వాహిని
ఇతర రాష్ట్రాలు, ప్రపంచ దేశాల ముఖ్యమైన పరిణామాలు
సామాజిక, ఆర్థిక, రాజకీయ పుస్తక సమీక్షలు
ప్రతి ఆదివారం 'వార్త' మెయిన్‌లో ఒక పూర్తి పేజీ

epaper.vaartha.com WWW.VAARTHA.COM

తెలుగు జాతీయ దినపత్రిక
# వార్త

గుంటూరు


fb.com/vaartha Digital

Published from Guntur, Vijayawada, Hyderabad, Visakhapatnam, Rajahmundry, Nizamabad, Ongole, Warangal, Tirupathi, Kadapa, Kurnool, Anantapur, Karimnagar, Mahabubnagar, Khammam, Nellore, Nalgonda, Tadepalligudem, Srikakulam

24-4-2025 గురువారం సంపుటి: 31 సంచిక: 82 పేజీలు: 12 వెల: 6.50

విదేశీ అతిథుల పర్యటనల్లోనే ఉగ్రదాడులు

శాంతి చర్చలకు సిద్ధమే: పుతిన్ 9లో



# నేర చరితులతో ఎప్పటికీ ప్రమాదమే

## వీరయ్య చౌదరి కుటుంబం నా కుటుంబమే

## మృతుని కుటుంబాన్ని ఓదార్చిన సిఎం చంద్రబాబు

**ఒంగోలు (నాగులుప్పలపాడు), ఏప్రిల్ 23, ప్రభాతవార్త :** నేర చరిత్ర కలిగిన వారు భూమిపై ఉండరాదని వారితో ప్రమాదం ఎప్పుడైనా పొంచి ఉంటుందని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఉద్ఘాటించారు. బుధవారం నాగులుప్పలపాడు మండలంలోని అమ్మనబ్రోలు గ్రామంలో ముప్పవరపు వీరయ్య చౌదరి కుటుంబాన్ని పరామర్శించి ఓదార్చి నివాళులర్పించారు. తొలుత చదలవాడ రవిశంకర్ హెలిప్యాడ్ నుండి రోడ్డు మార్గంలో వీరయ్య చౌదరి స్వగ్రామమైన అమ్మనబ్రోలు చేరుకున్నారు. అప్పటికే వేలాది మంది ప్రజలు చౌదరి నివాసంతో పాటు గ్రామమంతా రహదారుల వెంట చంద్రబాబు రాక కోసం ఎదురుచూస్తున్న ప్రజలు ఆయన వస్తున్నట్లు సంకేతం తెలుపగానే ఒక్కసారిగా ముప్పవరపు వీరయ్య చౌదరి అమర్ రహే అంటూ నినాదాలు చేశారు. చంద్రబాబు నాయుడు చౌదరి సతీమణి సుచరిత కుమారుడు చంద్ర సిద్దార్థను ఓదార్చి ఇక నుండి మీ కుటుంబం నా కుటుంబంతో కలిసి ఉంటుందని భరోసా ఇచ్చారు. నేరస్తులు ఎక్కడ ఉన్నా వెతికి శిక్షింపచేసే విధంగా కృషి చేస్తానని హామీ ఇచ్చారు. వైఎస్సార్సీ ప్రభుత్వంలో నేర ప్రవృత్తి పెరిగిపోయిందని నేరస్తులు ఎంతకైనా భరితెగిస్తున్నారని ఎంతో మంది తెలుగుదేశం కార్యకర్తలను కోల్పోయామని ఆవేదన వ్యక్తం చేశారు. ఆ కుటుంబాలకు తెలుగుదేశం పార్టీ అండగా ఉంటుందని తెలిపారు.

**పార్టీలో ముప్పవరపు గుర్తింపు**

హత్యకు గురైన ముప్పవరపు వీరయ్య చౌదరి తెలుగుదేశం పార్టీలో మంచి గుర్తింపు ఉందని ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు పేర్కొన్నారు. సంతనూతలపాడు నియోజకవర్గంతో పాటు చీరాల నియోజకవర్గం బాధ్యతలను ఆయనకు అప్పగించడంతో అత్యధిక మెజార్టీతో గెలిపించిన ఘనత వీరయ్య చౌదరికి దక్కిందన్నారు.

పార్టీలో క్రమశిక్షణ కలిగిన యువ నేతగా ఎదుగుతున్న తరుణంలో ఇలా జరగడం బాధాకరమన్నారు. యువగళం పాదయాత్ర వంద రోజులు చేపట్టిన నారా లోకేష్‌కి వెంట ఉండి ఆయన సంకల్పాన్ని నెరవేర్చిన వారిలో వీరయ్య చౌదరి ఒకరన్నారు. అమరావతి రైతుల పాదయాత్రకు మద్దతు పలికిన ఆయన ఏంటో మరోసారి నిరూపించుకున్నారని చౌదరి ఘనత >>2



బుధవారం పహల్గాం దాడికి సంబంధించి రక్షణ, భద్రతా వ్యవహారాల కేబినెట్ సమావేశం దృశ్యం

# దేశం వీడాల్సిందే

## సార్క్ వీసా పాక్ పౌరులు సైతం వెళ్లాల్సిందే

## ఇండస్ నదీ జలాల ఒప్పందం రద్దు

## ఇరు రాయబార కార్యాలయాల్లో సిబ్బంది కుదింపు

## మే 1వ తేదీలోపు అమలు: భద్రతా కేబినెట్ కమిటీ నిర్ణయాలు

**న్యూఢిల్లీ:** జమ్మూకశ్మీర్‌లోని పహల్గాంలో జరిగిన ఉగ్రదాడిని ప్రధానమంత్రి నరేంద్ర మోడీ అధ్యక్షతన జరిగిన కేబినెట్ భద్రతా కమిటీ సమావేశం తీవ్రంగా ఖండించింది. ఉగ్రదాడుల్లో మృతులకు సంతాపం తెలిపింది. ఉగ్రదాడికి ప్రతిగా కీలక నిర్ణయాలు తీసుకుంది. 1960లో కుదిరిన ఇండస్ వాటర్ ఒప్పందాన్ని నిలిపివేస్తున్నట్టు ప్రకటించింది. అటారీ చెక్‌పోస్టును తక్షణమే నిలిపివేస్తున్నట్టు >>2

# పిఎస్ఆర్‌కు రిమాండు

**విజయవాడ,ఏప్రిల్ 23,ప్రభాతవార్తప్రతినిధి:** రాష్ట్ర ఇంటలిజెన్స్ మాజీ ఛీఫ్ పిఎస్ఆర్ ఆంజనేయులుకు విజయవాడ కోర్టు రిమాండ్ విధించింది. ముంబయి నటి కాదంబరి జెత్వానీ కేసులో మంగళవారం ఆయనను అరెస్ట్ చేసిన విషయం విదితమే. బుధవారం ఉదయం విజయవాడ ప్రభుత్వాసుపత్రిలో వైద్య పరీక్షల అనంతరం మూడవ అదనపు ఛీఫ్ జ్యుడిషియల్ మెజిస్ట్రేట్ కోర్టు న్యాయమూర్తి ఎదుట హాజరుపర్చారు. మే 7 వరకు న్యాయమూర్తి ఆయనకు రిమాండును విధించారు. దీంతో ఆయనను విజయవాడ జిల్లా జైలుకు తరలించారు.

# కెసిరెడ్డికి 14 రోజుల జ్యుడీషియల్ రిమాండ్

**విజయవాడ,ఏప్రిల్23,ప్రభాతవార్తప్రతినిధి:** మద్యం కుంభకోణం కేసులో ప్రధాన నిందితుడు రాజ్ కెసిరెడ్డికి విజయవాడ ఎసిబి ప్రత్యేక కోర్టు 14 రోజుల జ్యుడీషియల్ రిమాండ్ విధించింది. ఈ మేరకు న్యాయాధికారి భాస్కరరావు మంగళవారం అర్ధరాత్రి 12.30లకు ఆదేశాలు జారీ చేశారు. అనంతరం ఆయనను పోలీసులు విజయవాడలోని జిల్లా జైలుకు తరలించారు. అంతకుముందు కెసిరెడ్డిని కోర్టులో హాజరుపర్చిన సందర్భంగా న్యాయాధికారి ప్రాథమిక దశలో అభ్యంతరం వ్యక్తం చేశారు. సిఐడి కోర్టులో కూడ హాజరుపర్చాల్సిందని వ్యాఖ్యానించారు. ఓ దశలో రిమాండ్‌ను తిరస్కరిస్తాను మెమోను సవరించుకొని సిఐడి కోర్టులో హాజరుపర్చండి అని సూచించారు. సిఐడి తరపున అడ్వకేట్ జనరల్ (ఏజీ) దమ్మాలపాటి శ్రీనివాస్,పీపీ కళ్యాణి వాదనలు వినిపిస్తూ అవినీతి నిరోధక చట్టం(పీసీ యాక్ట్)తో ఈ కేసు ముడిపడి ఉంది. నిందితుడు కెసిరెడ్డికి జ్యుడీషియల్ రిమాండ్ విధించే విచారణాధికార పరిధి ఏసిబీ కోర్టుకు ఉంది. ఇదే కేసులో మూడో నిందితుడు అప్పటి ప్రత్యేక అధికారి సత్యప్రసాద్‌ను పిసి చట్టం క్రింద విచారించేందుకు కాంపిటెంట్ అథార్టీ నుండి సెక్షన్ 17(ఎ) అనుమతి లభించిందని న్యాయాధికారి దృష్టికి తెచ్చారు. కెసిరెడ్డి విషయంలో 17(ఎ) అనుమతి అవసరం లేదా? అని న్యాయాధికారి భాస్కరరావు ప్రశ్నించగా అవసరం లేదని ఎజి బదులిచ్చారు. గత ప్రభుత్వ హయాంలో ఐటి సలహాదారుగా ఉంటూ ఎపి బేవరేజెస్ కార్పొరేషన్‌లో అధికారులను కెసిరెడ్డి ప్రభావితం చేశారు. ఆ కార్పొరేషన్‌లో ఆయన ప్రభుత్వ ఉద్యోగి కాదు. అందులో అధికారిక విధులు నిర్వర్తించలేదు. కాబట్టి 17(ఎ) అనుమతి అవసరం లేదు అని వాదించారు.

**రిమాండ్ రిపోర్టులో సెక్షన్లు మార్చారు**

ఇక ఎసిబి ప్రత్యేక కోర్టులోనిందితుడు కెసిరెడ్డి తరపున సీనియర్ న్యాయవాది పొన్నవోలు సుధాకరరెడ్డి వాదిస్తూ రిమాండ్ విధించే పరిధి ఎసిబి కోర్టుకు లేదు. అరెస్ట్‌కు గల కారణాలను పేర్కొంటూ సోమవారం నిందితుడికి అందచేసిన మెమోలో పిసి యాక్ట్ లోని సెక్షన్లు లేవు. తాజాగా సిఐడీ అందచేసిన రిమాండ్ రిపోర్టులో పిసి యాక్ట్ సెక్షన్లను చేర్చారు. రిమాండును తిరస్కరించాలని కోరారు. దమ్మాలపాటి జోక్యం చేసుకొని రిమాండ్ నివేదికలో పీసీ యాక్ట్ ప్రస్తావన ఉంటే చాలన్నారు. ఏ3 విచారణ నిమిత్తం సెక్షన్ 17(ఎ) అనుమతి లభించిన విషయాన్ని గుర్తు చేసారు. >>2

# పదవ తరగతిలో బాలికలదే పైచేయి

## 84.09 శాతం ఉత్తీర్ణత సాధించిన బాలికలు, బాలుర ఉత్తీర్ణత 78.31 శాతమే

## కాకినాడకు చెందిన నేహాంజని అనే విద్యార్థిని 600కు 600 మార్కులు

## యలమంచిలికి చెందిన అనిత అనే విద్యార్థినికి 599 మార్కులు

**విజయవాడ.ఏప్రిల్23,ప్రభాతవార్తప్రతినిధి:** రాష్ట్రంలో 10వ తరగతి ఫలితాలు విడుదలయ్యాయి. మంత్రి లోకేశ్ ఆన్‌లైన్‌లో ఫలితాలను విడుదల చేశారు. ఈ ఫలితాల్లో మొత్తం 81.14 శాతం మంది ఉత్తీర్ణత సాధించారు. 93.90 శాతం ఉత్తీర్ణతతో అగ్రస్థానంలో పార్వతీపురం మన్యం జిల్లా నిలవగా 47.64 శాతం ఉత్తీర్ణతతో అల్లూరి సీతారామరాజు జిల్లా చివరి స్థానంలో నిలిచింది. 84.09 శాతం ఉత్తీర్ణతతో బాలికలు పైచేయి సాధించగా 78.31 శాతం ఉత్తీర్ణతతో బాలురు నిలిచారు.

మే 19 నుంచి 28 వరకూ సప్లమెంటరీ పరీక్షలు నిర్వహించనున్నారు. 10వ తరగతి పరీక్షలకు 6,14,459 మంది విద్యార్థులు హాజరుకాగా వీరిలో 4,98,585 మంది ఉత్తీర్ణత సాధించారు. 1,680 పాఠశాలల్లో వందశాతం ఫలితాలు వచ్చాయి. కాకినాడ చెందిన నేహాంజని అనే విద్యార్థిని 600కు 600 మార్కులు సాధించి అరుదైన రికార్డు సృష్టించింది.నగరంలోని భాష్యం పాఠశాలలో బాలిక చదువుతోంది. యలమంచిలి చైతన్య స్కూల్‌లో చదువుతున్న ఎండ అనిత అనే విద్యార్థిని 599 మార్కులు సాధించింది. పల్నాడు జిల్లాలో ప్రభుత్వ పాఠశాల విద్యార్థినికి 598 మార్కులువచ్చాయి. ఒప్పిచర్ల జడ్పీ హైస్కూల్‌లో చదువు



తున్న పావని చంద్రిక ఈ ఘనత సాధించింది. టెన్త్ ఫలితాలను గమనించినప్పుడు సబ్జెక్టులవారీగా ఉత్తీర్ణత పరిశీలిస్తే మొదటి ల్యాంగ్వేజ్‌లో 95.94శాతంమంది, రెండవ ల్యాంగ్వేజ్‌లో 99.51శాతం, థర్డ్ ల్యాంగ్వే >>2



# లిక్కర్ స్కాం బిగ్‌బాస్ గుట్టు తీస్తాం

## -మంత్రి కొల్లు రవీంద్ర

**విజయవాడ,ఏప్రిల్ 23,ప్రభాతవార్తప్రతినిధి:** మద్యం స్కాంలో బిగ్ బాస్ బండారం బయట పెడతామని మంత్రి కొల్లు రవీంద్ర తెలిపారు. జగన్ పాలనలో రాష్ట్రాన్ని స్కాములకు కేంద్రంగా మార్చారని ఆయన మండిపడ్డారు. జగన్ రెడ్డికి అడ్డగోలుగా సహకరించిన వారంతా జైలు పాలవ్వడం తథ్యమని ఈ సందర్భంగా స్పష్టం చేశారు. మద్యం స్కాం వెనుక పెద్ద రాకెట్ ఉందని విజయసాయి బయటపెట్టారని తెలిపారు. స్కాముల్ని కప్పిపుచ్చుకోవడానికే గోవుల మరణాల డ్రామా అని మంత్రి దుయ్యబట్టారు. తమ ప్రభుత్వం అభివృద్ధి వైపు అడుగులు వేస్తోందన్నారు. మంత్రి జగన్ పాలనలో దెబ్బతిన్న రాష్ట్రాన్ని ఒక్కో ఇటుక పేర్చి బాగు చేస్తున్నామన్నారు. >>2

# పిఒకెలో 42 ఉగ్రవాద శిక్షణ కేంద్రాలు

**శ్రీనగర్, ఏప్రిల్ 23:** భారత్‌కు వ్యతిరేకంగా పాకిస్థాన్ ఉగ్రవాద కార్ఖానాలు నడుపుతోంది. పాకిస్థాన్ ఆక్రమిత కశ్మీర్‌లో పీఓకేలో 42 ఉగ్రవాద శిక్షణ కేంద్రాలు ఉన్నట్లు తెలుస్తోంది. ఇవి నియంత్రణ రేఖకు సమీపంలోనే ఉన్నట్లు నిఘా వర్గాలు తాజాగా గణాంకాలు విడుదల చేశాయి. అందులో వందల సంఖ్యలో ముష్కరులు శిక్షణ పొందుతున్నట్లు సమాచారం. పహల్గాంకు సమీపంలోని పర్యాటక కేంద్రం బైసరన్‌లో జరిగిన ఉగ్రదాడి నేపథ్యంలో ఉగ్ర తండాల వివరాలను నిఘావర్గాలు వెల్లడించాయి. నియంత్రణ రేఖకు సమీపంలోని పీవోకేలో ఉన్న 42 ఉగ్రవాద శిక్షణా కేంద్రాల్లో 115 నుంచి 130 మంది ఉగ్రవాదులు ఉండొచ్చని అంచనా వేస్తున్నారు. అందులో 115 మంది పాకిస్థాన్ జాతీయులని అధికార వర్గాలు వెల్లడించాయి. ఇక జమ్ముకశ్మీర్ విషయానికొస్తే 130 నుంచి 140 మంది వరకు ఉగ్రవాదులు ఉండొచ్చని భద్రతా దళాలు అంచనా వేశాయి. కశ్మీర్ లోయలో 70నుంచి 75 మంది ఉగ్రవాదులు యాక్టివ్‌గాఉన్నట్లు సమా >>2

# విఐపి బ్రేక్ దర్శనాల సమయం మార్పు

## ట్రయల్‌రన్‌కు 'బ్రేక్'?

## వేసవిసెలవుల్లో సామాన్యభక్తులకే ప్రాధాన్యం!



**తిరుమల,ఏప్రిల్ 23ప్రభాతవార్తప్రతినిధి:** తిరుమల శ్రీవేంకటేశ్వరస్వామి విఐపి బ్రేక్‌దర్శనాల సమయం మార్పు దిశగా అడుగులేస్తామని, ప్రస్తుతం అమలవుతున్న విధానంలో ఏకధాటిగా మూడు, మూడున్నరగంటలపైగా విఐపిలకే సమయం సరిపోతోందని టిటిడి ట్రస్ట్‌బోర్డు ప్రకటనచేసింది. సరిగ్గా నెలరోజుల క్రిందట తిరుమలలో బోర్డు సమావేశంలో విఐపి బ్రేక్ దర్శనాల సమయాన్ని రెండేళ్లక్రిందట అమలైన పాత విధానం ఉదయం 5గంటల నుండి 8గంటల వరకు తిరిగి పున: ప్రవేశపెడతామని, ప్రయోగాత్మకంగా పరిశీలిస్తామని ప్రకటించించారు. అయితే నెలరోజులు కావస్తున్నా ఇప్పటికీ బ్రేక్ దర్శనాలు ఉదయం 10గంటలకే అమలవుతున్నాయి. దీనివల్ల కంపార్టుమెంట్లలో భక్తులు గంటలతరబడి వేచివుండే పరిస్థితులు పునరావృతమవుతున్నాయి. ఈ సమయాన్ని మార్పుచేస్తామని బోర్డు ఛైర్మన్ బిఆర్ నాయుడు తెలిపారు. కానీ కొత్తసమయం ఇంకా అమలుకు నోచుకోలేదు. రానున్న రెండున్నరనెలలు వేసవిసెలవులు కావడంతో దేశవ్యాప్తంగా విద్యాసంస్థలకు వేసవిసెలవులు మొదలవడంతో ఏడుకొండల వేంకటేశ్వరస్వామి దర్శనానికి భక్తులు భారీగా తరలివస్తున్నారు. ఇప్పటికే గత పది రోజులుగా తిరుమలలో భక్తుల రద్దీ విపరీతంగా కొనసాగుతోంది. సర్వదర్శనానికి 20గంటలపైగానే సమయం పడుతోంది. 2022వ సంవత్సరం సెప్టెంబర్‌నెలనుండి విఐపి బ్రేక్ దర్శనాల వేళలను అప్పటి వైసిపి ట్రస్ట్‌బోర్డు మార్పుతీసుకువచ్చింది.

**2022లోనే బ్రేక్ దర్శనాల సమయం మార్పు!:**

ఇష్టదైవం తిరుమల శ్రీవేంకటేశ్వరస్వామిని దర్శించుకునే విధానంలో విఐపి బ్రేక్‌దర్శనాలకు కొంత ప్రత్యేకత వుంది. ఈ దర్శన టిక్కెట్లు కలిగిన భక్తులను కులశేఖరపడి,రాములవారిమాడ గడప వరకు అనుమతిస్తారు. 2002 సెప్టెంబర్‌కు ముందు తిరుమలలో విఐపి బ్రేక్ దర్శనాల వేళలు ప్రోటోకాల్ విఐపి దర్శనాలు >>2

# టెక్నాలజీ అతి వినియోగం అనర్థమే

## - మంత్రి పార్థసారథి

**విజయవాడ, ఏప్రిల్ 23,ప్రభాతవార్తప్రతినిధి:** ఏ సాంకేతిక పరిజ్ఞానాన్నైనా ఎంత వరకు జీర్ణించుకోగలమో అంత వరకే వినియోగించుకోవాలని సూచిస్తూ అతిగా వినియోగిస్తే మాత్రం ఇబ్బందులకు దారి తీస్తుందని సమాచార ,పౌరసంబంధాల శాఖామంత్రి కె పార్థ సారథి, వాఖ్యానించారు. ఏ సాంకేతిక పరిజ్ఞానాన్నైనా మానవాళి అభివృద్ధి మాత్రమే వినియోగించుకోవాలని అన్నారు. ఎలా వినియోగించుకోవాలనే విచక్షణ కోల్పోతే మాత్రం వైపరీత్య పరిణామాలు సంభవిస్తాయని అన్నారు. >>2



# బిసి హాస్టళ్లలో ఇన్వర్టర్లు, సిసి కెమెరాలు

## - సిఎం చంద్రబాబు నాయుడు

**విజయవాడ,ఏప్రిల్ 23,ప్రభాతవార్తప్రతినిధి:** బిసి హాస్టళ్ల విద్యార్థులకు భద్రతతో కూడిన విద్య అందించడమే తమ ప్రభుత్వ లక్ష్యమని సిఎం నారా చంద్రబాబు నాయుడు అన్నారు. ఇందులో భాగంగా ప్రతి హాస్టల్లోనూ, గురుకుల పాఠశాలల్లోనూ ఇన్వర్టర్లతో పాటు సిసి కెమెరాలు ఏర్పాటు చేయనున్నామని స్పష్టంచేశారు.తాజాగా టెన్త్ ఫలితాల్లో బిసి హాస్టళ్ల విద్యార్థులు అనుహ్య ఫలితాలు సాధించడం అభినందనీయమన్నారు. ఎపి చరిత్రలోనే ఎన్నడూ లేనంతగా బిసిల అభ్యున్నతికి అత్యధిక నిధులు కేటాయించామన్నారు. అందులో భాగంగా బిసి హాస్టళ్ల మరమ్మతులకు రూ.25 కోట్లు కేటాయించామన్నారు. బిసి హాస్టళ్ల విద్యార్థులకు భద్రతతో కూడిన విద్య అందించడమే తమ ప్రభుత్వ లక్ష్యమన్నారు. ముఖ్యంగా నిరంతరం విద్యుత్ సదుపాయం ఉండేలా హాస్టళ్లలో ఇన్వర్టర్లతో పాటు విద్యార్థుల భద్రతను దృష్టిలో పెట్టుకుని సిసి కెమెరాలు ఏర్పాటు చేస్తున్నామన్నారు. హాస్టళ్లలో పరిశుభ్రమైన వాతావరణంతో పాటు నాణ్యమైన ఆహారం అందించేలా చర్యలు తీసుకున్నామన్నారు. తల్లిదండ్రులు ఏ నమ్మకంతో అయితే తమ పిల్లలను బిసి హాస్టళ్లకు పంపుతున్నారో, అదే భరోసాతో విద్యార్థులను కంటికి రెప్పలా కాపాడుతున్నామన్నారు.

2014-19లో అప్పటి టిడిపి ప్రభుత్వం బిసి భవన్ల నిర్మాణానికి నిధులు మంజూరు చేసిందన్నారు. ఆ భవనాలన్నీ 70 నుంచి 80 శాతం పూర్తయ్యాయన్నారు. తరవాత వచ్చిన జగన్ ఆ నిర్మాణాలను పట్టించుకోలేదన్నారు. అసంపూర్తిగా నిలిచిపోయిన బిసి భవన్లతో పాటు కొత్త జిల్లాల్లోనూ నూతన భవనాలు నిర్మించనున్నామన్నారు. ఎపి బడ్జెట్లో వెనుకబడిన తరగతుల అభివృద్ధికి తమ ప్రభుత్వం రూ.39 వేల కోట్లకు పైగా కేటాయించామన్నారురు. గత ప్రభుత్వం బిసి హాస్టళ్లను కూడా గాలి కొదిలేశారన్నారు. హాస్టళ్ల మరమ్మతులకు రూపాయి కూడా నిధులివ్వలేదని, చివరికి విద్యార్థుల డైట్ బిల్లులు కూడా చెల్లించలేదని అన్నారు. రంగుల రెడ్డికి భవనాలకు రంగుల వేయడంపై ఉన్న శ్రద్ధ హాస్టళ్ల నిర్వహణపై చూపలేదని జగన్‌పై తీవ్ర ఆగ్రహం >>2

# సీమలో అధునాతన శాప్ క్రీడా కాంప్లెక్స్‌లు

## - క్రీడా మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి

**తిరుపతి క్రీడ, ఏప్రిల్ 23, ప్రభాతవార్త:** రాయలసీమకు తలమానికమైన తిరుపతిలో అంతర్జాతీయ స్థాయి ప్రమాణాలతో శాప్ ఆధ్వర్యంలో క్రీడా సదుపాయాలను ఏర్పాటు చేస్తున్నామని రాష్ట్ర క్రీడా శాఖామంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి పేర్కొన్నారు. ఇప్పటికే తిరుపతిలోని శ్రీపద్మావతి మహిళా విశ్వవిద్యాలయంలో ఇంటిగ్రేటెడ్ మల్టీ పర్పస్ ఇండోర్ స్టేడియాన్ని ఏర్పాటు చేశామన్నారు. తాజాగా తిరుపతి ఎస్వీ ఆర్ట్స్ కళాశాల ప్రాంగణంలోని శ్రీశ్రీనివాస స్పోర్ట్స్ కాంప్లెక్స్‌లో ఎపి స్పోర్ట్స్ అథారిటీ ఛైర్మన్ అనిమిని రవినాయుడు ఆధ్వర్యంలో చేపట్టిన అత్యాధునీకీకరణ పనులను ముఖ్యఅతిధిలుగా హాజరైన తిరుపతి ఎమ్మెల్యే అరణి శ్రీనివాసులు, జిల్లా కలెక్టర్ ఎస్. వెంకటేశ్వర్, శాప్ ఛైర్మన్‌లతో కలిసి ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా >>2

24-4pg2exHMNWJQE.qxd:24-4pg2exHMNWJQE.qxd 01/01/01 10:16 AM Page 1





శ్రీనగర్‌లో సొంతూళ్లకు వెళ్లేందుకు వేచిఉన్న పర్యాటకులు

# శాప్ క్రీడా కాంప్లెక్స్‌లు

>> స్పోర్ట్స్ కాంప్లెక్స్‌లో అత్యాధునికరించిన ఎన్టీఆర్ క్రీడావికాస కేంద్రం, రైఫిల్ షూటింగ్ రేంజ్, మేజర్ ధ్యాన్‌చంద్ విగ్రహావిష్కరణ, స్విమ్మింగ్ పూల్, మల్టీపర్పస్ స్పోర్ట్స్ ఎరీనా, పికిల్‌బాల్, వాలీబాల్, బాస్కెట్‌బాల్, విద్యుత్ లైటింగ్ అధునికీకరణ పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా నిర్వహించిన విలేకర్ల సమావేశంలో మంత్రి మండిపల్లి మాట్లాడుతూ శాప్ ఆధ్వర్యంలో స్మార్ట్ సిటీ, సీఎస్ఆర్ నిధులు రూ.4 కోట్లతో శ్రీనివాస స్పోర్ట్స్ కాంప్లెక్స్‌లో పలు అభివృద్ధి పనులు చేపట్టడం ప్రశంసనీయమన్నారు. క్రీడాకారులకు మెరుగైన వసతులను కల్పించడంతో పాటు పేద క్రీడాకారులను ప్రోత్సహించేందుకు ప్రభుత్వం కృషి చేస్తుందన్నారు. దేశానికి ఆదర్శవంతంగా హైదరాబాద్‌లో ఆనాడే అత్యుత్తమ క్రీడాసదుపాయాలను సిఎం చంద్రబాబు నాయుడు నెలకోల్పారన్నారు. క్రీడాకారులకు మేలు చేయడంతోపాటు వారికి గౌరవాన్ని కిరీటంగా అందజేయాలనే లక్ష్యంతో ఆయన పనిచేస్తున్నారన్నారు. గత వైసీపీ ప్రభుత్వం ఆడుదాం ఆంధ్రా పేరుతో రూ. 120కోట్లు కాజేసిందని దుయ్యబట్టారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన అనతికాలంలోనే 16,400 పోస్టులకు మెగా డీఎస్సీని విడుదల చేయడంతోపాటు స్పోర్ట్స్ కోటా కింద 3శాతం అమలు చేస్తూ క్రీడాకారులకు 450కి పైగా ఉద్యోగాలు కల్పించనున్న ఘనత రాష్ట్ర ప్రభుత్వానికి దక్కుతుందన్నారు. రాజధాని అమరావతిలో వెయ్యి ఎకరాల్లో త్వరలోనే స్పోర్ట్స్ సిటీని ఏర్పాటు చేసేందుకు ప్రభుత్వం ప్రణాళికలు సిద్ధం చేస్తుందని, దానికి సంబంధించి మంత్రివర్యులు నారాయణ కూడా కసరత్తు చేస్తున్నారన్నారు. టీటీడీ నిధుల దుర్వినియోగంపై ప్రతిపక్షం చేస్తున్న ఆరోపణలు అర్థరహితమని, వైసీపీ నేతల్లా కరపత్రాల పేరుతో శ్రీవేంకటేశ్వరుని నిధులను మేమేమీ కాజేయలేదని హెచ్చరించారు. క్రీడల అభివృద్ధికి చిత్తశుద్ధితో పనిచేస్తున్నామని, క్రీడాకారులకు ముందస్తుగానే ఆర్థిక ప్రోత్సాహకాలు, రవాణా భత్యాలు అందజేస్తున్నామ ఎమ్మెల్యే అరణి శ్రీనివాసులు అన్నారు. కూటమి ప్రభుత్వంతో క్రీడలకు పూర్వవైభవం చేకూరుతోందని, తిరుపతి వేదికగా క్రీడాసదుపాయాలను నెలకోల్పడం సంతోషదాయకమని ఎమ్మెల్యే అరణి శ్రీనివాసులు వివరించారు. సమర్థవంతంగా క్రీడల అభివృద్ధి.. తిరుపతిలో సమర్థవంతంగా క్రీడలను అభివృద్ధి చేయంతోపాటు క్రీడాహబ్‌గా తీర్చిదిద్దేందుకు సాయశక్తులా కృషి చేస్తున్నామని శాప్ ఛైర్మన్ రవినాయుడు ప్రతినబూనారు.

# ఎప్పటికీ ప్రమాదమే

>> ఆమోఘం అన్నారు.

**మంత్రులు, ఎమ్మెల్యేలు రాకః**

అమ్మనబ్రోలులో నేత వీరయ్య చౌదరి భౌతికకాయానికి సిఎం చంద్రబాబు నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో హోంమంత్రి అనిత, ఇతర మంత్రులు ఆనం రామనారాయణరెడ్డి, గొట్టిపాటి రవికుమార్, మంత్రి బాలవీరాంజనేయస్వామి, అనగాని సత్యప్రసాద్, చీరాల ఎమ్మెల్యే మాలకొండయ్య, పర్చూరు ఎమ్మెల్యే సాంబశివరావు, ఒంగోలు ఎమ్మెల్యే దామచర్లజనార్ధన్, మారిటైం బోర్డుచైర్మన్ సత్య, సంతనూతల పాడు ఎమ్మెల్యే బీఎన్ విజయ్‌కుమార్, ఒంగోలుఎంపీ మాగుంట శ్రీనివాసులురెడ్డి సంతాపం తెలియజేశారు.

**హత్య చేసిన వారి గురించి ఆచూకి తెలిస్తే సమాచారం ఇవ్వొచ్చుః చంద్రబాబు**

వీరయ్య చౌదరిని హత్య చేసిన వారి గురించి ఆచూకీ తెలిస్తే ఎవరైనా సమాచారం ఇవ్వొచ్చని ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు తెలిపారు. ఎవరైనా సరే వదిలిపెట్టే ప్రసక్తే లేదన్నారు. వీరయ్య చౌదరిని హత్య చేసిన వాళ్ళ గురించి గోప్యంగా తెలియజేయాలంటే టోల్ ఫ్రీ నెంబరు 9121104784 కు ఫోన్ చేసి చెప్పండన్నారు. మీ వివరాలు గోప్యంగా ఉంటాయన్నారు.

# పిఒకెలో 42 ఉగ్రవాద శిక్షణ కేంద్రాలు

>> చారం. 60 నుంచి 65 మంది జమ్ము, రాజౌరీ, పూంచ్ రీజియన్లలో కార్యకలాపాలు సాగిస్తున్నట్లు తెలుస్తోంది. జమ్ము కశ్మీర్‌లో 56 మంది విదేశీ ఉగ్రవాదులు ఉన్నారని భద్రతాసంస్థలు వెల్లడించాయి. వారిలో అత్యధికంగా లష్కరే తొయిబా ముఠా సభ్యులే ఉన్నట్లు పేర్కొన్నాయి. అందులో 18 మంది జైషే మహమ్మద్, 35 మంది లష్కరే తొయిబా, ముగ్గురు హిజ్బుల్ ముజాహిద్దీన్‌కు చెందినవారు ఉన్నారు. మరో 17 మంది స్థానిక ఉగ్రవాదులు ఉన్నారు. విదేశీ ఉగ్రవాదులతో పోలిస్తే స్థానిక ఉగ్రవాదుల సంఖ్య తక్కువగా ఉంది. విదేశీ ఉగ్రవాదుల సంఖ్య ఎక్కువగా ఉండటం ఆందోళన కలిగిస్తోందని అధికారులు అంటున్నారు. మంగళవారం జరిగిన ఉగ్ర దాడిలో ఇద్దరు విదేశీయులుసహా 26 మంది పర్యాటకులు చనిపోయారు. పదుల సంఖ్యలో గాయపడ్డారు. ఈ దాడికి లష్కరే తొయిబాకు అనుబంధంగా పనిచేస్తున్న ద రెసిస్టెంట్ ఫ్రంట్ బాధ్యత తీసుకుంది. సైనికుల దుస్తుల్లో వచ్చిన ఉగ్రమూకలు ఈ ఘాతుకానికి పాల్పడ్డారని సమాచారం. కాల్పుల అనంతరం సమీప అడవుల్లోకి పారిపోవడంతో భద్రతా సిబ్బంది ఉగ్రవాదుల కోసం గాలిస్తున్నారు. కశ్మీర్‌లో గత కొంతకాలం నుంచి పర్యటకుల తాకిడి పెరిగిన తరుణంలోనే ఈ దారుణానికి ఒడిగట్టినట్లు భద్రతా దళాలు భావిస్తున్నాయి.

# 14 రోజుల జ్యుడీషియల్ రిమాండ్

>> రిమాండ్‌ను డిఫెండ్ చేసుకోవడానికి నిందితునికి అన్ని వివరాలు అందచేసామన్నారు. తన వాదనలకు బలం చేకూరేలా పలు తీర్పులను ఉటంకించారు. రూ. 3,200 కోట్ల మద్యం కుంభకోణంలో కెసిరెడ్డి కీలక పాత్ర పోషించారని,నేర తీవ్రత దృష్ట్యా నిందితునికి జ్యుడీషియల్ రిమాండ్ విధించాలని కోరారు. న్యాయమూర్తి భాస్కరరావు నిందితుడు కెసిరెడ్డితో మాట్లాడారు. సిఐడి అధికారులు అరెస్ట్‌కు గల కారణాలను తెలియచేశారా? విచారణకు హాజరుకావాలంటూ నోటీసులిచ్చారా? ఇంట్లో తనిఖీలు చేశారా? తెలియచేశారా?విచారణకు హాజరుకావాలంటూ నోటీసులిచ్చారా?ఇంట్లో తనిఖీలు చేశారా?ఆరోగ్య సమస్యలేమైనా ఉన్నాయా? తదితర వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఇరుపక్షాల వాదనలు విన్న అనంతరం నిందితునికి మే 6 వరకు రిమాండ్ విధిస్తూ ఉత్తర్వులిచ్చారు.



బుధవారం అమెరికా ఉపాధ్యక్షుడు జెడి వాన్స్ కుటుంబ సమేతంగా తాజ్‌మహల్‌ను సందర్శించిన దృశ్యం

# బాలికలదే పైచేయి

>> జ్‌లో 96.10 శాతం మంది ఉత్తీర్ణత సాధించారు. గణితంలో అత్యల్పంగా 86.92 శాతం మంది ఉత్తీర్ణత సాధించగా సైన్స్ సబ్జెక్టులో 90.17 శాతం మంది, సోషల్‌లో 92.90 శాతం మంది పాసయ్యారు. ఇంగ్లిష్ మీడియం విద్యార్థులు 83.19 శాతం మంది పాస్ కాగా తెలుగు మీడియం విద్యార్థులు 58.59 శాతం మంది పాసయ్యారు. హిందీ మీడియంలో 100 శాతం మంది, ఉర్దూ మీడియంలో 70.71 శాతం మంది ఉత్తీర్ణత సాధించారు. ఫలితాలను జిల్లాలవారీగా పరిశీలిస్తే 93.90 శాతంతో పార్వతీపురం మన్యం జిల్లా మొదటి స్థానం, 91.43 శాతంతో బీ.ఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా 2వ స్థానం, 89.14 శాతం ఉత్తీర్ణతతో విశాఖ జిల్లా మూడవ స్థానాల్లో నిలిచాయి. గుంటూరు, అనకాపల్లి, తూర్పుగోదావరి, విజయనగరం, ఎన్టీఆర్, ప్రకాశం, కృష్ణా జిల్లాలు ఆ తర్వాతి 10 స్థానాల్లో నిలిచాయి. పల్నాడు, బాపట్ల, నెల్లూరు, శ్రీకాకుళం, కాకినాడ జిల్లాలు ఆ తర్వాతి 15 స్థానాల్లో నిలిచాయి. 16వ స్థానంలో పశ్చిమ గోదావరి, 17వ స్థానంలో నంద్యాల, 18వ స్థానంలో కడప, 19వ స్థానంలో తిరుపతి, 20వ స్థానంలో అన్నమయ్య జిల్లాలు నిలవగా ఏలూరు, సత్యసాయి, అనంతపురం, చిత్తూరు, కర్నూలు, అల్లూరి సీతారామరాజు జిల్లాలు ఆ తర్వాతి స్థానాల్లో నిలిచాయి. ఫలితాల్లో బాలురతో పోలిస్తే బాలికలు 5.78 శాతం అధిక ఉత్తీర్ణత సాధించారు. 19 పాఠశాలల్లో సున్నాశాతం ఉత్తీర్ణత నమోదైంది. ఏపీ రెసిడెన్షియల్ పాఠశాలల్లో అత్యధికంగా 95.02 శాతం ఉత్తీర్ణత నమోదైంది. గత 10 ఏళ్ల ఫలితాలతో పోలిస్తే 2015 నుంచి 2019 వరకు 90శాతం ఉత్తీర్ణత నమోదైంది. 2020, 2021ల్లో కరోనా కారణంగా పరీక్షలు నిర్వహించకుండానే విద్యార్థులందరినీ పాస్ చేయడంతో 100 శాతం ఫలితాలు నమోదయ్యాయి. 2022లో అతి తక్కువగా 65.26శాతం ఫలితాలు నమోదయ్యాయి. మార్కుల వారీగా ఒరిజినల్ పాస్ సర్టిఫికెట్లను ఆయా పాఠశాలలకు పంపించనున్నారు. పాఠశాల హెడ్‌మాస్టర్లు విద్యార్థులకు వాటిని అందచేయాల్సిందిగా ఆదేశాలు జారీచేశారు. 10వ తరగతి పరీక్షల్లో ఉత్తీర్ణత సాధించినవిద్యార్థులు మంత్రి నారా లోకేశ్ అభినందనలు తెలిపారు. ఉత్తీర్ణత సాధించనివారు నిరుత్సాహపడకుండా సప్లమెంటరీలో అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. రీకౌంటింగ్ లేదా రీవెరిఫికేషన్‌కు రేపటి నుంచి (24ఏప్రిల్) మే 1వ తేదీ వరకూ విద్యార్థులు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకునే అవకాశం కల్పించారు. ఈ ఫలితాలను వెబ్‌సైట్ చూసుకునే అవకాశం కల్పించారు.మనమిత్ర వాట్సప్, లీప్ యాప్‌లోనూ పదోతరగతి ఫలితాలు. వాట్సప్ నెంబర్ 95523 00009కు హాయ్ అని మెసేజ్ పంపి పంపి, విద్యా సేవలను ఎంచుకుని, ఆపై పబ్లిక్ పరీక్షల ఫలితాలను ఎంచుకుని, వారి రోల్ నంబర్‌ను నమోదు చేస్తే ఫలితాల పిడిఎఫన కాపీ ద్వారా వస్తాయి.

# లిక్కర్ స్కాం బిగ్‌బాస్ గుట్టు తీస్తాం

>> వైఎస్సార్సీ అరాచకం కారణంగానే అమరావతి, పోలవరం నిర్మాణ వ్యయం అమాంతం పెరిగిందని విమర్శించారు. ఆడబిడ్డల విషయంలో తప్పుడు ప్రచారం చేస్తే ఎవరినీ వదిలిపెట్టమని హెచ్చరించారు. దాడులు, హత్యాయత్నాలు చేసినోళ్లకు పదవులిచ్చిన ఘనత జగన్ రెడ్డిదని విమర్శించారు. దొంగే దొంగ దొంగ అని అరిచినట్లుంది పేర్ని నాని వ్యవహారమని మంత్రి ఎద్దేవా చేశారు.పేదల బియ్యం గురించి ప్రశ్నిస్తే మట్టి దోపిడీ అంటూ హడావుడి చేస్తున్నారన్నారని దుయ్యబట్టారు.

మట్టి దోపిడీ ఎవరి హయాంలో జరిగిందో ప్రజల్ని అడిగి తెలుసుకుందామని సవాల్ చేశారు. ఫిషింగ్ హార్బర్, బందరు పోర్టు పనులు ప్రారంభించింది టిడిపి ప్రభుత్వమేనని గుర్తు చేశారు. అభివృద్ధి, సంక్షేమం అజెండాగా కూటమి ప్రభుత్వం అడుగులు వేస్తోందన్నారు. మచిలీపట్నంలో కనీవినీ ఎరుగని అభివృద్ధి చేసి చూపిస్తానని తెలిపారు. పి4 కార్యక్రమం ద్వారా మచిలీపట్నంలో పేదరికాన్ని నిర్మూలిస్తానన్నారు. ప్రజాస్వామ్యంలో సంఘు విద్రోహ శక్తులకు స్థానం లేదని మంత్రి కొల్లు రవీంద్ర హెచ్చరించారు. త్వరలో మాజీ సీఎం జగన్ అవినీతి గుట్టురట్టుకావడం ఖాయమన్నారు.ఒక్కో దొంగ బయటకు వస్తున్నారన్నారు.ఎవ్వరిని వదిలేది లేదన్నారు.

# ఇన్వర్టర్లు, సిసి కెమెరాలు

>> వ్యక్తంచేశారు. హాస్టల్ భవనాలకు రంగు మార్చో...పేరు మార్చో...నిర్మాణాలు పూర్తి చేసి ఉంటే బిసి విద్యార్థులకు ఎంతో మేలు కలిగేదన్నారు. గత 5 ఏళ్లు బిసిలను అన్ని విధాలా అన్యాయం చేసి.. బిసి ద్రోహిగా జగన్ చరిత్రలో నిలిచిపోయారని మంత్రి ఆగ్రహం వ్యక్తంచేశారు.

రాష్ట్రంలో అభివృద్ధితో పాటు సంక్షేమానికి కూడా ఎన్డీయే ప్రభుత్వం అధిక ప్రాధాన్యమిస్తోందని తెలిపారు. యువతకు ఉద్యోగ ఉపాధి అవకాశాలు కల్పించడానికి అధిక ప్రాధాన్యమిస్తున్నామన్నారు. బిసి కార్పొరేషన్ల ద్వారా స్వయం ఉపాధి పథకాలు అందజేయనున్నామన్నారు. ఇందులో భాగంగా ప్రతి ఇంటి నుంచి ఒక వ్యాపారవేత్తను రూపొందించేలా ప్రణాళికలు తయారు చేశామన్నారు. బిసి హాస్టళ్లలో నాణ్యమైన ఆహారం అందిస్తున్నామని ఓ ప్రశ్నకు మంత్రి సమాధానమిచ్చారు. హాస్టళ్ళను సందర్శించినప్పుడు...తీవ్రమైన సమస్యలను గుర్తించామన్నారు. విద్యార్థులకు డైట్ బిల్లులు కూడా రాలేదని వార్డెన్లు తెలిపారన్నారు. ఈ విషయం ముఖ్యమంత్రి చంద్రబాబు దృష్టికి తీసుకెళ్లి...డైట్ బకాయిలు చెల్లించామన్నారు. ఇప్పుడు అన్ని హాస్టళ్లలోనూ నాణ్యమైన ఆహారం విద్యార్థులకుఅందిస్తున్నామని ముఖ్యమంత్రి తెలిపారు హాస్టల్ లోని అన్ని గదులు శుభ్రంగా ఉండాలన్నారు. ఎస్సీలు, ఎస్టీలు, బిసిలు అభివృద్ధికి ప్రాధాన్యం లభిస్తుంటుందని తెలిపారు. గత జగన్ ప్రభుత్వం ఎస్టీ, బిసి, గిరిజన సంక్షేమ శాఖల హాస్టళ్లను గాలికొదిలేసిందన్నారు. నా ఎస్సీలు...నా ఎస్టీలు...నా బిసిలు...అంటూ బడుగు బలహీన వర్గాల వారిని జగన్ ఓటు బ్యాంకుగా చూశారన్నారు. ఎస్సీ, ఎస్టీ, బిసి బిడ్డలు చదువు కోవడం జగన్ కు ఇష్టంలేదన్నారు. అందుకే రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న సంక్షేమ హాస్టళ్లను పట్టించుకోలేదన్నారు. చిన్న చిన్న మరమ్మతులకు నిధులు కూడా మంజూరు చేయలేదన్నారు. చివరికి విద్యార్థులకు ఇవ్వాల్సిన డైట్, కాస్మోటిక్ బిల్లులను కూడా చెల్లించలేదన్నారు. సీఎం చంద్రబాబు నేతృత్వంలోని ఎన్డీయే ప్రభుత్వం అధికారంలోకి రాగానే హాస్టళ్ల మరమ్మతులకు, విద్యార్థుల డైట్, కాస్మోటిక్ బిల్లులను కూడా చెల్లించిన విషయాన్ని మంత్రి సవిత తెలిపారు. ఎస్సీ, ఎస్టీ, బిసి బిడ్డల విద్యకు, అభివృద్ధికి చంద్రబాబు ప్రభుత్వం అధిక ప్రాధాన్యమిస్తోందన్నారు.

# బ్రేక్ దర్శనాల సమయం మార్పు

>> ఉదయం 5గంటలకు మొదలైతే, శుక్రవారం రోజు 6గంటలకు అనుమతినిచ్చేవారు. విఐపిల సిఫార్సులేఖల ద్వారా టిక్కెట్లు కలిగిన భక్తులను ఆది,సోమ,మంగళ,బుధ వారాలు ఉదయం 6.30గంటలకు, గురువారం 7.30గంటల ప్రాంతంలో, శుక్రవారం 8.30గంటల సమయంలో ఇలా అనుమతించారు. దీనివల్ల వేర్వేరు సమయాలు అమలవుతుండటంతో సామాన్యభక్తుల సర్వదర్శనాల సమయం మరింత ఆలస్యమయ్యేది. రాత్రి సమయంలో వైకుంఠమ్ క్యూకాంప్లెక్స్ కంపార్టుమెంట్లలో రాత్రంతా గంటలుగంటలు వేచివుండే సామాన్యభక్తులు శ్రీవారి దర్శనం ముగించేలోపు ఉదయం 11గంటలుదాటిపోయేదని అప్పట్లో తీవ్ర అసహనం వ్యక్తం చేశారు. అదేగాక విఐపి దర్శనాలు ఉదయత్పూర్వంవేళ ఉండటంతో అతిదిగృహాలు, విశ్రాంతి గృహాల గదులు మధ్యాహ్నం 1గంట వరకు కూడా చాలావరకు ఖాళీ చేయలేకపోయారు. సామాన్యభక్తులకు గదుల కేటాయింపు గగనంగా మారింది. అప్పట్లోనే బ్రేక్ దర్శనాల సమయంలో మార్పుచేస్తే విఐపిలు ఉదయం వేళ కొండకు చేరుకుని నేరుగా స్వామివారిని దర్శించుకుని తిరిగి వెళ్ళిపోతారనే అభిప్రాయం వ్యక్తమైంది.

**సామాన్యభక్తులకు త్వరగా దర్శనానికే మార్పు!:**

తిరుమలకు వచ్చిన భక్తులు ఎక్కువ సమయం కంపార్టుమెంట్లలోనే వేచివుండేవారు. అప్పట్లో గదుల కొరత, మంచినీటి సమస్య ఎదురవడంతో విఐపి భక్తుల దర్శనాల వేళలను ఉదయం 10గంటల నుంచి మధ్యాహ్నం 12గంటలకు మార్పుచేశారు. కానీ ఇప్పుడు మధ్యాహ్నం 1గంట వరకు బ్రేక్ కొనసాగుతుండటం విశేషం. సామాన్యభక్తులను వేకువజామున 3.30-4గంటలకే దర్శనాలకు క్యూలైన్లలో అనుమతించి గంటసమయంలోనే శ్రీవారి దర్శనంచేసుకునేలా ఏకధాటిగా ఉదయం 7గంటల వరకు అమలవుతోంది. ఇప్పుడు చాలావరకు తిరుమలలో భక్తులకు గదుల కొరత తీరడం, నీటి సమస్య అధిగమించడంతో ప్రస్తుత కూటమి టిటిడి బోర్డు మళ్ళీ ఉదయం 5గంటలకే విఐపి బ్రేక్ దర్శనాలు అమలుచేస్తే మంచిదని అభిప్రాయంతో ముందుకు కదులుతోంది. ఇందుకు ట్రయల్‌రన్‌గా వారంరోజులు పరిశీలించాలని సూచించారు. అయితే గతనెలరోజులుగా ఈ నిర్ణయాలు అమలుకు నోచుకోలేదు. దర్శనాలు అమలుచేసే విదానంలో లోటుపాట్లు, సామాన్యభక్తుల అభిప్రాయాలను పరిగణనలోనికి తీసుకుని విఐపి బ్రేక్ సమయం మార్పుచేయడం మంచిదనే విషయంపై అధికారవర్గాలు ఆలోచనతో ఉన్నారు.

# దేశం వీడాల్సిందే

>> ప్రకటించడంతో పాటు పాకిస్థాన్ పర్యాటకులు, పౌరులు వెంటనే వెళ్లిపోవాలని స్పష్టం చేసింది. కేబినెట్ భేటీలో తీసుకున్న కీలక నిర్ణయాలను భారత విదేశంగ శాఖ కార్యదర్శి విక్రమ్ మిస్రీ మీడియాకు తెలిపారు. 1960లో కుదిరిన ఇండస్ జల ఒప్పందాన్ని తాత్కాలికంగా నిలిపివేస్తోంది. ఇది తక్షణమే అమల్లోకి వస్తోంది. సరిహద్దు ఉగ్రవాదాన్ని పాక్ నిలిపివేసేంత వరకూ ఈ నిర్ణయం అమలు చేయనుంది. అటారి ఇంటిగ్రేటెడ్ చెక్ పోస్ట్ తక్షణమే మూసివేత. ఇప్పటికే ఆ మార్గం ద్వారా వచ్చిన వారు 2025 మే 1లోగా తిరిగి వెళ్లవచ్చు.పాకిస్తాన్ పౌరులకు వీసాలపై భారతదేశ ప్రవేశం నిషిద్ధం. ఇంతకుముందు జారీచేసిన వీసాలురద్దు. ప్రస్తుతం భారత్‌లో ఉన్న పాక్ పౌరులు 48 గంటల్లోగా దేశం విడిచివెళ్లాలి. సార్క్‌వీసాలకు ఇచ్చిన మినహాయింపును కూడా నిలిపివేసింది. ఈ వీసాతో ఉన్నవారంతా కూడా రెండు రోజుల్లో దేశం విడిచి వెళ్లిపోవాలని ఆదేశించింది. పాకిస్థాన్, భారత్ సరిహద్దులో ఉన్న అట్టారి సమీకృత చెక్‌పోస్టునుకూడా వెంటనే మూసివేయాలని నిర్ణయించినట్లు విక్రమ్ మిస్రీ తెలిపారు. ఆ దారిలో భారత్‌కు వచ్చిన పాకిస్తాన్‌వాసులు వచ్చేనెల ఒకటవ తేదీలోపు వెళ్లిపోవాలని ఆదేశించింది. న్యూఢిల్లీలోని పాకిస్తాన్ హైకమిషన్‌లో ఉన్న రక్షణ, సైనిక, నౌకాదళ, వాయుసేన సలహాదారులను 'పర్సోనా నాన్ గ్రాటా'గా ప్రకటించి, వారిని వారంలోగా దేశం విడిచి వెళ్లమని ఆదేశించింది. భారత హైకమిషన్, ఇస్లామాబాద్ నుంచి భారత్ తన సలహాదారులను వెనక్కి వచ్చేయాలని ఆదేశించింది. ఈ పదవులను రద్దు చేసింది. అలాగే 5 మంది సపోర్ట్ స్టాఫ్ కూడా వెనక్కి పిలిపించనుంది. భారత్, పాకిస్తాన్ హైకమిషన్లలోని సిబ్బంది సంఖ్యను 55 నుండి 30కి తగ్గించనుంది. ఈ మార్పులు 2025 మే 1లోగా అమల్లోకి వస్తాయి. దేశ భద్రతా పరిస్థితిని సమీక్షించింది. అన్ని భద్రతా బలగాలు అత్యంత అప్రమత్తతతో విధులు నిర్వహించాలన్న ఆదేశాలు ఇచ్చింది.ఈ ఉగ్రదాడికి పాల్పడిన వారిని చట్టానికి లోబడి శిక్షించడమే కాక, వారికి మద్దతు ఇచ్చిన వారినీ చర్యలను బహిరంగంగా బహిర్గతం చేసి చర్యలు తీసుకుంటామని సంకల్పించింది. తహవ్వూర్ రాణాను భారతదేశానికి అప్పగించిన ఉదాహరణను ప్రస్తావిస్తూ, ఉగ్రవాదం పట్ల కఠినమైన ధోరణిని భారత్ కొనసాగిస్తుందని స్పష్టం చేసింది.

**పహల్గాం ఉగ్రదాడి సూత్రధారి లష్కర్ ఏ తోయిబా టెర్రరిస్టు ఖలీద్**

జమ్మూ కాశ్మీర్‌లోని పహల్గాంలో బైరసీన్ వద్ద పర్యాటకులపై మంగళవారం జరిగిన ఉగ్రదాడికి పాక్ ప్రేరేపిత ఉగ్రవాద సంస్థ లష్కర్ ఏ తోయిబాకు చెందిన గజ టెర్రరిస్టు ఖలీద్‌గా జాతీయ దర్యాప్తు సంస్థ (ఎన్ఐఎ) తేల్చింది. ఈ దాడిలో 27 మంది ప్రాణాలు కోల్పోగా మరో 20 మందిగా యపడిన విషయం తెలిసిందే. ఈ ఘటన తరువాత విచారణ నిమిత్తం రంగంలో దిగిన ఎన్ఐఎ అనేక విషయాలను వెలుగులోకి తెచ్చింది. ఇందులో ముఖ్యమైనది ఈ దాడికి సూత్రధారి ఖలీద్‌గా తేల్చింది. దాడికి పాల్పడిన ముగ్గురు ముష్కరుల రేఖా చిత్రాలను ఎన్ఐఎ విడుదల చేసింది. లష్కర్ ఏ తోయిబాలో ఖలీద్ కీలక వ్యక్తి. పాక్‌కు చెందిన 30 ఏళ్ల వయస్సున్న ఖలీద్ అసలు పేరు సైఫుల్లా కసూరి. లష్కర్ ఏ తోయిబా చీఫ్ హాఫీజ్ సయీద్‌కు అత్యంత సన్నిహితుడు. ఖలీద్ ప్రస్తుతం లష్కర్ ఏ తోయిబా పెషావర్ ప్రధాన కార్యాలయానికి అధిపతిగా వున్నాడు. ఇదే సమయంలో మిల్లీ ముస్లిం లీగ్ సంస్థకు అధ్యక్షుడు కూడా. ఈ సంస్థ హాఫీజ్ సయీద్‌కు చెందిన జమాత్ ఉద్ దవాకు రాజకీయ విభాగంగా పనిచేస్తోంది. జమాత్ ఉద్ దవా ప ంజాబ్ ప్రావిన్స్ సమన్వయ విభాగం కూడా ఖలీద్ చూస్తున్నాడని ఎన్ఐఎ విచారణలో తేలింది. జమాత్ ఉద్ దవా లష్కర్ ఏ తోయిబాతో సంబంధాలు వున్నట్లు తేలడంతో దీనిపై అమెరికా ఉగ్రవాద సంస్థ ముద్రవేసి నిషేధం విధించింది. కాగా పహల్గాం దాడికి సూత్రధారి ఖలీద్ కాగా దాడికి పాల్పడ్డ ఉగ్రమూకల బృందానికి నాయకత్వం వహించింది మాత్రం ఆసిఫ్ ఫౌజీగా ఎన్ఐఎ విచారణలో తేలింది. ఇతను కాశ్మీర్‌లో ఉగ్రవాద కార్యకలాపాలకు పాల్పడుతున్న ది రెసిస్టెన్స్ ఫ్రంట్ (టిఆర్ ఎఫ్)లో కీలక నేతగా ఎన్ఐఎ తేల్చింది. పాక్ కేంద్రంగా పనిచేసే బడా ఉగ్రవాద సంస్థ లష్కర్ ఏ తోయిబాకు టిఆర్ఎఫ్ మరో అనుబంధ సంస్థ. కాగా ఫౌజీ జమ్మూ కాశ్మీర్‌కు చెందిన వాడు. ఇతను పాకిస్తాన్ ఆర్మీతో కలిసి పనిచేయడం వల్ల ఫౌజీ అని పేరు చేరింది. కాగా పహల్గాం దాడి తరువాత ఉగ్రవాదులు ముజఫరాబాద్‌లోని సేఫ్ హౌజ్ దిశగా వెళ్లారని ఎన్ఐఎకు ఆధారాలు లభించాయి. పహల్గాం దాడికి పాల్పడ్డ నలుగురు ఉగ్రవాదుల ఫోటోలను ఎన్ఐఎ విడుదల చేసింది. కాగా పహల్గాం దాడికి కారణమైన టిఆర్ఎఫ్ 2017లో కాశ్మీర్‌లో ఆర్టికల్ 370 రద్దు తరువాత ఏ ర్పాటవగా అప్పటి నుంచి కాశ్మీరేతరులు, వలస కూలీలను టార్గెట్ చేస్తోంది. 2021లో శ్రీనగర్‌లో వాయుసేన స్థావరంపై డ్రోన్ల దాడులకు కూడా ఈ సంస్థ కారణంగా తేలింది. 2020 నుంచి ఈ సంస్థ జమ్మూ కాశ్మీర్‌లో 50 మంది వరకు వలస కూలీలు, కాశ్మీరేతరులు, భద్రతా బలగాలను అంతమొందించింది. ఈ సంస్థ కమాండర్‌గా వున్న సజ్జాద్ గుల్‌ను కేంద్రం ఇప్పటికే ఉగ్రవాదిగా ప్రకటించగా ఇతను పాక్‌లో తలదాచుకున్నాడు. టిఆర్ఎఫ్‌లో వున్న ఉగ్రవాదుల్లో ఎక్కువగా స్థానికులే వున్నట్లు పోలీసు చెబుతున్నారు. టిఆర్ఎఫ్ సభ్యులకు కాశ్మీర్‌లోని పలు చోట్ల ఆశ్రయాలు లభిస్తుం డడంతో పాటు వారికి ఆహారం ఇతర సహాయాలు అందుతున్నట్లు పోలీసుల విచారణలో తేలింది.

# కుట్రలు పన్నేవారిని ఊరికే వదలబోం!

## రక్షణమంత్రి రాజ్‌నాథ్‌సింగ్

**న్యూఢిల్లీ, ఏప్రిల్ 23:** పహల్గాంలో పర్యటకులపై జరిగిన ఉగ్రదాడిపై కేంద్ర రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ తీవ్ర ఆగ్రహం వ్యక్తంచేశారు. భారత్‌పై కుట్ర పన్నుతున్న వారిని ఊరికే వదలబోమన్నారు. దాడికి భారత్ గట్టి బదులిస్తుందని హెచ్చరించారు. పహల్గాం ఉగ్రదాడిని పిరికిపంద చర్యగా అభివర్ణించారు. ఆ ఉగ్ర దాడిలో అమాయకులు ప్రాణాలు కోల్పోయారని ఆవేదనవ్యక్తంచేశారు. ఉగ్రవాదాన్ని తుదముట్టించాలనేది భారత్ విధానమని, ఉగ్రవాదులను ఎదుర్కొనే విషయంలో దేశ ప్రజలంతా ఐక్యంగా ఉన్నారని రాజ్‌నాథ్ సింగ్‌చెప్పారు. తమ కుటుంబసభ్యులను కోల్పోయిన బాధిత కుటుంబాలకు కేంద్ర ప్రభుత్వం అండగా ఉంటుందని అన్నారు. దాడికి పాల్పడిన వాళ్లను, కుట్ర పన్నిన వాళ్లను బయటకు లాగి తగిన బుద్ధి చెబుతామన్నారు.

## వారం - వర్జ్యం

తేది : 24-04-2025, గురువారం
శ్రీ విశ్వావసు నామ సంవత్సరం,
చైత్రమాసం, ఉత్తరాయణం,
వసంత ఋతువు, కృష్ణ పక్షం
కృ.ఏకాదశి మ.2.27
శతభిషం ఉ.10.45
వర్జ్యం మ.3.48-సా.5.03
దు.ఉ.10.00-10.51, 2) మ.3.03-3.54
శుభసమయం : ఉ.6.20-6.50
రాహుకాలం - మ.1.30-3.00

## వార్తాఫలం

**మేషం :** ముఖ్యమైన పనులలో ఆటంకాలు ఎదురై చికాకులుపెడతాయి. మిత్రులతో ఏర్పడిన వివాదాలు పరిష్కరించుకుంటారు.

**వృషభం :** కుటుంబంలో బాధ్యతలు పెరిగినా సమర్థవంతంగా నిర్వహిస్తారు. ప్రయాణాలలో తొందరపాటు వద్దు.

**మిథునం:** బంధువుల నుండి విలువైన సమాచారం అందుకుంటారు. ఆకస్మిక ధన, వస్తు లాభాలు పొందుతారు.

**కర్కాటకం :** విలువైన వస్తువులు, ఆభరణాలు కొనుగోలు చేస్తారు. పనులు నిదానంగా పూర్తిచేస్తారు.

**సింహం:** ఋణ వత్తిడులు ఎదురైన చికాకులు పెడతాయి. కుటుంబసభ్యుల నుండి ప్రోత్సాహం లభిస్తుంది.

**కన్య :** మిత్రులను కలిసి కష్టసుఖాలను పంచుకుంటాలు. భూవివాదాలు తీరి నూతన ఒప్పందాలు కుదురుతాయి.

**తుల :** వృత్తి, వ్యాపారాలు అనుకూలంగా వుంటుంది. బంధువుల నుండి శుభ ఆహ్వానాలు అందుతాయి.

**వృశ్చికం:** ప్రయాణాలలో ఆటంకాలు ఎదురై చికాకులు పెడతాయి. ఆర్ధిక పరిస్థితి అంతంత మాత్రంగా వుంటుంది.

**ధనుస్సు:** మిత్రులతో ఏర్పడిన వివాదాలు పరిష్కరించుకుంటారు. ఉద్యోగాలలో స్థాన మార్పులు వుంటాయి.

**మకరం:** విలువైన వస్తువులు, పత్రాలు జాగ్రత్త అవసరం. వృత్తి, వ్యాపారాలలో ఆటంకాలు ఎదురై చికాకులు పెడతాయి.

**కుంభం:** ఆకస్మిక ప్రయాణాలలో నూతన పరిచయాలు పెరుగుతాయి. ఆరోగ్యం పట్ల మెలుకువ అవసరం

**మీనం:** వృత్తి, వ్యాపారాలు ప్రోత్సాహకరంగా ఉంటాయి. దూర ప్రాంతాల నుండి శుభవార్తలు వింటారు.

# టెక్నాలజీ అతి వినియోగం అనర్థమే

>> ఈ ఆలోచనలతోనే ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ప్రభుత్వం నడుస్తోందని వాఖ్యానిస్తూ సాంకేతికను వినియోగించుకోవడంలో రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ముందంజలో ఉందన్నారు. నేషనల్ పి ఆర్ డే సందర్భంగా పబ్లిక్ రిలేషన్స్ సొసైటీ ఆఫ్ ఇండియా అమరావతి చాప్టర్ వారు ప్రత్యేక కార్యక్రమాన్ని బుధవారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా సమాచార, పౌరసంబంధాల శాఖా మంత్రి కె పార్థ సారథి, ఆంధ్ర కేసరి యూనివర్శిటీ,ప్రొఫెసర్ డివిఆర్ మూర్తి, వైస్ ఛాన్సలర్, విజయవాడ డివిజన్, సౌత్ సెంట్రల్ రైల్వే నస్రత్ యం మంద్రూప్కర్, వారు ప్రధాన ఉన్యాసకులుగా పాల్గొన్నారు. విజయవాడలోని పి బి సిద్దార్థ కాలేజి ఆఫ్ ఆర్ట్స్ సైన్సెస్ ఆవరణలోని కాన్ఫరెన్స్ హాలులో జరిగిన ఈ కార్యక్రమాన్ని ముందుగా సాంప్రదాయబద్దమైన జ్యోతి ప్రజ్వలనతో ప్రారంభించిన అనంతరం మంత్రి పార్దసారధి మాట్లాడుతూ ప్రభుత్వ పనిని వాట్సప్ ద్వారా అందించే స్థాయిలో నేటి ప్రభుత్వం ఆధునిక సాంకేతక పరిజ్ఞానాన్ని వినియోగించుకోవడంలో దేశానికే మార్గదర్శకునిగా ఉందన్నారు. సాంకేతికతను ప్రభుత్వ పనిని మెరుగు పరచుకోవడానికి ఎలా వినియోగించుకోవాలో ఆలోచించే వ్యక్తి చంద్రబాబు నాయుడు గారని ప్రశంసించారు. చంద్రబాబు నాయుడు కేవలం నేటి గురించి ఆలోచించే వ్యక్తి కాదని గతంలో 2020 విజన్ పేరుతో కొన్ని దశాబ్దాల భవిష్యత్తును దృష్టిలో పెట్టుకొని పని చేసిన వాడని నేడు కూడా అదే రీతిలో 2047 విజన్ పేరుతో రాష్ట్రం, దేశ బాగు కోసం ఆలోచించే వ్యక్తని అన్నారు. అటువంటి వ్యక్తి ఆలోచనలను నేడు యువనాయకుడు లోకేష్ ముందుకు తీసుకొని వెళుతున్నారని ఇది రాష్ట్ర భవిష్యత్తు సురక్షితంగా ఉందనే భావనను అందించగలుగుతున్నారని ప్రశంసించారు.

ఇక మీడియా సాంకేతికతను వినియోగించుకోవాలని అదే సందర్భంలో దానిని ఎలా మంచికి వినియోగించుకోవాలనే విచక్షతతో పని చేయాల్సిన భాద్యత మీడియా పైనే ఉంటుందన్నారు. ఇటీవల తెలంగాణలో ఒక భూమి అంశంపై ఏఐ వినియోగంపై జరిగిన రాద్ధాంతం ఉదాహరణగా భావిస్తే టెక్నాలజీ ఎలా తప్పును ఒప్పుగా మారుస్తుందనే విషయాన్ని అందరి దృష్టికి తెచ్చిందని అలా జరుగుకుండా సాంకేతికను ఎలా, ఎంతవరకూ వినియోగించుకోవాలనే నిర్ణయించుకోవాల్సిన అవసరం ఉందన్నారు. అదే సందర్భంలో మీడియా కూడా సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించుకొని ఇతరులను బ్లాక్ మెయిల్ చేయడానికి కాకుండా మానవాళిని మంచి చేయడానికి వినియోగించుకోవాలని సూచించారు. ఇక సోషల్ మీడియా మితిమీరిన వినియోగం కూడా సరైనది కాదని అభిప్రాయపడ్డారు. చైర్మన్ అమరావతి చాప్టర్ వారు చాప్టర్ డా. జి. అనిత సంస్థ యొక్క కార్యకలాపాలను వివరించారు. కార్యక్రమం యొక్క థీమ్ రెస్పాన్సిబిల్ యూజ్ ఆఫ్,రోల్ ఆఫ్ పబ్లిక్ రిలేషన్స్ రిలేషన్స్ (కృత్రిమ మేధస్సు యొక్క భాద్యతాయుతమైన వినియోగం - ప్రజా సంబంధాల పాత్ర ప్రాధాన్యతను వివరించారు. ఇప్పటికే సోషల్ మీడియా కారణంగా కొనసాగుతున్న గందరగోళాన్ని మరింత సంక్లిష్టపరుస్తోందని తెలిపారు.

నస్రత్ యం మంద్రూప్కర్ ప్రసంగిస్తూ సాంకేతక పరిజ్ఞానం కారణంగా ఎన్ని ఉపయోగాలున్నాయో అదే సందర్భంలో దానిని భాద్యతతో వినియోగించుకోకుండా, దుష్పలితాలను సరిగ్గా అంచనా వేయకుండా ముందుకు సాగితే సమాజానికి హాని కలిగే ప్రమాదముందని హెచ్చరించారు. అట్లని ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం వినియోగించుకోకుండా ఆపితే దాని వలన వచ్చే మంచి ఫలితాలకు దూరమయ్యే ప్రమాదముందని రైల్వే విభాగంలో ఏఐతో ఎలా మంచి ఫలితాలను రాబడుతున్నారో సోదాహరణంగా వివరించారు డివిఆర్ మూర్తిమాట్లాడుతూ ప్రింట్ మీడియా రోజుల నుండి నేటి సోషల్ మీడియా రోజులను నిశితంగా పరిశీలిస్తే పని తీరు, వార్తల ఎంపికతో పాటూ ప్రసార శైలి దిగజారిపోతోందని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రస్థుతం ఏఐ వినియోగంతో ఈ పరిస్థితి మరింత జఠిలంగా మారుతోందని అన్నారు. రాష్ట్ర సమాచార పౌర సంబందాల శాఖ మంత్రి కె పార్థ సారథి మాట్లాడుతూ నేడు సోషల్ మీడియా దోరణులు చాలా దారుణంగా ఉన్నాయని దీనిని అరికట్టాల్సిన భాద్యత అందరిపై ఉందన్నారు.

**పర్యాటకులపై కాల్పులు అత్యంత హేయమైన చర్య: మంత్రి పార్థసారథి**

జమ్మూ కాశ్మీర్‌లోని బైసరన్, పహల్గామ్, అనంత్‌నాగ్‌లలో అమాయక పర్యాటకులు, స్థానికులపై మంగళవారం జరిగిన ఉగ్రదాడిని రాష్ట్ర గృహనిర్మాణ, సమాచార పౌరసంబంధాల శాఖ మంత్రి కొలుసు పార్థసారధి తీవ్రంగా ఖండించారు. దీనిని హేయమైన చర్యగా ఆయన పేర్కొన్నారు. 26 మంది అమాయకుల ప్రాణాలను బలిగొన్న, అనేక మందిని గాయపరిచిన సంఘటన అనాగరిక చర్య అన్నారు. మానవత్వం, శాంతి, కాశ్మీర్ ఆతిథ్య స్ఫూర్తిపై దాడిగా ఆయన పేర్కొన్నారు. బాధితుల కుటుంబాలకు ప్రగాఢ సాను భూతిని తెలియజేస్తూ గాయపడినవారు త్వరగా కోలుకోవాలని ప్రార్థిస్తున్నా మన్నారు. నాగరిక సమాజంలో ఇటువంటి హింసకు స్థానం లేదన్నారు. అత్యంత హేయమైన దాడికి పాల్పడిన హంతకులు, వారి వెనుకవున్నవారిని న్యాయస్థానం ముందుకు తీసుకురావాలన్నారు. ఉగ్రవాదానికి వ్యతిరేకంగా మరియు జమ్మూ కాశ్మీర్ ప్రజలతో సంఘీభావంగా భారత్ ఐక్యంగా నిలుస్తుందన్నారు.

## పదో తరగతి ఫలితాల్లో తిరుమల విద్యార్థుల విశేష ప్రతిభ

**ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా బ్యూరో ఏప్రిల్ 23 ప్రభాతవార్త** పదో తరగతి పరీక్షా ఫలితాలలో తిరుమల ఇంగ్లీష్ మీడియం స్కూల్ విద్యార్థులు అద్భుత ఫలితాలను సాధించారని తిరుమల విద్యాసంస్థల చైర్మన్ నున్న తిరుమలరావు తెలియజేశారు. యేలూరి లాశ్య శ్రీ సాయి 597 మార్కులు, ఉప్పాల జశ్వంత్ పవన్, సిహెచ్. సుప్రీత భరద్వాజ్, కొట్టిన దుర్గ కశ్యప్, కూసుమంచి శ్రీవల్లి 596 మార్కులు సాధించారని, 595 పైన 12 మంది విద్యార్థులు, 592 పైన 54 మంది విద్యార్థులు, 590 పైన 99 మంది విద్యార్థులు, 575 పైన 869 మంది విద్యార్థులు, 550 పైన 1798 మంది విద్యార్థులు సాధించారని మరియు 100 ఉత్తీర్ణత సాధించారని ఆయన తెలియజేశారు. ఈ సందర్భంగా అత్యధిక మార్కులు వచ్చిన విద్యార్థులను డైరెక్టర్ నున్న సరోజినీదేవితో కలిసి ఆయన అభినందించారు.

## మహిళా సాధికార కమిటీ చైర్‌పర్సన్‌గా పురందేశ్వరి

**విజయవాడ ఏప్రిల్ 23 ప్రభాతవార్తప్రతినిధి:** పార్లమెంటు మహిళా సాధికార కమిటీ చైర్‌పర్సన్‌గా రాజమహేంద్రవరం భాజపా ఎంపీ దగ్గుపాటి పురందేశ్వరి నియమితులయ్యారు. 20 మంది లోక్‌సభ, 10 మంది రాజ్యసభ సభ్యులతో ఏర్పాటైన కమిటీలో సభ్యులుగా విభిన్న పార్టీలకు చెందిన మహిళా ఎంపీలు నియమితులయ్యారు. ఇందులో మహబూబ్‌నగర్, వరంగల్ ఎంపీలు డీకే అరుణ, కడియం, కావ్య, సినీ నటి హేమామాలిని, సుధామూర్తి, పాత్రికేయురాలు సాగరిక ఘోష్, దిల్లీ మహిళా కమిషన్ మాజీ చైర్‌పర్సన్ స్వాతి మలివాల్, మహారాష్ట్ర ఉపముఖ్యమంత్రి అజిత్‌పవార్ సతీమణి సునేత్ర అజిత్‌పవార్ తదితరులు ఉన్నారు.

## రైల్వే సిసిటిసి పరీక్షా ఫలితాలు వెల్లడి

**గుంతకల్లు రైల్వే,ఏప్రిల్ 23,ప్రభాతవార్త** రాయలసీమలోని దక్షిణ మధ్య రైల్వే గుంతకల్లు డివిజన్ పరిధిలో సిసిటిసి పోస్టుల భర్తీకి నిర్వహించిన వ్రాతపరీక్ష ఫలితాలు వెల్లడయ్యాయి. డివిజన్ పరిధిలో కమర్షియల్ విభాగంలో ఖాళీగా ఉన్న 42సిసిటిసి పోస్టులను 331/3శాతం డిపార్ట్‌మెంటల్ కోటాలో భర్తీ చేసేందుకు సంబంధిత ఉన్నతాధికారులు ఈ ఏడాది ఫిబ్రవరి 7న వ్రాత పరీక్ష నిర్వహించారు. ఇందుకు సంబంధించిన ఫలితాలను సంబంధిత ఉన్నతాధికారులు విడుదల చేశారు. జనరల్ స్టాండర్డ్ విభాగంలో 90మంది, రిలాక్స్‌డ్ విభాగంలో మరో 8మంది అభ్యర్థులు ఉత్తీర్ణులయ్యారు. వీరికి సీనియారిటీ, సర్వీసు రికార్డుల ప్రాతిపదికన పోస్టింగ్స్ కల్పించనున్నట్లు అధికార వర్గాలు తెలిపాయి.

## రోగులకు ఎండ వేడి నుండి రక్షణ

### - తిరుపతి రుయా ఆస్పత్రి ప్రాంగణంలో చలువపందిళ్లు



**తిరుపతి,ఏప్రిల్ 23ప్రభాతవార్తప్రతినిధి:** రాయలసీమకే తలమానికంగా ఉన్న తిరుపతి రుయా ఆస్పత్రికి రోజువారీగా వేలాదిమంది పలు రకాల అనారోగ్యకారణాలతో వైద్యంకోసం వస్తుంటారు. ఈ ఆస్పత్రి తిరుపతి ఎస్వీవైద్యకళాశాలకు అనుబంధంగా ఉండటంతో అన్ని రకాల వైద్యసేవలు అందుబాటులో ఉన్నాయి. నిపుణులైన వైద్యులతోబాటు వైద్య విద్యార్థులు, పిజి విద్యార్థులు, మెడికోలు వైద్యసేవలందిస్తారు. వచ్చిన ప్రతిరోగిని సొంతవారిలా చూడాలనేది వైద్యఆరోగ్యశాఖమంత్రి సత్యకుమార్‌యాదవ్ సూచించారు. జిల్లా కలెక్టర్ డాక్టర్ వెంకటేశ్వర్ ఆస్పత్రి అభివృద్ధి కమిటీ చైర్మన్‌గా ఉండటంతో ఆయన నేతృత్వంలో రుయా ఆస్పత్రి ప్రాంగణంలో పూర్తిగా చలువపందిళ్ళు ఏర్పాటుచేశారు. ప్రభుత్వ సర్వజన వైద్యశాల కావడంతో రోగులు, వారి సహాయకులకు విపరీతమైన ఎండవేడినుండి కొంతవరకు ఉపశమనం కోసం ఈ చలువపందిళ్ళు ఏర్పాటుతో రోగులు ఉపశమనం చెందుతున్నారు. 8.5లక్షల రూపాయలు వ్యయంతో చలువపందిళ్ళు ఏర్పాటుచేశారు. ప్రత్యేకంగా అత్యవసర విభాగం, క్యాజువాలిటీ, ఓపి విభాగం, సిటి స్కాన్, ఎంఆర్‌ఐ స్కాన్, ఎక్స్‌రే, అల్ట్రాసౌండ్,రక్తపరీక్షల కేంద్రాల వద్ద ఈ చలువపందిళ్ళు రోగులకు కాస్త వేడినుండి రక్షణ కల్పిస్తున్నాయి. రాయలసీమ జిల్లాల్లోనే ప్రభుత్వ ఆస్పత్రి రుయాలో ఈ ప్రత్యేకత కల్పించడం అభినందనీయం.

# ఉగ్ర దాడిలో అసువులు బాసిన కావలివాసి మధుసూధన్

## భార్య, బిడ్డల కళ్లెదుటే జరిగిన దారుణం

**కావలి (నెల్లూరు), ఏప్రిల్ 23, ప్రభాతవార్త :** విహారయాత్రకు వెళ్లి ఉగ్రవాదులచేతుల్లో చిక్కి అతి కిరాతకంగా, దారుణంగా హత్యగావింపబడిన కావలివాసి సోమిశెట్టి మధుసూధన్ విషాదవార్త కావలిని కుదిపేసింది. భార్య, బిడ్డల కళ్లెదుటే ఉగ్రవాదులు కిరాతకంగా హత్యచేసిన సన్నివేశంనుంచి వారు కోలుకోలేకపోయారు. శోకసముద్రంలో మునిగిపోయారు. శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరుజిల్లా కావలి పట్టణానికి చెందిన ఆనాలవారి వీధిలో నివసిస్తున్న అరటికాయల వ్యాపారి సోమిశెట్టి తిరుపాలు, పద్మావతి దంపతుల కుమారుడు మధుసూధన్. ఉగ్రవాదుల చేతుల్లో మృతిచెందిన మధుసూధన్‌కు ఒక బాబు, ఒక పాప ఉన్నారు. కుమార్తె మేధు ఇంటర్ చదువుతుంది. కుమారుడు దత్తు 8వ తరగతి చదువుతున్నాడు. 20 సంవత్సరాలుగా కర్ణాటక రాష్ట్రం బెంగుళూరులో ఐబిఎం కంపెనీలో సాఫ్ట్‌వేర్ ఇంజనీర్‌గా పనిచేస్తున్నారు. ఈ నెల 20వ తేది మధుసూధన్ తన కుటుంబంతో కాశ్మీర్ విహారయాత్రకు వెళ్లారు. 7 రోజులపాటు విహారయాత్ర ముగించుకుని బెంగుళూరుకు రావాల్సిన మధుసూధన్



భార్య, పిల్లలతో మధుసూదన్ (ఫైల్‌ఫోటో)

జమ్ము కాశ్మీర్ వద్ద పహల్గామ్ ఉగ్రదాడిలో మృతిచెందారు. భార్య, బిడ్డల కళ్లెదుటే ఉగ్రవాదులు హత్యచేయడంతో మధుసూధన్ కుటుంబం రోదిస్తూ శోకసముద్రంలో మునిగిపోయింది. ఈ వార్త దావానలంలా వ్యాపించిడంతో కావలిలోని కుటుంబసభ్యుల రోదనలు వర్ణణాతీతంగా మారాయి. ఉగ్రదాడిలో మృతిచెందిన మధుసూధన్ పార్థివదేహాన్ని బుధవారం అర్ధరాత్రి సమయంలో కావలిలోని తండ్రి నివాసానికి తీసుకువస్తున్నట్లు సమాచారం. మధుసూధన్ మృతితో కావలిలో విషాదఛాయలు అలుముకున్నాయి. ఈ ఉగ్రదాడిలో 28 మంది హిందువులు మృతిచెందినట్లు పోలీసుల చెప్పడాన్నిబట్టి తెలుస్తోంది.

# జమ్ముకశ్మీర్ ఉగ్రదాడిలో ఆంధ్రప్రదేశ్ వాసుల మరణంపై మాజీ సిఎం జగన్ దిగ్భ్రాంతి

**విజయవాడ, ఏప్రిల్ 23,ప్రభాతవార్తప్రతినిధి:** జమ్ముకాశ్మీర్ ఉగ్రదాడిలో ఏపీకి చెందిన ఇద్దరు ప్రాణాలు కోల్పోవడంపై మాజీ ముఖ్యమంత్రి, వైఎస్సార్‌సీపీ అధినేత వైయస్ జగన్ దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు."ఎక్స్" వేదికగా మృతులకు ఆయన సంతాపం ప్రకటించారు. టెర్రరిస్ట్‌ల దాడిని ఆయన తీవ్రంగా ఖండించారు. పర్యాటకులను ఉగ్రవాదులు దారుణంగా కాల్చి చంపడం అమానవీయ చర్య అన్నారు. బాధిత కటుంబాలను ఆదుకుని అండగా నిలవాలని కేంద్రాన్ని కోరారు. శోకతప్తులైన వారి కుటుంబీకులకు వైయస్ జగన్ తన ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. ఈ ఘటనలో విశాఖ వాసి చంద్రమోళిని, కావలికి చెందిన సోమిశెట్టి మధుసూదన్ రావును ముష్కరులు దారుణంగా హత్య చేసినట్టు తెలిసింది. కశ్మీర్‌లో ఉగ్రదాడిని నిరసిస్తూ వైయస్సార్‌సీపీ క్యాండిల్ ర్యాలీలు కశ్మీర్‌లోని పహల్గామ్‌లో టూరిస్టులపై ఉగ్రవాదుల దాడిని ఖండిస్తూ వైయస్సార్‌సీపీ రాష్ట్రవ్యాప్తంగా అన్ని జిల్లా కేంద్రాల్లో క్యాండిల్ ర్యాలీలు



నిర్వహించనుంది. ఉగ్రవాద దాడిని ఖండిస్తూ ఈరోజు సాయంత్రం ర్యాలీలు చేప్టటనుంది. పార్టీ అధ్యక్షుడు శ్రీ వైయస్.జగన్ ఈమేరకు పార్టీ నాయకులకు, పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. ఉగ్రవాదుల దాడిని అమానుష చర్యగా పేర్కొన్నారు. దేశం అంతా ఒక్కతాటిపై నిలవాలన్నారు. ఉగ్రవాదుల దుశ్చర్యను ఖండిస్తూ పార్టీ శ్రేణులు క్యాండిల్‌ర్యాలీలు నిర్వహించాలని పిలుపునిచ్చారు. అన్ని జిల్లాకేంద్రాల్లో ఈ కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. పహల్గాం ఘటనలో పలువురు మరణించండం అత్యంత బాధాకరమన్నారు. వారి కుటుంబాలకు ప్రగాఢ సంతాపాన్ని తెలియజేశారు. ఏపీకి చెందిన ఇద్దరు వ్యక్తులు మరణించడం అత్యంత బాధాకరమన్నారు.

## పర్యాటకులపై ఉగ్రవాదుల దాడి పిరికిపంద చర్య

### - ఎంపి డాక్టర్ మద్దెల గురుమూర్తి

**వెంకటగిరి, ఏప్రిల్ 23, ప్రభాతవార్త** జమ్ము కాశ్మీర్‌లోని పహల్గాం వద్ద పర్యాటకులపై జరిగిన ఉగ్రవాద దాడి పిరికిపంద చర్య అని తిరుపతి ఎంపీ మద్దిల గురుమూర్తి తీవ్రంగా ఖండించారు. అమాయక పర్యాటకులపై జరిగిన ఈ కిరాతక దాడిని ముష్కర మూకల పిరికిపంద చర్యగా ఆయన అభివర్ణించారు. దేశ సమైక్యతను దెబ్బతీసే ఉగ్రవాద చర్యలను ఎట్టి పరిస్థితుల్లో సహించరాదని అన్నారు. పర్యాటకులను లక్ష్యంగా చేసుకుని ఉగ్రవాదులు చేసిన ఈ దాడి దేశ శాంతి భద్రతలను భంగ పరిచే చర్యగా అభివర్ణించారు. రాజకీయాలకు అతీతంగా, ఈ దాడులకు వ్యతిరేకంగా అందరూ ఐక్యంగా పోరాడవలసిన సమయం ఇదని తెలిపారు. బాధితులకు తగిన న్యాయం జరిగే



విధంగా కేంద్ర ప్రభుత్వం చర్యలు తెసుకోవాలని కోరారు. అలాగే ముష్కరులపై కఠిన చర్యలు తీసుకోవాలని అన్నారు. ఈ ఘటనలో మరణించిన బాధిత కుటుంబాలకు ఎంపీ గురుమూర్తి తన ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. క్షతగాత్రులు త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. తిరుమలలో భద్రతా లోపాలపై తిరుపతి ఎంపీ డాక్టర్ ఎం.గురుమూర్తి ఫిర్యాదు చేయడంతో కేంద్ర ప్రభుత్వం సీరియస్‌గా స్పందించింది. తక్షణ జోక్యం అవసరమని కోరుతూ తిరుపతి ఎంపీ మద్దిల గురుమూర్తి చేసిన ఫిర్యాదుతో కేంద్ర హోం మంత్రిత్వ శాఖ స్పందించింది. ఈ అంశంపై కేంద్ర హోంమంత్రిత్వ శాఖ సెక్రటరీ మృత్యుంజయ్ త్రిపాఠి ఆంధ్రప్రదేశ్ చీఫ్ సెక్రటరీకి లేఖ రాశారు. ఈ అంశంపై నిశితంగా పరిశీలించి సమాధానం పంపాలని ఆంధ్రప్రదేశ్ చీఫ్ సెక్రటరీని కేంద్రహోంశాఖ ఆదేశించింది. ప్రపంచ ప్రసిద్ధిగాంచిన పుణ్యక్షేత్రాలలో ఒకటైన తిరుమలలో భద్రత చాలా కీలకమని, అలాంటి చోట వరుసగా పునరావృతమవుతున్న భద్రతలోపాలు ఆందోళన కలిగిస్తున్నాయని ఎంపీ తన ఫిర్యాదులో పేర్కొన్నారు. కేంద్ర ప్రభుత్వం వెంటనే జోక్యం చేసుకోవాలని తిరుపతి ఎంపీ మద్దిల గురుమూర్తి కేంద్ర హోమ్ మంత్రిత్వ శాఖకు లేఖ రాసిన విషయం విదితమే. ఈ లేఖలో భక్తుల రక్షణకు అవసరమైన భద్రతా ఏర్పాట్లను మెరుగుపర్చే బాధ్యత రాష్ట్ర ప్రభుత్వంపై ఉందని, కాని రెడ్ బుక్ రాజ్యాంగంపై దృష్టి సారించిన ప్రభుత్వం పాలనపై పట్టు కోల్పోయిందని పేర్కొన్నారు. తిరుమలలో భద్రతా లోపాలు భక్తుల జీవితాలను ప్రమాదంలో పడేయడంతో పాటు, వెంకటేశ్వర స్వామి వారి ఆలయ పవిత్రతను తీవ్రంగా దెబ్బతీశాయని తెలిపారు. ప్రస్తుత టీటీడీ పాలక మండలి భద్రతా చర్యలను సమర్థవంతంగా అమలు చేయడంలో పూర్తిగా విఫలమైందని తెలిపారు.

## కోయంబత్తూర్ బస్సులో బాలికపై వేధింపులు

**తిరుపతి, ఏప్రిల్ 23ప్రభాతవార్తప్రతినిధి:** రాష్ట్రప్రభుత్వ పర్యాటకశాఖ ఆధ్వర్యంలో నడిచే బస్సులో ఓ బాలికపై వేధింపులకు పాల్పడిన ఉదంతం ఆలస్యంగా వెలుగుచూసింది. బాలిక తరపున ఓ వ్యక్తి వేధింపుల ఘటనపై ఏకంగా రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుకు, తమిళనాడు సిఎం స్టాలిన్‌కు, పర్యాటకశాఖ రాష్ట్ర ఉన్నతాధికారులకు మెయిల్ ద్వారా ఫిర్యాదు చేయడంతో ఈ ఉదంతం వెలుగులోకి వచ్చింది. టిటిడి దర్శనాల విషయంలో 300 రూపాయలు సుపథం దర్శన టిక్కట్లను మూడునెలల క్రిందట రద్దుచేశారు. దీంతో ప్యాకేజీ బస్సులు కూడా పర్యాటక శాఖ తిరుమల యాత్ర నడపడంలేదు. అనధికారికంగా పర్యాటకశాఖ తిరుపతి శాఖ తిరుపతినుండి కోయంబత్తూరుకు ప్రత్యేక ప్యాకేజీ బస్సును నడిపింది. ఇందులో ఈనెల 14వతేదీ చాలావరకు తమిళనాడు ప్రయాణీకులు ఉన్నారు. ఆ బస్సును డ్రైవర్ బివి ప్రసాద్, ఎంవి రమణలు నడిపారని, ఆ సమయంలో సిసికెమెరాలు కూడా పనియుయలేదని ప్రయాణీకుల ఆరోపణలు. అనధికారికంగా ప్రయాణీకులను ఎక్కించుకుని నడపడమేగాక బస్సులో ఓ వ్యక్తి మైనర్‌బాలికపట్ల అసభ్యకరంగా వ్యవహరించి, వేధించాడనే ఫిర్యాదు మెయిల్ ద్వారా వెలుగుచూసింది. అనధికార ప్యాకేజీలు నడపడమేగాక ఈ ఘటనపై కనీసం పర్యాటకశాఖ డ్రైవర్‌లు కూడా నోరుమెదపకపోవడం పట్ల ప్రయాణీకులు మండిపడ్డారు. ఉచిత దర్శనం పేరుతో నడిపే ఈ ప్యాకేజీ బస్సులో జరిగిన ఘటనపై విచారణకు పర్యాటకశాఖ అధికారులు ఆదేశించినట్లు సమాచారం. అంతేగాక డ్రైవర్లపై శాఖాపరమైన చర్యలు తీసుకోనున్నట్లు తెలుస్తోంది. ఓ ప్రయాణీకుడు సిఎంకు ఫిర్యాదు చేయడంతోనే పర్యాటకశాఖ అక్రమాలు వెలుగుచూడటం మరీ కొసమెరుపు. మరీ మైనర్‌బాలికపై వేధింపులకు పర్యాటకశాఖ చర్యలు ఏంటో చూడాల్సిందే.

## ప్రజాసమస్యల పరిష్కారమే ప్రధాన ధ్యేయం

### - అంకభూపాలపురంలో ఎమ్మెల్యే ఇంటూరి

**వలేటివారిపాలెం (నెల్లూరు), ఏప్రిల్ 23, ప్రభాతవార్త :** ప్రజా సమస్యల పరిష్కారమే ప్రధాన ధ్యేయంగా పనిచేస్తున్నానని కందుకూరు ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు అన్నారు. ఇందుకోసం నిరంతరం శ్రమిస్తున్నట్లు ఆయన వివరించారు. ఇందులో బాగంగానే ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు చొరవతో నియోజకవర్గంలో కోట్లాదిరూపాయలు వెచ్చించి అభివృద్ధి సంక్షేమ పనులు నిర్వహిస్తున్నట్లు ఆయన తెలిపారు. బుధవారం మండలంలోని సుమారు రూ.10లక్షలుతో నిర్మించిన సీసీ రోడ్డుకు, దాదాపు రూ.40లక్షలతోనిర్మించిన సచివాలయ భవనానికరి ప్రాంరభోత్సవం చేశారు. అనంతరం సుమారు రూ.8లక్షల విలువైన వ్యయసాయ ఉపకరణాలును 50శాతం సబ్సిడితో లబ్ధిదారులుకు పంపిణీ చేశారు. తదుపరి ఎంపీడీవో నరేంద్రదేవ్ అధ్యక్షతన జరిగిన బహిరంగసభలో ఆయన మాట్లాడారు. గత ప్రభుత్వ తప్పిదాలను విమర్శిస్తూ తమ ప్రభుత్వం పూర్తిగా ప్రజోపయోగకరమైన పనులుకు ప్రాధాన్యత ఇస్తున్నట్లు తెలిపారు. గ్రామాభివృద్ధికి పనులుకు రాజకీయాలకతీతంగా సహకరించాలన్నారు. ఉద్దేశ్యపూరితంగా ఇబ్బందుల కల్గిస్తే ప్రత్యామ్నాయం ఎంటో తమకు పూర్తిగా తెలుసన్నారు. కనీసం గ్రామంలో శ్మశానం కూడా లేదంటే ఎంత హాస్యాస్పదంగా ఉందో గమనించాలన్నారు. ఈ గ్రామంలో డ్రైనేజివ్యవస్థ ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. అయ్యవారిపల్లెలో చేపట్టబోయే పారిశ్రామికీకరణ తో ఈ ప్రాంతప్రజలుకు ఎంతో ఉపయోగం కలగనుందన్నారు. పరిష్కారానికి సహకరించాలని గ్రామస్తులకు విజ్ఞప్తిచేశారు. మండల తెదేపా అధ్యక్షుడు మాదాల లక్ష్మినరసింహం



మాట్లాడుతూ యువనేత 24గంటలు పనిచేసే ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు సేవలును వినియోగించు కోవాలన్నారు. ఏ సమస్యకైనా నేరుగా ఎమ్మెల్యేని కలవాలని సూచించారు. కార్యకర్తలంతా ఐక్యతతో సమస్యల పరిష్కారానికి ఆయనకు చేయూత నివ్వాల్సిన ఆవశ్యకతను ఆయన గుర్తుచేశారు. వ్యవసాయశాఖ ఏడీ అనసూయ మాట్లాడుతూ ఈ క్రాపు నమోదుచేసుకొని ప్రభుత్వ రాయితీలు పొందాలన్నారు. సీనియర్ అడ్వకేట్ ఎగడా శ్రీనివాసులు మాట్లాడుతూ సమస్యల పరిష్కారంపై ఎమ్మెల్యే ఇంటూరికి మంచి పట్టు ఉందన్నారు. దశలవారీగా పరిష్కారానికి ఆయన ప్రణాళికాబద్ధంగా వ్యవహరిస్తున్న తీరును వివరించారు. శ్మశాన,భూసమస్యలపై బి.మాల్యాద్రి మాట్లాడారు. ఈ కార్యక్రమంలో విద్యుత్ ఏఈ మధుబాబు, హౌసింగు ఏఈ నాగరాజు,ఏవో హేమంత్‌కుమార్, నాగరాజు, తెదేపా నేతలు పెగడా నరసింహారావు, కాకుమాని హర్షకుమార్, వలేటి మధు, కొంకా రమేష్,గుత్తా మహేశ్వరరావు,పెగడా మోహన్, చెంచు శ్రీనివాసులు,సిరిగిరి కొండారెడ్డి,గుత్తా తిరపతయ్య, చుండి సాంబయ్యపాల్గొన్నారు.

## పది ఫలితాలతో పాఠశాలల్లో సంబరాలు

**శ్రీకాళహస్తి, ఏప్రిల్ 23, ప్రభాతవార్త:** పది పరీక్షా ఫలితాలతో శ్రీకాళహస్తిలో సంబరాలు అంబరాన్ని అంటాయి. శ్రీకాళహస్తిలో 11 ప్రభుత్వ పాఠశాలలున్నాయి. కార్పొరేట్ పాఠశాలలు 4 ప్రవేటు పాఠశాలలు 29 ఉన్నాయి.పదవ తరగతి పరీక్షలకు 2220 మంది హాజరు కాగా ప్రభుత్వ పాఠశాలల నుంచి 1167 మంది హాజరు కాగా ఉత్తీర్ణులైంది 834 మంది.71శాతం మంది ఉత్తీర్ణులయ్యారు. ప్రభుత్వ పాఠశాలల్లో మున్సిపల్ పరిధిలోని బాబూ అగ్రహారం పాఠశాలకు చెందిన కేతన్ 600 మార్కులకు గాను 589 మార్కులు సాధించి ప్రభుత్వ పాఠశాలల్లో టౌన్ ఫస్ట్ అయ్యాడు. బాలుర ఉన్నత పాఠశాలలో నితిష్‌మోషన్ రాజ్ 584 మార్కులు సాధించి [illegible] అయ్యారు. రాజీవ్‌నగర్‌లోని స్కూల్ ఆఫ్ ఎక్సలెన్సి విద్యార్థి 583 మార్కులు సాధించగా శ్రీకాళహస్తిలోని సరస్వతి బాయ్ మున్సిపల్ ఉన్నత పాఠశాలకు చెందిన విద్యార్థి 579 మార్కులు సాధించారు. ఎపిడబ్యు బాలికల గురుకులంకు చెందిన విద్యార్థిని 560 మార్కులు సాధించగా జిల్లా పరిషత్ బాలికోన్నత పాఠశాల విద్యార్థి 576 మార్కులు సాధించింది. ఎపిఎస్ డబ్బు ఆర్‌ఎస్ బాలికల గురుకులంలో విద్యార్థి 565 మార్కులు సాధించి రికార్డు సాధించారు. మొత్తం మీద ప్రభుత్వ పాఠశాలల్లో 71.47శాతం ఉత్తీర్ణత సాధించారు.ఇక ప్రవైటు పాఠశాలల్లో ద స్కూల్ విద్యార్థి దయాశంకర్ 595 మార్కులు సాధించారు.ఇక కార్పొరేట్ పాఠశాలల్లో భాష్యం పాఠశాలకు చెందిన విద్యార్థి చాతుర్య 597 మార్కులు సాధించినట్లు మేనేజ్‌మెంట్ ప్రకటించింది.కాగా నారాయణ పాఠశాలకు చెందిన ప్రశాంతి 596 మార్కులు సాధించగా రత్నం పాఠశాలకు చెందిన ఎన్ సాయిశ్రీ 591 మార్కులు సాధించినట్లు ఆయా మేనేజ్‌మెంట్లు ప్రకటించాయి. శ్రీకాళహస్తిలోని ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు కార్పొరేట్ విద్యార్థులకు తీసుపోమని పది ఫలితాలు చాటి చెబుతున్నాయి.గత ఏడాది కూడా గురుకులాలు, ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థులు కార్పొరేట్ విద్యార్థుల కంటే 10 మార్కుల తేడాతోనే సత్ఫలితాలు సాధిస్తున్నారు.

# విహార యాత్రలో విషాదం!

## ఉగ్ర మూకల దాడిలో విశాఖ వాసి చంద్రమౌళి మృతి

**విశాఖపట్నం, ఏప్రిల్ 23, ప్రభాతవార్త :** కాశ్మీర్ దాడి లో వెంటాడి మరి హత్య చేసిన ముష్కరులు!! బుధవారం రాత్రికి విశాఖ చేరుకున్న మృతదేహం!!శుక్రవారం విశాఖలో అంత్యక్రియలుజమ్మూ కాశ్మీర్లో సుందర ప్రదేశాలను తిలకించాలని చేపట్టిన వారి విహారయాత్ర విషాదంగా మారింది.టూరిస్టులు అందరూ ఒకే చోట సేదతీరి ఉన్న సమయంలో ముష్కరులు వారిని చుట్టుముట్టి విచక్షణారహితంగా కాల్పులు జరిపి పలువురును పొట్టన పెట్టుకున్నారు.ఈ ఘటనలో విశాఖపట్నం కు చెందిన రిటైర్డ్ బ్యాంకు ఉద్యోగి జరజాపు చంద్రమోళి (69) మృతి చెందారు.ఈనెల 16న మరో రెండు కుటుంబాలతో కలిసి కాశ్మీర్ టూర్ కి వెళ్లిన చంద్రమోళి షెడ్యూల్ ప్రకారం ఈనెల 25న విశాఖ తిరిగి రావాల్సి ఉంది.ఇంతలోనే ఈ విషాదం చోటు చేసుకుంది.అతను మృతి చెందారన్న విషయం తెలుసుకున్న కుటుంబ సభ్యులు కన్నీటి పర్యంతమయ్యారు.జమ్మూ కాశ్మీర్ లోని పహల్గా సమీపంలో టూరిస్టులందరూ ఒకే చోట ఉన్న సమయంలో ఆర్మీ సిబ్బంది దుస్తుల్లో వచ్చిన ఉగ్రవాదులు వారందరిని చుట్టుముట్టారు.మరి ఐడి కార్డులను కూడా పరిశీలించారు.అందులో ముస్లిమ్స్ కానీ వారిని నిర్దాక్షిణ్యంగా కాల్పులు జరిపి హతమార్చారు.ఉగ్రవాదులకు చిక్కిన చంద్రమోళి తనను వదిలేయాలని ప్రాదేయపడినప్పటికీఉగ్ర మూకలు కనికరించలేదు.వారి నుంచి తప్పించుకునే ప్రయత్నం చేస్తున్న సమయంలో మీ ప్రధాని నరేంద్ర మోడీకి చెప్పుకో అంటూ అతనిపై విచక్షణ రహితంగా కాల్పులు జరిపారు.ఈ ఘటనలో మృతి చెందిన వారిలో చంద్రమోళి పేరు లేకపోవడంతో అతను మిస్సింగ్ అయినట్లు కుటుంబ సభ్యులు ఆందోళన చెందారు. మరుసటి రోజు కొందరు టూరిస్టుల ద్వారా అతను మృతి చెందినట్లు సమాచారం వచ్చింది.ఇతనితో పాటు వెళ్లిన మరో ఐదుగురు క్షేమంగా ఉన్నట్లు తెలిసింది.అతను మృతదేహాన్ని బుధవారం ప్రత్యేక విమానం ద్వారా విశాఖ తరలించనున్నారు.!! కుటుంబ సభ్యుల కన్నీటి పర్యంతం..ఉగ్ర మూకల దాడిలో రిటైర్డ్ బ్యాంకు ఉద్యోగి చంద్రమోళి మృతి చెందడం ఆయన కుటుంబ సభ్యులు జీర్ణించుకోలేకపోతున్నారు. ఒక కుటుంబ పెద్దగా అలాగే ఎంకరేజ్ అపార్ట్మెంట్ వైస్ ప్రెసిడెంట్ గా ఉంటూ తన బాధ్యతలను సక్రమంగా నిర్వహిస్తూ అందరి మనసులలో ఒక మంచి వ్యక్తిగా చెరగని ముద్ర వేసుకున్నారు.అందరితో చాలా కలవిడిగా ఉండే చంద్రమోళి కాశ్మీర్లో ఉగ్రవాదుల దాడిలో మృతి చెందడం చాలా షాకింగ్ గా ఉందని ఆ అపార్ట్మెంట్ వాసులు తమ ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.మరోపక్క కుటుంబ సభ్యులు కూడా కన్నీటి పర్యంతమవుతున్నారు.!! ఈనెల 25న తిరిగి రావాల్సి ఉండగా ఇంతలోనే ఇలా జరిగింది..ఈనెల 16న ట్రావెల్ ఏజెంట్స్ ద్వారా చంద్రమోళి తో పాటు మరో ఐదుగురితో కాశ్మీర్ వెళ్లిన చంద్రమోళి ఈనెల 25న విశాఖ తిరిగి రావాల్సి ఉందని చంద్రమోళి సమీప బంధువు కుమార్ రాజా తెలిపారు.చంద్రమోళి కుటుంబంతో పాటు అప్పన్న, శశిధర్ కుటుంబాలు కూడా ఉన్నాయన్నారు.ఉగ్రవాదులు టూరిస్టులు అందరిని చుట్టుముట్టి వారిపై విచక్షణ రహితంగా కాల్పులు జరిపి చాలామందిని హతమార్చారని తెలిపారు. ఈ క్రమంలో చంద్రమోళి తప్పించుకునే ప్రయత్నం చేశారని కానీ ముష్కర్లు వెంటాడి మరి అతనిని హత మార్చారని పేర్కొన్నారు.మృతదేహం బుధవారం రాత్రి విశాఖ రానున్నట్లు తెలిపారు.అతని ఇద్దరి కుమార్తెలు అమెరికా నుంచి గురువారం వస్తున్నట్లు వెల్లడించారు.శుక్రవారం అతని పార్థీవ దేహానికి అంత్య క్రియలు జరుగుతాయని తెలిపారు.

## తిరుపతిలో యువతిపై సామూహిక అత్యాచారం

### -మత్తుకలిపిన జ్యూస్ తాగించిన నిందితులు

**తిరుపతి,ఏప్రిల్ 23ప్రభాతవార్తప్రతినిధి:** తిరుపతినగరంలో సామాజిక మాధ్యమంద్వారా పరిచయమైన ఓ యువతిపై కొందరు యువకులు అత్యాచారానికి పాల్పడ్డారు. ఈ ఘటన ఆలస్యంగా వెలుగుచూసింది. మత్తుకలిపిన జ్యూస్ తాగించి నలుగురు యువకులు ఈ అఘాయిత్యానికి పాల్పడినట్లు బాధిత యువతి ,తల్లిదండ్రులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. బుధవారం సాయంత్రం తిరుపతి నగరంలోని వెస్టుపోలీసుస్టేషన్ పరిధిలో ఈ ఘటన చోటుచేసుకుంది. నగరంలోని పెద్రూనగర్‌లో నివాసముంటున్న (16)ఏళ్ల దళిత యువతితో సామాజిక మాధ్యమంలో అప్పటికే పెళ్లయి భార్య, ఓ పాప ఉంది. అయినా చెడుఅలవాట్లకు బానిసైన యువకుడు సామాజిక మాధ్యమంద్వారా యువతితో పరిచయంచేసుకుని ప్రేమ కార్యకలాపాలు సాగించాడు. ఏకంగా పెళ్ళిచేసుకుంటానని నమ్మించాడు. యువతికి మరో మైనర్‌బాలికకు మాయమాటలు చెప్పి నమ్మించి తీసుకురమ్మన్నాడు. ఇద్దరూ కలసి యువకుడు వద్దకు వెళ్ళడంతో అతనితోబాటు మరో ముగ్గురు యువకులు దళిత యువతిని తీసుకుని బయటకు వెళ్ళారు. అక్కడ యువతికి మత్తుకలిపిన జ్యూస్‌తాగించి ఆపై అత్యాచారంచేశారు. మరుసటిరోజు తిరుపతి ఆర్టీసిబస్టాండ్‌లో వదలిపెట్టి పరారయ్యారు. అప్పటికే యువతి కనిపించడం లేదని బాదిత తల్లిదండ్రులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. బస్టాండులో అపస్మారకస్థితిలో ఉన్న యువతిని మహిళ ఆటోడ్రైవర్ చేరదీసి ఇంటికి చేరవేసింది. బుధవారం సాయంత్రం యువతి సోదరుడికి విషయం చెప్పడంతో పోలీసులను ఆశ్రయించారు. పోలీసులు విచారణలో యువతి విస్తుబోయే విషయాలు వెల్లడించడం, ,యువతి మొబైల్‌ఫోన్‌లో ఉన్న ఇన్‌స్టాగ్రామ్‌లోని ఫోటోలతో నిందితులను గుర్తించింది. దీంతో పోలీసులు నిందితులను అదుపులోకి తీసుకున్నారు. యువతిని ప్రసూతి ఆస్పత్రికి తరలించి వైద్యపరీక్షలు నిర్వహిస్తున్నారు. వైద్యనివేదిక అందితే అత్యాచారంలో ఎంతమంది పాల్గొన్నారనేది తెలియదని, ఈ కేసును విచారణ చేస్తున్నట్లు పోలీసువర్గాలు మీడియాకు తెలిపాయి. అనుమానంతో ఇద్దరిని అదుపులోకి తీసుకుని విచారణ చేస్తున్నామన్నారు. నిందితులపై కఠిన చర్యలు తీసుకోవాలని మహిళా సంఘాలు డిమాండ్ చేస్తున్నాయి.

## తిరుపతిజూలో బెంగాల్‌పులి మృతి

**తిరుపతి,ఏప్రిల్ 23ప్రభాతవార్తప్రతినిధి:** తిరుపతి జూలో ఉన్న 20ఏళ్ళ వయస్సున్న బెంగాల్‌పులి అనారోగ్యంతో మృతి చెందింది. జూలో ఎండవేడి అధికంగా ఉండటం, కొండదిగువన జూ వుండటంతో మరింతగా జంతువులకు సమస్యలు ఎదురవుతున్నాయి. జూలో చల్లదనం కోసం వట్టివేర్లు, కూలర్లుఏర్పాటుచేసినా వేడికి అనారోగ్యానికి గురైంది.


ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం
రహదారులు మరియు భవనముల శాఖ

చిట్ నిట్ నెం.29/టి.ఓ/2025-26, **చిట్ టెండర్ ప్రకటన** తేది: 23.04.2025

ప్రధానమంత్రి పర్యటన నిమిత్తం అత్యవసర రహదారుల మరమ్మతుల పనులకు సుమారు రూ.30.00 లక్షల విలువ గల 1 పనికి బాక్స్ టెండర్లు కోరబడుచున్నవి. టెండర్లు దాఖలు చేయుటకు చివరి తేది: 26.04.2025, సా.4.00 గం.ల వరకు. తదుపరి వివరములకు ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ (ఆర్ & బి) డివిజన్, గుంటూరు కార్యాలయము నందు సంప్రదించగలరు.

సం/- కార్యనిర్వాహక ఇంజనీరు, (ర.భ) డివిజను, గుంటూరు

DIPR.No.16203/CL/Advt/1/1/2022-23, తేది: 23.04.2025

**ANDHRA PRADESH CAPITAL REGION DEVELOPMENT AUTHORITY (APCRDA)**
Lenin Center, Governorpet, Vijayawada - 520 002 (A.P.)

**E-PROCUREMENT SHORT TENDER NOTICE**

| S.No | NIT No | Name of the Work |
|---|---|---|
| 1 | NIT No. 18/PROC/MAU61-OPOMOCOMM/16/2025-JDC, Dt. 23.04.2025 | APCRDA-"Request for Proposal (RfP) for Appointment of Agency for Branding, Communications, and Digital Outreach Strategy for Amaravati" |

The bid can be downloaded on AP e-procurement portal from **24.04.2025 to 01.05.2025 up to 14.00 Hrs.** Due date for submission of Bid is **01.05.2025 up to 15.00 Hrs,** Technical bid opening **01.05.2025 @ 16.00 Hrs**

**E-PROCUREMENT TENDER NOTICE**

| S.No | NIT No | Name of the Work |
|---|---|---|
| 2 | NIT No. MAU61-ADMNOSD(VI)/19/2025-HB, Dt. 23.04.2025. | Supply and fixing of split air conditioners of four numbers in APCRDA thullur unit office"- **Estimate Amount: Rs. 3.60 Lakhs.** |
| 3 | NIT No. MAU61-ADMNOSD(VI)/16/2025-HB, Dt. 23.04.2025. | "Construction of Horticulture Nursery cum training centre (HNTC) at UD Palem in CRDA Region"- **Estimate Amount: Rs. 96.00 Lakhs.** |

(S.No 2) The bid can be downloaded on AP e-procurement portal from **24.04.2025 to 08.05.2025 up to 14.00 Hrs.** Due date for submission of Bid **08.05.2025 up to 15.00 Hrs,** Technical bid opening **08.05.2025 @16.00 Hrs.**

(S.No 3) The bid can be downloaded on AP e-procurement portal from **24.04.2025 to 09.05.2025 up to 14.00 Hrs.** Due date for submission of Bid **09.05.2025 up to 15.00 Hrs,** Technical bid opening **09.05.2025 @16.00 Hrs.**

For further details Please refer to **www.apeprocurement.gov.in** and **www.crda.ap.gov.in.**

Sd/- Commissioner, APCRDA, Vijayawada.

వార్త

కళ్లలంగా ఉన్న కొలనులో నిశ్చలమైన ప్రతిబింబం కనపడదు. అలాగే నిలకడలేని మనసులో శాంతి నిలబడదు.

-కె. స్టాన్ స్లావిస్కి

# మంచుకొండల్లో నెత్తుటి ధార

కశ్మీరులో పదమూడేళ్ల తర్వాత 26 మంది పర్యాటకులను బలితీసుకుంటూ ముష్కరులు వికటాట్టహాసం చేశారు. ఇదేదో దొంగ దెబ్బ కానేకాదు. పకడ్బందీ ప్లాన్‌తో చేసిన దాడే. ముందే హెచ్చరికలున్నా పర్యాటకుల్ని కాపాడుకోలేకపోయాం. ప్రభుత్వాధికారులను లక్ష్యంగా చేసుకున్న చర్యగా భావించేందుకు ఆధారాలున్నా ఇతర పర్యాటకుల్ని కూడా చంపేశారు. వారిలో ఐబి. నేవీ, ఎయిర్‌ఫోర్స్ అధికారులు తమ కుటుంబాలతో సందర్శనకు వచ్చారు. తమను వదలిపెట్ట మని చంపొద్దని ప్రాధేయపడినా ఎవర్నీవారు కనికరించలేదు. నిర్దాక్షిణ్యంగా కాల్చేశారు. చనిపోయిన వారిలో 25 మంది పురుషులు, ఒక మహిళ ఉన్నారు. మంగళవారం మధ్యాహ్నం 2.30 గంటల సమయంలో దక్షిణ కశ్మీర్ అనంత్‌నాగ్ జిల్లా పహల్‌గాంలో దాదాపు వందలాది మంది పర్యాటకులున్న బైసరన్ ప్రాంతంపై ఒక్కసారిగా ఉగ్రవాదులు చుట్టుముట్టారు. మృతిచెందిన వారిలో ప్రభుత్వాధికారులే ఎక్కువ మంది ఉండడంతో టెర్రరిస్టులు వారినే లక్ష్యంగా చేసుకున్నారని తొలుత భావించినా వారి పాశవిక చర్య వెనుక పాకిస్థాన్ ఆర్మీ హస్తం ఉండి ఉండవచ్చుననే అనుమానాలు బలపడ్డాయి. ఇదొక హృదయ విదారక అమానుష హత్యాకాండగా ఈ సంఘటనకు ప్రత్యక్షసాక్షులు చెబుతున్నారు. ఈ దురాగతానికితామే బాధ్యులమని లష్కరే ఎతోయిబా అనుబంధ సంస్థది రెసిస్టెన్స్‌ఫ్రంట్ బహిరంగంగానే ప్రకటించుకోవడం విశేషం. ప్రత్యక్ష సాక్షులు చెబుతున్న దానిని బట్టి తమను చంపొద్దని వేడుకున్నా తూటాల వర్షం కురిపించారని, మోడీతోచెప్పుకోండన్నారని వివరించారు. విశాఖపట్నంకు చెందిన చంద్రమౌళి పారిపోతుండగా వెంటాడి స్నైపర్ ఫైర్‌తో కాల్చిచంపారు. వేసవిలో కశ్మీర్ వెళ్లడానికి ఎంతో మంది ఇష్టపడతారు. ఇటీవలే వివాహంచేసుకున్న నవజంటలు కూడాఉన్నాయి. మృతుల్లో ఇద్దరు విదేశీయులుకాగా ఒకరు నేపాలీ, మరొకరిది యూ.ఎ.ఇ. పలువురు కర్ణాటక, మహారాష్ట్ర, గుజరాత్, యుపి,బీహార్, ఆంధ్రప్రదేశ్, తెలంగాణరాష్ట్రాలకు చెందినవారున్నారు. పహల్గామ్‌కు 5,6కిలోమీటర్ల దూరవంలో ఉండే బైసరన్ ప్రత్యేకమైన రిసార్టులుండే టూరిజం ప్రదేశం. యేటా ఈ ప్రాంతానికి అధిక సంఖ్యలో దేశ విదేశాల నుంచి టూరిస్టులు వస్తుంటారు. 2019లో పుల్వామాలో సిఆర్‌పిఎఫ్ కాన్వాయ్‌పై జరిపిన ఉగ్రవాదులదాడిలో 47మందిబలయ్యారు. తాజా దాడిలో ముష్కరులు చాలా విచిత్రంగా వికృతంగా ప్రవర్తించారని సమాచారం. పర్యాటకులు హిందువులని నిర్ధారించుకున్న తర్వాతనే వారిని పాయింట్ బ్లాక్‌లో కాల్చేశారు. తన భర్త శివ మొగ్గకు చెందిన మంజునాథ్ రావును చంపగానే తననూ చంపమని కోరినా చంపకుండా దుర్భాషలు మాట్లాడారని కర్ణాటకకు చెందిన పల్లవి చెప్పింది. హిందువులో ముస్లింలో తేల్చుకోడానికి ముస్లిం ప్రార్థనాగీతాల గురించి ప్రశ్నించి తీవ్రఉన్మాదాన్ని ప్రదర్శించారట. గుడారాలోంచి లాగి పేరడిగి కాల్చిపారేశారు. హోటళ్లలో తింటున్నవారినీ విచక్షణారహితంగా ఒక్కొక్కరిగా కాల్చేస్తుండగా పర్యాటకులు ఆర్తనాదాలు చేశారు. కశ్మీర్‌కు వేసవిలో దాదాపు 30లక్షలమంది దాకా పర్యాటకులు వస్తుంటారు. అయినా ప్రభుత్వపరంగా పహల్గామ్ ప్రాంతంలో ప్రత్యక్ష భద్రతా ఏర్పాట్లేవీ ఉన్నట్లు లేదు. కేవలం ఐదుగురుసాయుధులు, కెమెరా కలిగిన హెల్మెట్లు ధరించి పర్యాటకప్రాంతం మీదటెర్రర్ అటాక్‌జరిగినప్పుడే నిలువరించగల భద్రతా సిబ్బంది లేకపోవడంవిచారకరం. కశ్మీర్ ప్రత్యేక ప్రతిపత్తిని రద్దుచేసి, మూడు ప్రాంతాలుగా విభజించి, ఎన్నికలు జరిపించడంతో పాకిస్థాన్ బాగా ఆగ్రహంతో ఉంది. దేశంలో వక్ఫ్‌బిల్లు సవరించాక దేశీయ ముస్లింలలోనూ ఆగ్రహావేశాలు వ్యక్తమైనా ఎవరూ పాక్ దేశీయులతోచేయి కలుపలేదు. ఇదిలాఉండగా ఇక కేంద్ర ప్రభుత్వం ముందున్నది ఉమ్మడి పౌరస్మృతి మాత్రమే. కనుక ఆదిశగా అడు గులువేసే తరుణంలో పాక్‌ఆగ్రహం గురించి అంచనా వేయలేని పరిస్థితి ఏమీలేదు.అయినా జరుగరానిది జరిగిపోయింది. ఇంతమంది ప్రముఖులు ఒకేసారి కశ్మీర్ రావడాన్ని ముష్కరులు అలుసుగా తీసుకున్నారనిపిస్తుంది. ఏమయితేనేం అమాయకులు బలయ్యారు. సైఫుల్లాఖాన్ అనే ఉగ్రవాది ముందుగానే ఈ దాడుల గురించి హెచ్చరించాడు. రాబోయే రోజుల్లో ఫిబ్రవరి, ఏప్రిల్ నెలల్లో ముజాహిదీన్‌లు దాడిచేస్తారని, ఆ తర్వాత కశ్మీర్ తమ చేతుల్లోకి రాబోతోందని కేంద్రప్రభుత్వాన్ని తీవ్రంగా హెచ్చరించినా భద్రతాబలగాలుఏమాత్రం అప్రమత్తంగాలేరని అర్థమవుతోంది. ఇప్పుడు జరిగినదాడి కశ్మీరు టూరిజానికి పెద్ద దెబ్బ. కశ్మీరుకు రావడానికి దేశ విదేశీ టూరిస్టులు తీవ్ర భయభ్రాంతులౌతారు. పర్యాటకులు తగ్గిపోయే అవకాశముంది. పర్యాటకాదాయం భారీగా పొందే కశ్మీర్‌కు భద్రత కోసం కేంద్రం మరిన్ని పటిష్ట భద్రతా చర్యలు తీసుకోవాలి. 2000 మార్చిలో అప్పటి అమెరికా అధ్యక్షుడు బిల్‌క్లింటన్ భారత్‌లో పర్యటిస్తున్న సమయంలో అనంత్‌నాగ్‌జిల్లా చట్టీసింగ్ పురాలోఉగ్రవాద దాడిలో 36మంది సిక్కులను కాల్చిచంపారు. తాజాగా అమెరికా ఉపాధ్యక్షుడు వాన్స్ ఇండియాలోపర్యటిస్తున్నవేళ అలాంటి దుండగుల దుశ్చర్యకు 26 మంది చనిపోవడం విచారకరం.ఇలాజరిగిన ప్రతిఉగ్రవాది దాడిలోనూ ఎక్కువ మంది చనిపోతున్నారు. ఈ ఘటనను ఖండిస్తూ కశ్మీరు వాసులు ప్రజాసంఘాలు సైతంనిరసన వ్యక్తంచేస్తున్నాయి ముష్కర చర్యలను ఖండిస్తున్నాయి. సభ్య సమాజం గొంతెత్తి మృతుల కుటుంబాలకు సంతాపం తెలియచేస్తోంది. పహల్గామ్ ఊచకోతను ఖండిస్తూ సుప్రీంకోర్టుఏకగ్రీవ తీర్మానం చేసింది. ముష్కరులకు పాక్ గూఢచారి సంస్థ ఐఎస్ఐసహాయం అందించిందని తెలుసు.ఇక పాక్ కవ్వింపు చర్యలపై భారత్‌యుద్ధం ప్రకటించడమే తరువాయి.

లోకులు తొందరగా నిందిస్తారు. అంతే త్వరగా అభినందిస్తారు కూడా. అందువల్ల ఇతరులు నిన్ను గురించి అనుకునే మాటలకు అంత విలువ ఇవ్వొద్దు.



రామకృష్ణ పరమహంస

అతిథి అంటే ఇంటికొచ్చిన బంధువు మాత్రమే కాదు. ఆకలి బాధతో మిమ్మల్ని ఆశ్రయించిన ప్రతిజీవి, పశుపక్ష్యాదులు సైతం అతిథులే.



వి.జాన్సన్

# ప్రజావాక్కు



## నీటి ఎద్దడిని అరికట్టాలి

వేసవి మొదలవడంతోనే చాలా ప్రాంతాల్లో మంచినీటి ఎద్దడి ఎదురవుతుంది. నీటి కొరత ప్రజల జీవితాల్లో తీవ్ర ప్రభావం చూపుతోంది. పట్టణాలు, గ్రామాలు అనే తేడా లేకుండా ప్రతి ప్రాంతంలో నీటి కోసం పోటీపడే పరిస్థితి ఏర్పడుతోంది. ఈపరిస్థితికి ప్రధానంగా భూగర్భ జలాల క్షీణత, వర్షపు నీటి వృథా, పట్టణీకరణ వల్ల అడవులు దెబ్బతినడంవంటి అంశాలే ప్రధాన కారణం. పూర్వపు రోజుల్లోగ్రామాల్లో కొలనులు,చెరువులు, వాగులు, వంకలు వంటి ప్రకృతిసిద్ధ నీటి వనరులు అధికంగా ఉండేవి. వానాకాలంలో ఎక్కువగా వర్షపు నీరు వీటిలో నిల్వ ఉండి,భూగర్భ జలాలు పెరిగేలా సహాయపడేవి. అయితే ఇప్పుడు కాలక్రమేణా చెరువులు ఆక్రమణకు గురవుతున్నాయి,వాగులు,వంకలు కనుమరుగవుతున్నాయి. పట్టణ ప్రాంతాల్లో మంచినీటి సమస్య మరింత తీవ్రమోతోంది. ఇదే అదనుగా భావించి ట్యాంకర్ల ద్వారా నీటి వ్యాపారం విపరీతంగా పెరుగుతుంది.

-తోట యోగేందర్, మిర్యాలగూడ, నల్లగొండ జిల్లా

## గురుకులాలలో ఇంటర్ కోర్సులు

వచ్చే విద్యా సంవత్సరం తెలంగాణ రాష్ట్రంలోని ఎస్సీ ఎస్టీ బీసీ మైనారిటీగురుకులాలలో తప్పనిసరిగా ఇంటర్మీడియట్ స్థాయిలో అన్నికోర్సులుఎంపిసి, బైపిసి, హెచ్ఈసి, సిజిసి, ఎంఇసి అన్నికోర్సులను ప్రవేశపెట్టాలి. ఇప్పటివరకు మ్యాథమెటిక్స్ సైన్స్‌కోర్సులున్నాయి. వాటితోపాటుగా సామాజిక శాస్త్రాలు అయిన ఎకనామిక్స్. హిస్టరీ, సివిక్స్,కామర్స్ వంటి కోర్సులను కూడా తప్పనిసరిగా వచ్చే విద్యా సంవత్సరం నుండి తప్పనిసరిగా ప్రారంభించాలి. పేద విద్యార్థులు చదువుకునే అవకాశం ఉంటుంది.

-డాక్టర్ ఈదునూరి వెంకటేశ్వర్లు, నెక్కొండ

## పెరుగుతున్న మధుమేహం

దేశంలో పెరిగిపోతున్న మధుమేహం ,గ్యాస్ట్రిక్ వ్యాధుల తగ్గుదలకువాడుతున్న స్టెరాయిడ్,అసిడిటీ వగైరా మందులు నాణ్యత పరీక్షల్లో నిర్ణీత ప్రమాణాలు లేవని సంబంధిత సంస్థ తేల్చి చెప్పింది.దీనితో. 84రకాల ఇతర మందులు కూడా ఉన్నవి. జీవితకాలం వాడాల్సిన మందు కారణం ఏదైనా నాణ్యత లేనిది వాడకం జరిగితే ,ఉన్న రోగం తీవ్రత తగ్గక కొత్తరోగం రావొచ్చు.

-బి. మేఘనాథం, విశాఖపట్నం

## ఉగ్ర దాడి అమానుషం

పర్యాటకుల స్వర్గధామం మినీస్విర్జర్లాండ్‌గా పిలిచే జమ్ము కాశ్మీర్‌లోఉగ్రవాదుల కాల్పుల్లో 27 మంది పర్యాటకులు మృతి చెందిన ఘటన అమానుషం. ఈ ఘటన తీవ్ర దిగ్భ్రాంతిని కలిగించింది. ఈదుశ్చర్యను తీవ్రంగాఖండించాలి. ఉగ్రవాదులు దొంగ దెబ్బలతో భారతీయుల ఆత్మస్థైర్యాన్ని దెబ్బతీయలేరు. తెలుగు రాష్ట్రాలకు చెందిన వారు కూడా మరణించడం బాధాకరం. ఉగ్రవాద మూకల విషయంలో కేంద్రం కఠినంగా వ్యవహరించాలి. మృతుల ఆత్మకు శాంతి చేకూరాలి. ఉగ్రవాదాన్ని కేంద్రం ఉక్కుపాదంతో అణచి వెయాలి. మరో మారు ఇలాంటి ఘటనలు జరగకుండా కేంద్రం చర్యలు తీసుకోవాలి. అందరూ ఈ ఉగ్ర చర్యను ఖండించాలి.

- కామిడి సతీష్ రెడ్డి, భూపాల్‌పల్లి జిల్లా

## సామాన్యులకు పసిడి ఎంతో దూరం

అమెరికాలో రెండోసారి అధికారం దక్కించుకున్నడొనాల్డ్ ట్రంప్ ప్రభుత్వం అనుసరిస్తున్న ప్రభుత్వ విధానాలు, సుంకాల ప్రకటన, అమెరికాతో చైనాకు జరుగుతున్న వాణిజ్య యుద్ధం, డాలర్ విలువ బలహీనంగా ఉండటం వంటి కారణాలతో సురక్షిత పెట్టుబడి సాధనంగా బంగారంపై ఎక్కువ మంది ఆసక్తి చూపిస్తుండటంతో ప్రస్తుతం బంగారం ధర హిస్టరీ క్రియేట్ చేస్తుంది. ప్రస్తుతం మార్కెట్లో 24 క్యారెట్ల బంగారం ధర 10 గ్రాములకు రూ. లక్ష నమోదైంది. దీనిమీద 3 శాతం గూడ్స్ అండ్ సర్వీసెస్ ట్యాక్స్ కలిపితే మొత్తంధర రూ. 1,02,160కి చేరుకుంది. మన దేశంలోనే కాకుండా అంతర్జాతీయ మార్కెట్లోనూ పసిడిధరలు భగ్గుమంటున్నాయి. ధరలు ఇంతలా పెరగడం చరిత్రలో ఇదే తొలిసారి అని నిపుణులు చెబుతున్నారు.

-దాసం వెంకటరెడ్డి, బెంగుళూరు

## చౌక డిపోలలో రాగులను పంపిణీ చేయాలి

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం చౌక ధరల దుకాణాల ద్వారా కిలో రాగులను రెండురూపాయలకే పంపిణీ చేయటం హర్షణీయం. చిరుధాన్యాలలో రాగులు ఎంతో ముఖ్యమైనవి. మన ఆరోగ్యానికి ఉపయోగకరం. రాగులతో రాగి ముద్దలు, రాగి జావ తదితరాలుగా వాడుకోవచ్చు.రాగులలో అనేక పోషకాలు ఉన్నాయి. రాగులలో బి1, బి2, బి3, బి6 విటమిన్లతోపాటు సి విటమిన్ కూడా కొంతఉంటుంది. రక్తహీనతను తగ్గించటంలో ఉపయోగపడుతుంది. వైద్యులు సైతం రాగులను సిఫార్సు చేస్తున్నారు.

-కప్పగంతు వెంకట రమణమూర్తి, సికింద్రాబాద్

మనవి

ఎడిట్ పేజీకి..

ఆర్థిక, సామాజిక, రాజకీయ విశ్లేషణాత్మక రచనలు పంపగోరు రచయితలు మాకు పంపే వ్యాసాలు ఇతర పత్రికలకు కూడా పంపడం సరైన విధానం కాదు. సహకరిస్తారని ఆశిస్తాం. -ఎడిటర్

(e-mail: editpage@vaartha.com)

# డీలిమిటేషన్ ప్రజాస్వామ్య మనుగడకు అడ్డం కారాదు!

**రాజకీయాలు శాశ్వతం కావు కానీ దేశాలూ ప్రజలూ శాశ్వతం! ప్రజల కోసం వుండే వ్యవస్థల్లోని లోటుపాట్లని కాలానుగుణంగా సవరించుకోవటం అధికారంలో వున్న పార్టీ చేయాల్సిన బాధ్యత వుంది. అవసరమైతే రాజనీతిజ్ఞతను ప్రదర్శిస్తూ అధికార దర్పాన్ని, అహంనూ ప్రక్కనపెట్టి విపక్షాలనూ, న్యాయ నిపుణులనూ, మేధావులనూ, ప్రజా సంఘాలనూ విశ్వాసంలోకి తీసుకొని అవసరమైతే ఒకటి కాదు రెండు కాదు అవసరమైనన్ని సమావేశాలు జరిపి చర్చల ద్వారా సమయోచిత నిర్ణయాలు ప్రభుత్వాలు తీసుకుంటే అందరూ సంతోషించటమే కాదు ఆమోదయోగ్యమైన నిర్ణయాలకు కట్టుబడి వుంటారు! అదే ప్రజాస్వామ్యం పునాది మనుగడ!**



రావులపాటి సీతారాంరావు

ఓటర్లు సార్వత్రిక ఎన్నికలలో ఓటు హక్కును వినియోగించుకొని తమ ప్రతినిధులను చట్టసభల్లో ప్రవేశింపచేయటానికి లోక్‌సభకైనా, శాసనసభకైనా నియోజకవర్గాలు వుండక తప్పదు. రాజ్యాంగంలోనిఆర్టికల్ 82,170 ప్రకారం సభలలోనిసభ్యుల సంఖ్య జనాభాను అనుసరించి జరపబడాలి! జనాభా ముఖ్య ప్రాతిపదికగా గుర్తించబడినప్పుడు దేశంలోని రాష్ట్రాలలోని సభలోని సీట్ల ఓటర్ల విషయంలో హెచ్చుతగ్గులు వుండక తప్పదు.ఇదే ఇప్పుడు డీలిమిటేషన్ విషయంలో పెద్ద సమస్యగా మారింది. ఉత్తరాదిన కొన్ని రాష్ట్రాలలో ముఖ్యంగా ఉత్తరప్రదేశ్లో జనాభా ఆధారంగా తీసుకోవాల్సిన ఓటర్లసంఖ్య ప్రతి జనాభా లెక్కింపులోనూ దక్షిణాది రాష్ట్రాలతో పోలిస్తే విపరీతంగా పెరిగిపోతున్నది. దానివల్ల విధాన సభలో శాసన సభలలో వుండాల్సిన సీట్ల సంఖ్య ప్రతిసారీ ఎక్కువవుతున్నది. అందుచేత ప్రజాస్వామ్య మూలసూత్రాలు బీటలు వారుతున్నాయని దక్షణాది వారు ఆరోపిస్తున్నారు. దక్షణాదిలో ప్రభుత్వాల ఆదేశాల ప్రకారం పాపులేషన్ కంట్రోల్ (జనాభా నియంత్రణ) ముఖ్యంగా ఎమర్జెన్సీ లో ఎక్కువగా జరగటంతో అటు విధాన సభకూ ఇటు శాసన సభకూ సీట్ల సంఖ్య తగ్గుతూ వచ్చింది. కుటుంబ నియంత్రణ దేశ ప్రయోజనాల దృష్ట్యా ప్రభుత్వాల నిర్ణయానుసారం అమలు చేయటంవల్ల లోక్ సభలోనూ శాసనసభల్లోనూ సీట్లు తగ్గుతూ వచ్చాయి! మంచి చేసినందుకుగాను మాకు నష్టం వాటిల్లే రీతిలో డీలిమిటేషన్ నిర్ణయాలు జరిగాయని,జరగబోతున్నాయని దక్షిణాది ప్రజలు వాపోతున్నారు. కోపరేటివ్ ఫెడరిలిజమ్ సూత్రానికి భిన్నంగా ఈ డీలిమిటేషన్ వ్యవహారం నడుస్తున్నదని అందువల్ల ప్రజా ప్రతినిధుల సభలలో తమ తప్పేమీ లేకుండానే తమ ప్రాతినిధ్యం తగ్గటంవల్ల దేశ నిర్ణయాలలో తమపాత్ర, జోక్యం క్రమేపీ తగ్గిపోతున్నాయని, ఈ ప్రాతిపదిక మూలాలను ప్రశ్నిస్తున్నారు! ఎలక్షన్ కమీషన్ ఆఫ్ ఇండియా ఇచ్చిన డాటా ప్రకారం మొదట జరిగిన సార్వత్రిక ఎన్నికలలో (1951-52) 489 (లోక్‌సభ) సీట్లు ఉన్నాయి. 1957లో 494, 520-1967 ( డీలిమిటేషన్ కమిషన్ మార్చి 21, 1963 నాడు 1961 జనాభా లెక్కల ఆధారంగా ఏర్పరిచినవి) 31 సీట్లు పెంచటం, 5 సీట్లు తగ్గించటం (అంతకు పూర్వం జరిగిన ఎన్నికలతో పోలుస్తే) జరిగింది! విభజన పూర్వం వున్న ఎపిలో 43 నుంచి 41, చెన్నై 41 నుంచి 39, యుపి 86 నుంచి 85, అస్సాం, మహారాష్ట్ర, గుజరాత్, కేరళ, కర్ణాటక, రాజస్థాన్, వెస్ట్ బెంగాల్, ఢిల్లీ, హిమాచల్ ప్రదేశాల్లో కొన్ని సీట్లు పెరిగాయి. కొత్త రాష్ట్రాలైన హర్యానా, జమ్మూకాశ్మీర్, నాగాలాండ్, అండమాన్ నికోబార్, చండీఘడ్, దాద్రానగర్ హవేలీ, గోవా, డమన్ అండ్ డైయూ, లక్షద్వీప్, పాండిచ్చేరిల్లో గూడా కొత్తగా సీట్లు చేర్చబడ్డాయి! లోక్‌సభ సీట్లు ప్రస్తుతం 543 (1971 సెన్సస్ ప్రకారం). 1951 నుంచి 2004లో జరిగిన పెంపుకు (డీలిమిటేషన్ కమీషన్ నిర్ణయానుసారం) ప్రత్యేక ఫార్ములాగా ఐడియల్ జనాభా సంఖ్య అంటూ అనుసరించినట్లు లేదు. జనాభా ప్రాతిపదికన నిర్ణయాలు చేసినప్పుడు రాజకీయ సరిహద్దులు, భౌగోళిక పరిస్థితులు పరిగణనలోకి తీసుకున్న దాఖలాలు లేనట్లు ఒక అభిప్రాయం వుంది. కానిస్టిట్యూయన్సీకి ఏవిధమైన రిప్రజెంటేషన్ ముఖ్యాంశంగా వుండాలి అన్నది గూడా లెక్కల్లో వుండక తప్పదు. ప్రాంతీయతకు అన్యాయం జరగకూడదు.మతపరంగా, విద్యాపరంగా నియోజక వర్గాల సంఖ్యను పరిగణనలోకి తీసుకోవటం అవసరమా? ఇవ్వన్నీ గూడా ముఖ్యమైన అంశాలే కానీ, దక్షిణాదివారి విన్నపం గూడా



త్రోసివేయగూడదు. కుటుంబ నియంత్రణ తు.చ. తప్పకుండా దేశ శ్రేయస్సుకోరి పాటించటం వల్ల ఇప్పుడు ఈ ప్రాంతాలకు నియోజక వర్గాలు తగ్గుతున్నాయి. ఈ డీలిమిటేషన్ వల్ల అన్న అభిప్రాయం ఫెడరల్ వ్యవస్థలో మంచిది కాదు. ఇదే విధంగా డీలిమిటేషన్‌ను సంస్థీకరించటం జరుగుతే శాశ్వతంగా దక్షిణాది ప్రాంతాలవారికి గణనీయమైన నాయకత్వం, రాజకీయ పలుకుబడి ప్రాముఖ్యత కేంద్రంలో వుండకపోవచ్చనే వాదనను గూడా సహేతుకంగా ఆలోచించాల్సిన పరిస్థితి ఏర్పడింది. రాధాకృష్ణన్, నీలం సంజీవ రెడ్డి, వి.వి.గిరి. నారాయణన్ లాంటి వారు రాష్ట్రపతులుగా, పివి నర్సింహారావు, దేవెగౌడ లాంటి వారు ప్రధానమంత్రులయ్యారు. ఇప్పుడు అలాంటి ఎంపిక డీలిమిటేషన్ జనాభా ప్రాతిపదిక మీదనే కొనసాగుతే సాధ్యం కాకపోవచ్చు! రాజ్యాధికారం దక్కటానికి జనాభా ప్రాతిపదికను పరిగణనలోకి తీసుకుంటున్న ఈ ప్రజాస్వామ్య యుగంలో ఆ జనాభా లెక్కలు అనుసరించి ఎందుకు కొన్ని ప్రాంతాలలో జనాభా తగ్గుముఖం, కొన్ని సంవత్సరాలలో పట్టింది అన్నది లెక్కలోకి తీసుకోకుండా సంఖ్యా బలాన్ని బట్టి కేంద్రం నిర్ణయాలు అమలుచేస్తే మౌలిక సిద్ధాంతాలను దెబ్బతీసి కృత్రిమ పరిస్థితులు ఆసరాతో రాజకీయాధికారం కొన్ని ప్రాంతాల వారే అనుభవించే అవకాశాలు పొందటం ఎంతమాత్రం తగదు. పార్టీలు వేరయినంత మాత్రాన కొన్ని రాష్ట్రాలల్లో న్యాయం జరిగేందుకు చేస్తున్న డిమాండ్లలో ఎంతవరకు నిజం వుందన్న ఆలోచన గూడా జాతీయ స్థాయిలో చేయక తప్పదు. నిజంగానే డీలిమిటేషన్ ఒక ప్రణాళికననుసరించి, రాజ్యాంగం ఒప్పుకొనే విధంగా చేస్తున్నాం అని కేంద్రం అనుకుంటే రాష్ట్రాలలోని అధికార పార్టీలు తమ పార్టీకిగానీ, కూటమికిగానీ వేరైనా, సహేతుకమైన ఆలోచనలు సమిష్టిగా చేసి ఒప్పించగలగాలి! అదే ప్రజాస్వామ్యంలోని ముఖ్య సూత్రం!ప్రస్తుతం ఎక్కువ జనాభా, డీలిమిటేషన్ ప్రకారం కొన్ని రాష్ట్రాలలో వుంటే దానిని ఇతర తక్కువ జనాభా కలిగిన రాష్ట్రాలతో సమంగా ఎవరికీ నష్టం కలగని విధంగా, సమాన లాభం కలిగే రీతిలో నిర్ణయాలు సమిష్టిగానో, కమీషన్ల ద్వారానో, చర్చల ద్వారానో, ఆమోదయోగ్యంగా జరుపగలిగితే కేంద్రం అన్ని ప్రాంతాల వారికి ఈ విషయంలో న్యాయంచేసినట్లు అవుతుంది! అది కేంద్రం గురుతర బాధ్యత కూడా! నిజమైన గ్రాస్ డొమెస్టిక్ ప్రొడక్ట్ (జి.డి.పి) ఏవిధంగానైతే ద్రవ్యోల్బణం ఆధారంగా (ఇన్ఫ్లేషన్) నిర్ణయించి, అన్ని రాష్ట్రాలకు బెనిఫిట్ కలిగిస్తారో, అదేవిధమైన రీతిలో ఎక్కువ జనాభా వున్నప్పటికినీ, అన్ని రాష్ట్రాలకు సంఖ్యాపరంగా లోక్‌సభ, విధాన సభలలో న్యాయం చేసే అవకాశాన్ని గూడా లోతుగా సమీక్షించి తీసుకోవాలి! 1977లో లోక్‌సభ సీట్లు 10.10 లక్షల సరాసరి జనాభాను పరిగణనలోకి తీసుకొని 543సీట్లు ఏవిధంగా నిర్ణయించారో 2024 ఆ సూత్రాన్నే అనుసరిస్తే 680 సీట్ల వరకు పెరిగే అవకాశం వుందని నిపుణుల అంచనా! టోటల్ ఫర్టిలిటీరేట్ రాష్ట్రాల పరంగా కూడా అందుబాటులో వుంటుంది కాబట్టి ఇతర హెచ్చుసంఖ్యలో జనాభా ఆధారంగా వచ్చే సంఖ్యను ఈ సూత్రాన్ని అనుసరించి కొంతవరకు తగురీతిలో అన్ని రాష్ట్రాలకూ న్యాయం చేయొచ్చు! ఇంకా ఇంతకంటే మంచి ఫార్ములాలు వుంటే నిర్ణయాలు అందరికీ సంతృప్తి కలిగించే విధంగా తీసుకొనే అవకాశాన్ని సద్వినియోగం చేసుకుంటే ఎవర్నీ చిన్నచూపు చూడటం లేదన్న విశ్వాసం ప్రజల్లో కలుగుతుంది! పార్లమెంటులో రాజ్యాంగ సవరణల నిమిత్తం అనేక చర్చలు జరిపి ఎలక్షన్లు ఏవిధంగా నిర్వహిస్తే ప్రజలందరికీ సంతృప్తి కలుగజేయాలని భావిస్తారో అదేవిధంగా రాజ్యాంగ సవరణ ద్వారా కూడా రాజకీయ సమతుల్యతను ఈ ముఖ్యమైన విషయంలో సాధించవచ్చు! రాజకీయాలు శాశ్వతం కావు కానీ దేశాలూ ప్రజలూ శాశ్వతం! ప్రజల కోసం వుండే వ్యవస్థల్లోని లోటుపాట్లని కాలానుగుణంగా సవరించుకోవటం అధికారంలో వున్న పార్టీ చేయాల్సిన బాధ్యత వుంది. అవసరమైతే రాజనీతిజ్ఞతను ప్రదర్శిస్తూ అధికార దర్పాన్ని, అహంనూ ప్రక్కనపెట్టి విపక్షాలనూ, న్యాయ నిపుణులనూ, మేధావులనూ, ప్రజా సంఘాలనూ విశ్వాసంలోకి తీసుకొని అవసరమైతే ఒకటి కాదు రెండు కాదు అవసరమైనన్ని సమావేశాలు జరిపి చర్చల ద్వారా సమయోచిత నిర్ణయాలు ప్రభుత్వాలు తీసుకుంటే అందరూ సంతోషించటమే కాదు ఆమోదయోగ్యమైన నిర్ణయాలకు కట్టుబడి వుంటారు! అదేప్రజాస్వామ్యం పునాదీమనుగడ! •

# స్థానిక స్వపరిపాలనే పంచాయితీరాజ్ లక్ష్యం

**రామ కిష్టయ్య సంగన భట్ల**

జాతీయ పంచాయతీ రాజ్ దినోత్సవం ఏప్రిల్ 24న భారతదేశంలో ప్రతి ఏటా నిర్వహిస్తారు. పంచాయితీ రాజ్ వ్యవస్థను పటిష్టం చేయడం కోసం కేంద్ర పంచాయతీ రాజ్‌శాఖ అధ్వర్యంతో ఈదినోత్సవం నిర్వహించ బడుతుంది. భారత దేశంలోని అతి ప్రాచీన వ్యవస్థ పంచాయతీరాజ్ వ్యవస్థ. గ్రామస్థాయిలో అమల్లోఉండే అతి ప్రాచీన పాలనా వ్యవస్థే పంచాయతీ. ఇదే స్థానిక స్వపరిపాలనా సంస్థల వ్యవస్థ. ప్రాచీనకాలంలో పనిచేస్తున్న గ్రామ పాలనావ్యవస్థ నాటి సాంఘిక పరిస్థితుల కనుగుణంగా గ్రామ వృత్తి పనివారల ప్రతినిధులతో పనిచేయగా, బ్రిటిష్ పాలన కాలంలో గవర్నర్ జనరల్ రిప్పన్ ప్రోత్సాహంతో స్థానిక స్వపరిపాలనా సంస్థలు రూపుదిద్దుకున్నాయి. 1919, 1935 భారత ప్రభుత్వ చట్టాలు కొంత వీటికి బలం చేకూర్చాయి. భారత దేశంలో మూడంచెల పంచాయతీ రాజ్‌వ్యవస్థను ప్రారంభించిన తొలి రాష్ట్రం రాజస్థాన్ కాగా, 1959 నవంబరు 1న, ఆంధ్రప్రదేశ్‌లో దేశంలోనే రెండవదిగా, మహబూబ్‌నగర్ జిల్లా, షాద్‌నగర్లో ప్రారంభమైంది. గ్రామ స్థాయిలో గ్రామ పంచాయతీ, బ్లాకు స్థాయిలో పంచాయతీ సమితి, జిల్లా స్థాయిలో జిల్లాపరిషత్ ఏర్పడింది. 1986లో బ్లాకు స్థాయి వ్యవస్థని మండల పరిషత్‌గా మార్చారు. కేంద్ర ప్రభుత్వ చొరవతో ప్రయోగాత్మక ప్రాతిపదికగా, సమాజ వికాసాభివృద్ధి కార్యక్రమం (కమ్యూనిటీ డెవలప్‌మెంట్ ప్రోగ్రామ్) 1952లో ప్రారంభమైంది. ఈ కార్యక్రమం ద్వారా దేశంలో బాగా వెనుకబడిన గ్రామీణ ప్రాంతాల్లో వ్యవసాయం, విద్య, ఆరోగ్యం, రవాణా సౌకర్యాలు, కుటీర పరిశ్రమలు అనే ఐదు రంగాలకు ప్రాధాన్యం ఇచ్చారు. 1953లో ఈ పథకాన్నే జాతీయ విస్తరణ సేవా పథకం (నేషనల్ ఎక్స్ టెన్షన్ సర్వీస్ స్కీమ్) గా దేశ మంతటా అమలు చేశారు. ఈ కార్యక్రమాల ప్రభావాన్ని అంచనా వేయడానికి బల్వంత రాయ్ మెహతా అధ్యక్షతన నిపుణుల కమిటీ ని 1956లో నియమించారు. ఈకమిటీ తన నివేదికను 1957లో సమర్పించింది. ఈ కమిటీ సిఫారసులే పంచాయతీరాజ్ వ్యవస్థ (ప్రజాస్వామ్య వికేంద్రీకరణ) ఏర్పాటుకు మూలాధారం అయినాయి ఈ కమిటీ 1953, అక్టోబరు 2న ప్రవేశపెట్టిన జాతీయ విస్తరణ సేవా కార్యక్రమం పథకాలు ఎంతవరకు విజయవంతం అయినాయో సమీక్షించి, గ్రామపరిపాలనలో ప్రజలకు భాగస్వామ్యం కల్పించడానికి అవసరమయ్యేసంస్థాగత ఏర్పాటును సిఫార్సు చేసింది. బల్వంతరాయ్ మెహతా కమిటీ ప్రజాస్వామ్య వికేంద్రీకరణ ప్రజల భాగస్వామ్యం అనే అంశాలతో 3అంచెల పంచాయతీరాజ్ వ్యవస్థను సిఫారసు చేస్తూ, తన నివేదికను 1957, నవంబరు 24న జాతీయాభివృద్ధి మండలికి సమర్పించింది. కమిటీనివేదికను జాతీయాభివృద్ధి మండలి 1958, జనవరిలోఆమోదించింది. ఈ నివేదికలోని అంశాల అమలు వివిధరాష్ట్రాలు పంచాయతీరాజ్ సంస్థఏర్పాటుకు ప్రయత్నించాయి. భారత దేశంలో 1959 అక్టోబరు 2న రాజస్థాన్‌లోని నాగూర్ జిల్లాలో పంచాయతీరాజ్ వ్యవస్థను లాంచనంగా ప్రారంభించారు. రాజస్థాన్ రాష్ట్రంలో, నాగోర్‌జిల్లాలోని, సికార్‌అనే ప్రాంతంలో ఈ విధానాన్ని ప్రధాని జవహర్‌లాల్ నెహ్రూ ప్రారంభిస్తూ చేసిన వ్యాఖ్యానం."నేడు ప్రారంభమవుతున్న స్థానిక స్వపరిపాలనా సంస్థలు భారత ప్రజాస్వామ్యానికి ప్రాతిపదికగా పనిచేస్తూ జాతి నిర్మాణంలో కీలక పాత్ర పోషిస్తూ, భవిష్యత్ నాయకత్వానికి పాఠశాలలుగా తోడ్పడ తాయి". మూడు అంచెల విధానాన్ని ప్రారంభించిన రెండో రాష్ట్రం ఆంధ్రప్రదేశ్. కల్పించడానికి పంచాయతీరాజ్ వ్యవస్థను నెలకొల్పాలి. గ్రామపంచాయతీవ్యవస్థకు ప్రత్యక్ష ఎన్నికలను నిర్వహించాలి. ఈ ఎన్నికలు పార్టీ ప్రాతిపదికన కాకుండా, స్వతంత్ర ప్రాతిపదికపై జరపాలి. స్థానిక సంస్థలకు ప్రతి 5 సంవత్సరాలకు ఒకసారి నియమబద్ధంగా ఎన్నికలుజరపాలి. స్థానిక సంస్థలకు తగిన అధికారాలను, ఆర్థిక వనరులను సమకూర్చాలి. భవిష్యత్తులో చేపట్టబోయే అభివృద్ధి పథకాలన్నీ స్థానికసంస్థల ద్వారానే నిర్వహించాలి.స్థానిక స్వపరిపాలనలో జిల్లా కలెక్టరు కీలకపాత్ర పోషించాలి. కింది స్థాయి లో మినహాయించి, మాధ్యమిక, ఉన్నత స్థాయుల్లో పరోక్ష ఎన్నికలు నిర్వహించాలి. అధికారాల, పరి పాలనా, వనరుల,ప్రణాళికా, ప్రజాస్వామ్య వికేంద్రీకరణలు జరగాలి. పంచాయతీలకు రాష్ట్ర ప్రభుత్వం గ్రాంట్లు మంజూరుచేయాలని బల్వంత్‌రాయ్ మెహతా కమిటీ సూచించింది. స్థానిక సమస్యలను స్థానికంగాపరిష్కరించడం,ప్రజలను రాజకీయంగా చైతన్యం చేయడం పంచాయతీ రాజ్‌వ్యవస్థ లక్ష్యం. •

# నయా వలస పాలనతో రంగాలన్నీ కుదేలు

**డాక్టర్ ఎనుగొండ నాగరాజ నాయుడు**

ప్రపంచ బ్యాంకు చేపట్టిన నివేదిక ప్రకారం గత 20 సంవత్సరాల కాలంలో ఉన్నత ఆదాయ వర్గాల ఒక శాతం జనాభా ఆదాయాలు 60 శాతం పెరగగా అల్పాదాయ వర్గాల క్రింది భాగాన ఉన్న ఐదుశాతం జనాభా ఆదాయాలు ఒక పైసా కూడా పెరగలేదు.ఈ 20 సంవత్సరాల కాలంలో వివిధ దేశాలలోని పెట్టుబడిదారులు ఆఫ్సోర్సింగ్ చేపట్టి అంటే పరిశ్రమలను, సేవలను ఇతర దేశాలకు తరలించి అక్కడ తక్కువ వేతనాలకు దొరికే కార్మికులను చౌక ధరలకు లభించే ముడిసరుకులను ఉపయోగించి వారు గణనీయంగా తమ ఆదాయాలను పెంపొందించుకోగలిగినారు. ఇది కొన్ని దేశాలకు మాత్రమే పరిమితమైనవి. నేడు ప్రపంచంలో మూడు దేశాల దగ్గర మాత్రమే ఉన్న సంపద మొత్తం బిలియనీర్ల సంపదలో 50 శాతంగా ఉంది. ప్రపంచంలో మొత్తం బిలియనీర్లు 3000 మంది. వీరి సంపద విలువ 16.1 ట్రిలియన్ డాలర్లు. ఎక్కువ మంది బిలియనీర్లు ఉన్న దేశంలో మొదటిది అమెరికా కాగా రెండవది చైనా, మూడవది మన దేశం. ఇలా బిలియనీర్లు కొన్నిదేశాలకే పరిమితంకావడం వలన ప్రపంచ ప్రజల ఆదాయాలు అవకాశాలలో అసమా నతలు పెరిగాయి. పరస్పర ఆధారిత ప్రపంచంలో బిలియ నీర్ల మనస్తత్వంతో లాభాల కోసంపాలకుల దుర్నీతితో ప్రపంచ ఆధిపత్యంకోసం జరుగుతున్న సుంకాల యుద్ధంలో ప్రపంచ ప్రజలు అల్లాడిపోతున్నారు. భారత్ లిబరలైజేషన్, ప్రైవేటైజేషన్, గ్లోబలైజేషన్ విధానాల వలన ప్రపంచమంతా వసుధైక కుటుంబంగా పెట్టుబడులతో ఉద్యోగ కల్పనతో వస్తుఉత్పత్తులతో గణనీయంగా పెరిగి మానవ శ్రేయస్సుతో ప్రపంచ దేశాలన్నీ అభివృద్ధి చెందిపోతాయని ముఖ్యంగావెనుకబడిన దేశాలు అభివృద్ధిలో పెట్టుబడిదారుల దేశాల సరసన సమానంగా అభివృద్ధి చెందుతాయని భావించారు. అయితే ఈవిధానాల వలన వెనుకబడిన దేశాలు అభివృద్ధి చెందిన దేశాల కనుసన్నల్లో తమ ఆర్థికవిధానాలను పెట్టుబడి విధానాలను రూపొందించుకోవాల్సి వస్తుందని ఇది నయా సామ్రాజ్యం వైపు దారితీస్తుందని గమనించ లేకపోయారు. మన పాలకులు అయితే ప్రభుత్వ రంగంలో పరిశ్రమలు పనిచేయడం లేదనినష్టాలలో ఉన్నాయని ఎల్పిజి విధానాలకు పోయారు. ఇప్పుడు ఏమైంది? ఉత్పత్తి రంగం కుదేలైంది. అనేక వస్తువులు అమెరికా నుంచి చైనానుంచి దిగుమతి చేసుకుంటున్నాం.దేశంలో నిరుద్యోగిత, మానవ వనరులవిధ్వంసం, సహజ వనరులు పెట్టుబడిదారుల వశం, వృద్ధిప్రక్రియ



అంతా పెట్టుబడిదారుల కనుసన్నల్లోకిపోయింది. మన దేశం 191దేశాలలో 132వదిగా విద్యావైద్య జీవనప్రమాణాల రీత్యాఉన్నది. 193దేశాలలోఆయుష్ ప్రమాణం రీత్యా మన దేశంస్థానం 134గా ఉన్నది. ఆకలి ఎక్కువగా ఉన్న జనాభా గల దేశాలలో 125దేశాలలో 111వ దేశం మనది. ఎల్పిజి ఫలితాలవలన ఏర్పడిన దుష్పరిమాణం ఇది. తొందరలో మూడవ అతిపెద్ద ఆర్థికవ్యవస్థగా మన దేశంఅభివృద్ధి చెందుతున్నదని పాలకులు ఎలాచెబుతున్నారో అర్థంకావడం లేదు? ఎల్పిజి ప్రారంభించిన తొలి రోజుల్లో ఇద్దరే ఇద్దరు బిలియనీర్లు ఉన్న దేశంలో నేడు 332బిలియనీర్లు పెరిగినందున దేశం మూడవ అతిపెద్ద ఆర్థికవ్యవస్థఅవుతున్నదా? ప్రజల ఆదాయాలు గాని ఉద్యోగితను గాని పరిగణనలోకి తీసుకోనే అవసరం లేదా?అంతేకాకుండా నేడుప్రధానమంత్రి గరీబ్ కళ్యాణ్ అన్న యోజన పథకం కింద 81.35 కోట్ల మందికి ఐదు కిలోల బియ్యం ఉచితంగా ఇవ్వవలసిన పరిస్థితిఏర్పడింది.పేదలకు ఉద్యోగితను కల్పించకుండా ఆదాయ కల్పన చేయకుండా పాలకులు ఉచిత పథకాలు ప్రవేశపెట్టి పాలనసాగిస్తున్నారు. పేదలజీవనం సాగాలంటే ఉచితాలే గతి అయ్యాయి. ఈవిధంగా దేశ ఆర్థికాభివృద్ధి తిరోగమనంలో ఉన్న కార్పొరేట్ వర్గాలకు చెందిన పైస్థాయి బిలియనీర్ల సంఖ్య ప్రతి ఏడాది దేశంలో పెరుగుతున్నది. వీరి సంపదలోని పెరుగుదల ఏవిధమైన ఉత్పత్తి క్రమం నుంచివచ్చింది కాదు. దేశ సహజ వనరులను దేశ సంపద ప్రభుత్వమే కార్పొరేట్లకు తాయిలాలుగా ఇస్తున్నది. దేశంలో బడా కార్పొరేట్ సంస్థల చేతుల్లో దేశంలోని పోర్టులు 25శాతం సిమెంట్ ఉత్పత్తులో 45శాతం స్టీల్ పరిశ్రమల, 33శాతం టెలికాము ల 60శాతం బొగ్గు ఎగుమతులు 65శాతం కేంద్రీకృతమై ఉన్నాయి. దేశం సంపద ప్రైవేట్ గుత్తాధిపత్య సంస్థల చేతుల్లో కేంద్రీకృతం కారాదని ప్రభుత్వం అలా కాకుండా చర్యలు తీసుకోవాలని రాజ్యాంగంలోని ఆదేశిక సూత్రాలు 39వ అధికరణలో స్పష్టంగా పొందుపరిచినారు. వారిసంపద కేంద్రీకృతం అవుతుండడం రాజ్యాంగం ఉల్లంఘనకాదా? ఒకపక్క ద్రవ్యలోటు పేరుతోప్రభుత్వ సంస్థలను కారు చౌకగా అమ్మేస్తున్నారు. మరోపక్క బడాబాబులు బ్యాంకులకు బకాయిపడ్డ లక్షల కోట్ల బకాయిలను మాఫీ చేస్తున్నారు.గత తొమ్మిదేళ్లలో పెద్దలబ్యాంకులలో బకాయిపడిన 14.5 లక్షలకోట్లు రుణాలను మాఫీచేసి కేవలం 15శాతం మాత్రమే వసూలు చేయగలిగినారు. మూడేళ్లలో ప్రభుత్వరంగబ్యాంకు లను 12కి కుదించారు. ప్రజలకు ఉపయోగపడే వ్యవస్థల న్నిటిని చిన్నాభిన్నం చేశారు. ప్రజాస్వామ్య ముసుగులో లాభాలేముఖ్యమై ఆర్థిక సంపాదన కోసం అగ్రరాజ్యాల పాలకులు ప్రజానాయ కులమని చెప్పుకుంటూనే ప్రపంచ వ్యాప్తంగా సామ్రాజ్యవాదం వైపు పరుగులు తీస్తున్నారు. గ్లోబలైజేషన్‌వలన ప్రపంచవ్యాప్తంగా నిరుద్యోగిత ఆదాయ అసమానతలు పెరగడం బిలియనీర్ల సంఖ్య పెరగడం జరిగిందిగాని ప్రజాశ్రేయస్సు శూన్యం. •

# ప్రజలకు, ప్రభుత్వానికి నాయకులే వారధి

## -గుంటూరు తూర్పు ఎమ్మెల్యే మొహమ్మద్ నసీర్

**గుంటూరు తూర్పు,ఏప్రిల్23,ప్రభాతవార్త :** గుంటూరు తూర్పు నియోజకవర్గంలో ప్రజలకు ప్రభుత్వానికి మధ్య నాయకులు వారధి అని ఎమ్మెల్యే మొహమ్మద్ నసీర్ అన్నారు. బుధవారం గుంటూరు తూర్పు ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో స్థానిక కార్పొరేటర్లతో ఎమ్మెల్యే సమావేశమయ్యారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే నసీర్ మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తొమ్మిది నెలల కాలంలో ప్రజలకు నిత్యం అందుబాటులో ఉంటూ ప్రభుత్వ సేవలను దగ్గరకు



చేరుస్తున్నామని తెలిపారు. గత ప్రభుత్వంలో గుంతల రోడ్లు, కదలని మురుగు కాలవలు, ప్రతి చోటా దర్శనమిచ్చేవని తెలిపారు. కూటమి అధికారం చేపట్టిన వెంటనే ప్రణాళిక ప్రకారం ప్రతి కాలనీలో అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టామని వివరించారు. కార్పొరేటర్లు ఆయా ప్రాంతాలలోని కమ్యూనిటీ హాల్స్, మురుగునీటి కాలువలు, రోడ్లు వంటి సమస్యలను గుర్తించి తమ దృష్టికి తీసుకురావాలని సూచించారు. ప్రజలకు ఏ సమస్య వచ్చినా ప్రతినిత్యం వారికి అందుబాటులో ఉండాలని చెప్పారు. సీఎం చంద్రబాబు నాయుడు ఆధ్వర్యంలో ప్రతి ప్రాంతంలో మౌలిక సదుపాయాల కల్పనకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఇంచార్జ్ మేయర్ షేక్ సజీల, స్థానిక తూర్పు నియోజకవర్గ కార్పొరేటర్లు పాల్గొన్నారు.

# టెన్త్ జిల్లా టాపర్స్‌నుఅభినందించిన పల్నాడుజిల్లా కలెక్టర్

**నరసరావుపేట టౌన్, ఏప్రిల్ 23 ప్రభాతవార్త :** పల్నాడు జిల్లా టెన్త్ టాపర్స్‌ను కలెక్టర్ ఆరుణ్‌బాబు అభినందించారు. రాష్ట్ర స్థాయిలో ప్రభుత్వపాఠశాలలో అత్యధిక మార్కులు 598 మార్కులు సాధించిన పావని చంద్రికను



ప్రత్యేకంగా సత్కారించారు. భవిష్యత్‌లో ఉన్నత స్థానలకు చేరుకోవాలని సూచించారు. అదే విధంగా 590 మార్కులు సాధించిన కావ్యశ్రీని అభినందించి దత్తాత తీసుకుంటున్నట్లు ప్రకటించారు. విద్యార్ధిని ఉన్నత చదవులు కొనసాగించేందుకు అవసరమైన సహాకారం అందించటం జరుగుతుందన్నారు. ప్రభుత్వ పాఠశాలలో చదివితే మంచి మార్కులు రావు అనే అభిప్రాయాలకు సరైన సమాధానం అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థులు చెప్పారని కలెక్టర్ ఆరుణ్‌బాబు తెలిపారు. కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ సూరజ్ గనోరే, డిఈవో ఎల్ చంద్రకళ, జిల్లా అధికారులు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

**ముఖ్యమంత్రి పర్యాటన పై కలెక్టర్ సమీక్ష :** ప్రధానమ ంత్రి నరేంద్రమోడీ, ముఖ్యమంత్రి నారా చంద్ర బాబునాయుడు ఆమరావతి పర్యటన, సభ కార్యక్రమాల పై కలెక్టర్ పి.ఆరుణ్‌బాబు బుధవారం సమీక్ష నిర్వహించారు. జిల్లా నుండి 30వేల మంది సభకు హాజరవుతారని తెలిపారు. వారికి ఆర్టీసీ నుండి 600 బస్సులు ఏర్పాటు చేయాలని ఆదేశాలు ఇచ్చారు. ప్రాథమిక అంచనాలతో పాటు నియోజకవర్గ స్థాయి నుండి మండల, గ్రామ స్థాయి వరకు ఎంత మంది ప్రజలు ఏయే మార్గాలలో సభ వేదికకు చేరుకొంటారో వివరాలు సేకరించాలన్నారు. అదే విధంగా సభకు హాజరై వారి కోసం ప్రత్యేకంగా భోజన వసతి, మంచి నీరు వంటి సదుపాయాలు కల్పించాలని కలెక్టర్ ఆరుణ్‌బాబు ఆధికారులకు ఆదేశాలు ఇచ్చారు. జాయింట్ కలెక్టర్ సూరజ్ గనోరేతో పాటు వివిధ శాఖల అధికారులు సమీక్షలో పాల్గొన్నారు.

# ఎస్‌ఎస్‌సి-2025 ఫలితాల్లో స్టేట్ ఫస్ట్ మార్కులతో భాష్యం

## 600/600మార్కులతో స్టేట్ ఫస్ట్ సాధించిన వై.నేహాంజని

**గుంటూరు విద్య,ఏప్రిల్ 23,ప్రభాతవార్త :** ఎస్‌ఎస్‌సి-2025 ఫలితాల్లో భాష్యం విద్యార్థినీ,విద్యార్థులు అత్యుత్తమ ప్రతిభ



కనబరిచారని భాష్యం విద్యాసంస్థల చైర్మన్ భాష్యం రామకృష్ణ తెలిపారు.బుధవారం చంద్రమౌళీనగర్‌లోని భాష్యం మెయిన్ క్యాంపస్‌లో ఆయన విద్యార్థులను అభినందించారు.ఈ సందర్భంగా రామకృష్ణ మాట్లాడుతూ భాష్యం విద్యార్థి వై.నేహాంజని 600కి 600 మార్కులు సాధించి స్టేట్ ఫస్ట్ మార్కులతో అరుదైన రికార్డు సాధించిందన్నారు.కె.ప్రేమ సత్య లిఖిత 599, కె.హర్షిత్ 599, ఎ.లిఖిత 599,పివిఎస్ఎస్ శ్రీహాసిని 598,ఎస్.షాలిని సంహిత 598,ఎం.ప్రియజోషిణి 598 మార్కులు సాధించి ఉత్తమ ప్రతిభ కనబరిచారని తెలిపారు.590మార్కులను 206మంది,580 పైగా 953మంది,570కిపైగా 1889, 550కి పైగా 3585,500కి పైగా 6635మంది విద్యార్థులు సాధించారన్నారు.మ్యాథ్స్ 100కి 100 మార్కులు సాధించిన విద్యార్థులు 1088, 95కి పైగా 3223, 90కి పైగా 4675మంది,సైన్స్‌లో 100కి 100 సాధించిన విద్యార్థులు 724, 95కిపైగా 4331, 90కి పైగా 6685మంది విద్యార్థులని తెలిపారు. ఇంతటి ఘన విజయానికి తోడ్పడిన విద్యార్థులకు, వారి తల్లిదండ్రులకు, ఉపాధ్యాయులకు భాష్యం చైర్మన్ రామకృష్ణ,వైస్ చైర్మన్ భాష్యం హను మంతరావు,మేనేజింగ్ డైరెక్టర్ భాష్యం సాకేత్‌రామ్‌లు అభినందనలు తెలిపారు.

# నగర శివారు వరకు డ్రైన్‌లన్నీ ఖచ్చితంగా డీ సిల్టింగ్ చేయాలి : విజయవాడ కమిషనర్ ధ్యానచంద్ర

**విజయవాడ కార్పొరేషన్,ఏప్రిల్ 23,ప్రభాతవార్త:** నగరంలో నుండి శివారు వరకు ఉండే డ్రైన్‌లన్నీ ఖచ్చితంగా డీ సిల్టింగ్ చేయాలని మున్సిపల్ కమీషనర్ ధ్యానచంద్ర అధికారులను ఆదేశించారు. తన పర్యటనలో భాగంగా బుధవారం ఆయన ఎక్సెల్ ప్లాంట్,రాధానగర్ డ్రైన్,ఇన్నర్‌రింగ్ రోడ్డు,ముస్తాబాద్ రోడ్,ఔట్‌పాల్ డ్రైన్,సింగ్‌నగర్ ప్రాంతాలన్నీ పర్యటించి క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా



ఆయన మాట్లాడుతూ ఎక్సెల్ ప్లాంట్‌లో వ్యర్థాలు అన్నీ ఎప్పటికప్పుడు తొలగిస్తూ జిందాల్‌కి పంపించాలని రాధానగర్ డ్రైన్ చిన్నగా ఉండటం వలన వ్యర్థాలు పేరుకుపోతే,వర్షపు నీటి నిల్వలు వెంటనే రోడ్డుపైకి వచ్చే అవకాశాలున్నందున దానిని పెద్దది చేసి ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. నగర శివారులైన ఇన్నర్‌రింగ్ రోడ్డు,ముస్తాబాద్ రోడ్,ఔట్‌పాల్ డ్రైన్ డీ సిల్టింగ్ పనులను శరవేగంగా చేయాలని, రానున్న వర్షాకాలంలో వర్షపు నీటి నిల్వలు రోడ్డుపైకి రాకుండా ఉండాలంటే డ్రైన్ డీ సిల్టింగ్ చేయడమే కాకుండా నగరంలోని డ్రైన్లు అన్నీ చేరుకునే ఔట్‌ఫాల్ డ్రైన్లో డీ సిల్టింగ్ చేసి వర్షపు ప్రవాహపు నీరులో ఎటువంటి అంతరాయం లేకుండా చూసుకోవాలని అధికారులను ఆదేశించారు. కొత్త వంతెన సెంటర్,సింగ్‌నగర్ అన్నా క్యాంటీన్‌లలో పారిశుధ్య నిర్వహణను పరిశీలించి,పరిశుభ్రతలో ఎటువంటి లోపం లేకుండా చూసుకోవాలన్నారు. ఈ పర్యటనలో ఇంఛార్జి చీఫ్ మెడికల్ హెల్త్ ఆఫీసర్ డాక్టర్ గోపాల కృష్ణ నాయక్ ,సూపరింటెండింగ్ ఇంజనీర్ వర్క్స్ పి.సత్యన్నారాయణ,ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ శ్రీనివాసరెడ్డి,అసిస్టెంట్ మెడికల్ హెల్త్ ఆఫీసర్ డాక్టర్ బాబూ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

అమరావతి వార్త

## యమునా బయో డైవర్సిటీ పార్కును సందర్శించిన

# అమరావతి అభివృద్ధి సంస్థ ప్రతినిధులు

**అమరావతి,ఏప్రిల్ 23,ప్రభాతవార్త :** ఢిల్లీలోని యమునా బయో డైవర్సిటీ పార్కును అమరావతి అభివృద్ధి సంస్థ(ఏడీసీ) సీఎండీ శ్రీమతి డి.లక్ష్మీపార్థసారథి బుధవారం సందర్శించారు. ఢిల్లీలో





యమునా మరియు ఆరావళి బయో డైవర్సిటీ పార్కులను స్థాపించిన ఇన్‌ఛార్జ్ ప్రొఫెసర్ సి. అర్. బాబుతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా వారు అభివృద్ధి చేసిన ఉద్యానవనాలను సందర్శించారు. సహజ సిద్ధంగా వారు ఉత్పత్తి చేస్తున్న మొక్కలను పరిశీలించారు. అమరావతి రాజధానిలో హరిత ప్రాజెక్టుల అభివృద్ధిలో సహాయం అందించడానికి ఆరావళి బయో డైవర్సిటీ వారు అంగీకరించారు. ఈ సందర్ధంగా సీఎండీ తీపి నారింజ మొక్కను కూడా నాటారు. బయో డైవర్సిటీ పార్కుల అభివృద్ధిలో బాబు వారి బృందం చేపట్టిన విధానాలను ఏడీసీ ప్రతినిధులను వివరించారు. ఈ పర్యటనలో ఏడీసీ హార్టికల్చర్ విభాగాధిపతి వి. ఎస్. ధర్మజ ఉన్నారు.

# ఉగ్రవాదుల దాడికి నిరసిస్తూ వైకాపా నాయకుల కొవ్వొత్తుల ర్యాలీ

**గుంటూరుతూర్పు,ఏప్రిల్23,ప్రభాతవార్త :** జమ్ము కాశ్మీర్ రాష్ట్రంలోని పహల్గంలో జరిగిన ఉగ్రవాదుల దాడికి నిరసిస్తూగుంటూరు జిల్లా పార్టీ కార్యాలయం నుండి బృందావన్ గార్డెన్స్



సర్కిల్ వరకు వైసిపి నేతలు కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించారు, వైయస్ జగన్ పిలుపుమేరకు శాంతి ర్యాలీ చేపట్టారు, జిల్లా పార్టీ అధ్యక్షులు అంబటి రాంబాబు మాట్లాడుతూ ఇటువంటి ఘటనలు పునరావృతం కాకుండా కాకుండా కేంద్రం కఠిన చర్యలు తీసుకోవాలని ఉగ్రవాదులకు బుద్ధి చెప్పాలని తెలిపారు, గుంటూరు, పల్నాడు పరిశీలకులు మోదుగుల వేణుగోపాల్ రెడ్డి మాట్లాడుతూ ఉగ్రవాదుల దాడి చాలా బాధాకరమైన విషయమని తెలిపారు. భవిష్యత్తులో ఇటువంటి దాడులు చేయకుండా కేంద్ర బృందం కఠినంగా వ్యవహరించాలని తెలిపారు, ఈ కార్యక్రమంలో తాడికొండ నియోజకవర్గ సమన్వయకర్త వనమా బాల వజ్ర బాబు, పత్తిపాడు నియోజకవర్గ సమన్వయకర్త బలసాని కిరణ్ కుమార్ , రాష్ట్ర కార్యదర్శి నిమ్మకాయల రాజ నారాయణ, రాష్ట్ర సంయుక్త కార్యదర్శి మెట్రో వెంకటప్ప రెడ్డి, జిల్లా అనుబంధ విభాగల అధ్యక్షులు కురిటిపాడు ప్రేమ్ కుమార్, ఆళ్ళ ఉత్తేజ్ రెడ్డి, మురళి, విజయ్, పవన్, జిల్లా ప్రధాన కార్యదర్శులు మామిడి రాము, చదలవాడ వేణుగోపాలరావు మొండితోక శ్రీనివాస్ రావు తదితర నాయకులు పాల్గొన్నారు

# వివేకా విద్యార్థినికి రాష్ట్రస్థాయి ర్యాంకు

**పొన్నూరు, ఏప్రిల్ 23,ప్రభాతవార్త:** బుధవారం ప్రభుత్వం ప్రకటించిన పదోతరగతి పబ్లిక్ పరీక్షా ఫలితాలలో వివేకా హైస్కూల్ విద్యార్థిని పరమేశ్వరి 595మార్కులు సాధించి రాష్ట్రస్థాయి ర్యాంక్‌ను కైవసం చేసుకొన్నట్లు పాఠశాల డైరెక్టర్ ఉప్పల సుకుమార్‌బాబు తెలిపారు. 580మార్కులపైగా 12మంది విద్యార్థులు, 500మార్కులపైగా 98మంది విద్యార్థులు ఉండడం ఫలితాలలో తిరుగులేదని నిరూపించిందన్నారు. పాఠశాల స్థాపించిన నాటినుంచి రాష్ట్రస్థాయి ర్యాంకులతో తమ విద్యార్థులు



విద్యా కుసుమాలను వెదజల్లుతున్నారన్నారు. సాధారణమైన గ్రామీణ ప్రాంత విద్యార్థులతో ఉత్తమ ఫలితాలు సాధించడం ఆనందంగా ఉందన్నారు. పదిలోనైనా, ఇంటర్‌లైననా, జేఈఈలోనైనా, ఇంకెందులోనైనా తమ విద్యార్థులు తిరుగులేని రీతిలో ముందుకు సాగుతున్నారన్నారు. ఈ ఫలితాలు సాధించేందుకు కారకులైన ఉపాధ్యాయులకు, విద్యార్థినీ విద్యార్థుల తల్లిదండ్రులకు కృతజ్ఞతలు తెలిపారు.

# గంజాయి,మాదకద్రవ్యాల అక్రమ రవాణాను అరికట్టాలి : బాపట్లజిల్లా కలెక్టరు

**బాపట్ల,ఏప్రిల్23,ప్రభాతవార్త:** గంజాయి, మాదకద్రవ్యాల అక్రమ రవాణాను అరి కట్టాలని జిల్లా కలెక్టర్ జె.వెంకటమురళి అధికారులను ఆదేశించారు. బుధవారం స్థానిక కలెక్టరేట్ లో జిల్లా స్థాయి గంజాయి, మాదకద్రవ్యాల నియంత్రణ కమిటీ సమావేశం జిల్లా కలెక్టర్ అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో గంజాయి మాదకద్రవ్యాలను సరఫరాచేసే వారిపై పి.డి యాక్ట్ కేసులు పెట్టాలన్నారు.జిల్లాలో ప్రభుత్వ పాఠశాలలో, ప్రభుత్వ కాలేజీలు, ప్రభుత్వ ఇంజనీరింగ్ కాలేజీలలో గంజాయి తీసుకునే వారి వివరాలను సేకరించాలని ఆయన అధికారులకు చెప్పారు. ప్రజల నుండి సమాచారం సేకరించి గంజాయి సరఫరా చేసే వారిని పట్టుకోవాలని ఆయన అధికారులు చెప్పారు. జిల్లాలో గంజాయి మాదక ద్రవ్యాలను సరఫరా చేసే వారిపై దాడులు నిర్వహించి వారికి అవగాహన కల్పించాలన్నారు.



జిల్లాలో గంజాయి మాదక ద్రవ్యాల నియంత్రణకు గ్రామస్థాయిలో మండల స్థాయిలో కమిటీలు ఏర్పాటు చేయాలని ఆయన అధికారులకు సూచించారు. గ్రామస్థాయిలో గంజాయి విని యోగించే వారి యొక్క వివరాలను గ్రామ సచివాలయ సిబ్బంది ద్వారా స్వీకరించాలని ఆయన చెప్పారు. ప్రభుత్వం ఏర్పాటు చేసిన గంజాయి మాదకద్రవ్యాల నియంత్రణకు1972 టోల్ ఫ్రీ నెంబర్ కు సమాచారం ఫిర్యాదులు చేయవచ్చునని ఆయన చెప్పారు. సమాచారం అందించిన ప్రజల యొక్క వివరాలను ప్రభుత్వం గోప్యంగా ఉంచు తుందని ఆయన తెలియజేశారు. జిల్లాలో ఉన్న 4 లక్షల కుటుంబాల ప్రజలకు గంజాయి డ్రగ్స్ నియంత్రణపై అవగాహన తెలియజేసే వాల్ పోస్టర్లు, కరపత్రాలు ప్రచురించి పంపిణీ చేయాలని ఆయన అధికారులు సూచించారు. ఈ సమావేశంలో జిల్లా అదనపు ఎస్పీ విఠలేశ్వర్, జిల్లా సాంఘిక సంక్షేమ శాఖ అధికారి రాజ్ దిబోరా, జిల్లా వైద్యఆరోగ్య శాఖ అధికారి విజయమ్మ, జిల్లా రవాణాశాఖ అధికారి పరంధామరెడ్డి, పోలీసు అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# ప్రజల మీద కుక్కలు దాడి చేస్తే మునిసిపల్ అధికారులే బాధ్యత వహించాల్సి ఉంటుంది

## ఎమ్మెల్యే గళ్ళా మాధవి

**గుంటూరుకార్పొరేషన్,ఏప్రిల్23,ప్రభాతవార్త :** .గుంటూరు పశ్చిమ నియోజకవర్గంలో ప్రజల మీద కుక్కలు దాడి చేస్తే మున్సిపల్ అధికారులే బాధ్యత వహించాల్సి ఉంటుందని గుంటూరు పశ్చిమ నియోజకవర్గ ఎమ్మెల్యే గళ్ళా మాధవి తేల్చి చెప్పారు. బుధవారం గుంటూరు పశ్చిమ నియోజకవర్గ టిడిపి కార్యాలయంలో ప్రజలు, అధికారుల నుండి ఎమ్మెల్యే గళ్ళా మాధవి అర్జీలు స్వీకరించారు. పలు సమస్యల పై సంబంధిత అధికారులకు చరవాణి నుండి



ఆదేశించి, సమస్యను వెంటనే పరిశ్కరించాలన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. .ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఆదేశాలతో ప్రతి బుధవారం గ్రీవెన్స్ డే నిర్వహిస్తున్నాము. ప్రతిరోజు ప్రజల మధ్య అందుబాటులో ఉండటమే కాక ప్రతి బుధవారం ప్రజలకు,పార్టీ శ్రేణులకు కార్యాలయంలో అందుబాటులో ఉంటూ వారి సమస్యలను తెలుసుకొని, వాటి పరిష్కారానికి కృషి చేస్తున్నామన్నారు.ఎన్డీయే కూటమి పాలనలో ప్రజలందరూ ఆనందంగా ఉండాలన్నదే మా ఆకాంక్ష, అలాగే గుంటూరు పశ్చిమ నియోజక వర్గంలో అభివృద్ధి కార్యక్రమాలే మా లక్ష్యం.అయితే గత ప్రభుత్వం ప్రజా సమస్యలను గాలికి వదిలేసి, అభివృద్ధి కార్యక్రమాలకు పాతర వేసిందన్నారు. దీని వలన మా ప్రభుత్వం అధికారంలో వచ్చిన నాటి నుండి ప్రజల నుండి పెద్ద ఎత్తున రోడ్లు, డ్రైన్లు, స్ట్రీట్ లైట్లు, కుక్కల బెడద, మంచినీటి సమస్యలు పరిష్కరించమని, ప్రజల పెద్ద ఎత్తున అర్జీలు ఇస్తున్నారు. వాటిన్నిటి పరిశీలించి, నగర పాలక సంస్థ కమిషనర్, మున్సిపల్ అధికారుల సహకారంతో సాధ్యమైనంత త్వరగా పరిష్కరించడానికి కృషి చేస్తున్నాను.విలేకరులు అడిగిన ప్రశ్నకు ఎమ్మెల్యే గళ్ళా మాధవి స్పందిస్తూ...కుక్కల బెడద గురించి మున్సిపల్ కౌన్సిల్ దృష్టికి తీసుకొని వెళ్లినప్పుడు కుటుంబ నియంత్రణ, వ్యాక్సినేషన్ చేస్తున్నామని సమాధానం ఇస్తున్నారు. ఇది కంటి తుడుపు చర్య మాత్రమే, సమస్య పరిష్కారం కాదు. అసలు కుక్కల ఇలా ప్రజల మీద దాడి చేయటానికి ప్రధాన కారణం వాటికి సరైన ఆహారం, నీరు దొరకక పోవటం వలన, ఆదివారం మాంసపు దుకాణాల వద్ద, మాంసపు వ్యర్థాలను ఇష్టానుసారం పడవేయటం వలన అవి తిని మతి స్థిమితం తప్పి ప్రజల మీద దాడులు చేస్తున్నాయి. కనుక వీటికి ఒక ఆసరా కల్పించటానికి జంతు ప్రేమికులు కూడా ముందుకి రావాలని అభ్యర్థిస్తున్నాను.బ్లూ క్రాస్, మున్సిపల్ కార్పొరేషన్ అధికారులతో సమావేశం నిర్వహించి వీటి పరిష్కారానికి కృషి చేస్తాను.నా గుంటూరు పశ్చిమ నియోజకవర్గములో ఈ కుక్కల బెడద మీద అధికారులు దృష్టి సారించాలి, ఏ ఒక్క వ్యక్తి మీద అయిన కుక్క దాడి చేస్తే దానికి మున్సిపల్ అధికారులే బాధ్యత వహించాల్సి ఉంటుందని ఎమ్మెల్యే గళ్ళా మాధవి సున్నితంగా హెచ్చరించారు.ఈ రోజు ప్రకటించిన పదవ తరగతి పరీక్షా ఫలితాలలో మంచి ఉత్తీర్ణత సాధించిన విద్యార్థులు అందరికీ నా హార్దిక శుభాకాంక్షలు.అలాగే మార్కులు తక్కువగా వచ్చాయని ఏ ఒక్క విద్యార్థి కూడా బాధ పడవద్దని, మంచి ఉత్తీర్ణత సాధించేలా ముందుకు వెళ్ళాలని ఎమ్మెల్యే గళ్ళా మాధవి తెలిపారు. ఈ కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర కార్యదర్శి సుఖవాసి శ్రీనివాస్, కొమ్మినేని కోటేశ్వరరావు,మానం పద్మ శ్రీ, చంద్రగిరి బాబు,రహీం, గుర్రం ప్రసాద్, గుంటుపల్లి శేష గిరి రావు, డివిజన్ పార్టీ అధ్యక్షులు, ఎన్డీయే కూటమి నేతలు తదితరులు పాల్గొన్నారు.

# శ్రీ విజేత హైస్కూల్ విద్యార్థుల ప్రతిభ

**గుంటూరు విద్య,ఏప్రిల్ 23,ప్రభాతవార్త :** పదో తరగతి పరీక్షా ఫలితాల్లో ఏటి ఆగ్రహారంలోని శ్రీ విజేత హైస్కూల్ విద్యార్థులు విజయ ఢంకా మోగించారని స్కూల్ డైరెక్టర్ శ్రీహరి తెలిపారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తమ విద్యార్థుల కె.గాయత్రి 592మార్కులు,సిహెచ్ ప్రణీత 584,ఎస్‌కె రియాన్ 579,అతికూల్ రెహమాన్ 575 మార్కులు



సాధించారని 500కి పైగా మారు ్కలు 21మంది విద్యార్థులు సాధించారని 100శాతం ఉత్తీర్ణత సాధించారని సోషల్,గణితంలో 100కి 100మార్కులు సాధించారని ఇంతటి గొప్ప విజయానికి కృషిచేసిన ఉపాధ్యాయులకు అభినందనలు తెలిపారు.మంచి మార్కులు సాధించిన విద్యార్థులకు సూ ్కల్ ఆవరణలో అభినందనలు పాఠశాల ఆవరణలో బాణాసంచా,కేక్ కట్ చేసి ఆనందాన్ని పంచుకున్నారు.ప్రతిభ చాటిన విద్యార్థులకు శుభాకాంక్షలు తెలిపారు.కార్యక్రమంలో స్కూల్ హెచ్ఎం అన్నపూర్ణ ఉపాధ్యాయులు,విద్యార్థులు పాల్గొన్నారు.

# సాంకేతికతతో చైన్ స్నాచర్ల ఆట కట్టించిన నల్లపాడు పోలీసులు

## -సౌత్ డీఎస్పీ నేతృత్వంలో కేవలం 5 రోజుల్లోనే చైన్ స్నాచింగ్ కేసును చేధించిన నల్లపాడు పోలీసులు

## -ఇద్దరు నిందితుల అరెస్ట్, రూ.1,50,000/ విలువైన 20 గ్రాముల బంగారం స్వాధీనం

**గుంటూరుతూర్పు,ఏప్రిల్23,ప్రభాతవార్త :** గుంటూరు జిల్లా ఎస్పీ సతీష్ కుమార్ ఆదేశాల మేరకు సౌత్ పోలీస్ సబ్ డివిజన్ డీఎస్పీ



జి.భానోదయ ఆధ్వర్యములో నల్లపాడు పోలీస్ స్టేషన్లో నమోదైన చైన్ స్నాచింగ్ కేసులో ఇద్దరు నిందితులను అరెస్ట్ చేసి, సుమారు రూ.1,50,000/ విలువైన 20 గ్రాముల బంగారు చైనును రికవరీ చేసిన నల్లపాడు సీఐ వంశీధర్, ఎస్సై వాసు, పోలీస్ సిబ్బంది...గత శనివారం ఉదయం సుమారు 6గంటల సమయంలో ఇన్నర్ రింగ్ రోడ్డు, ఎలైట్ కార్ కేర్ సమీపంలో ఒంటరిగా స్కూటీపై వెళ్తున్న మహిళను వేరొక స్కూటీపై వెళ్తున్న ఇద్దరు వ్యక్తులు ఆమెను ఆపి అడ్రస్ అడుగుతూ, అకస్మాత్తుగా ఆమె మెడలో ఉన్న బంగారు చైనును బలవంతంగా లాక్కొని పారిపోయిన ఘటనకు సంబంధించి నల్లపాడు పోలీస్ స్టేషన్ లో కేసు నమోదు చేసి, సాంకేతిక పరిజ్ఞానం, సీసీ కెమెరాలనల్లపాడు ద్వారా సేకరించిన ఆధారాల ఆధారంగా ఇద్దరు నిందితులను గుర్తించారు. బుధవారం ఏటుకూరూ బైపాస్ వద్ద వారిని అదుపులోకి తీసుకుని విచారించారు. ఈ విచారణలో నిందితులు ఇద్దరు మేన మామ మేనల్లుళ్లు అని,వారు గుంటూరు నగరంలో ఆటోలు నడుపుతూ జీవిస్తుంటారని, వ్యసనాలకు అలవాటు పడి వచ్చే సంపాదన సరిపోక చైన్ స్నాచింగ్ చేసి డబ్బులు సంపాదిద్దమనే దురాలోచనతో మొదటిసారి చైన్ స్నాచింగ్ కు పాల్పడినారని తెలిపారు.పట్టు బడిన ఇద్దరు నిందితుల నుండి సుమారు రూ.1,50,000/ విలువచేసే 20 గ్రాముల బంగారు చైనును, వారు వాడిన ద్విచక్ర వాహనాన్ని స్వాధీనం చేసుకోవడం జరిగింది.వారిరువురి అరెస్ట్ చేసి, కోర్టులో హాజరుపరచడం జరుగుతుందని సౌత్ డీఎస్పీ జి భానోదయ తెలిపారుఈ కేసు చేదనలో సీసీ కెమెరాలు ప్రముఖ పాత్ర పోషించాయనీ, సీసీ కెమెరాల ఏర్పాటు ఎంతో ఆవశ్యకమని ప్రజలకు సూచించారు.చైన్ స్నాచింగ్ కేసును కేవలం 05 రోజుల్లో ఛేదించిన సౌత్ డీఎస్పీ భానోదయ, నల్లపాడు సీఐ వంశీధర్, ఎస్ఐ సిహెచ్ వాసు, సిబ్బంది హెడ్ కానిస్టేబుల్ కె సుబ్బారావు, కానిస్టేబుల్ షేక్ మస్తాన్ వలి, షేక్ నూరల్లా లను ఎస్పీ అభినందించినారు.

# సివిల్స్ ర్యాంకర్ అంబటి యామినినీ అభినందించిన ఎమ్మెల్యే అరవిందబాబు

నరసరావుపేట, ఏప్రిల్ 23 ప్రభాతవార్త : పట్టణానికి చెందిన అంబటి యామినికి శాసనసభ్యులు డాక్టర్ చదలవాడ అరవిందబాబు బుధవారంఅభినందనలు తెలిపారు. ఆల్ ఇండియా స్థాయిలో పల్నాడు జిల్లాకు నరసరావుపేట నియోజక వర్గానికి పేరు, ప్రతిష్టతను తీసుకుని వచ్చిన యామిని కృషి, పట్టుదలతో సాధించిన విజయం నేటి యువతకు ఆదర్శమన్నారు. సివిల్స్ లో ఐఆర్ఎస్‌కు ఎంపిక కావటం ఎంతో సంతోషమన్నారు.తల్లి కష్టంతో సమస్యలు అధిగమించి విజయాన్ని స్వంతం చేసుకున్నారని తెలిపారు.



అదే విధంగా ఆల్ ఇండియా స్థాయిలో 26వ ర్యాంకు సాధించిన ఇంటర్ విద్యార్థులను ఎమ్మెల్యే సత్కారించారు. కూటమి ప్రభుత్వం విద్యకు ఎంతో ప్రాధన్యత ఇస్తుందని, సియం చంద్రబాబు ఆధ్వర్యంలో చదువులకు అవసరమైన ప్రోత్సాహం అందిస్తామని ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవిందబాబు వివరించారు.

# ప్రజా దర్బార్‌లో పిర్యాదులను స్వీకరించిన ఎమ్మెల్యే కొలికపూడి

**తిరువూరు, ఏప్రిల్ 23, ప్రభాతవార్త :** ఎమ్మెల్యే కార్యాలయంలో ప్రజా దర్బార్ సందర్భంగా అర్జీదారులు క్యూ కట్టారు. ఈ ప్రజా దర్బార్‌కు నాలుగు మండలాలకు చెందిన ప్రభుత్వ అధికారులు హాజరవ్వగా, స్వయముగా ఎమ్మెల్యే కొలికపూడి శ్రీనివాసరావు




ఫిర్యాదులను స్వీకరించి, సంబంధిత అధికారులకు ఆదేశాలు జారీ చేశారు.

# హిట్ అండ్ రన్ కేసుల్లో 101 మందికి నష్టపరిహారం : సిపి రాజశేఖరబాబు



**విజయవాడ క్రైం,ఏప్రిల్ 23,ప్రభాతవార్త :** హిట్ అండ్ రన్ కేసుల్లో 101 మంది భాధితులకు 89.59 లక్షల నష్టపరిహారాన్ని అందచేశామని సిపి రాజశేఖరబాబు వెల్లడించారు. వీటిలో రోడ్డు ప్రమాదంలో మరణించిన కుటుంబాలకు రూ.2లక్షల చొప్పున,గాయపడిన 75 మందికి రూ.50వేల చొప్పున అందచేసినట్లు ఆయన తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత మూడు సంవత్సరాల్లో 253 హిట్ అండ్ రన్ కేసులు నమోదయ్యాయని,101 మందికి నష్టపరిహారం వచ్చిందని,మిగతా వారికి త్వరలోనే వస్తుందని పేర్కొన్నారు. మిగతా వారికి త్వరలోనే వస్తుందన్నారు. ఎన్టీఆర్ పోలీసు కమీషనరేట్ కొత్త ఒరవడిని సృష్టిస్తూ ముందుకు పోతుందన్నారు. ఒక సేఫ్టీ కల్చర్ నేపథ్యంలో సురక్ష అనే కార్యక్రమం చేపట్టి ఇప్పటికీ సుమారు 3వేల సిసి కెమేరాలను ఏర్పాటు చేసామన్నారు. హిట్ అండ్ రన్ కేసుల్లో ఖచ్చితంగా వాహనం దొరకాలి అనే ఉద్దేశ్యంతో ముందుకు పోతున్నామన్నారు. వాహనం దొరికితే ఇన్సూరెన్స్ ఎక్కువగా ఉంటుందన్నారు. 2022 ఏప్రిల్ 1 నుండి ఇప్పటి వరకు ఎన్టీఆర్ జిల్లా పోలీస్ కమీషనరేట్‌లో 253 రోడ్డు ప్రమాద కేసులు నమోదయ్యాయని,భాధితులకు కేంద్ర ప్రభుత్వం వారు అందించే నష్టపరిహారం కోసం చేయల్సిన అప్లికేషన్‌కు సుప్రీం కోర్టు సూచనల మేరకు 1-4 ఫారాల్లో కావాల్సిన అన్ని వివరాలను జనరల్ ఇన్సూరెన్స్ డిప్యూటీ కలెక్టర్ కార్యాలయం, కలెక్టరేట్ మొదలగు శాఖలను సమన్వయం చేసుకుంటూ కావాల్సిన పత్రాలను సమకూర్చుకుని పూర్తి వివరాలతో కూడిన ఫారాలను కలెక్టర్‌కు పంపండం జరుగుతుందన్నారు. కలెక్టర్ సంబంధిత క్లైం అధికారులకు పంపి భాధితులకు నష్టపరిహారం అందేలా చేస్తారన్నారు. ఇప్పటి వరకు సదరు ప్రత్యేక బృందం వాకె 200 కేసులకు సంబంధించిన ఫారాలను కలెక్టర్‌కు పంపడం జరిగిందన్నారు. వాటిల్లో 101 మంది భాధితులకు 89 లక్షల 50 వేల నగదు వారి వారి ఎకౌంటులలో జమ చేశామన్నారు. హిట్ అండ్ రన్ కేసుల్లో ప్రమాద భాధితులకు నష్టపరిహారం అందేలా చేయడంలో రాష్ట్రం లోనే ఎన్టీఆర్ కమీషనరేట్ ప్రథమ స్థానంలో నిల్చిందన్నారు.భాధితులతో సమావేశం ఏర్పాటు చేసిన ఆయన వారితో రోడ్డు ప్రమాద వివరాలపై మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం నుండి నష్టపరిహారం రావడంలో కీలకంగా వ్యవహరించిన డిసిపి కృష్ణమూర్తి నాయుడు,డిప్యూటీ కలెక్టర్ జి.మహేశ్వరరావు,స్టేట్ జనరల్ ఇన్సూరెన్స్ అధికారి డి.రామ్ సుధాకర్,ఎసిపి రామచంద్రరావు,మహిళా ఎస్ఐ మల్లీశ్వరిని,కలెక్టర్ కార్యాలయ సిబ్బందిని పోలీసు సిబ్బందిని ఆయన అభినందించారు. కార్యక్రమంలో డిసిపిలు కెజివి సరిత,కృష్ణమూర్తి నాయుడు,ఏడిసిపి గుణ్ణం రామకృష్ణ,డిప్యూటీ కలెక్టర్ మహేశ్వరరావు,స్టేట్ జనరల్ ఇన్సూరెన్స్ అధికారి డి.రాంసుధాకర్,ఏసిపి రామచంద్రరావు,సిఐలు,ఇతర అధికారులు,సిబ్బంది,భాధిత కుటుంబాల వారు పాల్గొన్నారు.

## 10లో మాచర్ల నారాయణ విద్యార్థుల విజయకేతనం



**మాచర్ల, ఏప్రిల్ 23 ప్రభాతవార్త:** పది ఫలితాల్లో మాచర్ల పట్టణంలోని నారాయణ పాఠశాల విద్యార్థులు అత్యుత్తమ ప్రతిభ కనబరచినట్లు పాఠశాల ప్రిన్సిపల్ ఉల్లారెడ్డి తెలిపారు. 500 పైగా 45 మంది విద్యార్థులు ప్రతిభ చూపారు. పాఠశాల విద్యార్థి వై.చిన్మయిసాయి 590 మార్కులతో పాఠశాల మొదటిస్థానంలో నిలిచాడు. నూటికి నూరు శాతం ఉత్తీర్ణత సాధించినట్లు ప్రిన్సిపల్ తెలిపారు. ఈ సందర్భంగా పాఠశాలలో, పార్కుసెంటర్‌లో బాణాసంచా కాల్చి మిఠాయిలు పంచిపెట్టారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఇన్‌ఛార్జిలు ఆంజనేయులు, పవన్, ఉదయలక్ష్మి, సునీత, అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ శివకిరణ్‌రాజు, పాఠశాల సిబ్బంది, విద్యార్థినీ విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

## పది ఫలితాల్లో కృష్ణవేణి విద్యార్థుల విజయభేరి



**మాచర్ల, ఏప్రిల్ 23 ప్రభాతవార్త:** పదో తరగతి ఫలితాల్లో మాచర్ల పట్టణంలోని కృష్ణవేణి టాలెంట్ స్కూల్ విద్యార్థులు అత్యుత్తమ ప్రదర్శన కనబరచినట్లు ప్రిన్సిపల్ హనుమంతరావు తెలిపారు. 500పైగా 33 మంది విద్యార్థులు సాధించినట్లు పేర్కొన్నారు. పాఠశాల విద్యార్థి షేక్ ఖాజా అజ్గర్ 584 మార్కులతో పాఠశాల మొదటిస్థానంలో చాడు. పాఠశాల ఛైర్మన్ ఎస్ రాజు, యాజమాన్యం రామకృష్ణ, శ్రీధర్‌గుప్తా, సదాశివరాజు, హరీష్‌చంద్రలు విద్యార్థులను అభినందించారు. ఈ సందర్భంగా పాఠశాలలో, పార్కు సెంటర్లో బాణాసంచా కాల్చి మిఠాయిలు పంచిపెట్టారు

## పది ఫలితాల్లో కిడ్స్ పాఠశాల విద్యార్థుల ప్రభంజనం



**మాచర్ల, ఏప్రిల్ 23 ప్రభాతవార్త:** పదో తరగతి ఫలితాల్లో మాచర్ల కిడ్స్ పాఠశాల విద్యార్థులు ప్రభంజనం సృష్టించినట్లు పాఠశాల ప్రిన్సిపల్ జేవీఎస్ఆర్‌కే శాస్త్రి తెలిపారు. పరీక్షకు 102 మంది విద్యార్థులు హాజరుకాగా 100 శాతం ఉత్తీర్ణత సాధించినట్లు ఆయన తెలిపారు. 600 మార్కులకుగాను కాకర్ల వెంకటకావ్య 593 మార్కులతో ప్రథమస్థానం కైవసం చేసుకోగా, పి.అక్షితషైని 585, యశ్వంత్ 584 మార్కులతో ద్వితీయ, తృతీయ స్థానాలు సాధించారన్నారు. 36 మంది విద్యార్థులు 550కిపైగా మార్కులు సాధించారు. 66 మంది విద్యార్థులు 500 పైగా మార్కులు సాధించినట్లు పేర్కొన్నారు. ఈ సందర్భంగా పాఠశాల కమిటీ, కేసీపీ యాజమాన్యం నూరుశాతం పరీక్షా ఫలితాలకు కృషి చేసిన ఉపాధ్యాయులు, విద్యార్థులను అభినందించారు.

## బాల్యం నుండే విద్యా పునాది గట్టిగా ఉండాలి



**గుంటూరు విద్య,ఏప్రిల్ 23,ప్రభాతవార్త :** చిన్నారులకు బాల్యం నుంచే విద్యాపరమైన పునాది గట్టిగా ఉండాలని అప్పుడే పై తరగతుల్లో భాగా రాణించడానికి అవకా: ఉంటుందని దివ్యజ్యోతి ప్లే స్కూల్ డైరెక్టర్‌లు బి.లక్ష్మయ్య,కె.శ్రీనివాస్‌లు పేర్కొన్నారు.విద్యానగర్ 4వ లైను శ్యామల నిలయంలో నూతనంగా ప్రారంభించిన దివ్యజ్యోతి ప్లే స్కూల్ కిడ్స్ క్యాంపస్ ప్రారంభ సందర్భంగా జరిగిన విలేకరుల సమావేశంలో స్కూల్ డైరెక్టరు ్ల మాట్లాడారు. స్కూలు నిర్వహణలో అపార అనుభవం ఉన్న స్కూల్ డైరెక్టర్ల పర్యవేక్షణలో పాఠశాల నిర్వహిస్తున్నామన్నారు.డి కేర్, నర ్సరీ,ఎల్‌కెజి,యూకెజిల కు సంబంధించి ప్రవేశాలు జరుగుతున్నాయని,బాలల పట్ల వ్యక్తిగత శ్రద్ధ,ఆధునిక తరగతి గదులు,పిల్లల ఆరోగ్య అప్రమత్తత,మంచి వాతావరణం,అదనపు కరిక్యూలర్ యాక్టివిటిస్,కోకర్యులర్ యాక్టివిటిస్,స్నేహపూర్వక సిబ్బంది సేవలు,తదితర అంశాలు పాఠశాల ప్రత్యేకతను తెలిపారు.అడ్మిషన్లు ప్రారంభమయ్యాయని ఆసక్తిగల తల్లిదండ్రులు స్కూల్ కార్యాలయంలో సంప్రదించాలని డైరెక్టర్లు కోరారు.మరిన్ని వివరాల కోసం కార్యాలయంలో సంప్రదించాలని పేర్కొన్నారు.

## పది ఫలితాల్లో సత్యసాయి విద్యావిహార్ ప్రభంజనం



**మాచర్లటౌన్, ఏప్రిల్ 23 ప్రభాతవార్త:** పదో తరగతి ఫలితాల్లో మాచర్ల సత్యసాయి విద్యావిహార్ ప్రభంజనం సృష్టించినట్లు పాఠశాల హెచ్ఎం వై.రమాదేవి, జక్కా శ్రీనివాసరావు, అక్కినేని అనిల్ తెలిపారు. పాఠశాలలో 24 మంది విద్యార్థులు పరీక్షలు రాయగా నూరుశాతం ఫలితాలు సాధించినట్లు తెలిపారు. వారిలో తేజస్విని 591, కార్తీక్ 584, శ్రీవల్లి 578 మార్కులు సాధించగా 20 మందికి పైగా 500పైగా మార్కులు సాధించినట్లు వివరించారు. విద్యార్థులను పాఠశాల టీచర్లు, పలువురు అభినందించారు.

## తల్లిదండ్రులు స్నేహపూర్వక వాతావరణాన్ని కల్పించాలి

**మాచర్లటౌన్, ఏప్రిల్ 23 ప్రభాతవార్త:** ప్రతి తల్లిదండ్రులు తమ పిల్లల పట్ల బాధ్యతగా వ్యవహరిస్తూ, ప్రేమగా మెలిగి, ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దాలని ఆర్ట్ ఆఫ్ లివింగ్ సంస్థ రాష్ట్ర కౌన్సిల్ మెంబర్ కోరె సురేష్, గుంటూరు జిల్లా మీడియా కోఆర్డినేటర్ బి.రమాదేవి అన్నారు. సంస్థ ద్వారా పట్టణంలోని సత్యసాయి విద్యావిహార్‌లో విద్యార్థుల తల్లిదండ్రులకు, పెరిగే పిల్లల పట్ల ఎలా మెలగాలో తెలిపే క్లాసులను బుధవారం నిర్వహించారు. ఆడపిల్లలు చాలా సున్నితంగా ఉంటారని వారిని మంచి మార్గంలో నడిపిస్తూ వారికి తగ్గట్లుగా వ్యవహరించాలన్నారు. పిల్లలకు సెల్‌ఫోన్ సాధ్యమైనంత మేరకు దూరంగా ఉంచాలన్నారు. ప్రతి తల్లిదండ్రి పిల్లల కోసం సమయాన్ని కేటాయించాలన్నారు.కార్యక్రమంలో సభ్యులు ఎ న్.సుధాకర్, పాఠశాల ప్రిన్సిపల్ వై.రమాదేవి, వైస్ ప్రిన్సిపల్ మధురవాణి తదితరులు పాల్గొన్నారు.

## పుస్తకమంటే ప్రపంచ జ్ఞానం..దారిచూపే దీపం

**గుంటూరు కల్చరల్,ఏప్రిల్ 23,ప్రభాతవార్త :** పుస్తకమంటే ప్రపంచ జ్ఞానమని,పుస్తకమంటే వ్యక్తిత్వ వికాసమని పుస్తకమంటే మానసిక ఆరోగ్యమని పుస్తకమంటే చీకటి చిట్టడవిలో దారిచూపే దీపమని అవగాహన సంస్థ ఆధ్వర్యంలో జరిగిన ప్రపంచ పుస్తక దినోత్సవ కార్యక్రమంలో పాల్గొన్న పుస్తక ప్రియులు,విద్యావేత్తలు అభిప్రాయ పడ్డారు.అవగాహన సంస్థ కార్యాలయంలో ప్రపంచ పుస్తక దినోత్సవం సందర్భంగా పుస్తకం ప్రియనేస్తం అంశంపై చర్చ జరిగింది.కార్యక్రమంలో పుస్తక ప్రియులు,యోగాచార్యులు అచ్యుత ఇందుశేఖర్ మాట్లాడుతూ అర్థవంతంగా ఆనందంగా జీవించడానికి మన జీవితం మనకే కాక కొందరికైనా ఉపయోపడేలా మలచుకోవడం కోసం పుస్తక పఠనం ఉపయోగపడుతుందన్నారు.పుస్తక ప్రియులు,రాడికల్ హ్యూమనిస్ట్ నాయకుడు కళ్యాణం చంద్రశేఖర్ మాట్లాడుతూ నవ్వడానికి స్ఫూర్తి పొందడానికి తెలియని విషయాలు తెలుసుకోవడానికి చదవడం అవసరమన్నారు.కార్యక్రమంలో ప్రపంచ ప్రసిద్ధ రచయిత విలియం షేక్స్‌పియర్ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు.కార్యక్రమంలో విద్యావేత్త సత్యనారాయణ,రాజన్న మాస్టారు తదితరులు ప్రసంగించారు.

## ఏఎన్యూకు ఐదు రోజుల పనిదినాలు

**ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం,ఏప్రిల్ 23,ప్రభాతవార్త :** వర్సీటీ ఇకనుండి ఐదు రోజులు మాత్రమే పనిచేయనుంది.ప్రతి శనివారం సెలవు ప్రకటిస్తూ ఇన్‌చార్జి రిజిస్ట్రార్ ఆచార్య సింహాచలం ఉత్తర్వులు జారీ చేశారు.ఈ మేరకు వికాస ఉద్యోగుల సంఘం వినతిమేరకు ఇన్‌చార్జీ విసి ఆచార్య గంగాధరరావు ఈ నిర్ణయం తీసుకున్నట్లు ఉత ్తర్వుల్లో పేర్కొన్నారు.అయితే సోమవారం నుండి శుక్రవారం వరకు వర్ ్సటీ పనిచేసే సమయాలను కూడా మార్పు చేశారు.ప్రతిరోజు ఉదయం 9.30నుంచి సాయంత్రం 5.30గంటల వరకు వర్సిటీ పనిచేస్తుందని వివరించారు.ఈ విధానం జూన్ 8వ తేది వరకు అమల్లో ఉంటుందని పేర్కొన్నారు.

## ఎన్ఎన్‌టీలో నూరుశాతం ఉత్తీర్ణత



**పొన్నూరు, ఏప్రిల్ 23,ప్రభాతవార్త:** పట్టణంలోని సాయినగర్‌లో వున్న ఎన్ఎన్‌టి పబ్లిక్ స్కూల్ విద్యార్థులు పదో తరగతి పబ్లిక్ పరీక్షల్లో నూరుశాతం ఉత్తీర్ణత సాధించినట్లు పాఠశాల ప్రధానోపాధ్యాయుడు కొలిపర్తి శివనాగేశ్వరరావు తెలిపారు. పాఠశాల స్థాపించిన నాటి నుంచి నూరుశాతం ఉత్తీర్ణత సాధిస్తూ మెరుగైన విద్యను అందిస్తున్నట్లు చెప్పారు. తక్కువస్థాయి విద్యార్థులతో మెరుగైన ఫలితాలు సాధిస్తున్నట్లు చెప్పారు. 58మంది పరీక్షకు హాజరుకాగా నూరుశాతం ఉత్తీర్ణత సాధించామన్నారు. 588మార్కులతో వెలిగందుల అనన్య, 581మార్కులతో జ్యోతుల అక్షర, 580మార్కులతో కెఎస్‌జిఎన్ సుబ్రహ్మణ్యం పాఠశాల ప్రథమ, ద్వితీయ,తృతీయస్థానాల్లో నిలిచారన్నారు. 500లకుపైగా 32మంది విద్యార్థులు ఉన్నారు. హాజరైన ప్రతి ఒక రరూ ప్రథమస్థానంలో ఉత్తీర్ణత సాధించారన్నారు. విద్యార్థులను పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థినీ విద్యార్థుల తల్లిదండ్రులు అభినందించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఇన్‌చార్జి వెలనాటి రామదాసు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## తెలుగు సేన ఆధ్వర్యంలో నిరసన

**వట్టిచెరుకూరు ఏప్రిల్ 23 ప్రభాత వార్త :** ప్రత్తిపాడు నియోజకవర్గం, వట్టి చెరుకూరు మండలం, పుల్లడుగుంట గ్రామంలో ఎన్టీఆర్ విగ్రహం వద్ద తెలుగు సేన ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం నిర్వహించారు,నిన్న సాయంకాలం వైసిపి హత్యా రాజకీయానికి బలైన ముప్పవరపు వీరయ్య చౌదరి హత్యకు నిరసనగా అన్న నందమూరి తారక రామారావు విగ్రహం దగ్గర కార్యకర్తలు ఆవేదనను తెలియజేయడం జరిగింది అధినేత అభివృద్ధి రాజకీయాన్ని జోడెద్దులుగా నడిపించినప్పుడే శాశ్వతమైన అభివృద్ధి సాధ్యమని ఆ దిశగా తెలుగు సేన ప్రజా ప్రభుత్వం పరిపాలన సాగాలని తెలుగు రైతు సేన ఆధ్వర్యంలో నినాదించడం జరిగింది

## ఏఎన్యూ ఇయర్ ఎండ్ డిగ్రీ ఫలితాలు విడుదల

**ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం,ఏప్రిల్ 23,ప్రభాతవార్త :** వర్సిటీ పరిధిలో జనవరి,ఫిబ్రవరి నెలలో జరిగిన యూజి అన్ని కోర్సుల 1వ,2వ,3వ సంవత్సరాల ఫలితాలను విడుదల చేశారు.మొత్తం 636మంది పరీక్షలకు హాజరుకాగా 615మంది ఉత్తీర్ణత సాధించినటు ్ల తెలిపారు.రీవాల్యుయేషన్ కు మే 7వ తేదీ లోపు దరఖాస్తు చేసుకోవచ్చన్నారు.ఒక్కొక్క పేపర్‌కు రూ.1490లు చెల్లించాల్సి ఉంటుందన్నారు.

## పెరుగతున్న ఉష్ణోగ్రతలకు నీటిని అధికంగా తీసుకోవాలి : మండల వైద్యాధికారి సుమంత్

**కొల్లిపర,ఏప్రిల్ 23 ప్రభాతవార్త:** పెరుగుతున్న ఉష్ణోగ్రతలకు నీటిని అధికంగా తీసుకోవాలని మండల వైద్యాధికారి సుమంత్ అన్నారు.బుధవారం మండలంలోని దావులూరులో వైద్యాధికారులు ప్యామిలీ ఫిజీషియన్ కాన్సెప్ట్ క్యాంపు నిర్వహించి రోగులకు తగిన, సూచనలు సలహాలు ఇచ్చారు.ఈ సందర్భంగా సుమంత్ మాట్లాడుతూ నిల్వ ఆహార పదార్థాలను తీసుకోరాదన్నారు. గర్భిణీలు క్రమం తప్పకుండా వైద్య పరీక్షలు చేయించుకోవాలన్నారు.కార్యక్రమంలో ఎన్‌సిఎల్‌హెచ్ పీ కుమారి,ఎఎన్ఎం వసుమతి,డీఈవో బొమ్మ కోటిరెడ్డి,ఆషా కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## జమ్ముకశ్మీరులో 28 మందిని హతమార్చటాన్ని ఖండిస్తూ జనసేన నిరసన



**కొల్లిపర,ఏప్రిల్ 23 ప్రభాతవార్త:** జమ్ముకశ్మీరులో పహల్గామ్ ప్రాంతంలో పర్యాటకులపై ఉగ్రవాదులు దాడిచేసి 28 మందిని హతమార్చటాన్ని ఖండిస్తూ జనసేన పార్టీ పీఏసీ చైర్మన్,రాష్ట్రమంత్రి నాదెండ్ల మనోహర్ ఆదేశాల మేరకు మండల పరిధిలోని దావులూరు అడ్డరోడ్డు వద్ద బుధవారం జనసేన పార్టీ ఆద్వర్యంలో నాయకులు నల్లబాడ్జీలు ధరించి కొవ్వొత్తులతో నిరసన వ్యక్తం చేసారు.నిరసన వ్యక్తం చేసిన వారిలో జనసేన మండల అద్యక్షుడు యర్రు వెంకయ్యనాయుడు,జనసేన నాయకులు అడపా నారాయణరెడ్డి,భీమవరపు కిషోర్‌రెడ్డి,కట్టా శ్రీహరిరెడ్డి,కొండా కిషోర్‌రెడ్డి,కన్నెగంటి ,శ్రీను,అద్దంకి వేణుగోపాల్,యలమాటి అనిల్,పోగోలు వాసు,తాతా శివయ్య,దంటు వెంకటరెడ్డి,తోటా రాంబాబు,షేక్ బాజీ తదితరులు పాల్గొన్నారు.

## 10ఫలితాలలో శ్రీసాయి వాసవి విద్యానికేతన్ హైస్కూల్ విద్యార్థుల హవా







**కొల్లూరు, ఏఫ్రియల్ 23 (ప్రభాతవార్త) :** 2024-2025 సంవత్సరం మార్చి నెలలో జరిగిన 10వ తరగతి పబ్లిక్ పరీక్షల్లో బుధవారం విడుదల చేసిన ఫలితాలలో కొల్లూరులోని శ్రీసాయి వాసవి విద్యానికేతన్ హైస్కూల్‌కి చెందిన గొల్లపూడి వేణువర్ధన్ 600/592 మార్కులతో మండలంలో ప్రథమ స్థానాన్ని సాధించడం జరిగిందని శ్రీ సాయి వాసవి విద్యా సంస్థల డైరెక్టర్ ఉప్పు శ్రీనివాసరావు తెలియజేశారు. ఈ విద్యా సంస్థ నుండి చిలుమూరు సింధు 587మార్కులు, జొన్నకూటి మేఘన 585మార్కులు సాధించినట్లుగా ఆయన తెలియజేశారు. శ్రీసాయి వాసవి విద్యా సంస్థల నుండి హాజరైన 50మందికి 50మంది ఉత్తీర్ణులై నూరు శాతం ఫలితాలు సాధించడం జరిగిందని ఆయన తెలిపారు. ఈ సందర్భంగా ప్రథమ స్థానాన్ని సాధించిన గొల్లపూడి వేణు వర్ధన్‌ని సమస్థ డైరెక్టర్ శ్రీనివాసరావు పాఠశాల ఉపాధ్యాయులు తల్లిదండ్రులు అభినందించడం జరిగింది. ఈ విద్యా సంస్థ నుండి హాజరైన విద్యార్థులు 550మార్కులకు పైబడిన వారు 14మంది 500మార్కుల పైబడి వచ్చిన వారు 26మంది విద్యార్థులు ఉన్నట్లు ఆయన తెలియజేశారు. ఈ సందర్భంగా శ్రీసాయి వాసవి విద్యా సంస్థల విద్యార్థులు, ఉపాధ్యాయులు, పదో తరగతి ఫలితాలు సాధించిన విద్యార్థులను అభినందించారు

## టెన్త్ ఫలితాల్లో నెహ్రూనికేతన్ ప్రభంజనం



**తెనాలి, ఏఫ్రియల్ 23 (ప్రభాతవార్త) :** స్థానిక బోసురోడ్డులోని నెహ్రూనికేతన్ ఇంగ్లీష్ మీడియం స్కూల్ టెన్త్‌లో అత్యుత ్తమ ఫలితాలు సాధించినట్లు మేనేజింగ్ డైరెక్టర్ మురళీకాంత్ దాసరి బుధవారం తెలియజేశారు. నెహ్రూనికేతన్ విద్యార్థులు 93మంది టెన్త్ పరీక్షకు హాజరు కాగా 55మందికి పైగా 500లకు పైబడిమార్కులతోప్రతి సంవత్సరం లాగా నూరు శాతం ఉత్తీర్ణత సాధించారు. సయ్యద్ జునేరా ఫాతిమా 600మార్కులకు గాను 586మార్కులు సాధించి టాపర్‌గా నిలిచింది. ఈ.వేదజ 585, పి.జాహ్నవి సాయిశ్రుతి 585, ఎన్.ప్రవల్లిక 583, ఆర్.దేదీప్య 582, షేక్ దానిష్ 580మార్కులు సాధించారు. పాఠశాలలో జరిగిన కార్యక్రమంలో మేనేజింగ్ డైరెక్టర్ మురళీకాంత్ వి.దాసరి విద్యార్థులకు జ్ఞాపికలు అందించి అభినందించారు. ఈ విజయానికి కారణమైన బాలబాలికలు, సహకరించిన వారి తల్లిదండ్రులు, ఉపాధ్యాయులను ప్రత్యేకంగా అభినందించారు. గత 50సంవత్సరాల పైబడి చరిత్ర కలిగిన నెహ్రూనికేతన్ గ్రామీణ, మధ్య తరగతి వారికి సైతం అందుబాటులో ఉన్న విషయాన్ని మురళీకాంత్ గుర్తు చేశారు. నెహ్రూనికేతన్ వ్యక్తిగత శ్రద్ధ తీసుకుంటూ విద్యా విధానంలో విప్లవాత్మకమైన మార్పులు తీసుకువచ్చి సాధారణ విద్యార్థులతో సాధించిన అసాధారణ ఫలితాలకు విద్యా సేవలకు నిదర్శనం ఈ ఫలితాలు అన్నారు.

## సమన్వయంతోనే సమగ్రాభివృద్ధి : ఎంపిపి భవనం పద్మలీల



**పొన్నూరు, ఏప్రిల్ 23,ప్రభాతవార్త:** అధికారులు-నాయకులు సమన్వయంతో పనిచేసినప్పుడే సమగ్రాభివృద్ధి సాధ్యమవుతుందని ఎంపిపి భవనం పద్మలీల అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో బుధవారం జరిగిన మండల పరిషత్ సర్వసభ్య సమావేశంలో ఆమె మాట్లాడారు. ప్రస్తుతం వేసవి కాలంలో మంచినీటి కొరత రాకుండా ఉండేవిధంగా అన్ని గ్రామాల సర్పంచులు, కార్యదర్శులు చర్యలు చేపట్టాలన్నారు. ప్రభుత్వ ఫలాలు అర్హులందరికీ అందించేవిధంగా అధికారులు శక్తివంచన లేకుండా పనిచేయాలన్నారు. కూలీల నివారణకు ప్రభుత్వం ప్రవేశపెట్టి అమలు చేస్తున్న జాతీయ గ్రామీణ ఉపాధిహామీ పథకాన్ని పక్కాగా అమలు చేయాలన్నారు. జాబ్‌కార్డు ఉన్న ప్రతి ఒక్కరికి పని కల్పించేవిధంగా చూడాలన్నారు. పాఠశాలల బలోపేతానికి ఉపాధ్యాయులు శక్తివంచన లేకుండా పనిచేసి సత్ఫలితాలు వచ్చేవిధంగా ముందుకు సాగాలన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్యను పెంచేవిధంగా విద్యాశాఖాధికారులు పనిచేయాలన్నారు. రైతులు పండించిన పంటలకు గిట్టుబాటు ధర వచ్చేవిధంగానూ, వారి వద్ద ఉన్న ధాన్యాన్ని, ఇతర పంటలకు సంబంధించి ప్రభుత్వం తరపున కొనుగోలు చేసేవిధంగా చూడాలన్నారు. గ్రామాల్లో లో ఓల్టేజి సమస్య లేకుండా, నిరంతరాయంగా విద్యుత్ సరఫరా అయ్యేవిధంగా సంబంధిత అధికారులు శ్రద్ధ పెట్టాలన్నారు. అన్నిశాఖల అధికారులు ఆయా శాఖల ఆధ్వర్యంలో జరుగుతున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను నూరుశాతం అమలయ్యే విధంగా చూడాలన్నారు. మండల వ్యవసాయాధికారి దేగల వెంకట్రామయ్య మాట్లాడుతూ ఈ ఏడాది రైతులు పండించిన వరి, మినుములు, పెసలు, మొక్కజొన్న, జొన్న తదితర పంటలన్నింటికి ఆశించిన మేర దిగుబడులు వచ్చాయన్నారు. పెసలు నాణ్యత కొరవడడంతో ప్రభుత్వం నిర్ధేశించిన ధర ఇవ్వలేకపోతున్నట్లు చెప్పారు. పెసలులో అక్కడక్కడ మట్టి రేణువులు తగులుతుండడంతో ప్రభుత్వ మద్దతు ధర ఇవ్వలేకపోతుందన్నారు. డీ స్టోనర్ మిషన్ అందుబాటులో లేకపోవడంతో నాణ్యమైన పెసలు అందించలేకపోతున్నట్లు చెప్పారు. ప్రజాప్రతినిధులు మండలానికి ఒ డీ స్టోనర్ మిషన్ ఇప్పించగలిగితే రైతులకు ఉపయోగంగా ఉంటుందన్నారు. ప్రతి రైతు మట్టి నమూనాలను సేకరించి సాయిల్ టెస్ట్ చేయించుకోవాలన్నారు. భూమి స్వభావాన్ని బట్టి మాత్రమే పంటలు వేసుకోవాలన్నారు. మండల విద్యాశాఖాధికారి కొమ్మారెడ్డి శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ ఈ ఏడాది పదో తరగతి పబ్లిక్ పరీక్షా ఫలితాల్లో గత ఏడాది కంటే ఆరుశాతం ఎక్కువ ఉత్తీర్ణత సాధించినట్లు చెప్పారు. ప్రభుత్వ పాఠశాలలకు సంబంధించి 638మంది విద్యార్థులు పరీక్షకు హాజరుకాగా 535మంది ఉత్తీర్ణత సాధించారన్నారు. ప్రైవేట్ పాఠశాలలకు సంబంధించి 699మంది విద్యార్థులు హాజరుకాగా 676మంది విద్యార్థులు ఉత్తీర్ణత సాధించినట్లు చెప్పారు. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్యను పెంచేందుకు బడిబాట కార్యక్రమం ద్వారా అడ్మిషన్ల డ్రైవ్ కొనసాగుతుందన్నారు. ఇంకా సమావేశంలో విద్యుత్‌శాఖ, గృహనిర్మాణశాఖ, శిశు సంక్షేమశాఖ తదితర శాఖల అధికారులు ఆయా శాఖలకు సంబంధించిన వివరాలను వివరించారు. సమావేశంలో ఎంపిడిఓ గుమ్మా చంద్రశేఖరరావు, మండల పరిషత్ ఉపాధ్యక్షుడు అంబటి రాఘవయ్య, అధికారులు, ఎంపిటీసిలు, సర్పంచ్‌లు పాల్గొన్నారు.

## ప్రభుత్వ పాఠశాలల్లో 83శాతం ఉత్తీర్ణత

**-మండల విద్యాశాఖాధికారి శ్రీనివాసరెడ్డి**

**పొన్నూరు, ఏప్రిల్ 23,ప్రభాతవార్త:** పదోతరగతి పబ్లిక్ పరీక్షా ఫలితాల్లో ప్రభుత్వ పాఠశాలలకు సంబంధించి మండలస్థాయిలో 83శాతం ఉత్తీర్ణత సాధించినట్లు మండల విద్యాశాఖాధికారి కొమ్మారెడ్డి



శ్రీనివాసరెడ్డి తెలిపారు. మండలంలో 12ప్రభుత్వ పాఠశాలలు ఉండగా వాటిలో 638మంది విద్యార్థులు పరీక్షకు హాజరయ్యారన్నారు.వీరిలో 535మంది ఉత్తీర్ణత సాధించారన్నారు. మండల పరిధిలోని బ్రాహ్మణకోడూరు జడ్పీ పాఠశాలకు చెందిన ఉప్పల జ్యోతి స్వరూప-574, వెల్లలూరు జడ్పీ పాఠశాలకు చెందిన ఆలా సాయి రమ్య-567, పచ్చలతాడిపర్రు జడ్పీ పాఠశాలకు చెందిన కె.మోహన్-539, దొప్పలపూడి జడ్పీ పాఠశాలకు చెందిన షేక్ కహతీజా-530, చింతలపూడి జడ్పీ పాఠశాలకు చెందిన షేక్ ఖాజా మొహిద్దీన్-572, మాచవరం జడ్పీ పాఠశాలకు చెందిన ఒరుగంటి నిఖిల్-538, నండూరు జడ్పీ పాఠశాలకు చెందిన అక్కి అఖిల-584, నిడుబ్రోలు జడ్పీ పాఠశాలకు చెందిన సిహెచ్ భాను తేజ-566, జడ్పీపాఠశాల, పొన్నూరుకు చెందిన సుతీక్షణ-578, నేతాజీనగర్ మునిసిపల్ పాఠశాలకు చెందిన ఎం.చేతన సాయి-578, 5వవార్డు మునిసిపల్ పాఠశాలకు చెందిన పి.భార్గవి-569, పొన్నూరు శ్రీరామా మునిసిపల్ పాఠశాలకు చెందిన పి.జ్యోత్స్నశ్రీ-559మార్కులు సాధించారన్నారు. మండలంలో ప్రథమస్థానంలో నిలిచిన అక్కి అఖిలను మండల విద్యాశాఖాధికారి వారి కార్యాలయంలో అభినందించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు, సిబ్బంది పాల్గొన్నారు.

## జంధ్యములు తొలగించమనడం హేయమైన చర్య

**-బ్రాహ్మణ సేవా సంఘ సమాఖ్య రాష్ట్ర కోశాధికారి**

**పొన్నూరు, ఏప్రిల్ 23,ప్రభాతవార్త:** కర్ణాటక రాష్ట్రంలో విద్య విద్య కోర్సుల్లో ప్రవేశించడానికి వ్రాసే ప్రవేశ పరీక్షకు హాజరయ్యే బ్రాహ్మణ విద్యార్థులను జంధ్యములు తొలగించాలని చెప్పడం హేయమైన చర్య అని ఆంధ్రప్రదేశ్ బ్రాహ్మణ సేవా సంఘ సమాఖ్య రాష్ట్ర కోశాధికారి పులిపాక సత్యసాయి వరప్రసాద్(పివిఎస్ఎస్‌విప్రసాద్) అన్నారు. స్థానిక శంకరమఠంలో బుధవారం జరిగిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. కర్ణాటక రాష్ట్రంలోని శివమొగ్గ బీదర్ జిల్లాలో వృత్తి విద్యాకోర్సులలో ప్రవేశానికి వ్రాసే ప్రవేశ పరీక్ష సందర్భంగా బ్రాహ్మణ విద్యార్థులను జంధ్యములను తొలగించాలని, తొలగించని విద్యార్థులను పరీక్షకు అనుమతించమని వెనక్కు పంపండం సరైన విధానమా..? అని ప్రశ్నించారు. దేశంలో ఏ మత సంప్రదాయాలను ఆ మతాల వారు స్వేచ్ఛగా పాటించుకోవచ్చన్నారు. ఎంతో పవిత్రంగా గాయత్రి మంత్రాన్ని జపించే బ్రాహ్మణ విద్యార్థుల జంధ్యములను తొలగించడం అమానుషమన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఈ విషయమై తగు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వాలు ఈ విషయంలో స్పందించకపోతే దేశవ్యాప్తంగా ఉద్యమిస్తామన్నారు. ఈ సమావేశంలో బ్రాహ్మణ మహాసభ అధ్యక్షుడు గణపవరపు రామశాస్త్రి, ఎఆర్‌కెఎస్టీ సాయి, దేశిరాజు బాలగంగాధరతిలక్, దేశిరాజు శ్రీనివాసరావు, తాడేపల్లి వెంకటరత్నం, చిలకపాటి లక్ష్మణ్‌రామాచార్యులు, కోన శశికళ, కోటంరాజు తాండవకృష్ణ, పులిజాల సాంబశివరావు, పెరవలి రామకృష్ణసాయి, మురళీమోహన్, కృష్ణ ప్రసాద్ తదితరులున్నారు.

## ఉగ్రవాదంపై పోరులో రాజకీయాలకు తావులేదు

**-కాంగ్రెస్ పార్టీ మండలాధ్యక్షుడు అందె దిలీప్**



**పొన్నూరు, ఏప్రిల్ 23,ప్రభాతవార్త:** సీమాంతర ఉగ్రవాదంపై దేశవ్యాప్తంగా పార్టీలు, ప్రాంతాలకతీతంగా ఒక్కటై పోరాడుతామని ఇందులో రాజకీయాలకు తావులేదని కాంగ్రెస్ పార్టీ మండలాధ్యక్షుడు అందె దిలీప్ అన్నారు. జమ్మూకాశ్మీరులోని పహల్గామ్‌లో పర్యాటకులపై ముష్కరులు చేసిన దాడిని ఖండించారు.ఈ దాడి పరికివారి చర్యగా చెప్పారు. పిరికివారు, చేతకాని వారే అమాయకులను లక్ష్యంగా చేసుకొని విచక్షణా రహితంగా దాడులకు తెగబడతారన్నారు. ఈ దాడులకు తెగబడిన ది రెసిస్టన్స్ ఫ్రంట్ ఉన్మాదులు ప్రపంచంలో ఏ మూలన నక్కినా భారత్ తగిన రీతిన జవాబిస్తుందన్నారు. అందుకు ప్రతి భారతీయుని మద్దతు ఈ దేశ ప్రభుత్వానికి, భారత సైన్యానికి ఉంటుందన్నారు. ఇందులో ఎక్కడా రాజీలేదన్నారు. ముఖ్యంగా సీమాంతర ఉగ్రవాదం, దేశ ప్రజల భద్రత విషయంలో కాంగ్రెస్ పార్టీగా రాజకీయం చేయబోదన్నారు. ఉగ్రమూకల దాడులకు భారత్ ఇక ఏమాత్రం వేదిక కాకుండా ప్రతిదాడి ఉండాలని, ప్రపంచంలోని ఏ ఉగ్రమూక భారత్‌ను భారతీయులను లక్ష్యంగా చేసుకోకుండా సమాధానం చెప్పాలన్నారు. ఈ విషయంలో రాజకీయ విభేదాలు పక్కనపెట్టి వీలైనంతవరకు ప్రభుత్వాలకు, భారత సైన్యానికి సహకారం ఇచ్చినప్పుడే నిజమైన భారతీయత అనిపించుకుంటుందన్నారు.

## నేడు డయల్ యువర్ డిఎం



**పొన్నూరు, ఏప్రిల్ 23,ప్రభాతవార్త:** ప్రయాణీకుల సమస్యలను తెలుసుకొని పరిష్కరించేందుకే డయల్ యువర్ డిఎం కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు ఆర్టీసి డిపో మేనేజర్ తుమ్మపూడి అజితకుమారి చెప్పారు. స్థానిక డిపో కార్యాలయంలో బుధవారం ఆమె విలేకర్లతో మాట్లాడారు. డిపో అభివృద్ధికి, ప్రయాణీకుల సమస్యల పరిష్కారం కోసమే ఈ నెల 24వ తేదీ ఉదయం 10గంటల నుండి 11గంటల వరకు డయల్ యువర్ డిఎం కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు చెప్పారు. పొన్నూరు ఆర్టీసి డిపో పరిధిలోని ప్రయాణీకులు, ప్రజలు సమస్యలను తెలియజేయడంతోపాటు అభివృద్ధికి సూచనలు, సలహాలు ఇవ్వాలని కోరారు. 9959225267కు ఫోన్ చేయవచ్చని కోరారు. ఈ అవకాశాన్ని ప్రయాణీకులు సద్వినియోగం చేసుకోవాలన్నారు.

# కూటమి ప్రభుత్వంలో హత్యారాజకీయాలకు తావులేదు : ఎమ్మెల్యే ప్రత్తిపాటి



**చిలకలూరిపేట,ఏప్రిల్23,ప్రభాతవార్త:** కూటమి ప్రభుత్వంలో హత్యలు, అరాచకాలకు తావులేదని, వీరయ్య చౌదరి హంతకులకు కఠిన శిక్ష తప్పదని మాజీమంత్రి, ఎమ్మెల్యే ప్రత్తిపాటి హెచ్చరించారు. బుధవారం ప్రత్తిపాటి నివాసంలో జరిగిన విలేకరుల సమావేశంలో అయన మాట్లాడుతూ టిడిపి అధికార ప్రతినిధి, సంతనూతలపాడు మాజీ ఎంపిపి వీరయ్యచౌదరి హత్యను ప్రత్తిపాటి తీవ్రంగా ఖండించారు. వీరయ్యచౌదరిని చంపినవారు,వారి వెనకఉన్న వారు ఎవరైనా, ఎంతటివారైనా చట్టం నుంచి తప్పించుకోలేదని ప్రత్తిపాటి తెలిపారు. చట్టానికి కట్టుబడి న్యాయబద్ధంగా పాలన చేస్తున్న ప్రజాప్రభుత్వం ఆటవి, ఉన్మాద చర్యలకు ముగింపు పలుకుతుందని అన్నారు. కూటమి ప్రభుత్వం దోషులను గుర్తించి త్వరలోనే వారికి కఠినశిక్ష పడేలా చేస్తుందన్నారు వీరయ్యచౌదరి కుటుంబానికి ప్రత్తిపాటి తన ప్రగాఢ సానుభూతిని తెలియచేశారు. వీరయ్యచౌదరి అభిమానునలు, పార్టీ కార్యకర్తలు ఆవేశకావేశాలకు లోనుకాకుండా సంయమనంతో వ్యవహరించాలని ప్రత్తిపాటి సూచించారు.

# 28మంది అమాయకులను బలితీసుకున్న ఉగ్రవాదులను వదిలిపెట్టే ప్రసక్తేలేదు

## -భాజపా రాష్ట్ర కమిటి సభ్యుడు పరాంకుశం శ్రీనివాసరావు



**చిలకలూరిపేట,ఏప్రిల్23,ప్రభాతవార్త:** కాశ్మీర్ అందాలను వీక్షించాలని వెళ్లి అక్కడ ఉగ్రవాదుల చేతిలో ప్రాణాలు కోల్పోయిన 28మంది అమాయకులకు భారతీయ జనతాపార్టీ రాష్ట్ర కమిటి తరుపున నివాళులు అర్పిస్తున్నామని కమిటి సభ్యులు పరాంకుశం శ్రీనివాసరావు తెలిపారు. బుధవారం విలేకరులతో మాట్లాడుతూ ఆ హృదయ విదారక చిత్రాలను చూస్తూంటే మనసు కలచివేస్తుందని, కొత్తగా పెళ్లయిన యువతి తన భర్తను ఉగ్రవాదులు కాల్చివేయగా భర్త శవం ప్రక్కన కూర్చొని విలపిస్తున్న దృశ్యం హృదయవిదారకంగా ఉందని అన్నారు. మతం అడిగి వారి ఐడెంటీ కార్డులను పరిశీలించి హిందువు అన్నవాళ్లందరిని కాల్చి చంపడం అనేది అత్యంత ఘోరమైన, దారుణమైన సంఘటన అని అన్నారు. ఈ ఉగ్ర దాడికి పాల్పడిన పాక్ ప్రేరేపిత ఉగ్ర మూకలను, వారి వెనకుండి దాడికి పథకరచన చేసిన, కాశ్మీర్‌లో వారికి సహకరించిన శక్తులను భారత ప్రభుత్వం తగిన రీతిలో సమాధానం చెప్తుందని ఆయన తెలియచేశారు.

# పెహల్గాం లో ఉగ్రవాదుల మారణ కాండను నిరసిస్తూ ర్యాలీ

**బాపట్ల,ఏప్రిల్23,ప్రభాతవార్త:** జమ్మూ కాశ్మీర్ లోని అనంతనాగ్ జిల్లా పెహల్గాం లో మంగళవారం జరిగిన ఉగ్రవాదుల దాడిని తీవ్రంగా ఖండిస్తున్నట్లు బాపట్ల ఎమ్మెల్యే వేగేశన నరేంద్ర వర్మ రాజు పేర్కొన్నారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రశాంతంగా ఉన్న భారతదేశాన్ని అల్లకల్లోలం చేసి



తద్వారా భారతదేశాన్ని విచ్ఛిన్నం చేయాలి అనే దురుద్దేశంతోనే ఉగ్రవాదులు ఇలాంటి చర్యలకు పాల్పడుతున్నారని ఆయన పేర్కొన్నారు. తప్పకుండా ప్రతి చర్యలు ఉంటాయని బాధిత కుటుంబాలకి ప్రగాఢ సానుభూతి తెలియజేస్తూ క్యాండిల్ ర్యాలీ నిర్వహించారు.ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ నాయకులు పల్లం సరోజని,గిరిజ రాణి,జాన్సీరాణి తదితరులు పాల్గొన్నారు.

# ముప్పవరపు వీరయ్య చౌదరి దారుణ హత్యను తీవ్రంగా ఖండిస్తున్నాం : ఎమ్మెల్యే వేగేశన

**బాపట్ల,ఏప్రిల్23,ప్రభాతవార్త:** సంతనూతలపాడు నియోజకవర్గం టీడీపీ నేత,పార్టీ అధికార ప్రతినిధి,నాకు అత్యంత అప్తుడు,పార్టీకి ఎంతో విధేయుడైన వీరయ్య చౌదరి హత్య సంఘటన తీవ్రంగా కలిచి వేసిందని బాపట్ల శాసన సభ్యులు వేగేశన నరేంద్ర వర్మ అన్నారు.బుధవారం స్థానిక తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఒంగోలులోని వీరయ్య చౌదరి కార్యాలయంలో వీరయ్య చౌదరిని దుండగులు అత్యంత కిరాతకంగా నరికి చంపడం హేయమైన చర్య అని ఈ దారుణ హత్యను తీవ్రంగా ఖండిస్తున్నానన్నారు. వీరయ్య చౌదరి మరణం తెలుగుదేశం పార్టీకి తీరని లోటు అని వారి ఆత్మకు శాంతి కలగాలని బాధాతప్త హృదయంతో ప్రార్థిస్తున్నానన్నారు. ఈ విషాద సమయంలో వారి కుటుంబానికి తన ప్రగాఢ సంతాపం వ్యక్తం చేసి వారి కుటుంబానికి తెలుగుదేశం పార్టీ ఎల్లవేళలా అడ్డగా ఉంటుందన్నారు.

# హజ్ కమిటీ డైరెక్టర్‌కు ఘన సన్మానం



**తిరువూరు, ఏప్రిల్ 23, ప్రభాతవార్త :** ఏపి ఆర్గానిక్ సర్టిఫికెట్ అథారిటీ చైర్మన్ శావల దేవదత్ కార్యాలయంలో ఇటీవల నూతనంగా హజ్ కమిటీ డైరెక్టర్‌గా నియమించిన కౌన్సిలర్ అబ్దుల్ హుస్సేన్‌నునేపి ఆర్గానిక్ సర్టిఫికెట్ అథారిటీ చైర్మన్ శావల దేవదత్ మరియు మైనార్టీ సెల్ నాయకులు పూలబొకే అందించి శాలువతో సత్కరించారు. కార్యక్రమంలో టిడిపి సీనియర్ నాయకులు సంకురాత్రి జనార్ధనరావు మోదుగు వెంకటేశ్వరరావు, కామాల రామారావు, షేక్ రసూల్ మర్సకట్ల కుమార్, పెరుమాళ్ల నిరంజన్ తోట వెంకటేశ్వరరావు, తెలుగు యువత తదితరులు పాల్గొన్నారు.

# జయప్రద ఫౌండేషన్ ఆధ్వర్యంలో కంభంపాడులో ఉచిత కంటి వైద్య శిబిరం

**వత్సవాయి ఏప్రిల్ 23 ప్రభాతవార్త:** జయప్రద ఫౌండేషన్ ఛైర్మన్ తొండపు దశరథ జనార్ధన్ ఆధ్వర్యంలో వత్సవాయి మండలం, ఖమ్మంపాడు



గ్రామంలో ఉచిత నేత్ర వైద్య శిబిరం, మరియు జనరల్ మెడిసిన్, ఎముకలు కీళ్ల వైద్య శిబిరం నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమంలో శంకర్ నేత్రాలయం విజయవాడ డాక్టర్లు మరియు శ్రీకాంత్ బోన్ అండ్ జాయింట్ కేర్ హాస్పిటల్ మరియు కృష్ణ చైతన్య హాస్పిటల్ సంయుక్తంగా 243 మందికి వైద్య పరీక్షలు చేయటం జరిగింది. ఇందులో 150 మందికి కంటి పరీక్షలు చేయగా 46 మందికి శుక్లాల ఆపరేషన్ 9 మందికి కంటి పొరల ఆపరేషన్ 81 మందికి కళ్ళజోళ్ళు అవసరమని డాక్టర్లు గుర్తించడం జరిగింది. అదేవిధగా మరియు జనరల్ మెడిసిన్ 63 మందికి ఎముకలు కీళ్ల వైద్య పరీక్షలు చేసి వారికి ఉచితంగా మందులు ఇవ్వడం జరిగింది. వీరితోపాటు 243 మందికి ఉచితంగా షుగర్ మరియు బ్లడ్ టెస్ట్‌లు చేయటం జరిగింది. ఈ వైద్య శిబిరంలో వత్సవాయి మండల తహసిల్దార్ ప్రభుకుమార్, గ్రామ నాయకులు చేకూరు రమేష్ చావశాంతి బాబు, ఉయ్యూరు అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

# మైనర్ బాలిక లైంగిక వేధింపులపై యువకునిపై ఫోక్సో కేసు నమోదు

**ఎ కొండూరు, ఏప్రిల్ 23, ప్రభాతవార్త :** ఎన్‌టిఆర్ జిల్లా తిరువూరు నియోజకవర్గం ఎ కొండూరు మండలం పోలిశెట్టిపాడు గ్రామానికి చెందిన గోసు వెంకటేశ్వరరావు అనే యువకుడిపై ఎ కొండూరు పోలీసులు ఫోక్సో చట్టం కింద కేసు నమోదు చేశారు. పోలీసుల కథనం ప్రకారం గోసు వెంకటేశ్వరరావు, మారేపల్లికి చెందిన మైనర్ బాలికను ప్రేమించానని మాయమాటలు చెప్పి ఆమెను వశబర్చుకుని మానసికంగా లైంగిక వేదింపులకు గురిచేసి తీరా ఆ మైనర్ బాలికను వదిలివేయడంతో మైనర్ బాలిక బాధితురాలి తల్లి మోర్ల వరలక్ష్మి ఇచ్చిన ఫిర్యాదు మేరకు మొదటగా మిస్సింగ్ కేసు నమోదు చేసిన పోలీసులు ఆ తర్వాత ఈ కేసును నిందితుడి ఆచూకి అనంతరం కేసు ఫోక్సో చట్టం కింద నమోదు చేసినట్లు స్టేషన్ హెచ్‌సి బి శ్రీమన్నారాయణ తెలిపారు.

# నిరుపేదల అభివృద్ధిపై ప్రణాళికలు కల్పించాలి : బాపట్ల జిల్లా కలెక్టరు



**బాపట్ల,ఏప్రిల్23,ప్రభాతవార్త:** బంగారు కుటుంబాలను పేదరికం నుంచి బయటకి తెచ్చేలా మార్గదర్శులకు అవగాహన కల్పించాలని జిల్లా కలెక్టర్ జె వెంకట మురళి తెలిపారు. పి4 అమలు తీరుపై జిల్లా, మండల ప్రత్యేక అధికారులు, మండల స్థాయి అధికారులతో బుధవారం స్థానిక కలెక్టర్ క్యాంపు కార్యాలయంలో ఆయన సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నిరుపేదలకు జీవనోపాధి కల్పించడం, వారి భవిష్యత్తు అభివృద్ధిపై ప్రణాళికతో అవగాహన కల్పించడం చాలా ముఖ్యమన్నారు. జిల్లాలో 62,291 బంగారు కుటుంబాలు ఉన్నాయన్నారు. ఆ కుటుంబాలన్ని పేదరికం నుంచి బయటకు రావడానికి చేయూతనందించాలన్నారు. పి4 విధి విధానాలు అమలు కొరకు జిల్లా, మండల, గ్రామస్థాయిలో కమిటీలు నియమిస్తామన్నారు. ఆర్థిక, సామాజిక రంగాలలో పేద కుటుంబాలు ఎదగడమే రాష్ట్ర ప్రభుత్వం ముఖ్య లక్ష్యమన్నారు. ఒక్కొక్క మండలంలో సుమారు 500 బంగారు కుటుంబాలు ఉండగా, ఆ కుటుంబాల్లోని యువతకు నైపుణ్యాల అభివృద్ధిపై అవగాహన కల్పించాలన్నారు. బంగారు కుటుంబాలను ఇప్పటికే ఎంపిక చేసుకున్న మార్గదర్శిలకు ఎలా ఆ కుటుంబాలకు సహకరించాలో అవగాహన కల్పించాలన్నారు. ఎలా ఎంపిక చేసుకోవాలి, ఎలా సహకరించాలి అనే అంశాలపై మార్గదర్శి కుటుంబాల వారికి అవగాహన కల్పించాలన్నారు. వీటిపై గ్రామస్థాయి అధికారులు ప్రభుత్వ ఉద్యోగులకు ఓరియంటేషన్ నిర్వహించాలన్నారు. ఎన్టీఆర్ భరోసా పింఛన్ల నగదు పక్కదారి పడితే బాధ్యులపై క్రిమినల్ చర్యలు తీసుకుంటామని ఆయన హెచ్చరించారు. పింఛన్ నగదు పంపిణీ ప్రక్రియ ముగిసిన తక్షణమే మిగిలిన నగదును ప్రభుత్వానికి చెల్లించాల్సి ఉందన్నారు. సంతమాగులూరు మండలంలో రూ.6.41 లక్షలు పింఛన్ నగదు ఎందుకు చెల్లించలేదని నిలదీశారు. అలాగే బాపట్ల, బల్లికురవ, మార్టూరు, వేటపాలెం, నిజాంపట్నం మండలాలలోను నగదు పక్కదారి పడితే బాధ్యులపై ఎందుకు చర్యలు తీసుకోలేదని సంబంధిత అధికారులను ఆదేశించారు. తక్షణమే బాధ్యులను సస్పెండ్ చేయాలని, వారిపై కేసు పెట్టి ఎఫ్ఐఆర్ నమోదుతో చార్జ్ షీట్ పంపాలని తెలిపారు. తక్షణమే సంబంధిత మండలాల నుంచి నివేదిక పంపాలని కలెక్టర్ ఆదేశించారు. ఈ సమావేశంలో జిల్లా రెవిన్యూ అధికారి జి గంగాధర్ గౌడ్, సిపిఒ కె శ్రీనివాసరావు, డి ఆర్ డి ఎఫ్ సి డి శ్రీనివాస్, వివిధ శాఖల జిల్లా అధికారులు, మండల ప్రత్యేక అధికారులు, ఎండిఓ లు, తహసిల్దార్లు, తదితరులు పాల్గొన్నారు.

# ఉగ్రమూకల దాడి హేయమైన చర్య : ఎమ్మెల్యే డాక్టర్ అరవిందబాబు



**నరసరావుపేట, ఏప్రిల్ 23 ప్రభాతవార్త :** కాశ్మీర్‌లో పర్యాటకులపై ఉగ్ర మూకలు చేసిన దాడి హేయమైన చర్యగా ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవిందబాబు బుధవారం అన్నారు. స్దానిక పార్టీ కార్యాలయంలో వారు మాట్లాడుతూ బాధిత కుటుంబాలకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. కాశ్మీర్‌లోని బైసరన్, పహల్గామ్, అనంత్‌నాగ్‌లలో అమాయక పర్యాటకులు, స్దానికులపై ఉగ్రవాదులు దాడికి దిగాటం దారుణంగా ఉందన్నారు. దాడిని తీవ్రంగా ఖండిస్తున్నట్లు తెలిపారు. 26మందిని పొట్టన పెట్టుకున్న వారికి కనీసం మానవత్వంలేదన్నారు. కాశ్మీర్ ఆతిధ్యం, భారతజాతి స్ఫూర్తిని దెబ్బతీసేవిధంగా ఈ సంఘటన ఉందన్నారు. ప్రాణాలతో బైటపడి తీవ్ర గాయాలతో చికిత్స పొందుతున్న వారు త్వరగా కోలుకోవాలని ఎమ్మెల్యే అకాంక్షించారు. దాడి చేసిన వారితో పాటు కుట్ర వెనుక ఉన్న వారినితక్షణమే అరెస్ట్ చేసి కఠినంగా శిక్షించాలని ఎమ్మెల్యే డాక్టర్ అరవిందబాబు కేంద్రప్రభుత్వానికి విజ్ఞప్తి చేసారు.

# కొత్త కొత్త ఆలోచనలు..సరికొత్త ఆవిష్కరణలు

## - ఎస్ఆర్ఎంలో ఆకట్టుకున్న ఈసీఈ ఓపెన్ హౌస్ - సృజనాత్మక ప్రాజెక్టులతో పోటీపడ్డ విద్యార్థులు


**మంగళగిరి, ఏప్రిల్ 23, ప్రభాతవార్త :** ఎస్ఆర్ఎం యూనివర్సిటీ ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్స్ విభాగం ఆధ్వర్యంలో బుధవారం అబ్దుల్ కలామ్ ఆడిటోరియంలో ఓపెన్ హౌస్ డేభిను నిర్వహించారు. యూనివర్సిటీకి చెందిన ఇంజినీరింగ్



విద్యార్థులు, రీసెర్చ్ స్కాలర్లు, ఫ్యాకల్టీలు తమ ప్రాజెక్టులతో హౌస్ లోపాల్గొన్నారు. విద్యార్థుల నుంచి 150 పైగా పరిశోధక ప్రాజెక్టులు, ఫ్యాకల్టీల నుంచి మూడు నూతన అంకుర ప్రాజెక్టులు పోటీ పడ్డాయి. యూనివర్సిటీ ప్రో వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ సిహెచ్ సతీష్ కుమార్ ప్రదర్శనను ప్రారంభించారు. విద్యార్థుల్లో నూతన సృజనలకు ప్రాణం పోయడమే కాకుండా కొత్త కొత్త ఆవిష్కరణలకు ఈ తరహా కార్యక్రమాలు ఎంతగానో ఉపయోగపడతాయని ప్రొఫెసర్ సతీష్ కుమార్ అభిప్రాయపడ్డారు. ఈ సందర్భంగా విద్యార్థులు, ప్రొఫెసర్లు ఏర్పాటు చేసిన టెక్నాలజీ ప్రాజెక్టుల దగ్గరకు వెళ్లి వివరాలను తెలుసుకున్నారు. వీ ఎల్ ఎస్ ఐ, ఎంబెడెడ్ సిస్టమ్స్, బయోమెడికల్ సిగ్నల్ ప్రాసెసింగ్, ఇంటర్నెట్ ఆఫ్ థింగ్స్ సెక్టార్ల నుంచి విద్యార్థులు నూతన ప్రాజెక్టులు తయారు చేసి వాటి వివరాలను వెల్లడించారు. ప్రధానంగా డ్రోన్, సెన్సార్, సోలార్ పవర్ టెక్నాలజీలతో రూపొందించిన పలుప్రాజెక్టులువిశేషంగా ఆకట్టుకున్నాయి.నూతన ప్రాజెక్టులతో కొత్త ఆవిష్కరణలకు శ్రీకారం చుట్టిన విద్యార్థులు పూజారి శ్రీసాయి మణికంఠ, అజిత్ కుమార్ (అటానమస్ డ్రోన్ డెలివరీ సిస్టమ్), సేడ్ జాబ్ గెలెజా (రోబోటిక్స్ అండ్ బయోనిక్స్), జల్లేపల్లి భనేష్ కుమార్ షేక్ సాయితే జమీన్, పొందల వెంకట రమణమూర్తిలతో పాటు పలువురు ఎంటెక్ విద్యార్థులకు ప్రశంసాపత్రాలు, బహుమతులను అందజేశారు. ఈ కార్యక్రమంలో పరువురు పారిశ్రామిక రంగ నిపుణులతో పాటు రిజిస్ట్రార్ డాక్టర్ ప్రేమ్ కుమార్, డీన్ సీవీ టామి, ఈసీఈ హెడ్ డాక్టర్ కేపీ సునీత, డైరెక్టర్ అనూప్ సూర్యవంకి ప్రొఫెసర్లు వడ్డి రమేష్, సుజిత్ కల్లూరి, డాక్టర్ ప్రద్యుత్, డాక్టర్ శివశంకర్. తదితరులు పాల్గొన్నారు.

# పది ఫలితాల్లో ఫాతిమా విద్యానికేతన్ విద్యార్థుల విజయఢంకా

**రెంటచింతల, ఏప్రిల్ 23 ప్రభాతవార్త:** పదో తరగతి పరీక్ష ఫలితాల్లో మండలంలోని ప్రైవేటు పాఠశాలలు ఎప్పటిలాగే మెరుగైన ఫలితాలు సాధించగా, ప్రభుత్వ పాఠశాలలు కూడా మంచి ఉత్తీర్ణత సాధించాయి. అయితే ఎయిడెడ్ పాఠశాలల్లో ఉత్తీర్ణత రాణింపు తగ్గడం గమనార్హం. ముఖ్యంగా సెయింట్ జోసెఫ్ ఉన్నత పాఠశాల ఉత్తీర్ణత 56.83 శాతంగా తగ్గగా,





వైఆర్ఎస్ పాఠశాల ఉత్తీర్ణత శాతం గతంలో కంటే మెరుగ్గా 83.33 శాతంగా ఉండటం ఊరట కలిగించింది. ప్రైవేటు పాఠశాలలో మండలం ఫస్ట్, ద్వితీయ, తృతీయ స్థానాలు ఫాతిమా విద్యానికేతన్ విద్యార్థులు కైవసం చేసుకున్నారు. బి.గీతఅఖిల్‌రెడ్డి 593 మార్కులతో ప్రథమం, ఎం.మల్లికార్జుననాయక్ 592 మార్కులతో ద్వితీయ, కోట అనిత 591 మార్కులతో తృతీయస్థానంలో విజయఢంకా మోగించారు. అలాగే ప్రభుత్వ పాఠశాలల్లో మండలం ఫస్ట్ ఏపీటీడబ్ల్యూఆర్ఎస్ విద్యార్థి కె.సంపత్ నాయక్ 573 మార్కులతో తృతీయస్థానంలో విజయఢంకా మోగించారు. అలాగే ప్రభుత్వ పాఠశాలల్లో మండలం ఫస్ట్ ఏపీటీడబ్ల్యూఆర్ఎస్ విద్యార్థి కె.సంపత్‌నాయక్ 573 మార్కులతో, ఏపీ మోడల్ స్కూల్ జెట్టిపాలెం విద్యార్థిని పి.హారిక 570 మార్కులతో ద్వితీయ, డి.అనురాధ సెయింట్ జోసెఫ్ హైస్కూల్ విద్యార్థిని 550 మార్కులతో తృతీయస్థానం సాధించారు. ఈ సారి ప్రభుత్వ పాఠశాలలు పదో తరగతి ఫలితాల్లో మంచి ఉత్తీర్ణత సాధించగా ఏపీటీడబ్ల్యూఆర్ఎస్ విద్యార్థి కె.సంపత్‌నాయక్ 573 మార్కులతో రాణించడమే కాక, ఏకంగా జిల్లాలోని 12 గిరిజన సంక్షేమ పాఠశాలల కంటే ప్రథమంగా నిలవడం విశేషం. విద్యార్థి సంపత్‌నాయక్‌ను ఈ సందర్భంగా ప్రిన్సిపల్ ఎస్.మోహన్ అభినందించారు. ప్రభుత్వ పాఠశాలలో ఉత్తీర్ణత శాతం ఇలా ఉంది. తుమ్మకోట జడ్పీ పాఠశాల 75 శాతం, పాలువాయి జడ్పీ పాఠశాల 60.87 శాతం, రెంటాల 92 శాతం, ఏపీ మోడల్ స్కూల్ 79.49, కస్తూరిబాలో 91.89, ఏపీటీడబ్ల్యూఆర్ఎస్ 88.89, సెయింట్ జోసెఫ్ 56.83, వైఆర్ఎస్ పాఠశాల 83.33, లూథరన్ బాలికల పాఠశాలలు తప్ప మిగిలిన అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో 500 పైగా మార్కులు సాధించిన విద్యార్థులు ఉన్నారు. అలాగే ప్రైవేటు పాఠశాలల్లో ఫాతిమా విద్యానికేతన్, బాలవికాస్, ఆల్‌ఫోర్స్ పాఠశాలలు నూటికి నూరు శాతం ఉత్తీర్ణత సాధించగా రామకృష్ణ గురుకులం 91.38 శాతం, వివేక 96.67, సెయింటాన్స్ 74.19 శాతం ఉత్తీర్ణతతో ముందున్నాయి.

# సాతులూరులో మంజునాథ ఫిల్లింగ్ స్టేషన్‌ను ప్రారంభించిన ఎమ్మెల్యే ప్రత్తిపాటి

**నాదెండ్ల,ఏప్రిల్23,ప్రభాతవార్త:**మండలంలోని సాతులూరు గ్రామంలో బుధవారం ఐనవోలు బ్రదర్స్ ఆధ్వర్యంలో నూతనంగా ఏర్పాటుచేసిన మంజునాథ ఫిల్లింగ్ స్టేషన్‌ను మాజీమంత్రి, స్దానిక శానససభ్యుడు ప్రత్తిపాటి పుల్లారావు ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో నరసరావుపేట శాసన సభ్యులు చదలవాడ అరవిందబాబు, గోల్కొండ గ్రూప్స్ యండి నడికట్టు రామిరెడ్డి,మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు బండారుపల్లి సత్యనారాయణ, కందుల రమణ, గట్టినేని రమేష్ మరియు మండలపార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# శ్రీనివాష హోమ్స్ భూమిపూజ కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే ప్రత్తిపాటి

**చిలకలూరిపేట,ఏప్రిల్23,ప్రభాతవార్త:** పట్టణంలోని కరెంట్‌ఆఫీస్ రోడ్డులో గల యంవి నారాయణపురంలో ఉప్పుటూరి ప్రసాద్, కటకం శివరాంప్రసాద్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న శ్రీ వాసవీ విఘ్నేశ్వర ఇన్‌ఫ్రాస్టక్చర్ వారి శ్రీనివాస హోమ్స్ భూమి పూజ కార్యక్రమంలో బుధవారం మాజీమంత్రి, స్దానిక శాసనసభ్యులు ప్రత్తిపాటి పుల్లారావు ముఖ్య అతిధిగా పాల్గొన్నారు. అనంతరం శ్రీనివాస హోమ్స్ బ్రోచర్‌ను ప్రత్తిపాటి టిడిపి నాయకులతో కలసి ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు కందుల రమణ, గట్టినేని రమేష్, గట్టినేని సాయి, షేక్ బాజీ, మరియు వార్డు నాయకులు పాల్గొన్నారు.

# విస్తృతంగా మేకిండియా రీడ్‌మోర్

**విజయవాడ, ఏప్రిల్ 23, ప్రభాతవార్త :** ప్రపంచ పుస్తక దినాన్ని పురస్కరించుకుని మేకిండియా రీడ్‌మోర్ అనే మిషన్‌ను విస్తృతంగా నిర్వహిస్తున్నట్లు అమేజాన్ ఇండియా ప్రతినిథులు తెలిపారు. ప్రజాస్వామ్య లభ్యత, వినూత్నంగా గుర్తించడం వంటి భారతదేశపు పఠన సంస్కృతిని పెంచేలా సమగ్ర ప్రయత్నం తమనిబద్ధతను తెలుపుతుందన్నారు.

# ప్రమాదకరంగా విద్యుత్తు పోల్



నరసరావుపేట టౌన్, ఏప్రిల్ 23 ప్రభాతవార్త : పట్టణంలోని చౌదరి నగర్‌లో విద్యుత్ పోల్స్ ప్రమాదకరంగా మారాయి. త్రీ ఫేస్ విద్యుత్ సరాఫరా జరిగే విద్యుత్ స్తంభాల పరిస్దితి గురించి ఇప్పటికే తాము విద్యుత్‌శాఖ అధికారుల దృష్టికి పలుమార్లు తీసుకుని వెళ్లటం జరిగిందనిమాదిగ రిజర్వేషన్ పోరాట సమితి నాయకులు గుండాల ఆనంద్ తోపాటు స్దానికులు బుధవారం తెలిపారు. నిత్యం ఆటువైపు చిన్నారులు, పెద్దలు, పశువులు రాకపోకలు సాగిస్తారని అన్నారు. గాలి వానలు వచ్చే కాలంలో పూర్తిగా ఒరిగి పోతున్న విద్యుత్ స్తంభాలతో ఎదైన ప్రమాదం జరిగితే అందుకు పూర్తి బాధ్యత ఆ శాఖ అధికారులు వహించాల్సి ఉంటుందని ఈ సందర్భంగా స్దానికులు తెలిపారు.

# జనసేన పార్టీ కార్యాలయంలో పార్టీ పతాకం అవనతం

నరసరావుపేట టౌన్, ఏప్రిల్ 23 ప్రభాతవార్త : స్దానిక జనసేన పార్టీ కార్యాలయంలో బుధవారం పార్టీ పతాకాన్ని నియోజకవర్గ పార్టీఇన్‌ఛార్జి సయ్యద్ జిలాని అవనతం చేసారు. డిప్యూటీ సియం పవన్ కళ్యాణ్ ఆదేశాల మేరకు పతాకాన్ని అవనతం చేయటం జరిగిందన్నారు. కాశ్మీర్‌లో ఉగ్రవాదుల దాడిలో 25మంది వరకు ఆమాయకులు కనుమూయటం బాధకరమన్నారు. జనసేన పార్టీ ఆధ్వర్యంలోమూడు రోజుల పాటు చనిపోయిన కుటుంబాలకు సంతాపం తెలుపుతూ ప్రత్యేక సంతాప దినాలు నిర్వహిస్తామన్నారు. ఉగ్రవాదులను కఠినంగా శిక్షించాలని సయ్యద్ జిలాని కేంద్రప్రభుత్వాన్ని కోరారు. కార్యక్రమంలో పార్టీ పట్టణ అధ్యక్షులు జివిఎస్ ప్రసాద్, నాయకులుఅచ్చుల సాంబశివరావు తదితరులు పాల్గొన్నారు.

# డిజైన్ నౌ కాంపిటేషన్-2025 ఫైనల్‌కు ఎంపికైన ఎన్ఈసీ విద్యార్థులు

నరసరావుపేట, ఏప్రిల్ 23 ప్రభాతవార్త : స్దానిక నరసరావుపేట ఇంజనీరింగ్ కళాశాల విద్యార్దులు హర్షవర్దన్, ఆనందబాబు, కోటేశ్వరరావు,ఆజయ్‌కమార్‌లు జాతీయ స్దాయిలో నిర్వహించే



ఇండియా డిజైన్ వీక్-2025కాంపిటేషన్‌కు అర్హత సాధించారని కళాశాల కార్యదర్శి మిట్టపల్లిరమేష్ బుధవారం తెలిపారు. విద్యార్దులకు అభినందనల కార్యక్రమంలో వారు వివరాలు తెలిపారు. ఈనెల 24,25 తేదిలలో జాతీయ స్దాయిలో చైన్నైలో ఐటీటీ అకాడమీ ఆటో డెస్క్-ఫ్యూషన్ లో తమ విద్యార్దులు పాల్గొంటారని పేర్కొన్నారు. ఈపోటీలలో ఇండియా తరుపున 150కళాశాలల నుండి 50టీమ్‌ల వరకు పాల్గొనటం జరుగుతుందన్నారు. విద్యార్దులను కళాశాల కార్యదర్శి మిట్టపల్లి రమేష్‌తో పాటు వైస్ ఛైర్మన్‌మిట్టపల్లి చక్రవర్తి అభినందించారు.

# ఎఎమ్ రెడ్డి ఇంజనీరింగ్ కళాశాలలో ప్రాంగణ ఎంపికలు

**నరసరావుపేట టౌన్, ఏప్రిల్ 23 ప్రభాతవార్త :** ఎఎమ్ రెడ్డి ఇంజనీరింగ్ కళాశాలలో బుధవారం ప్రాంగణ ఎంపికలు నిర్వహించారు. హైదరాబాద్‌కు చెందిన ప్రముఖ ఐటీ సంస్ద ఆగ్నెస్ సాఫ్‌టెక్ ఆధ్వర్యంలో విద్యార్దులకు పరీక్షలు నిర్వహించారు. కళాశాల కార్యదర్శి వివరాలను తెలిపారు.సిఎస్ఈ, ఈసీఈ విభాగాల నుండి మొత్తం 50మంది విద్యార్దులు ఎంపికలలో పాల్గొన్నారు. వారిలో సంస్ద ప్రతినిధులు 15మందిని ఉద్యోగాలకు ఎంపిక చేసారు. ఎంపికైన వారికి వార్షిక వేతనం రూ.4లక్షల నుండి రూ.4.8లక్షల వేతనం అందుతుందని ప్రతినిధులు తెలిపారు. ఉద్యోగ అవకాశాలు సాధించిన విద్యార్దులను ఈ సందర్భంగా కళాశాల కార్యదర్శి అట్లూరి శాంతి శ్రీనివాసరెడ్డి అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ సిహెచ్ మల్లిఖార్జున్, ప్రిన్సిపాల్ కె కృష్ణారెడ్డి, డీన్ కిశోర్‌రెడ్డి పాల్గొన్నారు.

# పుస్తకాలు మానవ మనోవికాసానికి దోహదపడతాయి

**కర్లపాలెం,ఏప్రిల్23,ప్రభాతవార్త:** పుస్తకాలు విజ్ఞానానికి, మనోవికాసానికి దోహదపడతాయని కర్లపాలెం ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఇనకొల్లు పోలీసు రావు అన్నారు. బుధవారం



ప్రపంచ పుస్తక దినోత్సవ సందర్భంగా విద్యార్థులకు పుస్తకాల యొక్క ప్రాముఖ్యత, వాటి విలువ ను తెలియజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పుస్తకాలు మంచి మిత్రులని, విజ్ఞానాన్ని వినోదాన్ని కలిగించి మానవికాసానికి దోహదపడతాయని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆ పాఠశాల ఉపాధ్యాయులు ఎం ఇందుమతి, డిఎల్ ప్రసన్న లక్ష్మీ, బి .రాజేష్, విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు.

# ఉగ్రవాదుల దాడిలో ప్రాణాలు కోల్పోయిన వారికి జెడ్పిటిసి వేణుగోపాల్ రెడ్డి నివాళి



**కర్లపాలెం,ఏప్రిల్23,ప్రభాతవార్త:** ఉగ్రవాదులు జమ్మూ కాశ్మీర్లో అమాయకుల ప్రాణాలు తీయటాన్ని మాజీ సైనికుడు జడ్పిటిసి పిట్ల వేణుగోపాల్ రెడ్డి తీవ్రంగా ఖండించారు. ఇలాంటి పిరికిపంద చర్యలు బలమైన భారతదేశ ఐక్యతను, సమాన త్వాన్ని దెబ్బతీయ లేవన్నారు. దేశమంతా ఏకమై ఇలాంటి పిరికిపంద చర్యలను వ్యతిరే కించాలని, ఇలాంటి సమయంలో ఆ కుటుంబాలకు తన ప్రగాఢ సానుభూతిని తెలియజేస్తున్నట్లు ఆయన వివరించారు.


NATIONAL SEEDS CORPORATION LIMITED
(A Government of India Undertaking)
"An ISO 9001:2015 & ISO 14001:2015 Company"
REGIONAL OFFICE, 17-11, Tukaram Gate, Lalaguda, Secunderabad-500017.(TG) PH: 040 -27731152, 27730635
Mail ID- rm.secunderabad@indiaseeds.com

E-TENDER NOTICE FOR CUSTOM PROCESSING

E-Tenders are invited "FROM REPUTED AND EXPERIENCED CUSTOM PROCESSORS FOR FIXING RATE CONTRACT FOR CUSTOM PROCESSING, PACKING OF VARIOUS TYPES OF SEEDS PRODUCED DURING RABI 2024-25. The tender documents may be downloaded from NSC website www.indiaseeds.com or https://indiaseeds.enivida.com. The last date for submission of tender is 07.05.2025 at 03.00 P.M. and will be opened on same day at/after 03.30 P.M. The detailed terms and conditions can be seen from tender documents.
Any changes will be placed only on NSC web-site www.indiaseeds.com.

No. Engg 2(01)/Rabi-2024-25 /NSC: HYD/25-26
DATED: 23.04.2025
(GAJANAND SINGH)
REGIONAL MANAGER

# పదవ తరగతి ఫలితాల్లో సత్తాచాటిన ప్రభుత్వ పాఠశాల విద్యార్థులు

**యడ్లపాడు, ఏప్రిల్ 23, ప్రభాతవార్త :** పదవ తరగతి పరీక్ష ఫలితాలు బుధవారం విద్యాశాఖ వెల్లడించింది. 2024-25విద్యా సంవత్సరంలో పదో తరగతి పరీక్షలకు యడ్లపాడు మండల పరిధిలోని 11ప్రభుత్వ ఉన్నత పాఠశాలల నుండి 410మంది విద్యార్థులు పరీక్షలకు హాజరుకాగా ఇందులో 323మంది ఉత్తీర్ణతను సాధించారు. దీంతో 78.78శాతం ఉత్తీర్ణతను నమోదు చేసుకోవటం జరిగిందని ఎంఇవో నాగరత్నం తెలిపారు.

**పాఠశాలల వారీగా వివరాలు :** వంకాయలపాడు జెడ్పీ హైస్కూల్ 29పరీక్షలకు హాజరుకాగా ఇందులో 28మంది ఉత్తీర్ణత సాధించగా 97శాతం రావటం జరిగింది. లింగారావుపాలెం జెడ్పీ 46మంది హాజరుకాగా 43మంది ఉత్తీర్ణత సాధించారు. ఉత్తీర్ణతా శాతం 93.5శాతం, జగ్గాపురం జెడ్పీ 26మందికి 23మంది ఉత్తీర్ణత శాతం 88.5, సొలస జెడ్పీలో 35మందికి 30మంది ఉత్తీర్ణత 87శాతం, యడ్లపాడు జడ్పీ 37మందికి 29మంది ఉత్తీర్ణత 78.3శాతం, తిమ్మాపురం జడ్పీ 27మందికి 21మంది ఉత్తీర్ణత, ఉత్తీర్ణతా శాతం78, బోయపాలెం డాక్టర్ బిఆర్ అంబేద్కర్ గురుకులం 63మందికి 49 మంది ఉత్తీర్ణతకాగా ఉత్తీర్ణత 78శాతం, సందెపూడి జడ్పీ 15మందికి గాను 11మంది ఉత్తీర్ణత 73శాతం, ఉన్నవ జడ్పీ 103మందికిగాను 74మంది ఉత్తీర్ణత కాగా ఉత్తీర్ణతా శాతం 65, యడ్లపాడు లూథరన్ ఉన్నత పాఠశాల 12మందికి గాను 4గురు ఉత్తీర్ణత శాతం 33.33 సాధించాయి.

**విద్యార్థుల వివరాలు :** ఉన్నవ జెడ్పీ హైస్కూల్ విద్యార్థి కె జయలక్ష్మీ, బి ఫణీంద్రసాయి 566-600, లింగారావుపాలెం విద్యార్థి నక్కా మేఘన 565-600, బి యశ్విని, వి సంజన 563-600, సొలస జడ్పీ హైస్కూల్ విద్యార్థిని అలూరి గీతాశ్రీలక్ష్మీ 563-600, జగ్గాపురం జడ్పీ విద్యార్థిని టి జ్యోతిక 563-600.

**ప్రైవేట్ పాఠశాలలలో :** మండలంలో ఉన్న నాలుగు ప్రైవేటు ఉన్నత పాఠశాలలో యడ్లపాడు సెయింట్ అన్స్ స్కూల్ 28మందికిగాను 27మంది ఉత్తీర్ణత శాతం96.4, కొత్తపాలెం గ్రామంలోని శ్రీశ్రీరవిశంకర్ సేవ మందిరం స్కూల్ 16మందికి గాను 15మంది ఉత్తీర్ణత శాతం 93.75, యడ్లపాడు నారాయణ ఇంగ్లీష్ మీడియం స్కూల్ నుండి 74మందికి 69మంది ఉత్తీర్ణత శాతం 93.2, యడ్లపాడు సాయిచైతన్య స్కూల్ 10మందికి అందరూ విజయం ఉత్తీర్ణత నూరు శాతం. విద్యార్థులు కొత్తపాలెం శ్రీరవిశంకర్ సేవా మందిర విద్యార్థి షేక్ అఖిల్ 577-600, యడ్లపాడు సెయింట్ అన్స్ ఇంగ్లీష్ మీడియం నర్రా దేవిశ్రీ 571-600, యడ్లపాడు నారాయణ ఇంగ్లీష్ మీడియం అతో_ట శ్యాం ప్రసాద్ 569-600, ప్రభుత్వ ప్రైవేటు పాఠశాలల్లో పదో తరగతి పరీక్ష ఫలితాలు నందు అత్యధిక మార్కులను, అలాగే పాఠశాలల ఉత్తీర్ణత శాతం అధికంగా సాధించిన, ఉత్తమ ఫలితాలను సాధించేందుకు కృషిచేసిన పాఠశాలల హెచ్ఎంలు, ఉపాధ్యాయులకు యడ్లపాడు ఎంఈవో 1-2 ఎంఈవో నాగరత్నకుమారి, అరుణకుమారిలు అభినందనలు తెలిపారు.







# సెయింట్ లారెన్స్ హైస్కూల్ విద్యార్థుల ప్రతిభ

**గుంటూరు విద్య,ఏప్రిల్ 23,(ప్రభాతవార్త :** స్థానిక ఆర్టీసి కాలనీలోని సెయింట్ లారెల్స్ ఇంగ్లీషు మీడియం హైస్కూల్ విద్యార్థులు 10వ తరగతి ఫలితాల్లో అద్భుత ప్రతిభ చాటారని,టాప్ మార్కులు సాధించారని హైస్కూల్ కరస్పాండెంట్ మేకల రవీంద్రబాబు పేర్కొన్నారు.పి.షఫీయా 589 మార్కులు సాధించి స్కూల్ టాపర్గా నిలిచారని పేర్కొన్నారు.డి.సుజాత 587, ఎ.శ్రీహర్ష 587, ఫిజా జమీర్బేగ్ 585, షేక్ షీగుఫతా ఫాతిమా 581, షేక్ సోనియా 581, కె.జశ్రీ 575,షేక్ కరీమున్నీసా 575, వి.భాను సాకేత్ 570 మార్కులు సాధించి విజయకేతనం ఎగురవేశారని రవీంద్రబాబు వెల్లడించారు.ఈ సందర్భంగా ఆయా టాపర్లను అభినందించారు.




# పల్నాడు జిల్లా 2వర్యాంకు సాధించిన మాచర్ల ప్రభుత్వ పాఠశాల విద్యార్థిని

**మాచర్ల, ఏప్రిల్ 23 ప్రభాతవార్త:** పదో తరగతి పరీక్షా ఫలితాల్లో జడ్పీ బాలికోన్నత పాఠశాలకు చెందిన విద్యార్థిని షేక్ సమీరా 596 మార్కులతో పట్టణంలో మొదటి ర్యాంకు, జిల్లాలో రెండో ర్యాంకు, స్టేట్ 3వ ర్యాంకు సాధించినట్లు ఎంఈఓ అల్లి సురేష్, పాఠశాల హెచ్ఎం షేక్ సకీనా తెలిపారు. ఈ సందర్భంగా విద్యార్థిని సమీరాను బుధవారం ఘనంగా అభినందించారు. ఎంఈఓ అల్లి సురేష్ మాట్లాడుతూ కార్పొరేట్ పాఠశాలలకు ధీటుగా ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు అత్యుత్తమ మార్కులు సాధించడం సంతోషకరమన్నారు. ఏకాగ్రతతో విద్యనభ్యసిస్తే ఊహించని ఫలితాలు సాధ్యమేనన్నారు. అనంతరం 596 మార్కులు సాధించిన సమీరాను అభినందించారు. అదేవిధంగా పి.సంజన 586, ఎస్.ధరణి 581, కె.సుధీష్ణ 581 సాధించినట్లు తెలిపారు. ఉత్తమ ఫలితాలను సాధించి జిల్లా స్థాయిలో గుర్తింపు తెచ్చిన పాఠశాల ఉపాధ్యాయుల కృషిని ఆయన అభినందంచారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు ఆయేషా, బాలనాగమ్మ, కృష్ణారెడ్డి, ప్రసాద్, నాగరాజు, ఉషా, కోటేశ్వరమ్మ, మాలిక, రత్నకుమారి తదితరులు పాల్గొన్నారు.



# టెన్త్ ఫలితాల్లో విజయ పరంపర మోగించిన గీతాంజలి హైస్కూల్

**గుంటూరు విద్య,ఏప్రిల్ 23,(ప్రభాతవార్త :** పదో తరగతి పరీక్షా ఫలితాలు ఏటి ఆగ్రహారంలోని రామిరెడ్డినగర్ గీతాంజలి హైస్కూల్ విద్యార్థులు విజయ పరంపర మోగించారని స్కూల్ డైరెక్టర్ షేక్ హుస్సేన్ తెలిపారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తమ విద్యార్థి షేక్ అబ్దుల్ కరీం 589మార్కులు, షేక్ జానీ భాష 582,సిహెచ్ మేఘన 568,బి.దుర్గా 565,కె.హర్షిణి 543 మార్కులు 500కి పైగా మార్కులు 13మంది విద్యార్థుల సాధించారని నూరుశాతం విద్యార్థులు ఉత్తీర్ణత సాధించారని తెలిపారు.అంతేకాకుండా మ్యాథమెటిక్స్,సైన్స్లో వందకు వంద మార్కులు సాధించాలని ఇంతటి విజయాన్ని సాధించడానికి కృషిచేసిన ఉపాధ్యాయులకు బాగా కష్టపడి చదివి మంచి మార్కులు సాధించిన విద్యార్థిని విద్యార్థులకు అభినందనలు తెలిపారు.ఈ కార్యక్రమంలో స్కూల్ హెచ్ఎం షేక్.షాంషాద్ భాను ఉపాధ్యాయులు గురుమూర్తి,రాజగోపాల్ విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు.



# నాదెండ్ల మండలంలో ఎస్ఎస్సి పరీక్షలలో ప్రథమస్థానం సాధించిన తూబాడు హైస్కూల్ విద్యార్థిని ప్రత్తిపాటి అమూల్య

**నాదెండ్ల,ఏప్రిల్23,(ప్రభాతవార్త):** మండలంలో నేడు ప్రకటించిన ఎస్ఎస్సి పరీక్షలలో తూబాడు జిల్లా పరిషత్ హైస్కూల్కు చెందిన విద్యార్థిని ప్రత్తిపాటి అమూల్య 600 మార్కులకుగాను 593 మార్కులు సాధించి మండలంలో ప్రథమంగా నిలిచింది. అదేవిధంగా సాతులూరు ఈశరం పాఠశాలకు చెందిన విద్యార్థిని షేక్ షాహీరా 588 మార్కులు సాధించి ద్వితీయస్థానంలో నిలిచింది. అదేవిధంగా ఎస్ఎస్సి ఉత్తీర్ణత శాతంలో నాదెండ్ల కస్తూరాబా గాంధీ విద్యాలయం, చిరుమామిళ్ల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, ప్రైవేటు పాఠశాలల విభాగంలో నాదెండ్ల శ్రీ సాయి ఇంగ్లీష్మీడియం స్కూల్ 100శాతం ఉత్తీర్ణత సాధించాయి.




# 10లో 586 మార్కులు సాధించిన పసుమర్రు హైస్కూల్ విద్యార్థిని పార్వతి

**చిలకలూరిపేట,ఏప్రిల్23,(ప్రభాతవార్త):** పసుమర్రు మద్దిరామయ్య జిల్లా పరిషత్ హైస్కూల్ విద్యార్థులు నేడు ప్రకటించిన 10వతరగతి పరీక్షలలో నార్నెపాటి పార్వతి 600 మార్కులకుగాను 586 మార్కులు సాధించి పాఠశాలలో ప్రథమంగా నిలిచారు. అదేవిధంగా పఠాన్ మహ్మద్ అల్తాఫ్ 585 మార్కులు సాధించి పాఠశాలలో ద్వితీయస్థానంలో నిలిచారు. కాగా ఈ విద్యార్థులను బుధవారం పాఠశాలలో జరిగిన సమావేశంలో ప్రధానోపాధ్యాయులు వై హనుమంతురావు, స్కూల్ మేనేజ్మెంట్ కమిటి చైర్మన్ కోట సుదర్శనరావు, వైస్ చైర్మన్ షేక్ గౌసియా, పూర్వ విద్యార్థి సంఘం ప్రతినిధి గద్దె హరిబాబు, పాఠశాల ఉపాధ్యాయులు షేక్ యాసిన్,ఉపాధ్యాయేతర సిబ్బంది అభినందనలు తెలియచేశారు.



# ఎస్ఎస్సి పరీక్షలలో నియోజకవర్గం పరిధిలో మొదటి 3ర్యాంకులు సాధించిన వికాస్ ఐఐటి విద్యార్థులు

**చిలకలూరిపేట,ఏప్రిల్23,(ప్రభాతవార్త):** ఎస్ఎస్సి పరీక్షా ఫలితాలలో వికాస్స్కూల్స్ చెందిన ఐఐటి విద్యార్థులు సింగు ఇందుశ్రీ 600 మార్కులకుగాను 595 సాధించి నియోజకవర్గ పరిధిలో ప్రథమంగా నిలిచారు. అదే విధంగా పి బాలత్రిపుర 594 మార్కులు సాధించి ద్వితీయ స్థానాన్ని సాధించింది. కాగా ఈ పాఠశాలకు చెందిన 7గురు విద్యార్థిని, విద్యార్థులు 590కి పైగా మార్కులు సాధించారు. 580కి పైన 12మంది విద్యార్థులు, 570కి పైన 29మంది విద్యార్థులు, 560కి పైన 30మంది విద్యార్థులు, 550కి పైన 49మంది విద్యార్థులు, 500కి పైన 74మంది ర్యాంకులు సాధించారు. మాథ్స్ సబ్జెక్ట్లో 100కు 100 మార్కులు 38మంది విద్యార్థులు సాధించారు. సైన్స్ సబ్జెక్ట్లో 12మంది 100కి 100 మార్కులు సాధించారు. సోషల్ సబ్జెక్ట్లో 100కి 100మార్కులు 6గురు విద్యార్థులు సాధించారు. తెలుగు సబ్జెక్ట్లో 12మంది విద్యార్థులు 100కి 100 మార్కులు సాధించారు. హిందీ సబ్జెక్ట్లో 3గురు విద్యార్థులు 100కి 100 మార్కులు సాధించారు. కాగా ఈ ర్యాంకులు సాధించిన విద్యార్థిని, విద్యార్థులందరిని బుధవారం వికాస్ పాఠశాలలో జరిగిన సమావేశంలోపాఠశాల డైరక్టర్లు దండా పవన్ కుమార్, దండా రోజశ్రీ,పాఠశాల ఉపాధ్యాయుని, ఉపాధ్యాయులు అభినందించారు.





# 10ఫలితాల్లో జైన్ హైస్కూల్ విద్యార్థుల విజయభేరి

**గుంటూరు విద్య,ఏప్రిల్ 23,(ప్రభాతవార్త) :** 2024-25 విద్యా సంవత్సరంలో 10వ తరగతి పబ్లిక్ పరీక్ష ఫలితాల్లో జైన్ హైస్కూల్ విద్యార్థులు



విజయభేరి మోగించి గుంటూరు నగరంలో మరోసారి సత్తా చాటారని జైన్ హైస్కూల్ డైరెక్టర్ డాక్టర్ మహ్మద్ మున్ను సంతోషం వ్యక్తం చేశారు.బుధవారం వెలువబడిన 10ఫలితాల్లో అద్భుత ఫలితాలు సాధించిన సందర్భంగా జైన్ హై స్కూల్ ఆవరణలో విద్యార్థులు బాణాసంచా కాల్చి మిఠాయిలు పంచుకుంటూ సంబరాలు నిర్వహించారు.ఈ సందర్భంగా డాక్టర్ మహ్మద్ మున్ను మాట్లాడుతూ తమ స్కూల్ విద్యార్థులు గుంటూరు వెంకట కావ్య 574మార్కులు,మహ్మద్ జోహార నుసరత్ 574, షేక్ సాఫియా ముస్కాన్ 571, షేక్ ఫైజాన్ 571,కుర నాగ వెంకట జస్వంత్ 568,గూడె శ్రీజ 565,షేక్ సోహెల్ 557మార్కులు సాధించి ఇంకా అత్యధిక సంఖ్యలో 500కి పైగా మార్కులతో ఉత్తీర్ణత సాధించి తమ ప్రతిభను చాటుకున్నారు.97శాతానికి పైగా మార్కులు సాధించి ఆల్టైమ్ రికార్డు సృష్టించారని డాక్టర్ మున్ను హర్షం వ్యక్తంచేశారు.అతి సాధారణ విద్యార్థులతో అసాధారణ ఫలితాలు సాధించి గుంటూరు నగరానికి తలమానికంగా నిలిచామని చెప్పారు.రానున్న కాలంలో మరిన్ని అద్భుత ఫలితాలు సాధించి రాష్ట్రస్థాయిలో ప్రతిభను చాటుతారని ఆయన చెప్పారు.కార్యక్రమంలో జైన్ హైస్కూల్ ప్రిన్సిపాల్ కనకదుర్గ,ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు,విద్యార్థులు పాల్గొన్నారు.


# పదవ తరగతి పరీక్షలలో శ్రీకృష్ణ చైతన్య మోడల్ స్కూల్ విద్యార్థులకు అత్యుత్తమ మార్కులు

**నరసరావుపేట, ఏప్రిల్ 23 ప్రభాతవార్త :** పదవ తరగతి పరీక్ష ఫలితాలలో స్థానిక శ్రీ కృష్ణ చైతన్య మోడల్ స్కూల్ విద్యార్థులు అత్యుత్తమ మార్కులు సాధించారు. వివరాలను విద్యాసంస్థల చైర్మన్ కొల్లి బ్రహ్మయ్య బుధవారం తెలిపారు. తమ విద్యార్థులు సంచలన విజయాలు నమోదు చేసారని పేర్కొన్నారు. 600 మార్కులకు అత్యధికంగా తమ విద్యార్థిని సుప్రజ 580 మార్కులు సాధించి ప్రథమ స్థానంలో నిలిచిందని తెలిపారు.అదే విధంగా శ్రావణి 576, మహర్షి 573, అనిల్ కుమార్ 569, కీర్తన 568 మార్కులు సాధించారని పేర్కొన్నారు. 500కు పైగా మార్కులు 14మంది విద్యార్థులు సాధించటం జరిగిందన్నారు. అద్భుతమైన మార్కులు సాధించిన విద్యార్థులకు వారి తల్లిదండ్రులకు కృషి చేసిన ఉపాధ్యాయులకు చైర్మన్ కొల్లి బ్రహ్మయ్య అభినందనలు తెలిపారు.



# ఎస్ఎస్సి 2024-25 ఫలితాల్లో బాసర విద్యార్థుల ప్రభంజనం

**గుంటూరు విద్య,ఏప్రిల్ 23,(ప్రభాతవార్త :** ఎస్ఎస్సి 2024-25 ఫలితాల్లో గుంటూరు



బాసర కాన్సెప్ట్ స్కూల్ విద్యార్థినీ,విదా ్యర్థులు అత్యుత్తమ ప్రతిభ కనబరిచారని బాసర విద్యాసంస్థల చైర్మన్ సాధినేని మురళీమోహన్ రావు తెలిపారు.మీడియా సమావేశంలో బాసర విద్యాసంస్థల చైర్మన్ సాదినేని మురళీమోహన్రావు మాట్లాడుతూ అత్యుత్తమ ర్యాంకులు సాధించిన విద్యార్థుల వివరాలు వెల్లడించారు.ఎస్కె సాదికా 577మార్కులు,జి.త్రివేణి 573, బి.స ్మృతి 572, బి.అనుష్కా 570మార్కులు, పరీక్షకు హాజరైన విద్యార్థుల్లో 50శాతం మంది విద్యార్థులు 500కి పైగా మార్కులు సాధించి నూటికి 99శాతం మంది ఉత్తీరు ్ణలయ్యారని బాసర్ కాన్సెప్ట్ స్కూల్ చైర్మన్ సాధినేని మురళీమోహన్ రావు తెలిపారు.ఇంతటి ఘన విజయానికి తోడ్పడిన విద్యార్థులకు,వారి తల్లిదండ్రులకు, ఉపాధ్యాయులకు,ఉపాధ్యాయేతర సిబ్బందికి బాసర విద్యాసంస్థల చైర్మన్ సాధినేని మురళీమోహన్, డైరెక్టర్ సాదినేని రాధా, కె.రాంబాబు,ప్రిన్సిపాల్స్ ఆర్.అఫ్రీమ్ ,బి.శ్రీలక్ష్మీ ,సిహెచ్ అప్పిరెడ్డి అభినందనలు తెలిపారు.

# 10లో కర్లపాలెం మండలంలో మిశ్రమ ఫలితాలు

**కర్లపాలెం,ఏప్రిల్23,(ప్రభాతవార్త:** పదవ తరగతి ఫలితాల్లో కర్లపాలెం మండలం నుంచి మిశ్రమ ఫలితాలు వచ్చాయి. మండలంలో మొత్తం 359 మంది విద్యార్థులు పరీక్షలు రాయగా 246 మంది ఉత్తీర్ణత సాధించారు. 68.52 శాతం ఉత్తీర్ణత నమోదయింది. యాజలి 59 పరీక్షలు రాయగా 44 మంది, కర్లపాలెం బోర్డ్ స్కూల్ 25 మంది రాయిగా 17 మంది,చింతయపాలెం 45 మంది రాయిగా 29 మంది,ఎంవి రాజుపాలెం 32 మంది రాయిగా 17 మంది,గనపవరం 39 మంది రాయిగా 27 మంది, పెదగోల్లపాలెం 17 మంది రాయిగా 10 మంది, పేరలి 58 మంది రాయిగా 24 మంది, ప్రైవేటు పాఠశాలలైన కెపి స్కూల్ 35 మంది రాయిగా 33 మంది, హైవేండ్ పాఠశాల 14 మంది రాయిగా 14 మంది, శ్రీ భార్గవి హై స్కూల్లో 35 మంది రాయిగా 31 మంది ఉత్తీర్ణులైయ్యారు. మొత్తం మీద మండలంలో కేవలం ఒక్క స్కూల్ మాత్రమే నూటికి నూరు శాతం ఉత్తీర్ణత సాధించింది. కర్లపాలెం మండలంలోని 7 ప్రభుత్వ పాఠశాలల నుంచి మొత్తం 275 మంది విద్యార్థులు పది పరీక్షలు రాయగా, 240మంది ఉత్తీర్ణులైయ్యారు. వీటిలో మండలం ప్రథమ స్థానం సాధించిన ప్రవేటు పాఠశాల వారికి, ప్రభుత్వ పాఠశాల వారికి కేవలం 8 మార్కుల వ్యత్యాసం మాత్రమే. ఈ ఏడాది ప్రభుత్వ పాఠశాలలు ఉత్తమ ఫలితాలు సాధించాయి. కర్లపాలెం మండల ప్రథమ స్థానం సాధించిన గణపవరం లంకపల్లి కి చెందిన గరికపాటి మహాలతు.600కి 585 మార్కులు సాధించారు. మరో విద్యార్థి ఎస్ డి ఆల్ థాప్ 585 మార్కులు సాధించి మండలంలో ప్రథమ స్థానంలో నిలిచారు. ప్రభుత్వ పాఠశాలలో పేరలి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన లావణ్య 577 మార్కులు సాధించారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఉపాధ్యాయులు లావణ్యను ప్రత్యేకంగా అభినందించారు.






# ప్రభుత్వ పాఠశాలల్లో 77శాతం ఉత్తీర్ణత

## -ఎంఈవో డాక్టర్ లక్ష్మీనారాయణ

**తెనాలి, ఏప్రిల్ 23, (ప్రభాతవార్త) :** పదవ తరగతి పబ్లిక్ పరీక్ష ఫలితాల్లో 77శాతం విద్యార్థిని, విద్యార్థులు ఉత్తీర్ణులయ్యారని విద్యార్థులు పదవ తరగతి పబ్లిక్ పరీక్ష ఫలితాల్లో 85శాతంపైగా ఉత్తీర్ణులయ్యారని ఇన్చార్జి హెచ్ఎం నాగమ్మ తెలియజేశారు.





ఎంఈవో డాక్టర్ లక్ష్మీనారాయణ పేర్కొన్నారు. పట్టణంలోని దొడ్డపనేని ఇందిర బాలికోన్నత హైస్కూల్ విద్యార్థిని ఉన్నిసుజాహో 600మార్కులకు గాను 591మార్కులు సాధించి పట్టణంలో ప్రథమ స్థానంలో నిలిచిందని ఆయన తెలియజేశారు. ఇన్చార్జి హెచ్ఎం నాగమ్మ ఆధ్వర్యంలో 550మరియు 500పైన మార్కులు సాధించిన విద్యార్థిని, విద్యార్థులను ఎంఈవోతో పాటుగా అధ్యాపకులు ఘనంగా అభినందించారు. అదే విధంగా గర్ల్స్ హైస్కూల్ విద్యార్థిని పట్టణంలో ద్వితీయ స్థానంలో ఎన్ఎస్ఎస్ఎం హైస్కూల్ విద్యార్థిని లక్ష్మీ మాధురి, ఎస్కే ఫరీద్ 600మార్కులు గాను 583, 578మార్కులు సాధించారని, ఇంకా పనులు చేతన విద్యార్థులు అత్యుత్తమ మార్కులు సాధించారని, ఎన్ఎస్ఎస్ఎం హెచ్ హైస్కూల్ హెచ్ఎం తెలిపారు. ఈ సందర్భంగా పదవ తరగతి పరీక్ష ఫలితాలలో అత్యుత్తమ మార్కులను సాధించిన విద్యార్థిని విద్యార్థులను స్కూల్ ప్రధానోపాధ్యాయులు ఘనంగా సత్కరించారు.

# పదో తరగతి ఫలితాల్లో కన్నా విద్యార్థుల ప్రతిభ

**గుంటూరు విద్య,ఏప్రిల్ 23,(ప్రభాతవార్త :** పదో తరగతి పరీక్షా ఫలితాల్లో కన్నా విద్యాసంస్థల విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించారని కన్నా విద్యాసంస్థల డైరెక్టర్ కన్నా మాస్టారు తెలిపారు.ె ఽ.మనస్విని 588, ఎస్పి అమృతవర్ధన్ 584, డి.జ్ఞానేశ్వరీ 583,హెచ్ మనోజ్ 580 మార్కులతో పాటు మొత్తం 56 మంది విద్యార్థినీ విద్యార్థులు 500కి పైగా మార్కులు సాధించివిజయకేతనం ఎగురవేశారని తెలియజేస్తూ వారందర్ని అభినందించారు.కన్నా స్కూల్లో పాఠశాల స్థాయినుంచే విద్యార్థులు ఐఐటిలతో పాటు మెడిసిన్లో సీట్లు సాదించే స్థాయిలో బోధన అందిస్తున్నామని తెలిపారు.



# టెన్త్ ఫలితాల్లో సుమేధ హైస్కూల్ విద్యార్థుల అద్భుత ప్రతిభ

**గుంటూరు విద్య,ఏప్రిల్ 23,(ప్రభాతవార్త :** ఎస్ఎస్సి 2025 ఫలితాల్లో మా సుమేధా హైస్కూల్ విద్యార్థులు అత్యుత్తమ సాదనచేసిన విద్యా సంస్థకు గౌరవం తెచ్చారని స్కూల్ డైరెక్టర్ మున్నంగి చంద్రశేఖర్రెడ్డి తెలిపారు.టాపర్లుగా టి.వైష్ణవి,నాగ మనోహర్లు 575, టి.రామచరణ్,కె.బాల నవీన్,రేణుశ్రీ 574 మార్కులు సాధించారన్నారు.570మార్కులకు పైగా 7గురు విద్యార్థులు,550కి పైగా 16మంది,500మార్కులకు పైగా 37మంది,95మందిలో 81మంది ఫస్ట్క్లాస్ సాధించారని,ఈ సందర్భంగా సుమేధ విద్యాసంస్థల నిర్దేశకులు ఎం.చంద్రశేఖర్రెడ్డి,అందరూ టాపర్లను అభినందించారు. ఉపాధ్యాయులకు,విద్యార్థుల తల్లిదండ్రులకు ధన్యవాదాలు తెలిపారు.

# కొల్లిపర మండలంలో పదోతరగతిలో 87 శాతం ఉత్తీర్ణత

**కొల్లిపర,ఏప్రిల్ 23 ప్రభాతవార్త:** మండలంలో పదోతరగతి ఫలితాల్లో 87 శాతం ఉత్తీర్ణత అయినట్లు ఎంఈవో సాల్మన్రాజు తెలిపారు. బుధవారం మండల కేంద్రం కొల్లిపర విద్యాభవనంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఈ ఏడాది పదో తరగతి పరీక్షలలో మండలంలో 361 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరు కాగా వారిలో 315 మంది విద్యార్థులు ఉత్తీర్ణత సాధించారన్నారు.మండలంలోని వల్లభాపురం హైస్కూల్కు చెందిన టి.పూజితారెడ్డికి 591 మార్కులు కైవసం చేసుకుని మండలంలో ప్రథమ స్థానంలో నిలవగా,మున్నంగి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన సిహెచ్.జీవనా కు 587 మార్కులు సాధించి ద్వితీయ స్థానంలో నిలిచింది.ఎస్.సుచరిత 583 మార్కులు సాధించి మండలంలో తృతీయ స్థానంలో నిలిచిందని చెప్పారు.





# పల్నాడు జిల్లాలో ప్రథమస్థానం కారంపూడి బ్రహ్మానాయుడు పాఠశాల

**కారంపూడి, ఏప్రిల్ 23 ప్రభాతవార్త:** పదో తరగతి పరీక్షా ఫలితాల్లో పల్నాడు జిల్లాలో కారంపూడి బ్రహ్మానాయుడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రథమస్థానం సాధించింది. పాఠశాలకు చెందిన విద్యార్థిని కోనేటి కావ్యశ్రీని జిల్లా విద్యాశాఖ అధికారి చంద్రకళ, అధికారులు, ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, మండల ప్రజలు అభినందనలు తెలియజేశారు.

**చదువుకోవడానికి ఆదుకుంటాం: కలెక్టర్ :** కారంపూడి బ్రహ్మానాయుడు జిల్లా పరిషత్ హైస్కూలు విద్యార్థిని కె.కావ్య జిల్లాలో ప్రథమ స్థానంలో 600 మార్కులకు 591 మార్కులు సాధించడంతో జిల్లా కలెక్టర్ అరుణ్బాబు అభినందించారు. ప్రభుత్వ పరంగా కావ్య చదువుకోవడానికి ఆదుకుంటామని హామీ ఇచ్చారు. కుటుంబ భారం ఎక్కువ కావడం చిన్నవయసులోనే తండ్రి మరణించడం, తల్లి కూలీ పని చేసుకోవడం తన కుమార్తె కావ్యను చదివించుకుంటుంది. చదువుకు సంబంధించి బాధ్యత కలెక్టర్ తీసుకోవడంతో పలువురు అభినందించారు.



# పదవ తరగతి ఫలితాలలో వీఆర్ విద్యార్థుల ప్రభంజనం

**గుంటూరుతూర్పు,ఏప్రిల్23,(ప్రభాతవార్త :** పదవ తరగతి ఫలితాలలో వీఆర్ విద్యాసంస్థల విద్యార్థినీ విద్యార్థులు అత్యధిక మార్కులతో ప్రభంజనం సృష్టించారని వీఆర్ విద్యాసంస్థల డైరెక్టర్ వి వెంకటేశ్వరరావు తెలిపారు. బుధవారం స్థానిక పాత గుంటూరులో వి ఆర్ హైస్కూల్లో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ తమ విద్యా సంస్థలో 592 మార్కులను సుజిత, 589 మార్కులను పెన్నాకుల ధృతి, బలగా తెసీద్ కుమార్ 587, మార్కులు, షేక్ యాసిన్ 586 మార్కులు, బుద్ధవరపు కావ్యాంజలి 586 మార్కులు, సాధించారని హర్షం వ్యక్తం చేశారు. పరీక్షకు హాజరైన విద్యార్థులలో ప్రతి ఇద్దరిలో ఒకరికి 500 కి పైగా మార్పులు సాధించి వంద శాతం ఉత్తీర్ణతతో పాత గుంటూరు లోనే నెంబర్ వన్ స్థానాన్ని సాధించి తమ సత్తా చాటుకున్నారని ఆయన చెప్పారు. ఈ సందర్భంగా ఆయన విద్యార్థిని విద్యార్థులకు తల్లిదండ్రులకు అభినందించారు. పది ఫలితాలో విజయం సాధించిన విద్యార్థులు పాత గుంటూరులో బాణాసంచా కాల్చి సంబరాలు చేసుకున్నారు.



# పదవ తరగతి ఫలితాలలో కొల్లూరు వివేక హైస్కూల్ విజయభేరి

కొల్లూరు, ఏఫ్రియల్ 23 (ప్రభాతవార్త) : పదో తరగతి విడుదలైన పరీక్ష ఫలితాలలో మండల కేంద్రమైన కొల్లూరు వివేక హైస్కూల్ విద్యార్థిని 590మార్కులు సాధించినట్లు వివేక విద్యా సంస్థల డైరెక్టర్ ఆర్.వీరనారాయణ ఆదివారం తెలియజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉప్పు జోషిత 590, మండవ ఆస్మిత 589, గాజుల మహాలక్ష్మీ 587మార్కులు సాధించినట్లు ఆయన తెలిపారు. 550మార్కులు సాధించిన విద్యార్థులు 10, అదే విధంగా 500పైన సాధించిన వారు 26మంది ఉన్నారని తెలిపారు. ఈ సందర్భంగా అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థులను వివేక విద్యా సంస్థల డైరెక్టర్ ఆర్.వీరనారాయణ, ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ గుప్తా వెంకటరత్నం, డీన్ రత్నకుమారి, ప్రిన్సిపాల్ సిహెచ్ రమేష్, ఉపాధ్యాయులు, విద్యార్థులను అభినందించారు.



# పదవ తరగతి ఫలితాలలో ముట్లూరు జిల్లా పరిషత్ హై స్కూల్ టాప్

వట్టిచెరుకూరు ఏప్రిల్ 23 ప్రభాత వార్త : వట్టిచెరుకూరు మండలంలో ముట్లూరు జిల్లా పరిషత్ హై స్కూల్ టాప్, వట్టిచెరుకూరు మండలం ఫస్ట్, సెకండ్, థర్డ్ ప్లేసులు కైవసం చేసుకుంది, 99 శాతం ఉత్తీర్ణత సాధించింది,పదో తరగతి పరీక్షలు రాయడానికి వెళ్లిన 74 మందిలో 73 మంది ఉత్తీర్ణమి సాధించారు.500 మార్కులు దాటినోళ్లు 28 మంది,రిషిత (588), తి.పూజిత (578),నాగూర్బి (577)మార్కులతో స్కూల్ టాపర్స్గా నిలిచారు.





# శ్రీచైతన్య టెక్నో స్కూల్ విద్యార్థి వర్షాత్కు టెన్త్లో జిల్లా ఫస్ట్ర్యాంకు

**ఎ కొండూరు, ఏప్రిల్ 23, ప్రభాతవార్త :** ఎన్టిఆర్ జిల్లా మైలవరం టౌన్లోని శ్రీ చైతన్య టెక్నో స్కూల్ ఈ ఏడాది పది పరీక్ష ఫలితాల్లో మైలవరం చరిత్రలోనే రికార్డు సృష్టించి ప్రిన్సిపాల్ రత్నదుర్గ నేతృత్వంలో వీరంకి వర్షాత్ అనే విద్యార్థి పది పరీక్షా ఫలితాల్లో 600 మార్కులకు గాను 597 మార్కులు సాధించి జిల్లాలో ప్రథమ స్థానంలో నిలిచాడు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ రత్నదుర్గ సిబ్బందిని మైలవరం ప్రాంత ప్రజలు విద్యార్థులు తల్లిదండ్రులు అభినందించారు. ఎన్టిఆర్ జిల్లాలోనే మైలవరం శ్రీ చైతన్య టెక్నో స్కూల్ విద్యార్థి వీరంకి వర్షాత్ ఫస ్ట్ర్యాంక్ సాధించడంతో విద్యార్థి తల్లిదండ్రులు ప్రిన్సిపాల్ రత్నదుర్గ సిబ్బందికి కృతజ్ఞతలు తెలిపారు.



24-4Pg5exHNWMJQE.qxd:24-4Pg5exHNWMJQE.qxd 01/01/01 9:01 AM Page 1



# విదేశీ అతిథుల పర్యటనల్లోనే ఉగ్రదాడులు



**పహల్గాంవ్, ఏప్రిల్ 23:** భారత్‌లో విదేశీ అతిథులు, అగ్రనేతలు పర్యటిస్తున్న సమయంలోనే ఉగ్రదాడులు జరుగుతుండడం పలు అనుమానాలకు తావిస్తోంది. ఇది పాకిస్థాన్ కుట్రబుద్ధికి ఓ తార్కాణంలా కనిపిస్తోంది. ఎందుకంటే ఇప్పటి పహల్గాం ఉగ్రదాడికి, 2000 సంవత్సరంలో జరిగిన అనంత్‌నాగ్ ఛత్తీసింగ్‌పోరా నరమేధానికి చాలా పోలికలు కనిపిస్తున్నాయి. జమ్మూకశ్మీర్ అంశాన్ని అంతర్జాతీయం చేయడానికి పాక్ ఈ విధమైన నక్కజిత్తులు వేషాలు వేస్తోందన్న వాదనలు వినిపిస్తున్నాయి. ప్రధాని మోడీ విదేశీ పర్యటనలో ఉండడం, అమెరికా ఉపాధ్యక్షుడు జేడీ వాన్స్ భారత్ పర్యటనలో ఉండడాన్ని అవకాశంగా తీసుకుని పాకిస్థాన్ పహల్గాం ఉగ్రదాడికి పాల్పడి ఉండవచ్చనే అనుమానాలు బలపడుతున్నాయి. 2000 సంవత్సరంలో అప్పటి అమెరికా అధ్యక్షుడు బిల్ క్లింటన్ భారత్ పర్యటనకు వచ్చారు. సరిగ్గా అదే సమయంలో, అంటే 2000 మార్చి 20న అనంత్‌నాగ్ జిల్లాలో ఛత్తీసింగ్‌పొరలో ఉగ్రవాదులు ఆకస్మిక దాడులు చేసి 36 మందిని బలి తీసుకున్నారు. నాడు సిక్కులే ముష్కర మూకలకు లక్ష్యంగా మారారు. జమ్ముకశ్మీర్ అంశాన్ని అంతర్జాతీయం చేయాలనే ఉద్దేశంతోనే పాక్ కుట్ర చేసింది. ఆనాడు ఉగ్రవాదులు రెండు సైనిక వాహనాల్లో, భారీ స్థాయిలో తుపాకులు తీసుకుని ఛత్తీసింగ్‌పొర గ్రామంలోకి చొరబడ్డారు. భారత సైనికుల వేషంలో ఇంటింటికీ వెళ్లి, తనిఖీల నిమిత్తం పురుషులు బయటకు రావాలని బెదిరించారు. అలా వచ్చిన పురుషులను గురుద్వారా వద్దకు తీసుకెళ్లి చంపేశారు. భారత సైన్యమే అలా చేసిందని, అక్కడి వారిని నమ్మించేలా ఉగ్రవాదులు నినాదాలు చేశారు. చివరికి దర్యాప్తులో పాక్ ఉగ్రవాదులే ఈ దారుణానికి పాల్పడినట్లు గుర్తించారు. ఇప్పటి పహల్గాం ఉగ్రదాడికి, 2000లో జరిగిన ఛత్తీసింగ్‌పొరా నరమేధానికి చాలా దగ్గరి పోలికలు ఉన్నాయి. అమెరికా ఉపాధ్యక్షుడు జేడీవాన్స్, తన కుటుంబంతో సహా భారత పర్యటనకు వచ్చారు. మరోవైపు భారత ప్రధాని నరేంద్ర మోడీ సౌదీ అరేబియా పర్యటనలో ఉన్నారు. దీనితో జమ్మూకశ్మీర్ అంశాన్ని మరోసారి ప్రపంచానికి తెలియజేయాలని పాక్ కుట్రపన్నినట్లు తెలుస్తోంది. అందుకే భారత సైనికుల్లా వేషాలువేసుకున్న ఉగ్రవాదులు, కశ్మీర్‌లోని పర్యటకులను లక్ష్యంగా చేసుకొని దాడులకు పాల్పడ్డారు. మరీ ముఖ్యంగా పురుషులనే లక్ష్యంగా చేసుకున్నారు. పహల్గాం ఉగ్రదాడి వెనుక పాక్ ఆర్మీ చీఫ్ ఆసీమ్ మునీర్ ఉన్నట్లు తెలుస్తోంది. ఆసీమ్ మునీర్ ఇటీవలే ఓవర్సీస్ పాకిస్థాన్ కన్వెన్షన్‌లో మాట్లాడుతూ, భారత్‌కు వ్యతిరేకంగా రెచ్చగొట్టే ప్రసంగం చేశారు. మన లక్ష్యం స్పష్టంగా ఉంది. గతంలో కశ్మీర్ మన గొంతులోని రక్తనాళంలా ఉండేది. ఇక భవిష్యత్తులోనూ అలానే ఉంటుంది. కశ్మీర్‌ను మనం ఎప్పటికీ మరిచిపోలేం. మన కశ్మీరీ సోదరులు పోరాటం చేస్తున్నారు. వారిని మనం ఒంటరిగా వదిలేయం. మీరు మీ పిల్లలకు పాకిస్థాన్ కథను కచ్చితంగా చెప్పండి. మన జీవితంలోని ప్రతి అంశం హిందువుల కంటే చాలా భిన్నమని మన పూర్వీకులు భావించారు. ఆ విషయాన్నే పిల్లలకు చెప్పండి. అప్పుడే మన పూర్వీకుల ఆలోచనలను పిల్లలు గుర్తుంచుకుంటారు. ఈ రెండు మతాలు, సంప్రదాయాలు, ఆలోచనలు, ఆకాంక్షలు పూర్తిగా భిన్నమైనవి. అదే ఈ రెండు దేశాల సిద్ధాంతానికి పునాది. ఆసీమ్ మునీర్, పాక్ ఆర్మీ చీఫ్ మునీర్ ఈ రెచ్చగొట్టే ప్రసంగం చేసిన తర్వాతే పహల్గాం దాడి జరిగింది. మరోవైపు ఇదే సమయంలో పాక్ వాయుసేనకు చెందిన రవాణా, నిఘా విమానాలను కరాచీనుంచి లాహోర్, రావల్పిండి బేస్‌లకు తరలించారు. ఇదంతా భారత్‌ను ఢీకొట్టాలని పాక్ చేస్తున్న ప్రయత్నమేనన్న అనుమానాలను బలపరుస్తోంది.




# కాశ్మీరీలు సిగ్గుపడుతున్నారు -మెహబూబా ముఫ్తీ

**శ్రీనగర్, ఏప్రిల్ 23:** జమ్ముకశ్మీర్‌లోని పహల్గామ్‌లో జరిగిన ఉగ్రదాడిలో 27 మంది పర్యాటకులు మరణించడంపై పిడిపి అధినేత్రి మెహబూబా ముఫ్తీ స్పందించారు. ఈ సంఘటనతో తమతోపాటు కశ్మీరీలు సిగ్గుపడుతున్నారని తెలిపారు. గత కొన్నేళ్లుగా కశ్మీర్‌లో పౌరులపై జరిగిన అత్యంత దారుణమైన దాడుల్లో ఇది ఒకటని అన్నారు. బుధవారం శ్రీనగర్‌లో పిడిపి కార్యకర్తలతో కలిసి మెహబూబా ముఫ్తీ నిరసన ర్యాలీ నిర్వహించారు. 'ఇది మనందరిపై దాడి, అమాయకులను చంపడం భయానక చర్య, అమాయకుల హత్యలను ఆపండి' అని రాసి ఉన్న ప్లకార్డులను కార్యకర్తలు ప్రదర్శించారు. కాగా, నిరసన ర్యాలీతర్వాత మెహబూబా ముఫ్తీ మీడియాతో మాట్లాడారు. ఉగ్రదాడి అమాయక పర్యాటకులపైనే కాదని, కశ్మీరియత్‌పై కూడా జరిగిందని తెలిపారు. 'ఇది మాపై జరిగిన దాడి. మేం దీనిని ఖండిస్తున్నాం. దీనిని సహించబోం. హోంమంత్రి ఇక్కడఉన్నారు. దాడిలో ప్రమేయం ఉన్న ఉగ్రవాదులను గుర్తించాలి. అప్పుడు వీలైనంత త్వరగా శిక్షించవచ్చు' అని అన్నారు. మరోవైపు సరదాగా గడిపేందుకు కశ్మీర్‌కు వచ్చే అమాయక పర్యాటకులపై ఉగ్రదాడి చేయడం అత్యంత పిరికి పని అని మెహబూబా ముఫ్తీ విమర్శించారు.

'మేం సిగ్గుపడుతున్నాం. కశ్మీరీలు సిగ్గుపడుతున్నారని దేశ ప్రజలకు నేను చెప్పాలనుకుంటున్నా. ఈ బాధాకరమైన సమయంలో మేం మీకు అండగా ఉంటాం. నేరస్తులను ప్రభుత్వం పట్టుకుని శిక్ష విధించాలని మేం కోరుతున్నాం' అని అన్నారు.

కాగా, ఉగ్రదాడి భద్రతా లోపమా అన్న ప్రశ్నకు, రాజకీయాలు ఆడటానికి ఇది సమయం కాదని మెహబూబా ముఫ్తీ తెలిపారు. 'మా హృదయాలు బాధలో ఉన్నాయి. ప్రజల హృదయాలు పగిలిపోయాయి. జమ్ముకశ్మీర్, దేశం మొత్తం శోకసంద్రంలో ఉన్నది. ప్రియమైన వారిని కోల్పోయిన వారి బాధను మేం పంచుకుంటున్నాం. దేశ ప్రజలకు నేను క్షమాపణలు చెప్పాలనుకుంటున్నా' అని అన్నారు.



# సిఎం, డిప్యూటీలను చంపేస్తామంటూ బెదిరింపులు!

**బెంగళూరు, ఏప్రిల్ 23:** కర్ణాటక ముఖ్యమంత్రి సిద్ధరామయ్యను, ఉప ముఖ్యమంత్రిడీకే శివకుమార్‌ను హతమారుస్తామని బెదిరింపు మెయిల్స్ వచ్చాయి. సీఎం, డిప్యూటీ సీఎంలను దారుణంగా హత్య చేస్తామని ఓ దుండగుడు ఈ మెయిల్‌లో బెదిరింపు సందేశం పంపాడు. కర్ణాటక విధానసౌధ పోలీసులు ఈ విషయాన్ని వెల్లడించారు. రాంపురకు చెందిన ప్రభాకర్ అనే వ్యక్తికి తాను కోటి రూపాయలు అప్పుగా ఇచ్చానని, దానిని ఇంకా తిరిగి చెల్లించనందున అతడిని కూడా హత్య చేస్తానని మెయిల్‌లో ఆగంతకుడు పేర్కొన్నాడు. దీనిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని పోలీసులు తెలిపారు. సింధార్ రాజపుత్ అనే వ్యక్తి పేరిట మెయిల్ వచ్చినట్లు గుర్తించామని, తదుపరి విచారణ కొనసాగుతోందని అన్నారు.

త్వరలోనే నిందితుడిని అదుపులోకి తీసుకుంటామని పోలీసులు తెలిపారు. బెదిరింపు మెయిల్ నేపథ్యంలో ముఖ్యమంత్రి, ఉప ముఖ్యమంత్రి నివాసాల దగ్గర భద్రతను కట్టుదిట్టం చేశామని చెప్పారు.

# మృతులకు హోంమంత్రి అమిత్‌షా నివాళి

## మృతులకు జమ్ముకాశ్మీర్ ప్రభుత్వం రూ.10 లక్షలు చొప్పున పరిహారం

## శ్రీనగర్‌నుంచి ఢిల్లీ, ముంబయిలకు ప్రత్యేక విమానసర్వీసులు



**శ్రీనగర్, ఏప్రిల్ 23:** జమ్ముకశ్మీర్‌లోని పహల్గాంలో పర్యాటకులపై జరిగిన భీకర ఉగ్రదాడి నేపథ్యంలో భారత ప్రభుత్వం అప్రమత్తమైంది. ప్రధాని నరేంద్ర మోడీ కేంద్రమంత్రులతో అత్యవసర సమావేశం నిర్వహించారు. అధికారులను భద్రతను కట్టుదిట్టం చేశారు. ఓవైపు ఉగ్రవాదులను మట్టుబెట్టేందుకు ముమ్మరంగా గాలింపు చర్యలు సాగుతున్నాయి. మరోవైపు కేంద్రమంత్రులు తదుపరి చర్యలకు ఉపక్రమిస్తున్నారు. కేంద్ర పౌర విమానయాన మంత్రి రామ్మోహన్ నాయుడు తాజాగా కీలక ప్రకటన చేశారు. పర్యాటకుల భద్రత మేరకు వారి కోసం శ్రీనగర్ నుంచి ప్రత్యేక విమాన సర్వీసులు ఏర్పాటు చేస్తున్నట్లు పేర్కొన్నారు. నాలుగు ప్రత్యేకవిమానాలు శ్రీనగర్ నుంచి ముంబయి, ఢిల్లీకి చేరుకుంటాయని చెప్పారు. ఆ విషయంపై మంగళవారం హోం మంత్రి అమిత్ షాతో మాట్లాడానని తెలిపారు. అవసరమైతే మరిన్ని విమానాలు నడపడానికి చర్యలు తీసుకుంటామన్నారు. ఇందులోభాగంగా మంత్రి అన్ని విమానయాన ఆపరేటర్లతో అత్యవసర సమావేశం నిర్వహించారు. ఇలాంటి సమయంలో ప్రయాణికులపై భారం పడకుండా సాధారణ స్థాయి ఛార్జీలను వసూలు చేయాలని విమానయాన సంస్థలను ఆదేశించారు. మరణించిన వ్యక్తుల మృతదేహాలను వారి స్వస్థలాలకు తరలించడానికి రాష్ట్ర ప్రభుత్వాలతో సమన్వయం చేసుకొని పనిచేస్తూ పూర్తి సహకారాన్ని అందించాలని కోరారు. శ్రీనగర్‌కు వెళ్లే విమానాలను పెంచాలని పలు విమానయాన సంస్థలను కేంద్రం కోరింది. అదే సమయంలో శ్రీనగర్ పర్యాటకులకు కొన్ని మినహాయింపులు ఇచ్చింది ఇండిగో సంస్థ. విమాన టికెట్లు రీషెడ్యూల్, కాన్సలేషన్ ఛార్జీలను రద్దు చేసింది. శ్రీనగర్‌కు ప్రత్యేక సర్వీసులు కూడా నడుపుతున్నామని బుధవారం వెల్లడించారు. పహల్గాం ఉగ్రదాడి మృతుల కుటుంబాలకు జమ్ముకశ్మీర్ ప్రభుత్వం పరిహారం ప్రకటించింది. మృతుల కుటుంబాలకు రూ.10 లక్షల చొప్పున పరిహారం ఇవ్వనున్నట్లు వెల్లడించింది. మరోవైపు పహల్గాంలో కాల్పులు జరిగిన ప్రదేశాన్ని కేంద్ర హోం మంత్రి అమిత్ షా పరిశీలించారు. ప్రాణాలు కోల్పోయిన వారికి కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్ షా నివాళులు అర్పించారు. అందుకోసం బుధవారం ఉదయం శ్రీనగర్‌కు చేరుకున్నారు. అనంతరం పుష్ప గుచ్ఛాలతో శ్రద్ధాంజలి ఘటించారు. ఉగ్రవాద దాడిలో కర్ణాటకకుచెందిన ఇద్దరు వ్యక్తులు మరణించారని ఆ రాష్ట్ర ప్రభుత్వం ధ్రువీకరించింది. అక్కడి నుంచి పర్యటకులను తీసుకురావడానికి హెల్ప్‌లైన్ నంబర్‌లను ఏర్పాటు చేసింది.

రాష్ట్రంలోని టూర్ ఆపరేటర్లు, ట్రావెల్ ఏజెంట్ల ద్వారా పర్యటకుల వివరాలను రాబట్టేలా చర్యలు తీసుకుంది. మరణించిన వారి మృతదేహాలను కుటుంబ సభ్యులతో పాటు బుధవారం మధ్యాహ్నం తిరిగి తీసుకురావాలని నిర్ణయించింది. పహల్గాం ఉగ్రవాద దాడి నేపథ్యంలో గోవాకు చెందిన 50 మందికి పైగా పర్యాటకులు జమ్ముకశ్మీర్‌లో చిక్కుకున్నారు. వారంతా శ్రీనగర్‌లోని హోటళ్లలో చిక్కుకుపోయారని, వారిని తిరిగి తీసుకురావడానికి ప్రయత్నాలు కొనసాగుతున్నాయని అధికారులు తెలిపారు. ప్రస్తుతం సురక్షితంగా ఉన్నారని చెప్పారు.

# సైనికులను చూసి కూడా వణికిన పర్యాటకులు!

**శ్రీనగర్, ఏప్రిల్ 23:** పహల్గాం సమీప బైసరన్ లోయలో ఉగ్రవాదులు సైనిక దుస్తుల్లో వచ్చి దాడులకు తెగబడ్డారు. మొత్తం ఐదుగురు ముష్కరులు మహిళలు, చిన్నారులను వదిలిపెట్టి పురుషులే లక్ష్యంగా కాల్పులకు దిగారు. ఈ కాల్పుల్లో మొత్తం 28 మంది పర్యాటకులు ప్రాణాలు కోల్పోయారు. ఉగ్రదాడి నుంచి బయటపడిన పలువురు బాధితులు తీవ్ర భయభ్రాంతులకు గురయ్యారు. దాడికి పాల్పడిన ఉగ్రవాదులు సైనిక దుస్తుల్లో రావడంతో.. దాడి అనంతరం బాధితులను రక్షించేందుకు వచ్చిన సైనికులను చూసి కూడా జనం గడగడ వణికిపోయారు. ఉగ్రవాదులు మళ్లీ వచ్చారనుకుని భీతిల్లారు. సైనికులను చూసిన ఓ మహిళ తన కొడుకును ఏమీ చేయవద్దని బోరున విలపించింది. చేతులు జోడించి వేడుకుంది. ఇతర పర్యటకులు భయంతో తమ పిల్లలను తమ వెనుక దాచుకున్నారు. దాంతో ఓ సైనికుడు వారికి ధైర్యం చెప్పారు. తాము భారత ఆర్మీ నుంచి మిమ్మల్ని రక్షించడానికే వచ్చామని భరోసా ఇచ్చారు. ఈ ఘటనకు సంబంధించిన దృశ్యాలు సోషల్ మీడియాలో వైరల్‌గా మారాయి. అదేవిధంగా ఉగ్రవాదుల దాడిలో తన భర్త మరణాన్ని చూసి షాక్‌కు గురైన ఓ మహిళ అందులో నుంచి బయటకు రాలేకపోతున్నారని, బాధతో రోదిస్తూనే ఉన్నారని భద్రతా బలగాలు తెలిపాయి. కాగా జమ్ముకశ్మీర్‌లో పౌరులే లక్ష్యంగా జరిగిన అత్యంత దారుణమైన ఉగ్రదాడుల్లో ఇది కూడా ఒకటి. పాకిస్థాన్‌కు చెందిన నిషేధిత 'లష్కరే తోయిబా' అనుబంధ విభాగం 'ద రెసిస్టెన్స్ ఫ్రంట్' ఈ మారణహోమానికి తామే పాల్పడినట్లు ప్రకటించింది. మంగళవారం మధ్యాహ్నం 3 గంటలకు ఈ ఉగ్రదాడి జరిగింది. దుండగులు అతి సమీపంనుంచి తూటాల వర్షం కురిపించారు. మహిళలు, చిన్నారులను వదిలిపెట్టి పురుషులే లక్ష్యంగా దాడికి దిగారు. 28 మంది పర్యాటకులు ప్రాణాలు కోల్పోయారు. పదుల సంఖ్యలో గాయపడ్డారు. మృతుల్లో ఇద్దరు విదేశీయులు ఉన్నట్లు అధికారులు తెలిపారు.



# శాంతిచర్చలకు సిద్ధమే: పుతిన్

**మాస్కో, ఏప్రిల్ 23:** ఉక్రెయిన్‌తో శాంతి చర్చలు చేసేందుకు సిద్ధంగా ఉన్నట్లు రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్ ప్రకటించారు. యుద్ధం ప్రారంభమైన తర్వాత తొలిసారిగా ద్వైపాక్షిక చర్చలపై ఆశాభావం వ్యక్తం చేశారు. శాంతిని నెలకొల్పేందుకు అమెరికా తీవ్రంగా ఒత్తిడి చేస్తున్న నేపథ్యంలో పుతిన్ ఈ వ్యాఖ్యలు చేశారు. రష్యా దేశ అధికారిక వార్తాచానెల్‌లో మాట్లాడిన పుతిన్ ఈ మేరకు చెప్పారు. శాంతి చర్చలకు సిద్ధంగా ఉన్నామని, ఉక్రెయిన్ నుంచి కూడా ఇదే ఆశిస్తున్నా టమని తెలిపారు.

అయితే, పుతిన్ వ్యాఖ్యలపై ఉక్రెయిన్ అధ్యక్షుడు జెలెన్‌స్కీ పరోక్షంగా స్పందించారు. కాల్పుల విరమణ ద్వారానే సమస్య పరిష్కారం అవుతుందని చెప్పారు. ఈ వివాదం ముగింపు లక్ష్యంగా అమెరికా, యూరప్ దేశాల ప్రతినిధులతో చర్చించడానికి ఉక్రెయిన్ ఉన్నత స్థాయి బృందం లండన్‌కు వెళ్తుందని తెలిపారు. ఒకవైపు శాంతి చర్చలకు అమెరికా అధ్యక్షుడు ట్రంప్ ఏర్పాట్లు చేస్తున్నప్పటికీ మరోవైపు రష్యా ఉక్రెయిన్‌లు మాత్రం దాడులను చేసుకుంటూనే ఉన్నాయి. ఆదివారం కీవ్‌పై పదులకొద్దీ డ్రోన్, బాంబు దాడులకు పాల్పడినట్లు ఉక్రెయిన్ అధ్యక్షుడు జెలెన్‌స్కీ వెల్లడించారు. బదులుగా కీవ్ బలగాలూ దాడులు కొనసాగించాయని రష్యా అధికారులు ఆరోపించారు. మరోవైపు ఉక్రెయిన్, రష్యాలు యుద్ధం విరమణపై తొందరగా ఒక ఒప్పందానికి రాకపోతే శాంతి ఒప్పందం కుదిర్చే ప్రయత్నాల నుంచి విరమించుకుంటామని అమెరికా ఇప్పటికే ప్రకటించింది. ఇప్పుడు ఈవారంలోనే యుద్ధం ఆగే అవకాశాలున్నాయని చెబుతోంది. ఈ విషయాన్ని అగ్రరాజ్య అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ వెల్లడించారు. రష్యా, ఉక్రెయిన్‌లమధ్య శాంతిఒప్పందం ఈ వారంలోనే కుదిరే అవకాశం ఉందంటూ తన సామాజిక మాధ్యమం 'ట్రూత్'లో పోస్టు చేశారు. ఈ రెండు దేశాలు తమతో కలిసి భారీగా వ్యాపారం చేయబోతున్నాయని కూడా వెల్లడించారు.

# పర్యాటకులను రక్షించిన వ్యాపారి

**పహల్గాంవ్, ఏప్రిల్ 23:** మినీ స్విట్జర్లాండ్‌గా పేరొందిన పహల్గాం పర్యటనకు వచ్చిన వారిపై ఉగ్రవాదులు చేసిన దాడిలో 26 మంది మరణించారు. పలువురు తీవ్రంగా గాయపడి చికిత్స పొందుతున్నారు. అయితే, స్థానిక వ్యాపారులు చొరవ తీసుకుని పలువురు పర్యటకులను రక్షించారు. వారిని సురక్షిత ప్రాంతాలకు తరలించి కాపాడినట్లు పర్యాటకులు చెబుతున్నారు. ఛత్తీస్‌గఢ్‌కు చెందిన మహేంద్రగఢ్ చిర్‌మిరీ భరత్‌పుర్ ప్రాంతానికి చెందిన నాలుగు కుటుంబాలు పహల్గాం పర్యటనకు వెళ్లాయి. ఉగ్గదాడి జరిగిన సమయంలో శివాన్ష్‌జైన్, కుల్దీప్ స్థాపక్, అర్వింద‌ర్ అగర్వాల్, హ్యాప్పీ బద్వాన్ కుటుంబాలకు చెందిన 11మంది అక్కడే ఉన్నాయి. వేసవి సెలవుల నేపథ్యంలో ఏప్రిల్ 18న వీరందరూ చిన్నారులతో సహా విహార యాత్రకు వెళ్లారు. ఏప్రిల్ 21న పహల్గాం చేరుకున్నట్లు కుల్దీప్ బంధువు రాకేశ్ తెలిపారు. అయితే, కొండచరియలు విరిగిపడడం వల్ల రోడ్డుపై ట్రాఫిక్ నిలిచిపోయిందని, ఎక్కడి వారు అక్కడే ఆగిపోయారని వివరించారు. ఈ సమయంలోనే కాల్పులు జరిగాయని, దీంతో భయపడిన పర్యాటకులు పరుగులు తీసినట్లు వెల్లడించారు.



వీరిని గమనించిన స్థానిక కశ్మీరీ వ్యాపారి నజకత్ అలీ సమయస్ఫూర్తిని ప్రదర్శించి, పర్యాటకుల 11 మందిని సురక్షిత ప్రాంతాలకు తరలించి కాపాడినట్లు తెలిపారు. నజకత్ అలీ ప్రతి ఏడాది శీతల కాలంలో ఉన్ని దుస్తులు విక్రయించేందుకు చిర్‌మిరికి వస్తుంటాడని వారు పేర్కొన్నారు. పహల్గామ్ వెళ్లిన పర్యాటకులు కుల్దీప్ స్థాపక్, అతడి భార్యతో పాటు అనేక మంది పహల్గాం పర్యటనకు వెళ్లారు. వారిలో చిన్నారులు కూడా ఉన్నారు. ఉగ్ర దాడి జరిగిన సమయంలో వీరంతా అక్కడే ఉన్నారు. దీంతో భయపడి లాడ్జ్ వైపు వచ్చినట్లు చెప్పారు. ఆ తర్వాత అక్కడి నుంచి సురక్షితంగా జమ్మూకు వచ్చారని చెప్పారు. కశ్మీర్ నుంచి చిర్‌మిరికి వచ్చి వ్యాపారాలు చేసుకునేవారు వీరిందరిని సురక్షితంగా పంపించడంలో సాయం చేశారు. రాకేశ్ పరాశర్, కుల్దీప్ బంధువు నా కొడుకు, కోడలు, మనవడు కలిసి పహల్గాం పర్యటనకు వెళ్లారు. వారితో పాటు ముగ్గురు స్నేహితుల కుటుంబాలు అక్కడికి వెళ్లాయి. ఉగ్రదాడి జరగడంతో భయపడ్డాం. వారికి ఫోన్ చేయగా తామంతా సురక్షితంగా ఉన్నట్లు చెప్పారు. శివాన్ష్ జైన్ తల్లి పహల్గాం సమీప బైసరన్ లోయలో ఉగ్రవాదులు మంగళవారం భీకర దాడికి పాల్పడింది. సైనిక దుస్తుల్లో వచ్చిన ముష్కరులు పర్యటకులను చుట్టుముట్టి, అతి సమీపం నుంచి కాల్పులు జరిపారు. ఈ ఘటనలో 26 మంది ప్రాణాలు కోల్పోగా పదుల సంఖ్యలో గాయపడ్డారు. ఘటన అనంతరం అడవుల్లోకి పారిపోయిన ఉగ్రవాదుల కోసం భద్రతా బలగాలు ముమ్మర గాలింపు చేపట్టాయి. ఘటన నేపథ్యంలో ఎన్ఐఏ రంగంలోకి దిగి దర్యాప్తు చేపట్టింది.

# పల్వామా 2 దాడిగా భావించాలి

## ముష్కరులను మట్టుపెట్టాల్సిందే..

## జమ్ముకాశ్మీర్ మాజీ డిజిపి శేష్‌పాల్ వైద్



**పహల్గాంవ్, ఏప్రిల్ 23:** జమ్ముకశ్మీర్‌లో ఉగ్రవాదులు దాడి చేసిన విధానం, అక్టోబర్ 7న ఇజ్రాయెల్‌పై హమాస్ చేసిన దాడి తరహాలో ఉందని జమ్ముకశ్మీర్ మాజీ డిజిపి శేష్ పాల్ వైద్ అన్నారు. భారత్‌పై జరిగిన ఈ దాడిని పుల్వామా 2గా భావించాలని తేల్చిచెప్పారు. రెండు రోజుల క్రితం పాక్ ఆర్మీ చీఫ్ అసిమ్ మునీర్ భారత్‌పై చాలా అనుచిత వ్యాఖ్యలు చేశారు. అవేవో యాదృచ్ఛికంగా అన్నమాటలు కావు. ఎందుకంటే ఉగ్రవాదులు పర్యాటకుల మతాన్ని అడిగి, ఎవరైతే ముస్లింలు కారో వారిని మాత్రమే చంపారు. హమాస్ దాడిని ఇజ్రాయెల్ ఎలా తిప్పికొట్టిందో, భారత్ కూడా అలానే చేయాలి. వాస్తవానికి ఈ ఉగ్రదాడిని పాకిస్థాన్ సైన్యం ప్రారంభించింది. ఎందుకంటే దాడి చేసింది ఉగ్రవాదులు కాదు. ఉగ్రవాదుల ముసుగులో పాకిస్థాన్ సైన్యంలోని ఎస్ఎస్‌జీ (స్పెషల్ సర్వీస్ గ్రూప్) కమాండోలు ఈ దాడులకు పాల్పడ్డారు. ఇది ఒక పక్కా ప్రణాళిక ప్రకారం జరిగిన దాడి. ఇక మనం చాలా అప్రమత్తంగా ఉండాల్సిందే. అని మాజీ డిజిపి అన్నారు. బలూచిస్థాన్, ఖైబర్ పఖ్తుంఖ్వా, సింధ్, పీఓకే ప్రజలందరికీ నేను విజ్ఞప్తి చేస్తున్నాను. పాకిస్థాన్ సైన్యం చేసిన ఈ ఉగ్రవాద చర్యలకు వ్యతిరేకంగా తిరుగుబాటు చేసి, స్వాతంత్ర్యం ప్రకటించుకోండి. అంతేకాదు, పాకిస్థాన్ సైన్యం వెన్నువిరిచి, భారత్ దాన్ని నాలుగు ముక్కలుగా నరకాలి అని శేష్ పాల్ వైద్ అన్నారు. వాస్తవానికి ఉగ్రదాడి అంతా పాక్ ఆర్మీ చీఫ్ అసిమ్ మునీర్ ఆదేశాలతోనే జరుగుతోంది. పైగా ఈ తరహా దాడులను మరింత తీవ్రతరం చేయాలని ఆయన అనుకుంటున్నారు. అతను తనేంటో నిరూపించుకోవాలని ఆరాటపడుతున్నాడు అని మాజీ డిజిపి పేర్కొన్నారు.

# జమ్ముకాశ్మీర్‌లో వెల్లువెత్తిన నిరసన



**శ్రీనగర్, ఏప్రిల్ 23:** ఉగ్ర దాడితో జమ్ముకశ్మీర్ మరోసారి ఉలిక్కిపడింది. పహల్గాంవ్‌లో చోటుచేసుకున్న ఉగ్రదాడితో స్థానికుల్లో తీవ్ర ఆగ్రహావేశాలు వ్యక్తం అయ్యాయి. శ్రీనగర్‌సహా స్థానికంగా అనేక ప్రాంతాల్లో స్వచ్ఛందంగా బంద్‌పాటించారు. వీధుల్లోకి వచ్చి నిరసనలు తెలిపారు. పీపుల్స్ డెమొక్రటిక్‌పార్టీ అధ్యక్షురాలు మెహబూబా ముఫ్తీ మాట్లాడుతూ దేశప్రజలకు క్షమాపణలు చెప్పారు. ఈఘటనతో కాశ్మీరీలు సిగ్గుతో తలదించుకుంటున్నారని అన్నారు. నేషనల్ కాన్ఫరెన్స్‌కూడా లాల్‌చౌక్ సెంటర్‌లో నిరసన కార్యక్రమం చేపట్టింది. రాజకీయ పార్టీలు సహా అన్ని వర్గాలప్రజలు ఉగ్రచర్యలను ఖండిస్తూ నిరసన ప్రదర్శనలుచేసారు. కాశ్మీర్ ఆర్థికమూలాలను దెబ్బతీసారని ఉగ్రవాదులపై ఆగ్రహం వ్యక్తంచేసారు. ఇటీవలికాలంలో దుకాణాలు మూతపడటం ఇదే తొలిసారి. 370వ అధికరణం రద్దు తర్వాత గత ఆరేళ్లలో కాశ్మీర్‌లో బంద్ పాటించడం ఇదే తొలిసారి కావడం గమనార్హం. ఇలాంటివి మళ్లీ జరక్కూడదు. కాశ్మీర్‌పేరుతో ఏదైనా వర్గంపేరుతో ఇలాంటివి మళ్లీ కొనసాగనీయకూడదని, అమాయకుల ప్రాణాలు తీయడం అంటే మొత్తం మానవాళినే చంపడంతో సమానం అని హాజీ బాషిర్ అహ్మద్ అనే శ్రీనగర్ వాసి అన్నారు. వీలైనంత త్వరగా ఉగ్రవాద మూలాలు నిర్మూలించాలనికోరారు. కాశ్మీరీ సమాజాన్ని కించపరచడం స్థానిక ఆర్థికవ్యవస్థను దెబ్బతీసేందుకు కుట్రలుజరుగుతున్నాయని అన్నారు. ఉగ్రవాద నిర్మూలనకు ప్రభుత్వం ఏం చర్యతీసుకున్నా తాము మద్దతు ఇస్తామన్నారు. ఉత్తర కాశ్మీర్‌లోని కుప్వారా జిల్లా హంద్వారాలో భారీ నిరసనలు జరిగాయి. దక్షిణకాశ్మీర్‌లో కూడా నిరసనలు వెల్లువెత్తాయి. 2016లో హిజ్‌బుల్ ముహిదీన్ ఉగ్రవాది బుర్హాన్ వానీ హతమైన తర్వాత ఇలాగే స్థానికులు వీధుల్లోకి వచ్చారు. కాశ్మీరీలు ఉగ్రవాదంతో లేరని ప్రపంచానికి తెలిజెప్పేందుకే ఈ నిరసనలుచేస్తున్నామని పర్యాటకులపై దాడిని ఖండిస్తున్నామని ఆందోళనకారులు చెప్పారు. దాడికి పాల్పడిన వారు జమ్ముకాశ్మీర్‌ప్రజలు మేలు కోరేవారుకాదని నేషనల్ కాన్ఫరెన్స్ నేత శ్రీనగర్ ఎంపి ఆగా సయ్యద్ రుహుల్లా మెహదీ అన్నారు. రాంబన్ జిల్లాలోకూడా నిరసనలు జరిగాయి. ఆకస్మిక వరదలు కొండచరియలు విరిగిపడిన ఘటనలతో విలవిల్లాడుతున్నా ఉగ్రదాడికి నిరసనగా బంద్‌పాటించి శాంతియుత నిరసనలుచేసారు. ఈ పట్టణం చరిత్రలో తొలిసారిగా హిందూ ముస్లిం వర్గాలు కలిసి ఉగ్రచర్యకు వ్యతిరేకంగా నిరసన కార్యక్రమంచేపట్టడం గమనార్హం.

# పొగాకు రైతు సమస్యలు సిఎం దృష్టికి తీసుకెళ్తా : కాకర్ల



**కలిగిరి (నెల్లూరు), ఏప్రిల్ 23, ప్రభాతవార్త :** పొగాకు పండించినా రైతుకు గిట్టుబాటు ధర రాకపోవడంపై ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ధృష్టికి తీసుకెళ్లి రైతులకుమంచి జరిగేవిదంగా కృషి చేస్తానని ఉదయగిరి శాసన సభ్యులు కాకర్ల సురేష్ తెలిపారు. బుదవారం కలిగిరి పొగాకు వేలం కేంద్రాన్ని రైతుల కోరిక మేరకు కాకర్ల సురేష్ సందర్శించారు. ఈసందర్భంగా కలిగిరి పొగాకు బోర్డులో రైతులు కొనుగోలుకు తెచ్చిన పొగాకు బేళ్లను పరిశీలించారు. అనంతరం కొనుగోలు దారుల ఆక్షన్‌లో రైతులతో కలసి పాల్గొన్నారు. పొగాకు ధరలు హెచ్చు తగ్గులు, పొగాకు నాణ్యతను బట్టి రకాలుగురించి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా రైతుసంఘనాయకులు శ్రీకాంత్ పొగాకు పంట వేసిన దగ్గరనుండి పెట్టుబడి, అమ్మితే రాబడి వరకు యంఎల్ఏ దృష్టికి తీసుకువచ్చారు. తదనంతరం రైతులుకూడా ఈ సంవత్సరం అన్ని పెట్టుబడులు అధికమైనాయని కానీ ధర విషయానికి వస్తే గత సంవత్సరంకన్నా క్వింటాకు రు. 10వేలు తగ్గించి కొనుగోలు చేస్తున్నారని ఇలాఐతే రైతు బారీగా నష్టపోతారని ప్రభుత్వమైనా తమను ఆదుకోవాలని యంఎల్ఏ దృష్టికి తెచ్చారు. అనంతరం ఇదేవిషయం పొగాకు బోర్డుఆకషన్ అధికారితో సమావేశమై రైతులు పడుతున్న ఇబ్బందులు ధర విషయంలో జరుగుతున్న అన్యాయంపై వేలం నిర్వాహణాధికారితోయంఎల్ఏ చర్చించారు. ధరలవిషయంలో పొగాకు కొనుగోలు చేసే కంపెనీ ప్రతినిదులతో మాట్లాడి రైతులకు నష్టం వాటెల్లకుండా చూడాలన్నారు. అనంతరం విలేఖర్లతో మాట్లాడుతూఈ ప్రాతంలో రైతులు వర్జీనియా పొగాకు అధికంగా పండించడం జరుగుతుందన్నారు. పొగాకు పండించేందుకు ఎకరాకు రైతుకు ఈసంవత్సరం లక్షాయాబైవేలనుండి లక్షా60వేలవరకు పెట్టుబడిఅవుతుందన్నారు. కానీ ఇక్కడ పొగాకు ధరలు చూస్తే గత సంవత్సరం పొగాకు ధర మేలురకం కింటాకురు. 38వేలు పలికితే అదేపొగారు ఈసంవత్సరం క్వింటారు. 28వేలు పలుకుతుందన్నారు. ఇక రెండవరకంపొగాకు ధర గతసంవత్సరం కన్నా 10వేలరూపాయల తక్కువ ధరకు కొంటున్నారన్నారన్నారు. ఇది బోర్డు, బయ్యర్లు కలిసి రైతులను ఇబ్బందులు పెడుతున్నట్లు రైతులద్వారా తెలుస్తుందన్నారు. కలిగిరి పొగాకు బోర్డు పరిదిలో సుమారు 1500మందిపైగా రైతులు పొగాకు పండిస్తున్నారన్నారు. ఈపొగాకు పంటకాలంలో అధికపెట్టుబడులు పెట్టి అమ్మకాలకు పంటను తీసుకువస్తే కంపెనీలు ఈవిదంగా కొనుగోలు చేయడం అన్యాయమన్నారు. ఇదేవిషయం మే1న చంద్రబాబు పర్యటన ఆత్మకూరులో ఉందని ఆత్మకూరు నియోజకవర్గంపరిదిలోని డిసి పల్లెలోకూడా పొగాకు బోర్డులో అమ్మకాలు తెలుసుకొని ఆత్మకూరు శాసన సభ్యులుతో కలసి బాబుదృష్టికి తీసుకెళ్తామన్నారు. అదేవిదంగా కేంద్ర వ్యవసాయమంత్రి పెమ్మసాని చంద్రశేఖర్, రాష్ట్ర వ్యవసాయమంత్రి అచ్చయ్యనాయుడు దృష్టికి తీసుకెళ్లి పొగాకు రైతులకు న్యాయం జరిగేవిదంగా కృషిచేస్తామని రైతులకు కాకర్ల సురేష్ మాటి ఇచ్చారు. ఈయన వెంట రైతుసంఘనాయకులు శ్రీకాంత్, టిడిపి రాష్ట్ర రైతుసంఘకార్యనిర్వాహక కార్యదర్శి బొల్లినేని వెంకట రామారావు, రావులకొల్లు సర్పంచి వ్రాసాలవెంగవనాయముడు, మల్నేని శ్రీనివాసులనాయుడు, గన్నమనేని శ్రీనివాసులు, చితంరెడ్డి సుబ్బారెడ్డి, సిహెచ్‌సుబ్బారెడ్డి, బుజ్జియ్య తదితరులు పాల్గొన్నారు.

# పదోతరగతిలో గురుకుల విద్యార్థుల ప్రతిభ:మంత్రి సవిత



**విజయవాడ,ఏప్రిల్23.ప్రభాతవార్తప్రతినిధి:** టెన్త్ ఫలితాల్లో ఎంజేపీ బీసీ స్కూళ్లు అత్యుత్తమ ఫలితాలు సాధించారని రాష్ట్ర బీసీ సంక్షేమ శాఖ మంత్రి ఎస్.సవిత వెల్లడించారు. కార్పొరేట్ సంస్థలకు ధీటుగా ఎంజేపీ బీసీ స్కూళ్ల ఫలితాలు సాధించాయన్నారు. 29 స్కూళ్లో వంద శాతం పలితాలు రావడంపై ఆమె ఆనందం వ్యక్తంచేశారు. బిసి హాస్టల్స్, ఎంజేపీ బీసీ స్కూళ్ల విద్యార్థులు సాధించిన ఫలితాలపై బుధవారం ఆమె ఒక ప్రకటన చేస్తూ రాష్ట్ర ప్రభుత్వం బీసీ విద్యార్థుల విద్యకు ఎంతో ప్రాధాన్యమిస్తోందని, సీఎం చంద్రబాబు ఆశయాలు నెరవేర్చేలా టెన్త్ లో ఫలితాలు రాబట్టినందుకు ఆమె విద్యార్థులను అభినందించారు. అత్యుత్తమ ఫలితాలు సాధించడంలో విశేష కృషి చేసిన ఎంజేపీ బీసీ ఉపాధ్యాయులకు, ఉపాధ్యాయేతర సిబ్బందికి కూడా మంత్రి సవిత అభినందనలు తెలిపారు. అధికారంలోకి రాగానే డైట్ బిల్లులు, కాస్మోటిక్ ఛార్జీల బకాయిల చెల్లించామన్నారు. హాస్టళ్ల మరమ్మతులు, మౌలిక వసతుల కల్పనకు నిధుల మంజూరు చేశామన్నారు. ఎస్ఆర్ శంకరన్ రిసోర్స్ సెంటర్లతో పాటు విద్యార్థుల భద్రతకు ప్రాధాన్యమిస్తూ సీసీ కెమెరాలు ఏర్పాటు చేశామని తెలిపారు. హాస్టళ్లకు నిరంతరం విద్యుత్ సరఫరా అయ్యేలా ఇన్వర్టర్లు ఏర్పాటు చేశామన్నారు. విద్యార్థులకు అన్ని సబ్జెక్టుల్లోనూ పట్టు సాధించేలా ఉపాధ్యాయులతో నిరంతర పర్యవేక్షణతో పాటు ప్రత్యేక తరగతులు నిర్వహించామన్నారు. ఈ విజయం ముమ్మాటికీ సీఎం చంద్రబాబుదేనని మంత్రి సవిత స్పష్టంచేశారు. పదో తరగతి పరీక్షల్లోనూ మహాత్మా జ్యోతిరావు పూలే(ఎంజేపీ) బీసీ గురుకుల విద్యార్థులు టాప్ లేపారు. బుధవారం విడుదలైన టెన్త్ పరీక్షల్లో ఎంజేపీ బీసీ స్కూల్ విద్యార్థులు 95 శాతం మేర ఉత్తీర్ణతీ సాధించారు. ఇటీవల విడుదలైన ఇంటర్ పరీక్షల్లోనూ ఎంజేపీ విద్యార్థులు ప్రభంజనం సృష్టించిన విషయం విధితమే. ఎంజేపీ స్కూల్ విద్యార్థులు అత్యుత్తమ ఫలితాలు సాధించడంపై రాష్ట్ర బీసీ సంక్షేమ శాఖ మంత్రి ఎస్.సవిత హర్షం వ్యక్తంచేశారు. రాష్ట్రస్థాయి ఉత్తీర్ణత కంటే అధికంగా ఎంజేపీ విద్యార్థుల ఉత్తీర్ణత శాతం అధికంగా ఉండడంపై ఆమె ఆనందం వ్యక్తం చేశారు. ఈ మేరకు బుధవారం ఆమె ఒక ప్రకటన విడుదల చేశారు. మార్చిలో జరిగిన పదో తరగతి పరీక్షల ఫలితాలను రాష్ట్ర విద్యా శాఖ మంత్రి నారా లోకేశ్ ఎక్స్ వేదికగా విడుదల చేశారు. రాష్ట్ర స్థాయి ఫలితాల్లో 81.14 శాతం మేర ఉత్తీర్ణత శాతం నమోదైంది. ఈ ఫలితాల్లో బీసీ వెల్ఫేర్ కు చెందిన ఎంజేపీ స్కూళ్ల విద్యార్థులు 95 శాతం ఉత్తీర్ణతతో సత్తా చాటారు. రాష్ట్ర వ్యాప్తంగా 102 ఎంజేపీ స్కూళ్లకు చెందిన 5,788 మంది విద్యార్థులు టెన్త్ పరీక్షలకు హాజరయ్యారు. వారిలో 95 శాతం మంది పాసయ్యారు. ఈ ఏడాది మార్చిలో జరిగిన పదో తరగతి పరీక్షలకు ప్రభుత్వ, ప్రైవేటు, ఎయిడెడ్ కు చెందిన 11,819 పాఠశాలలకు చెందిన 6,14,459 మంది విద్యార్థులు హాజరయ్యారు. రాష్ట్ర వ్యాప్తంగా 102 ఎంజేపీ స్కూళ్లకు చెందిన 5,788 మంది విద్యార్థులకు తమ అదృష్టాన్ని పరీక్షించుకున్నారు. వారిలో 95 శాతం మంది పదో తరగతి పరీక్షల్లో పాసైయ్యారు. 29 ఎంజేపీ స్కూళ్లలో వంద శాతం మేర ఉత్తీర్ణత సాధించడం విశేషం. అదే సమయంలో ఎంజేపీ స్కూళ్లో జీరో ఉత్తీర్ణత శాతం నమోదుకాకపోవడం మరో విశేషం. రాష్ట్ర ప్రభుత్వ పరిధిలోని బీసీ, ఎస్సీ, ఎస్టీ రెసిడెన్షియల్ స్కూళ్లు, కేజీబీవీ, మోడల్ స్కూళ్లు, ప్రభుత్వ పాఠశాలల ఫలితాలు పరిశీలిస్తే... ఏపీ రెసిడెన్షియల్ స్కూళ్లతో సమానంగా ఎంజేపీ బీసీ స్కూళ్లు అత్యుత్తమ ఫలితాలు సాధించాయి.

# కుమార్తె ప్రేమ వివాహం చేసుకుందని హత్య చేసిన తండ్రి

### - తండ్రి, కుమారుడిని అరెస్టు చేసిన టుటౌన్ పోలీసులు - వీడిన యాస్మిన్ హత్య మిస్టరీ



తండ్రి, సోదరుడిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలిస్తున్న పోలీసులు

**చిత్తూరుటౌన్, ఏప్రిల్ 23 ప్రభాతవార్త:** చిత్తూరు బాలాజీకాలనీలో మృతి చెందిన యాస్మిన్‌ను కన్న తండ్రి, ఆమె సోదరులు కలిసి పరువు హత్య చేశారని పోలీసులు నిర్ధారించారు. ఈ మేరకు పోలీసుల దర్యాప్తులో తేలడంతో బుధవారం యాస్మిన్‌ను హత్య చేసిన ఆమె తండ్రి షౌకత్‌ఆలీ(56), షౌకత్ ఆలీ భార్య అక్క కుమారుడు మహ్మద్‌భాష అలియాస్ అబ్దుల్(29)ను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. ఈ కేసులో మరో నిందితుడు అబుల్ కలాం పరారీలో వున్నాడు. బాలాజీకాలనీలో ఈ నెల 13వ తేదీన తన కుమార్తె ఇంట్లో ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకుందని ఆమె తండ్రి షౌకత్‌ఆలీ టుటౌన్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. విషయం తెలిసి అక్కడికి వెళ్ళిన పోలీసులకు నిజంగా ఆమె ఉరి వేసుకుని మృతి చెందినట్లుగా వుండటంతో పోలీసులు అనుమానస్పద కేసుగా నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. చిత్తూరు బాలాజీ కాలనీలో ఎస్. ముంతాజ్, షౌకత్‌ఆలీ దంపతులు నివాసం వుంటున్నారు. వీరికి ముగ్గురు కుమార్తెలు. వీరిలో ఇద్దరు కుమార్తెలకు వివాహం అయ్యింది. యాస్మిన్ చిన్న కుమార్తె. ఈమె ఎస్వీసెట్ కళాశాలలో ఎంబిఎ పూర్తి చేసి ఉద్యోగ ప్రయత్నాలు చేసుకుంటూ ఇంట్లో వుండేది. ఈ క్రమంలో యాస్మిన్ తల్లిదండ్రులు చిన్న కుమార్తెకు వివాహం చేయాలని చిత్తూరు రామ్‌నగర్ కాలనీలో నివాసం వుంటున్న షరీఫ్ అనే వ్యక్తిని ఎంచుకుని పెళ్ళి ముహుర్తం నిర్ణయించారు. ఈ మేరకు ఫిబ్రవరి 9వ తేదీ వివాహం జరగాల్సి వుంది. అయితే యాస్మిన్ తాను చదివే కళాశాలలో పరిచయం అయిన పూతలపట్టు మండలం పోటుకనుమ గ్రామంకు చెందిన సాయితేజ్‌ను ప్రేమించడంతో ఇంట్లో ఎవ్వరికి తెలియకుండా ఫిబ్రవరి 6వ తేదీ పారిపోయింది. ఈ మేరకు వెళ్ళిన యాస్మిన్ సాయితేజను కలిసి పెళ్ళి చేసుకుంది. తన కుమార్తె ప్రేమ పెళ్ళి నచ్చని యాస్మిన్ తండ్రి షౌకత్‌ఆలీ కుమార్తెను చంపాలని పక్కాగా ప్లాన్ చేశాడు. తన భార్యకు సోదరి కుమారులైన మహ్మద్ భాషా అలియాస్ లాలు, అబ్దుల్‌తో కలిసి యాస్మిన్‌తో మాట్లాడాలి అని చెప్పి ఈ నెల 13వ తేదీన చిత్తూరుకు రప్పించారు. చిత్తూరు పిసిఆర్ జూనియర్ కళాశాల వద్ద అద్దెకు తీసుకున్న స్కార్పియో వాహనంలో యాస్మిన్‌ను ఎక్కించుకుని ఇంటికి వెళ్తున్నామని చెప్పి అక్కడికి వెళ్ళకుండా మాపాక్షి క్రాస్ వద్ద బాలాజీ హ్యాచరీస్ సమీపంలో వున్న బీడు పొలాల్లో వాహనంను నిలుపుదల చేసి ఆమెకు ముందుగానే తాము తెచ్చుకున్న నూలు తాడును ఆమె గొంతుకు బిగించి హత్య చేశారు. అనంతరం యాస్మిన్ మృతదేహంను తండ్రి షౌకత్‌ఆలీ తీసుకువచ్చి తన ఇంటి ముందర వరండాలో పడుకోబెట్టి అక్కడ నుండి షౌకత్ ఆలీ, మిగిలిన ఇద్దరు పరారీ అయ్యారు. ఈ మేరకు యాస్మిన్ తల్లి ఇచ్చిన ఫిర్యాదు మేరకు టుటౌన్ ఇన్స్‌పెక్టర్ నెట్టికంఠయ్య కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. ఈ క్రమంలో పోలీసులు నిందితులైన షౌకత్ ఆలీ, మహ్మద్ భాష అలియాస్ లాలులను అర్బన్ తహసిల్దారు ఎదుట ఎక్స్‌ట్రా జుడీషియల్ కన్ఫెక్షన్ కింద చిత్తూరు టుటౌన్ పోలీసులు వారిని అదుపులోకి తీసుకుని బుధవారం రిమాండ్‌కు తరించారు.

# సమాజాన్ని జాగృతపరిచే సాహిత్యం రావాలి - సాహితీవేత్తలు

### - ప్రభుత్వ ఉగాది కళారత్న, పురస్కార గ్రహీతలకు 'ఎక్స్' ఆధ్వర్యంలో ఘన సత్కారం



నవ్యాంధ్ర రచయితల సంఘం ప్రధాన కార్యదర్శి కలిమిశ్రీని సన్మానిస్తున్న "ఎక్స్‌రే" సంస్థ ప్రతినిధులు

**విజయవాడ,ఏప్రిల్23,ప్రభాతవార్తప్రతినిధి:** సమకాలీన సమస్యలను ప్రతిబింబిస్తూ సమాజాన్ని జాగృత పరిచే సాహిత్యం రావాలని విజయవాడ బుక్ ఫెస్టివల్ సొసైటీ అధ్యక్షులు కె లక్ష్మయ్య ఆకాంక్షించారు. మాట్లాడుతూ నేటి తరానికి పఠనాశక్తి తగ్గి ఎలక్ట్రానిక్ పరికరాలపై ఆధార పడటం భాధాకరం అన్నారు. మంగళవారం సాయంత్రంఎక్స్ రే.. సాహిత్య సాంస్క ృతిక సేవా సంస్థ ఆద్వర్యంలో ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు చేతులమీదుగా కళారత్న, ఉగాది విశిష్ఠ పురస్కారాలు అందుకున్న పలువురు ప్రముఖులకు అభినందన సభ నిర్వహించారు. ఈ ససభలో ముఖ్యఅతిధిగా విచ్చేసిన కె లక్ష్మయ్య ప్రసంగం కొనసాగిస్తూ సమాజానికి ఉపయుక్తమైన సేవలు అందిస్తున్న కవులు, కళాకారులను గౌరవించడం మన విద్యుక్తధర్మం అన్నారు.. సంస్థ అధ్యక్షులు కొల్లూరి ప్రసంగిస్తూ ప్రతిభ కలవారిని ప్రోత్సహిస్తే వారు మరింత ఉన్నత ప్రమాణాలతో ముందడుగు వేస్తారు అన్నారు. అవార్డు గ్రహీతలంతా తమ ఎక్స్ రే సభ్యులు కావడం సంతోషంగా ఉందన్నారు, రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు సాహిత్యం, కళలకు మంచి ప్రోత్సాహాన్ని అందించడం అభినందనీయమని అన్నారు. వాకర్స్, లయన్స్ నాయకులు రావి కృష్ణారావు మాట్లాడుతూ కవులు మార్గనిర్దేశకులుగా ఉండాలి అన్నారు. సంస్థ కార్యదర్శి బోడి ఆంజనేయ రాజు మాట్లాడుతూ రాష్ట్ర స్థాయిలో గుర్తింపు పొందిన వీరు భవిష్యత్ లో మరెన్నో అవార్డు పొందుతారని ఆశిస్తున్నట్లు తెలిపారు. సభలో శ్రీ విశ్వావసు ఉగాది సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వం నుండి కళారత్న పురస్కారం అందుకున్న అంతర్జాతీయ జానపద గాయకులు దామోదర గణపతి, ఉగాది విశిష్ట పురస్కారం అందుకున్న నవ్యాంధ్ర రచయితల సంఘం ప్రధాన కార్యదర్శి కలిమిశ్రీ(కలిమికొండ సాంబశివరావు) ,ప్రముఖ కవులు సరికొండ నరసింహ రాజు, బండ్ల మాధవరావు, చలపాక ప్రకాష్, సింహాద్రి వాణి., చిత్రకారులు అరసవల్లి గిరిధర్, శ్రీ దేవి దూపాటిలఅభినందనలను సభలో వక్తలు అభినందించారు. అనంతరం వారందరిని నిర్వహకులుసత్కారించారు. సంస్థ. కోశాధికారి చామర్తి వెంకట సుబ్బయ్య వందన సమర్పణ చేసారు. సంస్థ ఉపాధ్యక్షులు కందికొండ రవి కిరణ్ పర్యవేక్షించారు. ఈ సమావేశంలో పాల్గొన్న అందరికి ఘంటా ఇందిర స్మృత్యర్థం ప్రముఖ రచయిత విజయ కుమార్ చల్లటి మజ్జిగ అందించారు.

# రూ.కోటి విరాళమిస్తే.. దాతలకు ఏడాదిలో మూడురోజులు సుప్రభాతసేవ, విఐపి బ్రేక్ దర్శనాలు

**ప్రభాతవార్తప్రతినిధి-తిరుమల:** కలియుగప్రత్యక్షదైవం తిరుమల శ్రీవేంకటేశ్వరస్వామికి కోటి రూపాయలు విరాళాలిచ్చే దాతలకు తిరుమల తిరుపతి దేవస్థానం పలు ప్రయోజనాలు చేకూరుస్తోంది. భారీ మొత్తంలో భూరీగా విరాళాలిచ్చిన దాతలకు జీవితకాలంలో దాతతోబాటు మరో నలుగురికి ప్రతి ఏడాదిలో మూడురోజులు సుప్రభాతసేవ దర్శనాలు, 3మూడురోజులు విఐపి బ్రేక్ దర్శనాలు, నాలుగురోజులపాటు సుపథం ప్రవేశ దర్శనం ద్వారా ఆ దేవదేవుని దర్శనం చేసుకునే వెసలుబాటు కల్పించారు. ఈ ప్రయోజనాలతో బాటు ఒకసారి 10 పెద్ద లడ్డూలు, 20 చిన్నలడ్డూలు, ఒక దుప్పట, రవికె, 10 మహాప్రసాదం ప్యాకెట్లు బహుకరిస్తారు. ఏడాదిలో ఒకసారి దాతలైన భక్తులకు వేద ఆశీర్వచనం వంటి సౌకర్యం పొందవచ్చు. తిరుమలలో 3వేల రూపాయలు అద్దెతో కూడిన వసతి గదుల సదుపాయం మూడురోజులు కల్పిస్తారు. జీవిత కాలంలో దాతకు ఒకసారి ఐదు గ్రాముల బంగారు డాలర్, 50గ్రాముల వెండిడాలర్‌ను తగిన ఆధారాల్నికార్యాలయంలో చూపి పొందవచ్చు. మదినిండా దేవదేవుని దర్శనం: ఒక్కసారి గోవింద..గోవిందా... నామంతో మనస్ఫూర్తిగా ఏడుకొండల వేంకటేశ్వరస్వామిని మదిలో తలచుకుని మొక్కుకుంటే తమ కష్టాలు తీరిపోతాయని హిందూ భక్తుల ప్రగాఢ విశ్వాసం. ఆనందనిలయంలో కొలువైనా వేంకటేశ్వరస్వామిని ఎన్నిసార్లు దర్శనం చేసుకున్నా మళ్ళీ మళ్ళీ ఆ దివ్యమంగళరూపాన్ని చూడాలనే తాపత్రయం భక్తులకు కలుగుతుంది. సామాన్యభక్తులు ఆ దేవుని క్షణకాల దర్శనం కోసం పరితపిస్తుంటే ధనవంతులైన ,కోటీశ్వరులైన భక్తులకు, దాతలకు తిరుమల తిరుపతి దేవస్థానం బహుళప్రయోజనాలు చేకూరుస్తోంది. గతంలో కోటి రూపాయలు, 1.50కోట్ల రూపాయలు దాతలు విరాళమిస్తే వారికి ఏడాదిలో ఆరుమందికి ఉదయాస్తమాన సేవదర్శనం టిక్కెట్ (తెల్లవారూజామున సుప్రభాతం నుండి సాయంత్రం సహస్రదీపాలంకారసేవ వరకు) ఆలయం లోపల కులశేఖరపడివద్ద నుండి వేంకటేశ్వరస్వామి కొలువైన ముందుకు వెళ్ళి తనివితీరా దర్శనం చేసుకునే వెసలుబాటు కల్పించింది. అంతేగాక ఆ భక్తులకు సుప్రబాతం, తోమాల, అర్చన సేవలు కొందరు గృహస్థభక్తులు, విఐపి బ్రేక్‌కు మరికొందరు గృహస్థభక్తులను దాత తీసుకెళ్ళే ప్రయోజనం ఉండేది. ఆ విరాళాల్లో కొంత మార్పుచేసి కోటి రూపాయలు విరాళమిస్తే ఆ దాతలకు ఏడాదిలో మరిన్ని ప్రయోజనాలు, దేవుని దర్శనం, వసతి, ప్రసాదాలు అందించే దిశగా కార్యాచరణ రూపొందించి అమలుచేస్తారు. తిరుమలలో ప్రత్యేక ఉత్సవాలు జరిగే రోజుల్లో మినహాయించి మిగిలిన రోజుల్లో కోటి విరాళమిచ్చిన భక్తులు తమకు కల్పించిన ప్రత్యేక సౌకర్యాలను సద్వినియోగం చేసుకునే వెసలు బాటు కల్పించారు. -రూ.కోటి విరాళాలివ్వాల్సిన పథకాలు: దాతలు కోటిరూపాయలు విరాళాలివ్వాల్సిన టిటిడి ట్రస్టులలో కాటేజీ డొనేషన్ స్కీం, ఎస్వీప్రాణదానట్రస్ట్, ఎస్వీ విద్యాదనట్రస్ట్, బర్డ్ ట్రస్ట్, ఎస్వీ అన్నదానట్రస్ట్, ఎస్వీ గోసంరక్షణ ట్రస్ట్, ఎస్వీ సర్వశ్రేయాస్ట్రస్ట్, ఎస్వీ వేదపరిరక్షణ ట్రస్ట్, శ్రీవాణి ట్రస్ట్, ఎస్వీబిసిట్రస్ట్, బాలాజీఆరోగ్యవరప్రసాదిని స్కీమ్‌లకుదాతలు విరాళాలు చెల్లించి సౌకర్యాలను పొందవచ్చని టిటిడి తెలిపింది. దాతలు టిటిడి వెబ్‌సైట్"డబ్ల్యుడబ్ల్యుడబ్ల్యు. టిటిదేవస్థానమ్స్.ఎపి.జివొవి, ఇన్"లో ఆన్‌లైన్ ద్వారా విరాళాలు చెల్లించవచ్చు. ఆఫ్‌లైన్‌లో దాతలు విరాళాలను ఇఒ టిటిడి పేరున డిడి, చెక్‌లను తిరుమలలోని దాతల విభాగంలో (డోనార్‌సెల్)అంద జేయవచ్చు.

## జమ్ముకశ్మీర్‌లో ఉగ్రమూకల దుశ్చర్య అమానవీయం: మంత్రి కందుల దుర్గేష్

**విజయవాడ,ఏప్రిల్23,ప్రభాతవార్తప్రతినిధి:** .ఈ ఘటనలో రాష్ట్రానికి చెందిన ఇద్దరు వ్యక్తులు మృతి చెందడంపై సాంస్క ృతిక, సినిమాటోగ్రఫీ మంత్రి కందుల దుర్గేష్ దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ఘటనను తీవ్రంగా ఖండించారుకాశ్మీరులో ఉగ్రదాడిలో మరణించిన చంద్రమౌళి, మధుసూదన్‌ల చిత్రపటాలకు మంత్రి దుర్గేష్‌నివాళి అర్పించారు. మృతుల కుటుంబాలకు ప్రగాఢ సానుభూతి మంత్రి తెలిపారు. జమ్మూకశ్మీర్‌లోని పహల్గామ్ వద్ద పర్యాటకులపై జరిగిన ఉగ్రవాద దాడిని రాష్ట్ర పర్యాటక, .ఉగ్రమూకలు విచక్షణారహితంగా కాల్పులు జరిపిన ఈ దుర్ఘటనలో ప్రాణాలు కోల్పోయిన విశాఖకు చెందిన జె.ఎస్. చంద్రమౌళి, కావలికి చెందిన మధుసూదన్ కుటుంబాలకు మంత్రి దుర్గేష్ ప్రగాఢ సానుభూతిని వ్యక్తం చేసారు. మృతుల ఆత్మలకు శాంతి చేకూరాలని, గాయపడిన వారు త్వరగా కోలుకోవాలని ప్రార్థించారు. ఇది హృదయ విదారకమైన, హేయమైన, అమానుషమైన చర్యగా మంత్రి దుర్గేష్ పేర్కొన్నారు.

# విఆర్‌ఓల సమస్యలు పరిష్కరిస్తాం: గ్రామవార్డు సచివాలయ శాఖ డైరెక్టర్ శివప్రసాద్

**విజయవాడ, ఏప్రిల్ 23, ప్రభాతవార్త :** విఆర్‌ఓల సమస్యలను పరిష్కరించడానికి తనవంతు కృషి చేస్తామని రాష్ట్ర గ్రామవార్డు సచివాలయ శాఖ డైరెక్టర్ శివప్రసాద్ హామీ ఇచ్చారు. ఆయనకు విజయవాడలోని ఆయన కార్యాలయంలో రాష్ట్ర గ్రామ రెవెన్యూ అధికారుల సంఘం అధ్యక్షుడు భూపతిరాజు రవీంద్రరాజు నేతృత్వంలో సంఘ నేతలంతా కలిసి తమ సమస్యలపై వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా భూపతిరాజు మాట్లాడుతూ క్లస్టర్ విధానంలో రెండు సచివాలయాలకు ఒక విఆర్‌ఓ వుంటే ఇబ్బంది అవుతుందని, సచివాలయ రేషనైలేజేషన్ విషయంలో విఆర్‌ఓలను డిస్టర్బ్ చేయొద్దని, లైన్ డిపార్ట్‌మెంట్ రెవెన్యూలోనే గ్రేడ్1, 2, విఆర్‌ఓలకు డిడివోలుగా తహసీల్దార్లు వుండేలా నిర్ణయం తీసకోవాలని చేసిన వినతికి శివప్రసాద్ స్పందిస్తూ వారి సమ్యల పరిష్కారానికి హామీ ఇచ్చారు. కార్యక్రమంలో సంఘం ఉపాధ్యక్షులు మిరియాల లక్ష్మీనారాయణ, చిత్తూరు జిల్లా మాజీ అధ్యక్షులు బాలాజీ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# చేనేత, జౌళి శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శిగా బాధ్యతలు స్వీకరించిన ఆర్.పి. సిసోడియా

**విజయవాడ, ఏప్రిల్ 23,ప్రభాతవార్తప్రతినిధి:** సీనియర్ ఐఏఎస్ అధికారి ఆర్.పి. సిసోడియా రాష్ట్ర సచివాలయంలో చేనేత, జౌళి శాఖ (పరిశ్రమలు మరియు వాణిజ్య శాఖ) ప్రత్యేక ప్రధాన కార్యదర్శిగా బుధవారం బాధ్యతలు స్వీకరించారు. విశాల దృష్టి, పరిపూర్ణ పరిపాలనా అనుభవంతో సిసోడియా నేతృత్వంలో శాఖ అభివృద్ధి దిశగా నడిచే అవకాశం ఉందని నేత కార్మికులు ఆశాభావం వ్యక్తం చేశారు. నూతన బాధ్యతలు చేపట్టే ముందు సిసోడియా ఛాంబర్ లో సంప్రదాయ పూజాదికాలు నిర్వహించారు ఈ సందర్భంగా చేనేత, జౌళి శాఖ కమిషనర్ రేఖారాణి శాఖకు సంబంధించిన ప్రాధాన్య విషయాలు, అమలులో ఉన్న పథకాలు, భవిష్యత్తు కార్యాచరణల పై సిసోడియాకు సమగ్ర వివరాలు అందించారు. చర్చల సందర్భంగా చేతివృత్తుల అభివృద్ధి, మౌలిక సదుపాయాల ఆధునికీకరణ, జాతీయఅంతర్జాతీయ విపణుల్లో చేనేత వస్త్రాలకు ప్రాధాన్యం కల్పించడం వంటి కీలక అంశాలు ప్రస్తావనకు వచ్చాయి. కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ ఖాదీ, గ్రామీణ పరిశ్రమల మండలి సీఈఓ వీఆర్ విజయరాఘవ నాయక్, చేనేత, జౌళి శాఖ అదనపు డైరెక్టర్లు మురళీకృష్ణ, శ్రీకాంత్ ప్రభాకర్, సంయుక్త డైరెక్టర్లు కన్న బాబు, రాజారావు, ఆప్కో జనరల్ మేనేజర్ నాగేశ్వరరావు, అకౌంట్స్ ఆఫీసర్ పార్వతి పాల్గొన్నారు. ఈ సమావేశం ద్వారా ప్రత్యేక ప్రధాన కార్యదర్శి సిసోడియా నేతృత్వంలో చేనేత జౌళి శాఖ మరింత చురుకుగా ప్రభుత్వ లక్ష్యాలసాధనకు సన్నద్ధమైంది.

# యుపిఎస్సీ విజేతలకు పవన్‌కళ్యాణ్ అభినందనలు

**విజయవాడ,ఏప్రిల్23,ప్రభాతవార్తప్రతినిధి:** యూపీఎస్సీ ఫలితాల్లో తెలుగు రాష్ట్రాల అభ్యర్థులు పలువురు విజేతలుగా నిలవడం సంతోషదాయకమని ఉప ముఖ్యమంత్రి పవన్‌కళ్యాణ్ అన్నారు. 11వ ర్యాంకుతో ఇ.సాయిశివాని, 15వ ర్యాంకుతో బి.వెంకటేశ్ తొలి 20 మందిలో నిలవడం అభినందనీయమని ఆయన పేర్కొన్నారు. పిఠాపురం పట్టణానికి చెందిన చక్కా స్నేహిత్ 94వ ర్యాంకు సాధించడం ముదావహమన్నారు. విజేతలందరికీ ఒక ప్రకటనలో ఆయన అభినందనలు తెలిపారు. సివిల్ సర్వీసెస్ డే సందర్భంగా ప్రజలే దేవుళ్ల అనే సూత్రాన్ని పాటించాలన్న ప్రధాని మోడీ మాటలను గుర్తుంచుకోవాలని విజేతలకు పవన్‌కళ్యాణ్ సూచించారు.

# మద్యం అమ్మకాలకు వ్యక్తిగత గరిష్ట పరిధి ఉండేలా చేయాలంటూ హైకోర్టులో పిల్

**విజయవాడ,ఏప్రిల్23,ప్రభాతవార్తప్రతినిధి:** మద్యం అమ్మకాలకు వ్యక్తిగత గరిష్ట పరిధి ఉండేలా చేయాలంటూ హైకోర్టులో పిల్ దాఖలైంది. ఒక నెలలో గరిష్టంగా విక్రయించే మద్యం బాటిళ్ల అమ్మకాలకు పరిమితిని విధించేలా రాష్ట్ర ప్రభుత్వాన్ని ఆదేశించాలని, మద్యం విక్రయాలన్నింటినీ ఆధార్‌తో అనుసంధానం చేసేలా ఉత్తర్వులివ్వాలని పిల్‌లో కోరారు. ఈ మేరకు విశాఖపట్నంకు చెందిన వైద్యులు డాక్టర్ షిరిన్ రహ్మాన్ పిల్ వేశారు. మద్యాన్ని 21 ఏళ్ల లోపు వారు కొనుగోలు చేయకుండా నియంత్రించాలన్నారు. సామాజిక న్యాయ సాధికారత మంత్రిత్వశాఖ మార్గదర్శకాల మేర జిల్లా, రాష్ట్ర స్థాయి నషా ముక్తి కమిటీలను ఏర్పాటు చేసేలా ఆదేశాలు ఇవ్వాలని కోరారు. ఇందులో ఎక్సైజ్‌శాఖ కార్యదర్శి, కమిషన్, వైద్యారోగ్యశాఖ కార్యదర్శిని ప్రతివాదులుగా చేశారు. రిటైర్డు అటవీశాఖ అధికారి మూర్తి వ్యక్తిగత స్వేచ్ఛకు భంగం కలిగించొద్దు హైకోర్టు ఆదేశం సీనియర్ ఐఎఎస్ ఆర్‌పి సిసోడియా ఒఎస్‌డిగా పనిచేసిన రిటైర్డు అటవీశాఖ అధికారి ఎంవివిఎస్ఎన్ మూర్తి వ్యక్తిగత స్వేచ్ఛకు భంగం కలిగించరాదని, ఈ విషయంలో జోక్యం చేసుకోరాదని పోలీసులను హైకోర్టు ఆదేశించింది. ఇంటెలిజెన్స్ అధికారులకిచ్చిన వాంగ్మూలాన్ని ఉపసంహరించు కోవాలని మూర్తిని ఒత్తిడి చేయొద్దని చెప్పింది. ఈ మేరకు విజయవాడ డిప్యూటీ పోలీస్ కమిషనర్, మాచవరం పోలీస్ స్టేషన్ ఎస్‌హెచ్‌ఒలను ఆదేశిస్తూ జస్టిస్ హరినాథ్ ఆదేశాలిచ్చారు. సిసోడియా సూచనల మేరకు ఆయన మనుషులు తనను కిడ్నాప్ చేశారని, దీనిపై విజయవాడ డిప్యూటీ పోలీస్ కమిషనర్, మాచవరం పోలీస్ స్టేషన్ ఎస్‌హెచ్‌ఒలకు తానిచ్చిన వాంగ్మూలాన్ని వాపస్ తీసుకోవాలని ఒత్తిడి చేస్తున్నారంటూ మూర్తి పిటిషన్ వేశారు. గత ఫిబ్రవరి 27న సిసోడియా మనుషులు తనను కిడ్నాప్ చేశారన్నారు. దీనిపై హైకోర్టు పైవిధంగా ఉత్తర్వులు జారీ చేసింది.

# అమరావతిలో హరిత ప్రాజెక్టుల అభివృద్ధికి ఆరావళి బయోడైవర్సిటీ సహకారం

**విజయవాడ, ఏప్రిల్ 23, ప్రభాతవార్త :** ఆంధ్రప్రదేశ్ రాజధానిలో హరిత ప్రాజెక్టుల అభివృద్ధికి ఆరావళి బయో డైవర్శిటీ ఆమోదం తెలిపింది. బుధవారం అమరావతి అభివృద్ధి సంస్థ (ఏడిసి) సిఎండి డి లక్ష్మి పార్ధసారధి ఢిల్లీలోని యమునా బయో డైవర్శిటీ పార్కు పరిశీలించారు. ఈ సందర్భంగా ఆరావళి బయో డైవర్శిటీ పార్కులను స్థాపించిన ఇన్‌చార్జ్ ప్రొఫెసర్ సిఆర్ బాబుతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా వారు అభివృద్ధి చేసిన ఉద్యానవనాలను పరిశీలించారు.

బయోడైవర్శిటీ పార్కుల అభివృద్ధిలో బాబు వారి బృందం చేపట్టిన విధానాలను ఏడిసి ప్రతినిధులకు వివరించారు.

ఈ సందర్భంగా సిఎండి లక్ష్మి పార్ధసారధి తీపి నారింజ మొక్కను నాటారు. ఈ పర్యటనలో ఏడిపి హార్టికల్చర్ విభాగాధిపతి విఎస్ ధర్మజ వున్నారు.

# మే 6న గంగమ్మజాతరకు చాటింపు

**తిరుపతి,ఏప్రిల్ 23ప్రభాతవార్తప్రతినిధి:** ఆధ్యాత్మికనగరం తిరుపతి గ్రామదేవతగా కొలువై పూజలందుకుంటున్న తాతయ్యగుంట గంగమ్మ ఆలయ జాతర వారంరోజులుపాటు జరుగుతుంది. రాయలసీమజిల్లాల్లోనేగాక తెలుగురాష్ట్రాల్లో ఎక్కడా అమ్మవారి జాతరలు వారం రోజులు నిర్వహించరు. తిరుపతి తాతయ్యగుంటగంగమ్మ జాతర వేడుకలు వారంరోజులు పాటు భక్తితో అంగరంగ వైభవంగా జరిపించడం ఆనవాయితీ. రానున్న మేనెలలో 6వతేదీ మంగళవారం రాత్రి తిరుపతి రూరల్ అవిలాల నుండి సారెతో ఆలయ పూజారులు వచ్చి నగరంలో చాటింపు వేస్తారు. ఇక మరుసటిరోజు మేనెల 7వతేదీ బుధవారం నుండి 13వతేదీ మంగళవారం వరకు వివిధ రకాల అలంకరణల్లో గంగమ్మ దర్శనమిస్తుంది. తిరుపతి తిరుమల పరిసరాల్లోనే భక్తులేగాక తమిళనాడు, కర్నాటక రాష్ట్రాల నుండి భక్తులు భారీగా వస్తారు. ఒక్కోరోజు ఒక్కోరక వేషధారణలో భక్తులు అమ్మవారిని దర్శించుకుంటారు. మేనెల 7వతేదీ తొలివేషంగా బైరాగివేషం, 8వతేదీ బండవేషం, 9న తోటివేషం, 10న దొరవేషం, 11న మాతంగివేషం, 12న సున్నపుకుండలు 13వతేదీ మంగళవారం అమ్మవారి జాతర, అర్ధరాత్రి అమ్మవారి విశ్వరూపం చెంపనరకడంతో జాతర పరిసమాప్తమవుతుంది. ఈ జాతర వేడుకలకు టిటిడి, తుడ, నగరపాలకసంస్థ సహకారం అందిస్తారు.

# ఇక నుండి తరచుగా ఆకస్మిక తనీఖీలు : ఏడిసిపి గుణ్ణం రామకృష్ణ

## -పత్రాలు లేని 50 వాహనాల సీజ్ -అదుపులోకి 5 గురు అనుమానితులు

విజయవాడ క్రైం,ఏప్రిల్ 23,ప్రభాతవార్త: ఇక నుండి తరచుగా కార్డన్ సెర్చ్‌తో పాటు ఆకస్మిక తనిఖీలు,వాహన తనిఖీలు,డ్రంక్ అండ్ డ్రైవ్



కార్యక్రమాలు నిరంతరం నిర్వహిస్తామని ఏడిసిపి గుణ్ణం రామకృష్ణ పేర్కొనా న్నరు. ఎన్టీఆర్ జిల్లాలో శాంతి భద్రతల పరిరక్షణ చర్యల్లో భాగంగా,సంఘ వ్యతిరేక శక్తులు,అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడే వ్యక్తులు,సామాన్య ప్రజానీకాన్ని ఇబ్బందులకు గురి చేసే వారిని గుర్తించే దిశగా ప్రజలకు మేమున్నామని భరోసా ఇచ్చేందుకు సిపి రాజశేఖరబాబు ఆదేశాల మేరకు ఇన్‌చార్జి డిసిపి గుణ్ణం రామకృష్ణ,పశ్చిమ ఎసిపి దుర్గారావు, పశ్చిమ జోన్ సిఐలు చిన్న కొండలరావు, గురుప్రకాష్ ,చంద్రశేఖర్, ఉమామహేశ్వరరావు కృష్ణ మోహన్,శ్రీలక్ష్మీ నారాయణలు వారి సిబ్బందితో మొత్తం 103 మంది అధిరారులు,సిబ్బందితో కలిసి ఎన్టీఆర్ జిల్లా పోలీస్ కమీషనరేట్ లోని పశ్చిమ డివిజన్,టూ టౌన్ పోలీస్ స్టేషన్ పరిధి లోని వైఎస్ఆర్ కాలనీ పరిసర ప్రాంతాల్లో బుధవారం తెల్లవారుజామున 5 గంటల నుండి 8 గంటల వరకు కార్డన్ అండ్ సెర్చ్ నిర్వహించారు. ఈ సందర్భంగా 350 వాహనాలను తనిఖీ చేసి సరైన పత్రాలు లేని 50 వాహనాలను స్వాధీనం చేసుకున్నారు. 640 ఫ్లాట్లను తనిఖీ చేసి ఐరిస్ వాహనం ద్వారా 128 మందిని తనిఖీ చేసి 5 గురు అనుమానితులను అదుపులోకి తీసుకున్నారు.ఈ సంధ్బంగా ఏడిసిపి గుణ్ణం రామకృష్ణ మాట్లాడుతూ సిపి ఆదేశాల మేరకు అసాంఘిక కార్యకలాపాలు జరుగుతాయని గుర్తించబడిన పరిసర ప్రాంతాల్లో అణువణువు క్షుణ్ణంగా సోదాలు చేసామన్నారు. గంజాయి,ఇతర మత్తు పదార్థాల విక్రయాలు,వినియోగంపై అనుమానం ఉన్న వ్యక్తులపై ఆరా తీసామని, శాంతి భద్రతలకు భంగం కల్గించే అసాంఘిక శక్తులపై పూర్తి నిఘా ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. రాత్రి సమయాల్లో చిన్న చిన్న సంఘటనలు,పెద్ద సంఘటనలుగా ప్రజల్లో వ్యాప్తి చెందుతున్నాయని, ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా ఉండటానికి ప్రతిరోజు అన్ని ముఖ్య ప్రదేశాల్లో కార్డన్ అండ్ సెర్చ్,ఆకస్మిక తనిఖీలు,వాహన తనిఖీలు,డ్రంక్ అండ్ డ్రైవ్ కార్యక్రమాలు నిరంతరం నిర్వహించడం జరుగుతుందన్నారు. జిల్లా వ్యాప్తంగా ఇటువంటి ఘర్షణలకు అస్కారం లేకుండా,అసత్య ప్రచారాలను నియంత్రించేలా పోలీసులు చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు. ఇక నుండి తరచుగా కార్డన్ సెర్చ్ నిర్వహించడంతో పాటు అన్ని ప్రాంతాల్లో తనిఖీలు డ్రంక్ అండ్ డ్రైవ్ జరుగుతాయన్నారు. నేరాలు,ఘర్షణలు,నియంత్రణకు పూర్తి స్థాయిలో అవసరమైన చర్యలు తీసుకుంటామని ఆయన స్పష్టం చేశారు.

# 598 మార్కులు సాధించిన ఒప్పిచర్ల ప్రభుత్వ పాఠశాల విద్యార్థిని పావనిచంద్రిక

## - అభినందించిన ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మానందరెడ్డి



మాచర్లటౌన్, ఏప్రిల్ 23 ప్రభాతవార్త: పది ఫలితాల్లో ఒప్పిచర్ల ప్రభుత్వ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థిని అంగడి పావని చంద్రిక 598 మార్కులతో సత్తా చాటించింది. రాష్ట్ర ప్రభుత్వ పాఠశాల ఫలితాల్లో మొదటిస్థానంలో నిలిచింది. ఈ సందర్భంగా ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మానందరెడ్డి మాట్లాడుతూ కార్పొరేట్‌కు ధీటుగా పోటీ పడుదూ ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు పదిలో సత్తాచాటడం మంత్రి లోకేష్ నిబద్ధతకు నిదర్శనమన్నారు. పావని చంద్రిక తండ్రికి నేరుగా ఫోన్ చేసి విద్యార్థికి అభినందనలు తెలిపారు. రాష్ట్ర స్థాయిలో ఉత్తమ ప్రతిభ కనబరచడం మాచర్ల నియోజకవర్గానికేకాక పలనాడుకే గర్వకారణమని అన్నారు. భవిష్యత్తులో ఉన్నతస్థాయికి ఎదగాలని ఎమ్మెల్యే ఆకాంక్షించారు. ఈ సందర్భంగా విద్యార్థిని పావనిచంద్రికకు, పాఠశాల ఉపాధ్యాయులకు ఒప్పిచర్ల తెదేపా రాష్ట్ర వాణిజ్య విభాగం కార్యదర్శి, మాజీ వైస్ ఎంపీపీ పంగులూరి పుల్లయ్య, గ్రామ పార్టీ నాయకులు అభినందనలు తెలిపారు.

# ఉగ్రదాడికి పాల్పడిన వారిని సహించేది లేదు

## -భాజపా గుంటూరు జిల్లా అధ్యక్షులు చెరుకూరి తిరుపతిరావు

గుంటూరుతూర్పు,ఏప్రిల్23,ప్రభాతవార్త: కాశ్మీర్ అభివృద్ధి ఆపటం ఎవరితరం కాదు. ఉగ్రదాడికి పాల్పడినటువంటి వారిని సహించేది లేదని బిజెపి గుంటూరు జిల్లా అధ్యక్షులు చెరుకూరి తిరుపతిరావు అన్నారు.



బుధవారం కాశ్మీర్లో అమాయక ప్రజల పైన జరిగినటువంటి అమానుషమైన దాడికి నిరసనగా స్థానిక లాడ్జి సెంటర్ నుంచి శంకర్ విలాస్ వరకు కొవ్వొత్తుల ర్యాలీని గుంటూరు జిల్లా భారతీయ జనతా పార్టీ ఆధ్వర్యంలో నిర్వహించి వారి ఆత్మకు శాంతి జరగాలని కోరుకున్నారు. ఈ సందర్భంగా బిజెపి గుంటూరు జిల్లా అధ్యక్షులు చెరుకూరి తిరుపతిరావు మాట్లాడుతూ కాశ్మీర్లో జరిగిన ఉగ్రవాదదాడిని తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. ఈ సంఘటన భారతదేశ చరిత్రలో ఒక చీకటి రోజుగా నిలిచిందని, ఈ సంఘటనలో ప్రాణాలు కోల్పోయినటువంటి వారి కుటుంబ సభ్యులకూ భారతీయ జనతాపార్టీ అండగా నిలుస్తుందని, ఈ దాడికి పాల్పడినటువంటి వారిపై ఊహించలేని స్థాయిలో ప్రతిదాడి చేయడానికి భారత సైన్యం సిద్ధంగా ఉందని దానికి కావాల్సిన వ్యూహరచన జరుగుతుంది అని అన్నారు. రాబోయే రోజుల్లో ఇలాంటి సంఘటనలు జరగకుండా ఉండే విధంగా కేంద్ర ప్రభుత్వం నూతన కార్యాచరణలను రూపొందిస్తది అని అన్నారు.

బిజెపి రాష్ట్ర అధికార ప్రతినిధి వల్లూరు జయప్రకాష్ నారాయణ మాట్లాడుతూ సరిహద్దు ప్రాయోజిత ఉగ్రవాదులు పహల్గామ్‌లో అమాయక పౌరులపై జరిపిన క్రూరమైన, నీచమైన దాడిలో విషాదకరంగా ప్రాణాలు కోల్పోయిన అమాయక పౌరుల జ్ఞాపకాలను మేము గౌరవిస్తున్నాము వారి కుటుంబాలకు మా హృదయపూర్వక సానుభూతిని తెలియజేస్తున్నాము. ఈ పిరికి ఉగ్రవాద దాడికి ప్రతిస్పందనగా కాశ్మీర్ లోయ ప్రజలలో కోపం, ద్వేషాన్ని మనం మీడియాలో చూశాము. లోయ శాంతి, అభివృద్ధి మరియు శ్రేయస్సు మార్గంలో ఉందని ఇది స్పష్టంగా చూపిస్తుంది. దేశ అంతర్గత భద్రత బలపడింది. అందుకే ఉగ్రవాదులు మరియు వారి శిబిరాలకు ఇది నిరాశగా గురయ్యారు. ఈ సమయంలో, మనం కలిసి రావాలి. బాధిత కుటుంబాలకు అండగా నిలిచి వారికి గౌరవం చూపాలి. ఈ విషయంలో రాజకీయాలకు చోటు ఉండకూడదు.బిజెపి సీనియర్ నాయకులు జూపూడి రంగరాజు మాట్లాడుతూ గత కొన్ని సంవత్సరాలుగా జమ్ము కాశ్మీర్ అభివృద్ధి ధ్యేయంగా యావత్ భారతదేశం పని చేస్తుందని అన్నారు. ఈ కార్యక్రమంలో భీమినేని చంద్రశేఖర్, ఈదర శ్రీనివాసరెడ్డి, దరక కుమార్ గౌడ్, డాక్టర్ శనక్కాయల ఉమాశంకర్, నేరళ్ల మాధవరావు, మంత్రి సుగుణ, ఏలూరి లక్ష్మి, మేరీ సరోజినీ, బొల్లా ప్రగడ శ్రీదేవి, వాణి వెంకట్, కోలా రేణుకాదేవి, గాయత్రి, రాజేష్ నాయుడు, దార అంబేద్కర్, దర్శనపు శ్రీనివాస్, కంతేటి బ్రహ్మయ్య, బజరంగ్ రామకృష్ణ,, దుర్గా ప్రసాద్, రామచంద్రరావు, తూనుగుంట్ల రాజేష్, మల్లాల లక్ష్మణ్, కామేపల్లి వెంకటేశ్వర్లు, మోతే శేషగిరి, పోతురాజు వెంకటేశ్వర్లు, తానుచింతల అనిల్, సాధు రామకృష్ణ, షేక్ బిలాల్, శ్రీను నాయక్, పద్మనాభం, రాజా అజయ్ కృష్ణ, షేక్ సాంబశివరావు, సురేష్ జైన్, కృష్ణ చైతన్య, పేరుమళ్ల పద్మనాభం, వక్కలగడ్డ తిరుమలరావు సాంబమూర్తి, నాగసాయి, కారం శెట్టి రమేష్, చంద్రశేఖర్, తాడువాయి రామకృష్ణ, సాంబయ్య, సాయి తదితరులు పాల్గొన్నారు.

# వ్యాసరచన, చిత్రలేఖనం పోటీలు

తెనాలి, ఏప్రియల్ 23 (ప్రభాతవార్త) : పట్టణంలోని రావి రవీంద్రనాథ్ నగర్‌లో గల ఆంధ్రప్రదేశ్ గిరిజన సంక్షేమ వసతి గృహ బాలికల పాఠశాల యందు ఈనెల 25వ తేదిన ప్రపంచ మలేరియా దినోత్సవంపై వ్యాసరచన, మరియు చిత్రలేఖనం పోటీలను నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా మలేరియా అధికారి తలాటం మురళీకృష్ణ సుబ్బారాయణం మాట్లాడుతూ



2027నాటికి మలేరియా కేసుల సంఖ్య జీరో రావాలని, 2030నాటికి మలేరియా రహిత భారతదేశం సాధించాలని ప్రభుత్వ లక్ష్యంగా నిర్దేశించిందని, ప్రజలు దీనిపై పూర్తిగా అవగాహన కలిగించుట ద్వారానే ఇది సాధ్యమవుతుందని ప్రతి ఒక్కరూ నీటి నిల్వలు లేకుండా చూసుకోవాలని కోరారు. వ్యాసరచన పోటీల్లో గెలుపొందిన ప్రథమ బహుమతి హారిక, ద్వితీయ బహుమతి శ్రావణి, తృతీయ బహుమతి లక్ష్మీప్రసన్న కైవసం చేసుకోగా చిత్రలేఖనం పోటీల్లో ప్రథమ బహుమతి దుర్గాభవాని, ద్వితీయ బహుమతి స్వాతి, తృతీయ బహుమతి కావ్యశ్రీ కైవసం చేసుకోగా జిల్లా మలేరియా అధికారి బహుమతులు ప్రధానం చేశారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ బండి విజయ్‌కుమార్, ఉపాధ్యాయునిలు బి.నాగమణి, టీవీఎస్ నాగలక్ష్మి, తెనాలి ఇన్‌చార్జి సహాయ మలేరియా అధికారి వంగల పున్నారెడ్డి, పట్టణ యూనిట్ అధికారి శ్రీకంత ఉమాకాంత్, సదాశివ గణేష్, ఆరోగ్య విస్తరణాధికారి అందెబాల చంద్రమౌళి, మలేరియా సూపర్‌వైజర్ దీపాల శ్రీనివాసరావు, బండారు మల్లేశ్వరరావు, దాసరి శివ నాగమల్లేశ్వరరావు, ఫైలేరియా జూనియర్ హెల్త్ ఇన్‌స్పెక్టర్ తిరువీధుల శివరామప్రసాద్, హెల్త్ అసిస్టెంట్ సయ్యద్ కరిముల్లా, దీపాల శ్రీనివాసరావు, ఆలా వేణుగోపాల్, సంకాశరత్‌బాబు, షేక్ నవీద్, ఏఎన్ఎం రాజ్యం, ఆశా కార్యకర్త యశోద తదితరులు పాల్గొన్నారు.

# పది ఫలితాలలో 598 మార్కులతో సత్తా చాటిన విద్యార్థిని హాసినికి ఎమ్మెల్యే నసీర్ అభినందనలు

గుంటూరుతూర్పు,ఏప్రిల్23,ప్రభాతవార్త : పదోవ తరగతి ఫలితాల్లో రాష్ట్ర స్థాయిలో 3వ ర్యాంకు సాధించిన పల్లపోతు హాసినిని గుంటూరు తూర్పు ఎమ్మెల్యే మొహమ్మద్ నసీర్ అభినందించారు. బుధవారం



విడుదలైన పదోవ తరగతి ఫలితాల్లో 598 మార్కులతో హాసిని సత్తా చాటింది. ఈ సందర్భంగా గుంటూరు తూర్పు ఎమ్మెల్యే కార్యాలయంలో విద్యార్థిని హాసినిని ఎమ్మెల్యే అభినందించారు. హాసిని పదోవ తరగతి ఫలితాల్లో ఉత్తమ ప్రతిభ చాటి గుంటూరు తూర్పు నియోజకవర్గానికి ఖ్యాతి తీసుకొచ్చిందని ఎమ్మెల్యే నసీర్ కొనియాడారు. ఈ సందర్భంగా ఆమె చదువులకు ఎలాంటి సాయం కావాలన్నా అందిస్తానని భరోసా ఇచ్చారు.

# పది ఫలితాల్లో ఒప్పిచర్ల విద్యార్థినికి స్టేట్ ర్యాంకు

## - అభినందనలు తెలిపిన ఎమ్మెల్యే జూలకంటి

కారంపూడి, ఏప్రిల్ 23 ప్రభాతవార్త: పదో తరగతి పబ్లిక్ పరీక్షల్లో మండలంలోని ఒప్పిచర్ల జిల్లా పరిషత్ హైస్కూల్ విద్యార్థిని అంగడి పావని చంద్రిక స్టేట్ ఫస్ట్ ర్యాంకు సాధించింది. మార్చి నెలలో జరిగిన పరీక్షల్లో మండలంలో 684 మంది విద్యార్థులకు పరీక్షలకు హాజరుకాగా 561 మంది విద్యార్థులు ఉత్తీర్ణులయ్యారు. చినగార్లపాడు జడ్పీ హైస్కూలు నుంచి 26 మంది, మిరియాల జడ్పీ స్కూల్ నుంచి 27 మంది, పెదకొదమగుండ్ల జడ్పీ స్కూల్ నుంచి 63, కారంపూడి జడ్పీ స్కూల్ నుంచి 111, ఒప్పిచర్ల జడ్పీ స్కూల్ 45 మంది, బీఆర్ అంబేద్కర్ గురుకులం 63, కస్తూరిబా గాంధీ పాఠశాల 38, మోడల్ స్కూల్ 80, ఏపీటీడబ్ల్యూఎస్ బాలుర పాఠశాల 23, ఏపీటీడబ్ల్యూఎస్ బాలికలు 16, ప్రభుత్వ గుర్తింపు పొందిన అక్షర ఇంగ్లీష్ మీడియం 3, సెయింట్ జాన్ ఇంగ్లీష్ మీడియం స్కూల్ 51, వివేకానంద 16, రెయిన్‌బో 90, దివ్యసాయి 32 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరుకాగా ఒప్పిచర్ల జిల్లా పరిషత్ హైస్కూలు విద్యార్థిని 500 మార్కులకు 598 మార్కులు సాధించి ప్రభుత్వ పాఠశాలల ఫలితాల్లో స్టేట్ ర్యాంకుల పట్టికలో నిలిచింది. ప్రభుత్వ పాఠశాలలు వేగంగా పునరుజ్జీవం పోసుకుంటున్నాయని కూటమి ప్రనభుత్వంలో విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ నేతృత్వంలో కారంపూడి మండలం ఒప్పిచర్ల జడ్పీ హైస్కూల్ విద్యార్థిని పావని చంద్రిక సత్తా చాటడం హర్షణీయమని శాసనసభ్యులు జూలకంటి బ్రహ్మానందరెడ్డి అన్నారు. కార్పొరేట్ విద్యాసంస్థలకు ధీటుగా పోటీ పడుతూ ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు పదో తరగతిలో సత్తా చాటడం నిదర్శనమని అన్నారు. పావని చంద్రిక తండ్రికి ఫోన్ చేసి విద్యార్థినిని అభినందించారు. రాష్ట్రస్థాయిలో ఉత్తమ ప్రతిభ కనబరచడం పల్నాడుకే గర్వకారణమని అన్నారు. విద్యార్థిని పావని చంత్రికను కూటమి నేతలు అధికారులు అభినందించారు. కారంపూడి బ్రహ్మనాయుడు జిల్లా పరిషత్ హైస్కూల్ విద్యార్థి కె.కావ్య 591 మార్కులు, బీఆర్ అంబేద్కర్ గురుకులం విద్యార్థి సీహెచ్ షాలెం 529 మార్కులు సాధించారు.

# సీనియర్ సిటిజన్స్‌కు సాయికృష్ణ మల్టీస్పెషాల్టీ వైద్యశాల ఉచిత వైద్య శిబిరం

నరసరావుపేట, ఏప్రిల్ 23 ప్రభాతవార్త : సాయికృష్ణ మల్టీస్పెషాల్టీ హాస్పిటల్స్ ఆధ్వర్యంలో పెన్షనర్స్, సీనియర్ సిటిజన్స్‌కు అవగాహన



సదస్సు,ఉచిత వైద్యశిబిరం బుధవారం నిర్వహించారు. పెన్షనర్స్ అసోసియేషన్ కార్యాలయంలో వైద్యశాల ఛైర్మన్ డాక్టర్ సింగరాజు సాయికృష్ణ,డాక్టర్ సింగరాజు విద్యలు శిబిరానికి హాజరైన వారికి వైద్య పరీక్షలు నిర్వహించారు. వారికి అవసరమైన వైద్య సలహాలు అందించారు. అవసరమైన వారికి ఉచితంగా మందులు పంపిణి చేసారు. తమ వైద్యశాలలో సీనియర్ సిటీజన్స్‌కు ప్రాధన్యత ఇచ్చి వారికి వైద్య సేవలలో రాయితీ ఇవ్వటం జరుగుతుందని తెలిపారు. ముఖ్యంగా బిపి, షుగర్, థైరాయిడ్, విష జ్వరాలు, మలేరియా, టైఫాయిడ్, డెంగ్యూ, పాముకాటు, పురుగుమందు కేసులు, లివర్ సంబంధించిన వ్యాధులు, ఆయాసం, నెమ్ము, ఉబ్బసం, దగ్గు, కాళ్ళవాపులు, శ్వాసకోస సంబంధింత వ్యాధులతో పాటు జనరల్ వ్యాధులకువైద్య సేవలు అందిస్తున్నామని తెలిపారు. తమ వైద్యశాలలో అత్యాధునిక వసతులతో కూడిన ఐసీయూ, క్రిటికల్ కేర్, ల్యాబ్, అందుబాటులో ఉన్నాయని డాక్టర్ సింగరాజు సాయికృష్ణ తెలిపారు.

# ఉగ్రదాడిని ఖండించిన విద్యార్థి నాయకులు

ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం,ఏప్రిల్ 23,ప్రభాతవార్త : జమ్మూకాశ్మీర్‌లో మంగళవారం జరిగిన మారణహోమంలో 27మంది ప్రాణాలు కోల్పోవడం బాధాకరమని ఏఎన్‌యులో విద్యార్థి సంఘ నాయకులు పేర్కొన్నారు.ఈ ఘటన చాలా బాధాకరమని అన్నారు.ఇలాంటిఒ దాడులను ఖండిస్తున్నటు్లు పేర్కొన్నారు.ఈ మేరకు ఏబివిపి విద్యార్థి సంఘం బుధవారం యూనివర్సిటీ లో కొవ్వొత్తుల ర్యాలీ



నిర్వహించింది.విద్యార్థులు పరిశోధకులు ఉగ్రవాదానికి వ్యతిరేకింగా ఐక్యతను ప్రదర్శించారు.ప్రాణాలు కోల్పోయిన వారికి ఏబివిపి తన ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు.ఇటుంటి ఉగ్రదాడులను నిలువరించాల్సిన ఆవశ్యకత ఎంతైనా ఉందని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో స్టేట్ సోధ్ కన్వీనర్ రమాకాంత్,స్టేట్ టెక్నికల్ సెల్ కన్వీనర్ మోహనరావు,విశ్వవిద్యాలయ రాష్ట్ర కన్వీనర్ గంగాధర్ స్టేట్ కోకన్వీనర్ శివగణేష్ యూనివర్సిటీ ఉపాధ్యక్షులు హేమంత్ రామ్‌లు పాల్గొన్నారు.కాగా ఏఐఎస్ఎఫ్ వర్సిటీ అధ్యక్షుడు పాలం నాసరయ్య మాట్లాడుతూ దేశంలో ప్రజలకు శాంతి భద్రతల విషయంలో రక్షణ లేకుండా పోయిందని ఆవేదన వ్యక్తంచేశారు.దీనికి జమ్మూ కాశ్మీర్‌లో జరిగిన దాడే ఉదాహరణగా పేర్కొన్నారు.

# టెన్త్‌లో కెజిబివి ప్రభంజనం

## - 525 మార్కులతో ఎం వర్షిత మండల ఫస్ట్

ఎ కొండూరు, ఏప్రిల్ 23, ప్రభాతవార్త : ఎన్టీఆర్ జిల్లా ఎ కొండూరు మండల కేంద్రంలోని కస్తూర్బా గాంధీ (కెజిబివి) టెన్స్ పరీక్షా ఫలితాల్లో విద్యార్థులు ప్రభంజనం సృష్టించారు. ఈ కెజిబివిలో



మాలాజి వర్షిత 525, శీలం శ్రీజా 506, మాలాజి అనురాధ 503 మార్కులు, మాలాజి వర్షిత 525 మార్కులు సాధించి మండలంలో ప్రథమస్థానంలో నిలిచింది ఈ ఏడాది ఈ పది పలితాల్లో ఈ విధంగా విద్యార్థినులు ప్రభంజనం సాధించడానికి ప్రిన్సిపాల్ ఎస్‌కె మీరుసా బేగం కృషిని విద్యార్థినుల తల్లిదండ్రులు అభినందించారు. ఈ సందర్భంగా ఈ కెజిబివిలో పదిలో ప్రభంజనంగా సృష్టించగా ఇంటర్‌లో మాత్రం ఫలితాలు ఆశించిన స్థాయిలో లేకపోవడం ఇంటర్ విద్య సంవత్సరం ఆఖరులో ప్రిన్సిపాల్ మీరున్నీసా బేగంను జిల్లా కలెక్టర్ సస్పెండ్ చేయడం వల్ల ఇంటర్ విద్యార్థినుల తల్లిదండ్రులు ఆందోళన వ్యక్తం చేశారు.

# జల జీవన్ మిషన్ ద్వార రూ.25 లక్షలతో కుళాయి కనెక్షన్లు

బాపట్ల,ఏప్రిల్23,ప్రభాతవార్త: చిన్న కొత్త గొల్లపాలెం గ్రామంలో జల జీవన్ మిషన్ కింద రూ.25 లక్షలతో కుళాయి కనెక్షన్లు ఇస్తున్నట్లు జిల్లా కలెక్టర్ జె వెంకట మురళి తెలిపారు. రాష్ట్ర ముఖ్యమంత్రి పర్యటనలో భాగంగా ఇచ్చిన హామీల అమలుపై జిల్లా అధికారులతో బుధవారం స్థానిక కలెక్టర్ క్యాంపు కార్యాలయంలో ఆయన సమావేశం నిర్వహించారు. ప్రతి ఇంటికి తాగునీరు అందించడానికి జల జీవన్ మిషన్ కింద పనులు మంజూరు చేశామని కలెక్టర్ చెప్పారు. తద్వారా సురక్షితమైన తాగునీరు ఆ గ్రామ ప్రజలకు అందుతుందన్నారు. 9 కుటుంబాలకు గ్యాస్ కనెక్షన్ల మంజూరు ప్రక్రియ వారంలో ముగుస్తుందన్నారు. గ్రామంలో సిసి రోడ్ల నిర్మాణానికి ఉపాధి హామీ పథకం కింద రూ. ఒక కోటి నిధులు మంజూరు చేశామన్నారు. డి ఎం ఎఫ్ కింద రహదారుల నిర్మాణానికి మరో రూ.3.15 కోట్లకు ప్రతిపాదనలు సిద్ధం చేశామన్నారు. ఎనిమిది మందికి బిసి కార్పొరేషన్ రుణాలు మంజూరు చేశామన్నారు. 249 ఇంకుడు గుంతల నిర్మాణానికి చర్యలు తీసుకోవాలన్నారు. ఐదు మండలాలలో అంబేద్కర్ భవనాలకు స్థలం కేటాయింపులు జరిగాయన్నారు. ఈ సమావేశంలో జిల్లా రెవిన్యూ అధికారి జి గంగాధర్ గౌడ్, జిల్లా అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# విద్యార్థులకు ఉత్తమ విద్యను అందించడం అభినందనీయం

## -వేమూరు సిఐ వీరాంజనేయ

కొల్లూరు, ఏప్రియల్ 23 (ప్రభాతవార్త) : గ్రామీణ ప్రాంతాల్లో ఫోర్ ఫ్రంట్ ఇంటర్నేషనల్ ఇంగ్లీష్ మీడియం స్కూల్ కొల్లూరులో ఏర్పాటు చేసి విద్యార్డులకు ఉత్తమ విద్యను అందించడం అభినందనీయమని వేమూరు సిఐ వీరాంజనేయ అన్నారు. బుధవారం సాయంత్రం మండల కేంద్రమైన కొల్లూరులోని ఫోర్ ఫ్రంట్ ఇంటర్నేషనల్ ఇంగ్లీష్ మీడియం స్కూల్ ఆవరణలో జరిగిన స్కూల్ యూనివర్సరీ డే ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వేమూరు సిఐ వీరాంజనేయులు మాట్లాడుతూ ఈ ప్రాంతంలో ఇంగ్లీష్ మీడియం స్కూల్ ఏర్పాటు చేసిన స్కూల్ డైరెక్టర్ నవీనపాల్‌ను ఆయన్ను అభినందించారు. ఈ సందర్భంగా జరిగిన సభకు స్కూల్ ప్రిన్సిపాల్ అనిత కుమారి రాజన్ అత్యక్షత వహించారు. కొల్లూరు స్టేట్ బ్యాంక్ మేనేజర్ రమేష్ మాట్లాడుతూ ఇంగ్లీష్ మీడియం విద్యతో పాటు కరాటే, డాన్స్‌లు నందు విద్యార్థులకు శిక్షణ ఇప్పించడం ఎంత ఉపయోగం ఉంటుందని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో వేమూరు సిఐ వీరాంజనేయ, కొల్లూరు స్టేట్ బ్యాంక్ మేనేజర్ రమేష్, స్కూల్ డైరెక్టర్ తెనాలి నవీన్‌పాల్, ప్రిన్సిపాల్ అనితకుమారి రాజన్‌లు వివిద పోటీలలో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు, సర్టిఫికెట్లును అందజేశారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు. తొలుత విద్యార్థి చేసిన నృత్య ప్రదర్శనలు ప్రేక్షకులను ఆకట్టుకున్నాయి.

# ఆలయ అభివృద్ధికి నూతన కమిటీ సభ్యులు కృషి చేయాలి

## -మార్కెట్ యార్డ్ చైర్మన్ జవాద్ కిరణ్

మంగళగిరి, ఏప్రిల్ 23, ప్రభాతవార్త: ఆలయ అభివృద్ధికి నూతన కమిటీ చైర్మన్ సభ్యులు తమ వంతుగా కృషిచేసి మరింత అభివృద్ధి చేయాలని మార్కెట్ యార్డ్ చైర్మన్ జవాద్ కిరణ్ కోరారు.



మంగళగిరి నగరంలోని శ్రీ గంగా భ్రమరాంబ సమేత మల్లేశ్వరస్వామివార్ల దేవస్థానం పాలకమండలి ప్రమాణస్వీకారం బుధవారం ఆలయ ప్రాంగణంలో వేడుకగా నిర్వహించారు. కమిటీ చైర్మన్ గా భోగి కోటేశ్వరరావు సహా 8మంది కమిటీ సభ్యులు, ఎక్స్ ఆఫీషియో సభ్యులుగా ఆలయ ప్రధాన అర్చకులు మహేష్ కుమార్ శర్మలు ప్రమాణ స్వీకారం చేశారు. తొలుత నగరంలో ర్యాలీ నిర్వహించారు. కోటేశ్వరరావు మాట్లాడుతూ ఆలయ అభివృద్ధికి కృషిచేస్తానన్నారు.ఈ కార్యక్రమం లో మంగళగిరి మార్కెట్ యార్డ్ చైర్మన్ జవ్వాది కిరణ్ చంద్ పాల్గొని నూతన కమిటీ చైర్మన్ సభ్యులకు శుభాకాంక్షలు తెలిపారు.

# 28న మునిసిపల్ వైస్ ఛైర్మన్ ఎన్నిక

మాచర్ల, ఏప్రిల్ 23 ప్రభాతవార్త: ఈ నెల 28న మాచర్ల మున్సిపల్ వైస్ ఛైర్మన్ ఎన్నిక నిర్వహించనున్నట్లు కమిషనర్ వేణుబాబు బుధవారం తెలిపారు. మాచర్ల మున్సిపల్ కౌన్సిల్ హాలులో జరిగే ఈ ఎన్నికకు సభ్యులు తప్పనిసరిగా హాజరు కావాలని కోరారు. పల్నాడు జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు ప్రిసైడింగ్ అధికారి, గురజాల రెవెన్యూ డివవిజనల్ అధికారి ఆధ్వర్యంలో ఈ ఎన్నిక జరుగుతుందన్నారు.

# రిజిస్ట్రేషన్లకు స్లాట్ బుకింగ్ తప్పనిసరి

మాచర్ల, ఏప్రిల్ 23 ప్రభాతవార్త: క్రయ విక్రయాలకు స్లాట్ బుకింగ్ తప్పనిసరని మాచర్ల ఇన్‌ఛార్జి సబ్ రిజిస్ట్రార్ కె.కిరణ్‌కుమార్ తెలిపారు. బుధవారం స్థానిక రిజిస్ట్రార్ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ ఉన్నతాధికారుల ఆదేశాల ప్రకారం క్రయ విక్రయాలకు స్లాట్ బుకింగ్ తప్పనిసరి అన్నారు. రిజిస్ట్రేషన్‌కు క్రయ విక్రయదారులు స్లాట్ బుకింగ్ అనంతరం ఇరువురి సెల్‌ఫోన్లలో ఓటీపీ తెలిపిన తరువాతే రిజిస్ట్రేషన్ చేయనున్నట్లు ఆయన తెలిపారు. ఈ నెల 26 నుంచి స్లాట్ బుకింగ్ విధానం అమల్లోకి రానున్నట్లు పేర్కొన్నారు. అవగాహన కోసం సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో సంప్రదిచాలన్నారు.

# కలెక్టరేట్ ఎదుట క్రైస్తవుల రిలే నిరాహార దీక్షలు

## -పాల్గొన్న పలు క్రైస్తవ సంఘాలు

గుంటూరు విద్య,ఏప్రిల్ 23,ప్రభాతవార్త : స్థానిక కలెక్టరేట్ ఎదుట క్రైస_్తవ ఐక్య కార్యాచరణ కమిటీ ఆధ్వర్యంలో క్రైస్తవుల రీలే నిరాహార దీక్షలు ప్రారంభమయ్యాయి. 50మంది క్రైస్తవ నాయకులు దీక్షలో పాల్గొన్నారు. ఈ



సందర్భంగా ప్రార్ధన దీక్షలో డాక్టర్ గోళ్ళమూడి రాజసుందరబాబు మాట్లాడుతూ పాస_్టర్ ప్రవీణ్ పగడాల మరణం హత్యఅని చెప్పడానికి 100రుజువులున్నాయని, ఆయన మరణ విషయంలో ప్రారంభమైన పోలీసు విచారణ మొదటి నుంచి చివరి వరకు ఆయన ప్రమాదవశాత్తు చనిపోయారని తేల్చడం సరైన విచారణ కాదని పేర్కొన్నారు. అది సరైన సమంజసమైన విచారణ కాదని ఆ విచారణ నివేదికను వ్యతిరేకిస్తున్నట్లు వెల్లడించారు. హైకోర్టు జడ్జి పర్యవేక్షణలో సిబిఐ చేత దర్యాప్తు జరిపించితే నిజాలు వెళ్లడవుతాయనీ డాక్టర్ రాజసుందర్ బాబు అన్నారు. కొన్ని కోట్ల మంది ప్రజలను పాస్టర్ ప్రవీణ్ తన ప్రసంగాల ద్వారా ఆకర్షితులవుతున్నారనేది ఒక కారణమైతే, 16రాష్ట్రాల్లో మతమార్పిడి వ్యతిరేక చట్టానికి వ్యతిరేకంగా ఆయన సుప్రీంకోర్టులో న్యాయపోరాటానికి దిగారని, వాదించడానికి సరిపోయినంత సమాచారాన్ని ఆయన సేకరించి పోరాటానిక సిద్దమయ్యారని ఇది గమనించిన మతోన్మాదులు ఆయనను మట్టుపెట్టాలని ఒక పథకం ప్రకారం హత్య చేశారని రాజ సుందరబాబు వెల్లడించారు. పాస్టర్ ప్రవీణ్ ది హత్యని తేలితే దేశంలో చాలా పెద్దపెద్ద నాయకుల గొంతుకు చుట్టుకుంటుందని వారిని రక్షించేందుకే ప్రవీణ్ మరణాన్ని ప్రమాదవశాత్తు జరిగినట్లుగా పోలీసులు తేల్చి తప్పుచేసు_్తన్నారని డాక్టర్ గోళ్ళమూడి ఆరోపించారు. నేషనల్ దళిత్ క్రిస్టియన్ వాచ్ రాష్ట్ర అధ్యక్షురాలు గద్దె రత్నశ్రీ, డాక్టర్ గోళ్ళమూడితో పాటు దీక్షలు పాల్గొన్న 50మందికి దీక్షా కండువాలు కప్పి దీక్షలను ప్రారంభించారు. గద్దె రత్నశ్రీ మాట్లాడుతూ ఈ దీక్షల కార్యక్రమంలో మహిళలు యువకులు పాస్టర్లు పాల్గొని పోరాటాన్ని జయప్రదం చేయాలని విజ్ఞప్తి చేశారు. దీక్షా శిబిరం నిర్వాహకులు, క్రైస్తవ హక్కుల పరిరక్షణ కమిటీ వ్యవస్థాపక అధ్యక్షులు మద్దు ప్రేమజ్యోతి బాబు మాట్లాడుతూ అన్ని చర్చీల పాస్టర్లు దీక్షలో పాల్గొని న్యాయపోరాటాన్ని జయప్రదం చేయాలని విజ్ఞప్తి చేశారు. శిబిరంలో ప్రసంగించిన వారిలో పెంతెకోస్తు ప్రార్ధన మందిరం, గుంటూరు జిల్లా క్రైస్తవ నాయకులు ఆరుమళ్ళ మార్కు, ఇద్వావ్యవస్థాపక గౌరవాధ్యక్షులు బడుగు విజయలక్ష్మి, బీమ్‌సేన్ సేవాదళ్ రాష్ట్ర అధ్యక్షులు నల్లపు నీలాంబరం, స ృష్టికర్త ప్రార్ధన మందిరం పాస్టర్ రవిచంద్ర, ఇమ్మానియేల్ ప్రార్ధనా మందిరం పాస్టర్ భాగ్యరాజ్, లూథరన్ చర్చి పాస్టర్ సంతోషరావు, ఇద్వా నాయకులు వేల్పూరి మరియరాణి, కోరబండి జోత్స్న, తదితరులు పాల్గొని ప్రసంగించారు.

# కార్యకర్తకు కొండంత అండగా ఎమ్మెల్యే నసీర్

## -యాక్సిడెంట్ లో చేయి కోల్పోయిన టీడీపీ కార్యకర్త బాలశౌరి. -కార్యకర్తల నిధి ద్వారా రూ.3 లక్షలు మంజూరు చేయించి ఎమ్మెల్యే...

గుంటూరుతూర్పు,ప్రభాతవార్త : పతి క్షణం కార్యకర్త కుటుంబానికి భరోసాగా నిలిచిన నసీర్...పార్టీ జెండాను భుజాన మోసిన కార్యకర్త కొండంత కష్టమొస్తే ఎమ్మెల్యే నసీర్ నేనున్నానంటూ గుండెల్లో పెట్టుకుని అండగా నిలిచారు. ఆ కార్యకర్తను తన కుటుంబ సభ్యుడిలా కంటికి రెప్పలా కాపాడారు. ప్రతిపక్షంలో ఉనప్పుడు కార్యకర్తకు ప్రమాదం జరిగితే ప్రతి క్షణం ఆ కుటుంబానికి ఆత్మస్థైర్యం కల్పించిన ఎమ్మెల్యే నసీర్ .. అధికారంలోకి వచ్చిన వెంటనే ఆర్థిక భరోసా కల్పించి నాయకుడంటే నమ్మకమని నిరూపించారు. గుంటూరు తూర్పు నియోజకర్గానికి చెందిన చల్లా బాలశౌరి 20 ఏళ్లుగా తెలుగుదేశం పార్టీలో క్రియాశీలక కార్యకర్తగా పని చేస్తుర్నున్నారు. మొదటి నుంచి పార్టీ కార్యక్రమాల్లో చురుగ్గా పాల్గొనే వారు. 2023 ఆగస్టు నెలలో చల్లా బౌలశౌరికి యాక్సిడెంట్ కావడంతో ఎడమ చేయి కోల్పోయారు. ఆ సమయంలో ప్రతిపక్షంలో ఉన్నప్పటికీ ఎమ్మెల్యే నసీర్ హాస్పిటల్ వారితో మాట్లాడి బాలశౌరి కుటుంబానికి అండగా నిలిచారు. ఎప్పటికప్పుడు బాలశౌరి యోగక్షేమాలు తెలుసుకుంటూనే ఉన్నారు. అధికారంలోకి వచ్చిన వెంటనే సీఎం చంద్రబాబు నాయుడు వద్దకు బాలశౌరి విషయాన్ని తీసుకెళ్లి కార్యకర్తల సహాయ నిధి కోసం ప్రయత్నించారు. ఈ క్రమంలో బాలశౌరికి రూ.3 లక్షల కార్యకర్తల నిధి మంజూరయ్యాయి. ఈ నగదును బుధవారం స్థానిక ఎమ్మెల్యే కార్యాలయంలో బాలశౌరికి ఎమ్మెల్యే నసీర్ అందించారు. కార్యకర్తలే తెలుగుదేశం పార్టీకి ఊపిరి అని, వారిని కాపాడుకోవడం మా బాధ్యత అని ఎమ్మెల్యే స్పష్టం చేశారు. ప్రతి క్షణం తమ కుటుంబానికి పెద్ద దిక్కుగా నిలిచిన ఎమ్మెల్యే నసీర్, ఆర్థిక సాయం అందించిన సీఎం చంద్రబాబు నాయుడుకు బాలశౌరి కృతజ్ఞతలు తెలిపారు.

24-4pg10exB.qxd:24-4pg10exB.qxd 01/01/01 9:03 AM Page 1





# మయామీ ఓపెన్‌లో ఒసాకా నిష్క్రమణ

**న్యూఢిల్లీ:** నాలుగుసార్లు గ్రాండ్‌స్లామ్ ఛాంపియన్ నవోమి ఒసాకా మాడ్రిడ్ ఓపెన్ తొలి రౌండ్‌లో లూసియా బ్రాంజెట్టి చేతిలో 4-6, 6-2, 4-6 తేడాతో ఓటమి పాలైంది. జపాన్ మాజీ ప్రపంచ నంబర్ 1, 55వ ర్యాంక్‌లో ఉన్న ఈ క్రీడాకారిణి, మొదటి సెట్‌ను కోల్పోయిన తర్వాత బలమైన రెండవ సెట్‌తో తిరిగి పోరాడింది, కానీ చివరికి తన దృఢనిశ్చయంతో ఉన్న ఇటాలియన్ ప్రత్యర్థిపై విజయం సాధించలేకపోయింది. కాగా టెన్నిస్ నుంచి 15 నెలల విరామం తర్వాత ఇంకా ఫామ్‌లో కొనసాగుతున్న ఒసాకా, చివరిసారిగా మార్చిలో మయామి ఓపెన్‌లో ఆడింది, మొదటి సెట్‌లోని నాల్గవ గేమ్‌లో రెండు బ్రేక్ పాయింట్లను సాధించింది, కానీ ఆమె దానిని తిరస్కరించింది. ఒసాకా తీవ్రంగా స్పందించే లోపు బ్రోంజెట్టి ఏడో సర్వ్‌ను బ్రేక్ చేసి దానిని అవుట్ చేసింది. 27 ఏళ్ల ఒసాకా తీవ్రంగా స్పందించేలోపు బ్రోంజెట్టి ఏడో సర్వ్‌ను బ్రేక్ చేసి దానిని అవుట్ చేసింది. ఒసాకా వెంటనే విరామం ఇచ్చింది మరియు ఆటలో తన ఐదవ బ్రేక్ పాయింట్ తీసుకున్నప్పుడు 33 వద్ద సర్వ్‌లో తిరిగి కుస్తీ పట్టినప్పటికీ, వెంటనే ఆమె మళ్ళీ బ్రేక్ అయింది. క్రాస్‌కోర్ట్ షాట్‌ను చేరుకోవడానికి ప్రయత్నించినప్పుడు ఒసాకా జారిపడటంతో బ్రాంజెట్టి విజయం సాధించింది. ఈ ఇటాలియన్ క్రీడాకారిణి రెండవ రౌండ్‌లో అమెరికన్ ప్రపంచ నంబర్ 5 మాడిసన్ కీస్‌తో తలపడుతుంది.

# 'ఏసియన్'లో భారత్ బాక్సర్ల జోరు

**న్యూఢిల్లీ:** ఆసియా అండర్-15, అండర్-17 బాక్సింగ్ ఛాంపియన్‌షిప్‌లలో భారత బాక్సర్లు తమ బలమైన ప్రస్థానం కొనసాగించారు. జోర్డాన్‌లోని అమ్మాన్‌లో జరిగిన 2వ రోజు పోటీల్లో మూడు కమాండింగ్ విజయాలు సాధించారు. ఎస్‌జిఎఫ్ 2024 బంగారు పతక విజేత టికమ్ సింగ్ (52 కిలోలు) యునైటెడ్ అరబిక్ ఎమిరేట్స్‌కు చెందిన అలీ అల్మేస్మారిపై ఆధిపత్యం చెలాయించాడు. మూడవ రౌండ్‌లో రిఫరీ స్టాప్డ్ కాంటెస్ట్‌తో బౌట్‌ను ముగించాడు. ఇక ఉధమ్ సింగ్ (54 కిలోలు) ఇరాన్‌కు చెందిన మహ్మద్‌పర్సా మోటెవాలియా నస్తనెహ్‌సారిని అవుట్ బాక్సింగ్ చేసి 50 తేడాతో క్లీన్ విజయాన్ని నమోదు చేశాడు. ఇక ఏషియన్ బాక్సింగ్ చాంపియన్‌షిప్‌లో జరిగిన బాలుర అండర్-17 63 కిలోల తొలి రౌండ్‌లో భారత యువ బాక్సర్ అమన్ సివాచ్ 41తో కిర్గిస్థాన్‌కు చెందిన అబుబకీర్ దుషీవ్‌పై అద్భుత విజయం సాధించాడు. ఆది నుంచే తనదైన జోరు కనబరిచిన అమన్..ప్రత్యర్థి బాక్సర్‌పై పదునైన పంచ్‌లతో చెలరేగాడు.



ఆట



# పసికూన జింబాబ్వే సంచలన విజయం

## 3 వికెట్ల తేడాతో స్వంత గడ్డపై బంగ్లాదేశ్ చిత్తు

**న్యూఢిల్లీ:** బంగ్లాదేశ్ క్రికెట్ జట్టుకు వారి సొంతగడ్డపై పసి కూన జింబాబ్వే ఊహించని షాకిచ్చింది. రెండు మ్యాచ్‌ల టెస్ట్ సిరీస్ కోసం బాంగ్లాదేశ్‌లో పర్యటిస్తున్న జింబాబ్వే క్రికెట్ జట్టు తొలి టెస్టులో సంచలన విజయం సాధించింది. సిల్హెట్ వేదికగా బుధవారం జరిగిన తొలి టెస్టు రెండో ఇన్నింగ్స్‌లో 3 వికెట్లు తేడాతో బంగ్లాదేశ్ జట్టును చిత్తు చేసింది. దీంతో అరేళ్ల తర్వాత బంగ్లా గడ్డపై జింబాబ్వే విజయం సాధించినట్లయింది. ఈ మ్యాచ్‌లో ఫస్ట్ ఇన్నింగ్స్‌లో బంగ్లాదేశ్ 191 పరుగులు చేయగా, జింబాబ్వే 273 పరుగులు చేసింది. ఇక రెండో ఇన్నింగ్స్ బుధవారం ఓవర్ నైట్‌తో కలిపి బంగ్లాదేశ్ 255 పరుగులు చేసి ఆలౌట్ కాగా, జింబాబ్వే 7 వికెట్లు నష్టానికి 174 పరుగులు చేసింది. దీంతో బంగ్లాదేశ్ రెండు ఇన్నింగ్స్‌లోనూ కలిపి 446 పరుగులు చేయగా, జింబాబ్వే 447 పరుగులు చేసింది. జింబాబ్వే బ్యాటర్లలో బ్రియాన్ బెన్నెట్ (52) టాప్ స్కోరర్‌గా నిలవగా, బెన్ కుర్రాన్ (44) పరుగులతో రాణించారు. బంగ్లాదేశ్ బౌలర్లలో మెహది హసన్ మిరాజ్ 5 వికెట్లు పడగొట్టగా, తైజుల్ ఇస్లాం 2 వికెట్లు సాధించాడు. ఇక ఈ మ్యాచ్‌లో తొలుత బ్యాటింగ్ చేసిన బాంగ్లాదేశ్, జింబాబ్వే బౌలర్లు రెచ్చిపోవడంతో తొలి ఇన్నింగ్స్‌లో 191 పరుగులకే కుప్పకూలింది. జింబాబ్వే బౌలర్లలో ముజరబానీ, వెల్లింగ్టన్ మసకడ్జ తలో 3 వికెట్లు, న్యాయుచి, మదెవెరె చెరో 2 వికెట్లు తీసి బంగ్లాదేశ్ దెబ్బకొట్టారు. అనంతరం జింబాబ్వే తమ తొలి ఇన్నింగ్స్‌లో 273 పరుగులకు ఆలౌట్ అయింది. జింబాబ్వే బ్యాటర్లలో ఓపెనర్ బ్రియాన్ బెన్నెట్ (57), సీన్ విలియమ్స్ (59) అర్ధ సెంచరీలతో రాణించగా, వికెట్ కీపర్ న్యాషా మయవో (35), వెస్లీ మెదెవెరె (24), రిచర్డ్ నగరవ (28 నాటౌట్)గా పర్వాలేనిపించారు. బంగ్లాదేశ్ బౌలర్లలో మెహిది హసన్ మిరాజ్ 5 వికెట్లతో చెలరేగగా, నహిద్ రాణా 3, హసన్ మహమూద్, ఖలీద్ అహ్మద్ తలో వికెట్ పడగొట్టారు. రెండో ఇన్నింగ్స్‌లో కూడా బాంగ్లా బ్యాటర్లు తీరు ఏ మాత్రం మార లేదు. రెండో ఇన్నింగ్స్‌లో బంగ్లాదేశ్ 255 పరుగులకు ఆలౌట్ అయింది. కెప్టెన్ శాంటో (60), జాకీర్ (58), మోమినల్ (47) మినహా మిగిలిన బ్యాటర్లు ఘోరంగా విఫలమయ్యారు. దీంతో జింబాబ్వే ముందు కేవలం 174 పరుగుల లక్ష్యాన్ని మాత్రమే ఉంచగలిగింది. ఈ స్వల్ప లక్ష్యాన్ని 7 వికెట్లు కోల్పోయి పర్యాటక జట్టు ఛేదించింది. కాగా బంగ్లాపై జింబాబ్వేకు ఇది రెండో టెస్టు విజయం. ఇక ఇరు జట్ల మధ్య రెండో టెస్టు మ్యాచ్ ఈ నెల 28 నుండి ఛటోగ్రామ్ వేదికగా జరగనుంది.

# ఆ రెండు టీమ్స్ ఇంటికే..

## ప్లే ఆఫ్ రేసులో ఉన్న జట్లు ఇవే

## మారుతున్న ఐపిఎల్ లెక్కలు



**న్యూఢిల్లీ:** ఐపీఎల్ 2025 టోర్నమెంట్, 18వ సీజను కీలక దశకు చేరుకుంది. తాజాగా ఐపీఎల్ లీగ్‌లో మొదటి దశ ముగిసింది. ప్రతి మ్యాచ్ తర్వాత పాయింట్ల పట్టికలో కీలక మార్పులు చోటు చేసుకుంటున్నాయి. ఈ సీజన్ లో కూడా కేవలం రెండు జట్లు తప్ప, మిగిలిన టీమ్స్‌లో టాప్ 4 కోసం గట్టి పోటీ ఉండేలా కనిపిస్తోంది. రెండవ దశ మ్యాచ్‌లు ప్రారంభమయ్యాయి. దీంతో ప్లే ఆఫ్ రేసు ఉత్కంఠగా మారింది. కానీ ప్రస్తుతం ఈ రెండు జట్ల పరిస్థితిని బట్టి చూస్తే ప్లే ఆఫ్ కు అర్హత సాధించడం కష్టంగా కనిపిస్తోంది. రాజస్థాన్ రాయల్స్, చెన్నై సూపర్ కింగ్స్ జట్లకు ఈ సీజన్ చాలా కఠినంగా మారింది. ప్లే ఆఫ్స్‌లో చోటు దక్కించుకోవాలంటే ఈ జట్లు మిగిలిన అన్ని మ్యాచ్‌ల్లోనూ గెలవాలి. ఐపీఎల్ ప్లే ఆఫ్స్‌కు అర్హత సాధించాలంటే 16 పాయింట్లు తప్పనిసరి. ఈ పరిస్థితుల్లో రాజస్థాన్ రాయల్స్, చెన్నై సూపర్ కింగ్స్ తమ మిగిలిన అన్ని మ్యాచ్‌లను గెలవవలసి ఉంటుంది. చెన్నై సూపర్ కింగ్స్, సన్‌రైజర్స్ హైదరాబాద్ మధ్య మ్యాచ్ ఏప్రిల్ 25న జరుగుతుంది. కాబట్టి ఈ మ్యాచ్ చెన్నై భవిష్యత్‌ను నిర్ణయిస్తుంది. ఇక ముంబై ఇండియన్స్ వరుసగా 3మ్యాచ్‌ల్లో గెలిచి ప్లేఆఫ్ రేసులో నిలిచింది. అయితే హార్దిక్‌సేన తమ మిగిలిన ఆరు మ్యాచ్‌ల్లో కనీసం 4 గెలవాలి. ఎందుకంటే ముంబైఖాతాలో ఇప్పుడు 8 పాయింట్లు ఉన్నాయి. కాబట్టి నాలుగు మ్యాచ్‌లు గెలిస్తే ఆ జట్టుకు 16 పాయింట్లు ఉంటాయి. ఇక కోల్‌కతా నైట్ రైడర్స్‌కు కూడా ప్లే ఆఫ్ అవకాశం ఉంది. కానీ జట్టు మిగిలిన ఆరు మ్యాచ్‌ల్లో ఐదింటిని ఎలాగైనా గెలవాలి. కోల్‌కతా ఖాతాలో ఇప్పుడు 6 పాయింట్లు ఉన్నాయి. ఐదు మ్యాచ్‌లు గెలిస్తే రహానే టీమ్ కు 16 పాయింట్లు వస్తాయి. ప్రస్తుతం మూడో స్థానంలో ఉన్న రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరుకు తదుపరి 6 మ్యాచ్‌లు చాలా ముఖ్యమైనవి. ప్రస్తుతం ఆర్‌సిబి ఖాతాలో 10 పాయింట్లు ఉన్నాయి. మిగిలిన 6 మ్యాచ్‌ల్లో 3 గెలిస్తే వారి ఖాతాలో 16 పాయింట్లు ఉంటాయి. గుజరాత్ టైటాన్స్ జట్టు 8 మ్యాచ్‌ల్లో 6 గెలిచింది. ఆ జట్టు ఖాతాలో 12 పాయింట్లు ఉన్నాయి. అలాగే, గుజరాత్ నికర రన్ రేట్ +1.104. కాబట్టి, గుజరాత్ ప్లేఆఫ్స్‌కు చేరుకోవాలంటే ఇంకా 2 మ్యాచ్‌లు మాత్రమే గెలవాలి. కాబట్టి, గుజరాత్ ప్లేఆఫ్స్‌కు చేరుకోవడం పెద్ద కష్టమేమీ కాదు. ఐపిఎల్ 2025లో ఇప్పటివరకు సన్‌రైజర్స్ హైదరాబాద్, ఢిల్లీ క్యాపిటల్స్ రెండూ 7 మ్యాచ్‌లు ఆడాయి. మిగతా 8 జట్లు ఒక్కొక్కటి 8 మ్యాచ్‌లు ఆడాయి. పాయింట్ల పట్టికలో గుజరాత్ తర్వాత ఢిల్లీ, ఆర్‌సిబి పంజాబ్ మరియు లక్నో మొదటి ఐదు స్థానాల్లో ఉన్నాయి. నాలుగు జట్లు చెరో 5 మ్యాచ్‌ల్లో గెలిచాయి. ప్రస్తుతం పాయింట్ల పట్టికలో రాజస్థాన్, హైదరాబాద్, చెన్నై జట్లు వరుసగా ఎనిమిదవ, తొమ్మిదవ, పదవ స్థానాల్లో ఉన్నాయి.



# అథ్లెటిక్స్ ఛాంపియన్‌షిప్‌లో.. తెలంగాణ ఖాతాలో రెండో స్వర్ణం

## ఆంధ్రప్రదేశ్‌కు మరో స్వర్ణం

**న్యూఢిల్లీ:** ఇంటర్నేషనల్ ఫెడరేషన్ కప్ సీనియర్ అథ్లెటిక్స్ ఛాంపియన్‌షిప్‌లో తెలంగాణ ఖాతాలో మరో స్వర్ణ పతకం చేరింది. దీంతో తెలంగాణ ఖాతాలో స్వర్ణ పతకాల సంఖ్య రెండుగా ఉంది. కొచ్చిలో జరుగుతున్న అథ్లెటిక్స్ చాంపియన్‌షిప్‌లో మహిళల హెప్టాథ్లాన్ ఈవెంట్‌లో తెలంగాణకు చెందిన అగసార నందిని పసిడి పతకాన్ని సొంతంచేసుకుంది. ఏడు క్రీడాంశాలైన 100 మీటర్ల హార్డిల్స, హై జంప్, షాట్‌పుట్, 200 మీటర్లు, లాంగ్ జంప్, జావెలిన్ త్రో, 800 మీటర్ల సమాహారమైన హెప్టాథ్లాన్‌లో నందిని మొత్తం 5813 పాయింట్లు స్కోరు చేస అగ్రస్థానంలో నిలిచింది. హరియాణాకు చెందిన పూజ 5401 పాయింట్లు సంపాదించి రజత పతకాన్ని దక్కించుకోగా, రిలయన్స్‌కు చెందిన మౌమిత మండల్ 5373 పాయింట్లతో కాంస్యం గెలిచింది. మరోవైపు మహిళల 100 మీటర్ల హార్డిల్స్‌లో ఆంధ్రప్రదేశ్ అమ్మాయి యర్రాజి జ్యోతి బంగారు పతకాన్ని దక్కించుకుంది. రిలయెన్స్ జట్టు తరపున బరిలోకి దిగిన జ్యోతి 100 మీటర్ల హార్డిల్స్ ఫైనల్ రేసును 13.23 సెకన్లలో పూర్తి చేసి అగ్రస్థానంలో నిలిచింది. విజేతగా నిలిచే క్రమంలో జ్యోతి ఆసియా ఛాంపియన్‌షిప్ అర్హత ప్రమాణ సమయాన్ని 13.26 సెకన్లతో అధిగమించింది.

# వాణిజ్యం


# సెన్సెక్స్, నిఫ్టీలకు ఐటి, బ్యాంకింగ్ మద్దతు

**ముంబై, ఏప్రిల్ 23:** దేశీయ స్టాక్ మార్కెట్ సూచీలు వరుసగా ఏడోరోజూ లాభాల్లో ముగిశాయి. అంతర్జాతీయ మార్కెట్ల నుంచి మిశ్రమ సంకేతాలు ఉన్నా, మన మార్కెట్లు మాత్రం రాణించాయి. భవిష్యత్‌లో జరిగే వాణిజ్య చర్చల్లో చైనా దిగుమతులపై సుంకాలు తగ్గిస్తామని ట్రంప్ పేర్కొనడం, వడ్డీ రేట్ల విషయంలో విభేదిస్తున్న ఫెడ్ చీఫ్ జెరోమ్ పావెల్‌ను తొలగించే ఉద్దేశమేదీ తనకు లేదంటూ ఆయన ప్రకటించడం మార్కెట్ సెంటి మెంట్‌ను బలపరిచింది. దేశీయంగా ఐటీ షేర్లలో కొనుగోళ్ల మద్దతు కనిపించింది. బ్యాంకింగ్ షేర్లలో లాభాల స్వీకరణ కనిపించింది. ఈ క్రమంలో సెన్సెక్స్ మళ్లీ 80వేల మార్క్ ఎగువన ముగిసింది. సెన్సెక్స్ ఆరంభం లోనే 80 వేల మార్కును అందుకుంది. 80,142.09 పాయింట్ల వద్ద లాభాల్లో ప్రారంభమైంది. ఆ తర్వాత కాస్త ఒడుదొడుకులకు లోనైనా మళ్లీ పుంజుకొంది. ఇంట్రాడేలో 80,2454 వద్ద గరిష్ఠాన్ని తాకిన సూచి చివరికి 520.90 పాయింట్ల లాభంతో 80,116.49 వద్ద ముగిసింది. నిఫ్టీ సైతం 161.70 పాయింట్ల లాభంతో 24,328.95 వద్ద స్థిరపడింది. డాలరుతో రూపాయి మారకం విలువ 24 పైసలు బలహీన పడి 85.43గా ఉంది. సెన్సెక్స్ 30 సూచీలో హెచ్‌సీఎల్ టెక్నాలజీస్, టెక్ మహీంద్రా, టాటా మోటార్స్, ఇన్ఫోసిస్, మహీంద్రా అండ్ మహీంద్రా షేర్లు ప్రధానంగా లాభపడ్డాయి. హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్, కోటక్ మహీంద్రా బ్యాంక్, ఎస్‌బీఐ, యాక్సిస్ బ్యాంక్, ఐటీసీ షేర్లు నష్టాలు చవిచూశాయి. అంతర్జాతీయ మార్కెట్లో బ్రెంట్ క్రూడ్ బ్యారెల్ ధర 68.25 డాలర్ల వద్ద కొనసాగగా, బంగారం ఔన్సు కాస్త తగ్గుముఖం పట్టి 3239 డాలర్ల వద్ద కొనసాగింది.



# 'ఇంటెల్'లో లేఆఫ్స్

**ముంబై, ఏప్రిల్ 23:** టెక్ పరిశ్రమలో అనిశ్చితులు ఇప్పట్లో కుదటపడేలా కనిపించడం లేదు. టాప్‌కంపెనీల్లో ఉద్యోగుల తొలగింపులు కొనసాగుతున్నాయి. తాజాగా టెక్ దిగ్గజం ఇంటెల్ కార్పొరేషన్ భారీ సంఖ్యలో ఉద్యోగుల తొలగింపునకు సిద్ధమైంది. తమ వర్క్‌ఫోర్స్‌లో 20 శాతానికిపైగా తొలగించాలని యోచిస్తోన్న ఇంటెల్ ఈ వారంలోనే లేఆఫ్‌లను ప్రకటించబోతున్నట్లు తెలిసింది. గత మార్చిలో సిఇఒగా బాధ్యతగా స్వీకరించిన లిప్-బు తాన్ నాయకత్వంలో ఇంటెల్ కంపెనీ ఈ వారం 20వేల కంటే ఎక్కువ మంది ఉద్యోగులను తొలగించే ప్రణాళికను ప్రకటించనుందని నివేదికలు సూచిస్తున్నాయి. 2024లో 19 బిలియన్ డాలర్ల నష్టంతో ఆర్థిక సంక్షోభాన్ని ఎదుర్కొంటున్న ఇంటెల్, ఈ కోతలతో అధికారిక వ్యవస్థను తగ్గించి, నిర్వహణను



సరళీకరించి, ఇంజినీరింగ్-ఆధారిత సంస్కృతిని పునరుద్ధరించాలని లక్ష్యంగా పెట్టుకుంది. ఇంటెల్ తన పరిస్థితిని మెరుగుపరచుకునేందుకు ఉద్యోగాల కోతలను చేపట్టడం ఇదే మొదటిసారి కాదు. 2024 ఆగస్టులో 15వేల మంది ఉద్యోగులను తొలగించింది. దీంతో కంపెనీ మొత్తం సంఖ్య 1,08,900కు చేరింది. అంతకుముందు సంవత్సరం 2023లో ఇంటెల్ మొత్తం ఉద్యోగుల సంఖ్య 1,24,800 ఉండేది. 2025లో 257 టెక్ కంపెనీలు రోజుకు సగటున 450 మంది చొప్పున 50,372 మంది ఉద్యోగులను తొలగించాయని లేఆఫ్స్-ఎఫ్‌వైఐ తెలిపింది. 2024లో 1,115 కంపెనీల్లో 2,38,461 మంది ఉద్యోగులు తొలగింపునకు గురయ్యారు.

# ఎయు స్మాల్ ఫైనాన్స్ బ్యాంకు లాభాలు పైపైకి

**ముంబై, ఏప్రిల్ 23:** ప్రైవేట్ రంగ సంస్థ ఎయు స్మాల్ ఫైనాన్స్ బ్యాంకు (ఎస్‌ఎఫ్‌బి) గతేడాది 2024-25 చివరి త్రైమాసికంలో పటిష్ట ఫలితాలు సాధించింది. జనవరి-మార్చి నాలుగవ త్రైమాసికంలో నికర లాభం 18శాతం పెరిగి రూ.504 కోట్లకు చేరింది. ఇందుకు ఇతర ఆదాయం దోహదపడింది. అంతకుముందు యేడాది ఇదే కాలంలో రూ.428 కోట్లు ఆర్జించింది. మొత్తం ఆదాయం రూ.3,385 కోట్ల నుంచి రూ.5,031 కోట్లకు జంప్ చేసింది. నికర వడ్డీ ఆదాయం (ఎన్ఐఐ) 57శాతం పెరిగి రూ.2,094 కోట్లకు చేరింది. నికర వడ్డీ మార్జిన్లు 0.7శాతం మెరుగుపడి 5.8శాతానికి చేరాయి. పూర్తి యేడాదికి బ్యాంకు నికర లాభం 32శాతం పెరిగి రూ.2,106 కోట్లయింది. 2023-24లో రూ.1,591 కోట్లు మాత్రమే ఆర్జించింది. వాటాదారులకు షేరుకి రూ.ఒకటి చొప్పున డివిడెండ్ ప్రకటించింది. కాగా స్థూల మొండిబకాయిలు (ఎన్‌పిఎలు) 1.67శాతం నుంచి 2.28 శాతానికి, నికర ఎన్‌పిఎలు 0.55 శాతం నుంచి 0.74 శాతానికి పెరిగాయి. వెరసి ప్రొవిజన్లు, కంటింజెన్సీలు రూ.118 కోట్ల నుంచి రూ.635 కోట్లకు భారీగా పెరిగాయి.

ప్రైవేట్ రంగ కంపెనీ మహీంద్రా లాజిస్టిక్స్ గతేడాది చివరి త్రైమాసికంలో ప్రోత్సాహకర ఫలితాలు సాధించింది. జనవరి-మార్చి నాలుగవ త్రైమాసికంలో స్టాండెలోన్ నికర లాభం 67శాతం పెరిగి రూ.13 కోట్లకు చేరింది. అంతకుముందు యేడాది ఇదే కాలంలో దాదాపు రూ.8 కోట్లు మాత్రమే ఆర్జించింది. మొత్తం ఆదాయం రూ.1,183 కోట్ల నుంచి రూ.1,293 కోట్లకు చేరింది. అయితే మార్చితో ముగిసిన పూర్తి యేడాదికి నికర లాభం 30శాతం క్షీణించి దాదాపు రూ.44 కోట్లకు పరిమితమైంది. 2023-24లో రూ.62 కోట్లు ఆర్జించింది. కాగా టర్నోవర్ 10శాతం వృద్ధితో రూ.5,013 కోట్లకు చేరింది. 2023-24లో రూ.4,530 కోట్ల ఆదాయం అందుకుంది.



# లగ్జరీ బ్యాగులు, వాచీలపై ఒకశాతం టిసిఎస్

**న్యూఢిల్లీ, ఏప్రిల్ 23:** లగ్జరీ వస్తువుల విక్రయాలపై కేంద్రం కీలక నిర్ణయం తీసుకుంది. రూ.10 లక్షలు అంతకంటే ఎక్కువ విలువ చేసే బ్యాగులు, చేతి గడియారాల వంటి వాటిపై 1 శాతం టీసీఎస్ (మూలం వద్ద వసూలుచేసే పన్ను) ప్రకటించింది. ఏప్రిల్ 22 నుంచే ఈ టీసీఎస్ అమల్లోకి వచ్చినట్లు తెలిపింది. ఈ మేరకు ఆదాయపు పన్ను విభాగం బుధవారం ఓ ప్రకటనలో వెల్లడించింది. పెయింటింగ్స్, శిల్పాలు, సన్‌గ్లాసెస్, హ్యాండ్‌బ్యాగ్‌లు, పాదరక్షలు, హోం థియేటర్ సిస్టమ్స్, రేసింగ్ గుర్రాలు, చేతి గడియా రాలు, హై ఎండ్ స్పోర్ట్స్‌వేర్, క్రీడా పరికరాలు వంటి వాటిపై ఈ టీసీఎస్ వర్తిస్తుందని ఐటీ శాఖ తమ నోటిఫికేషన్‌లో పేర్కొంది. అధిక విలువకలిగిన వస్తువుల విక్రయాల్లో పారదర్శకతను పెంచేందుకే కేంద్రం ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలుస్తోంది. తాజా నిర్ణయంతో విక్రయదారులు టీసీఎస్ నిబంధనలను తప్పనిసరిగా పాటించాల్సి ఉంటుంది.



అలాగే లగ్జరీ వస్తువులను కొనుగోలు చేసే సమయంలో కస్టమర్లు కేవీసీ, ఇతర డాక్యుమెంట్లను పూర్తిచేయాలి. ఈ నిర్ణయంతో లగ్జరీ వస్తువుల అమ్మకాలపై నియంత్రణ ఉంటుందని నిపుణులు అభిప్రాయపడుతున్నారు.

# ఏథర్ ఎనర్జీ ఐపిఒ

**ముంబై, ఏప్రిల్ 23:** ఎలక్ట్రిక్ ద్విచక్ర వాహన తయారీ సంస్థ ఏథర్ ఎనర్జీ ఐపీఓ ధరల శ్రేణిని ప్రకటించింది. రూ.2,981 కోట్ల ఐపీఓకు సంబంధించి ఒక్కో షేరు ధరల శ్రేణిని రూ.304-321గా పేర్కొంది. ఏప్రిల్ 28 నుంచి 30 వరకు సబ్‌స్క్రిప్షన్‌కు అందుబాటులో ఉంటుంది. యాంకర్ ఇన్వెస్టర్లకు 25న విండో తెరుచుకోనుంది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో మెయిన్ బోర్డు నుంచి పబ్లిక్ ఆఫర్‌కు వస్తున్న తొలి ఐపీఓ ఇదే కావడం గమనార్హం. ఏథర్ ఎనర్జీ సంస్థ ఈ పబ్లిక్ ఇష్యూలో తాజా షేర్ల జారీ ద్వారా రూ.2,626 కోట్లు సమీకరించనుంది. దీంతో పాటు 1.1 కోట్ల ఈక్విటీ షేర్లను ఆఫర్ ఫర్ సేల్ ద్వారా విక్రయించనున్నారు. ప్రమోటర్లు, వాటాదారులు తమ వాటాలను ఆ మేర తగ్గించుకోనున్నారు. రూ.11,956 కోట్ల విలువ వద్ద మొత్తం రూ.2,981 కోట్లు మార్కెట్ నుంచి సమీకరించేందుకు కంపెనీ లక్ష్యంగా పెట్టుకుంది. ఐపిఒ ద్వారా సమీకరించిన నిధులను మహారాష్ట్రలోని ద్విచక్ర వాహన ఫ్యాక్టరీ ఏర్పాటుతో పాటు రుణాన్ని తగ్గించుకునేందుకు కంపెనీ వినియోగించుకోనుంది. కొంత మొత్తాన్ని రీసెర్చ్ అండ్ డెవలప్‌మెంట్ సామర్థ్యాలు పెంచుకోవడానికి వినియోగించ బోతోంది. ఐపిఒలో భాగంగా 75 శాతం షేర్లను క్వాలిఫైడ్ ఇన్‌స్టిట్యూషనల్ బయ్యర్లకు కంపెనీ కేటాయించింది. 15 శాతం నాన్ ఇన్‌స్టిట్యూషనల్ ఇన్వెస్టర్లకు, 10 శాతం షేర్లను రిటైల్ ఇన్వెస్టర్లకు రిజర్వ్ చేసింది. యాక్సిస్ కేపిటల్, హెచ్ఎస్‌బీసీ సెక్యూరిటీస్, జేఎం ఫైనాన్షియల్, నొమురా బుక్ రన్నింగ్ లీడ్ మేనేజర్లుగా వ్యవహరిస్తున్నాయి. మరో విద్యుత్ ద్విచక్ర వాహన తయారీ సంస్థ ఓలా ఎలక్ట్రిక్, గతేడాది రూ.రూ.6,415 కోట్లను ఐపీఓ ద్వారా సమీకరించింది. విద్యుత్ వాహన విభాగంలో ఐపీఓకు వస్తున్న రెండో సంస్థగా ఏథర్ ఎనర్జీ నిలవనుంది.



# టాటా కమ్యూనికేషన్స్ లాభాలు జూమ్

**ముంబై, ఏప్రిల్ 23:** ప్రైవేట్ రంగ సంస్థ టాటా కమ్యూనికేషన్స్ గతేడాది చివరి త్రైమాసిక ఫలితాలు విడుదల చేసింది. జనవరి-మార్చి నాలుగవ త్రైమాసికంలో కన్సాలిడేటెడ్ నికర లాభం రెట్టింపుపైనా వృద్ధితో రూ.761 కోట్లను అధిగమించింది. సహచర కంపెనీకి చెన్నైలోని భూమిని విక్రయించడం ఇందుకు ప్రధానంగా సహకరించింది. అంతకు ముందు యేడాది ఇదే కాలంలో కేవలం రూ.346 కోట్లు ఆర్జించింది. ఈ ఆర్థిక సంవత్సరంలో 30 కోట్ల డాలర్ల పెట్టుబడులు వెచ్చించనున్నట్లు కంపెనీ వెల్లడించింది. గతేడాది 27 కోట్ల డాలర్లు కేటాయించినట్లు తెలియచేసింది. కాగా మొత్తం ఆదాయం కూడా 6శాతానికిపైగా పెరిగి రూ.6,059 కోట్లకు చేరింది. మొత్తం వ్యయాలు 6శాతం పెరిగి రూ.5,723 కోట్లకు చేరాయి. చెన్నైలోని భూమి అమ్మడంతో రూ.577 కోట్ల మేర అదనపు లాభం ఆర్జించినట్లు కంపెనీ పేర్కొంది. అంతేకాకుండా టాటా కమ్యూనికేషన్స్ పేమెంట్స్ సొల్యూషన్స్‌లో వాటా విక్రయం ద్వారా రూ.311 కోట్లు అందుకున్నట్లు తెలియచేసింది. మార్చితో ముగిసిన పూర్తి యేడాదికి రూ.23,238 కోట్ల ఆదాయం సాధించింది. మార్చికల్లా రూ.9,377 కోట్ల రుణభారం నమోదైంది.



Printed and Published by Gireesh Sanghi, CMD and Managing Editor on behalf of AGA Publications Ltd., and printed at Sy No.658/A , NH-5, Ankireddy Palem, Guntur Dist-522005. Ph:2355939, 2512322(0863), 9848812526. RNI No : APTEL / 2004 / 13725, Editor : *Damerla Sai Baba, Postal Licence/AP/Vj/GTR/57/08-10 *Responsible for selection of News under the PRBAct. Regd.: No.H/SD/337/12-14